సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 46

బుధవారం 8-5-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



బెయిలిస్తే ఫైళ్లపై సంతకాలొద్దు

సీఎంగా అధికారిక విధులు నిర్వర్తించొద్దు.. కేజ్రీవాల్‌కు సుప్రీం స్పష్టీకరణ - 6లో



రష్యా అధ్యక్షుడిగా ఐదోసారి

పుతిన్ ప్రమాణం.. గైర్హాజరైన అమెరికా, యూకే, జర్మనీ దౌత్యవేత్తలు - 6లో



మధ్యాహ్నం 3 గంటలకు.. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాన్'ను ప్రజలకు చూపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పథకాలను అడ్డుకున్నా.. గెలుపును ఆపలేరు

కోరుకొండ, ఇచ్ఛాపురం, గాజువాక ఎన్నికల సభల్లో సీఎం వైఎస్ జగన్

జూన్ 4న మళ్లీ మీ బిడ్డే వస్తాడు.. విశాఖ నుంచే పాలన.. ప్రమాణ స్వీకారం

మన ప్రభుత్వం మళ్లీ రాగానే వారంలో అన్ని బటన్లూ క్లియర్ చేస్తా

- ఎన్నికలు వచ్చాయని నొక్కిన బటన్లు కావివి.. అన్నీ కొనసాగుతున్న పథకాలే
- ఐదేళ్లుగా ఏటా బటన్లు నొక్కుతూ పేదలకు మంచి చేస్తున్నాం
- జగన్ అంటే పథకాలు... బాబు అంటే మోసాలు, కుట్రలు
- ముందే క్యాలెండర్ ప్రకటించి మరీ పథకాలతో లబ్ధి చేకూరుస్తున్నాం
- మంచికి అడ్డుపడితే అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, రైతన్నలు ఊరుకుంటారా?
- ఆ కుట్రలకు ఓటుతో బుద్ధి చెప్పండి.. రెట్టించిన ఉత్సాహంతో మీ జగన్‌కు ఓటేయండి.. తుప్పు పట్టిన సైకిల్ రిపేర్ చేసేందుకు ఢిల్లీ మెకానిక్స్
- వాళ్లూ చేతులెత్తేయడంతో హామీల బెల్లు మోగిస్తున్న చంద్రబాబు
- తిట్టిన వారి చంకనెక్కే విద్యలో చంద్రబాబు నిపుణుడు
- అక్కచెల్లెమ్మలకు డబ్బులు రాకుండా అడ్డు పడుతున్నారు

11లో

ఆ అవినీతిపరుడే గొప్పవాడయ్యారా?

- పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని అన్నది ప్రధాని మోదీనే: ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఈ 2024 డ్రామాలో హామీలేమిటి?.. హోదా ఇస్తారా?
- ఐదేళ్లుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందంటే.. జగన్ అనే సీఎం ఒప్పుకోలేదు కాబట్టే
- రెండు బిల్డింగ్‌లు కడితే రైల్వే జోన్ కాదు
- టీడీపీకి ఓటేస్తే.. స్టీల్ ప్లాంట్ అమ్మకానికి ఓటేసినట్లే..

12లో

అప్పుడూ ఇప్పుడూ అంతే

పేదల పొట్ట కొట్టడమే లక్ష్యంగా వికృతరూపం దాల్చిన బాబు పెత్తందారీ పోకడ

వారికి లబ్ధి జరిగేది ఏదైనా అడ్డుకోవడమే ఆయన లక్ష్యం

అప్పట్లో ఇళ్ల స్థలాల పంపిణీ, ఇంగ్లిష్ మీడియం చదువులు అడ్డుకునేందుకు ఎల్లోగ్యాంగ్ చేయని ప్రయత్నంలేదు.. ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని ఎప్పటినుంచో కొనసాగుతున్న డీబీటీలకూ అడ్డంకులు

తొలి నుంచీ పేదలకు మేలు జరగకుండా కోర్టులకు వెళ్లి మరీ అడ్డుకున్న బాబు బ్యాచ్

తాజాగా కోడ్ పేరుతో విద్యా దీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మహిళలకు చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాలను అడ్డుకున్న పచ్చముఠా.. ఐదేళ్లుగా కొనసాగుతున్న పథకాలపైనా కుట్రలు

తెలంగాణలో ఇన్‌పుట్ సబ్సిడీకి ఓకే చెప్పిన ఈసీ.. ఏపీలో మాత్రం నో



సాక్షి, అమరావతి: పేదలంటే ఏమాత్రం పట్టని టీడీపీ అధినేత చంద్రబాబు ఆ పదం వింటేనే అగ్గిమీద గుగ్గిలమవుతారు. ఇక వారికి ఏదైనా మేలు జరిగితే.. గుండెలు బాదుకోవడం.. గగ్గోలు పెట్టడం.. పెడబొబ్బలు.. ఆర్తనాదాలే. పుట్టుకతో సహజసిద్ధంగా ఆయనకు అబ్బిన ఈ లక్షణాలు ఇప్పుడు మరీ వికృతరూపం దాల్చి కరాళ నృత్యం చేస్తున్నాయి. పేదలకు అందాల్సిన పథకాలను ఎన్నికల కోడ్ ముసుగులో ఎన్నికల సంఘం ద్వారా అడ్డుకోవడమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.

అసలు ఎన్నికల కోడ్ లేని సమయంలోనే పేదల చదువుల కోసం సీఎం వైఎస్ జగన్ సర్కారు ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెడితే దానిపై 'పచ్చ'ముఠా పెట్టిన గగ్గోలు అంతాఇంతా కాదు. ఆ విధానాన్ని అమలుచేయకుండా చేయని కుట్రలులేవు. అలాగే, అప్పట్లో పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూములను సేకరిస్తే వాటిపైనా న్యాయస్థానాలకు వెళ్లి అడ్డుకుంది. ఆఖరికి అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందంటూ తమ పెత్తందారీ ధోరణిని ప్రదర్శించింది. ఇలా రాష్ట్రంలో అనేక జిల్లాల్లో పేదలకు ఇళ్ల స్థలాలివ్వకుండా కోర్టుల్లో కేసులు వేసింది. కానీ, సీఎం జగన్ సర్కారు

మిగతా 2వ పేజీలో ▶

మూడో దశలో 63.53% పోలింగ్

స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

11 రాష్ట్రాలు, యూటీల్లోని 93 స్థానాలకు పూర్తయిన ఎన్నికలు

- వివరాలు 6లో

ప్రధాని పదవికి విలువ లేకుండా చేశారు

బీజేపీ చేస్తున్న అవినీతి దేశంలో ఏ పార్టీ చెయ్యలేదు

- తోడు దొంగల కూటమి ఏ స్క్రిప్టు ఇస్తే అది చదివేయడమేనా?.. మోదీ స్థానిక సమస్యలను పట్టించుకోలేదు.. స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడలేదు
- పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని మీ నోటితోనే అన్నారుగా!.. పోలవరంలో అవినీతి జరిగిందని భావిస్తే విచారణ జరిపించుకోవచ్చు
- రాష్ట్రంలో పేదల కడుపు కొడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ
- అమలులో ఉన్న పథకాలనూ నిలిపివేయిస్తున్నారు
- ఈసీ వాస్తవాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలి
- 2019లో పసుపు-కుంకుమకు మేం అడ్డుపడ్డామా?
- మంత్రి బొత్స సత్యనారాయణ


5లో



ల్యాండ్ టైటిల్లింగ్ చట్టం నిజాలివిగో..

శాశ్వత భూ హక్కులు కల్పించడమే అసలు లక్ష్యం..

- గెజిట్ మాత్రమే జారీ అయింది.. నోటిఫికేషన్ రాలేదు.. కోర్టుల అధికారాలు తగ్గించలేదు
- ప్రజల స్థిరాస్తికి పూర్తి భద్రత ఉంటుంది
- కబ్జాదారుల ఆగడాలకు ఆస్కారం ఉండదు
- వివాదాలు తగ్గిపోతాయి.. కొత్త వివాదాలకు అవకాశం ఉండదు



సాక్షి, అమరావతి: ఓటమి కళ్ల ముందు కనిపిస్తుండటంతో చంద్రబాబు గ్యాంగ్ పిచ్చెత్తిపోయి ప్రజల్లో లేనిపోని అనుమానాలు సృష్టించే ప్రయత్నం చేస్తోంది. చెప్పుకోవడానికి చంద్రబాబుకు ఏమీ లేక వైఎస్ జగన్‌పైన, ఆయన ప్రభుత్వం పైన దుష్ప్రచారం చేసి, ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగానే ప్రజల భూములపై వారికే హక్కులు కల్పించేలా వైఎస్ జగన్ ప్రభుత్వం తెస్తున్న ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్‌పై నీచమైన ప్రచారం చేస్తోంది. భూముల వ్యవస్థను సమూలంగా మార్చడం ద్వారా ప్రజలకు.. తద్వారా సమాజానికి, రాష్ట్రానికి ఎంతో మేలు చేసే ఈ చట్టాన్ని స్వలాభం కోసం

మిగతా 3వ పేజీలో ▶

ఇనుంజగత్



నాకు ఓటు ఎవడేస్తాడు.. నువ్వా? నీ అమ్మ మొగుడా.. లేక నీ అమ్మమ్మ మొ...

బాబొస్తే ఇంగ్లిష్ మీడియం రద్దే..!

మేనిఫెస్టోలో పేర్కొన్న 'కేజీ టు పీజీ విద్య రివ్యూ' అందుకే..

- గతంలో చై-నా స్కూళ్ల కోసం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుదే
- తక్కువ మంది విద్యార్థులున్నారని 6 వేల సర్కారు స్కూళ్లకు ఆయన జమానాలోనే మంగళం
- ప్రభుత్వ ఉపాధ్యాయులకు నైపుణ్యం లేదని హేళన
- అసలు పేదల విద్య ప్రభుత్వ బాధ్యత కాదని ప్రకటించిందీ ఆయనే
- ఇప్పుడు పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం బోధనను దూరం చేయాలని కుట్ర
- రాష్ట్రంలో 15,784 ప్రైవేటు స్కూళ్లలో 100 శాతం ఇంగ్లిష్ మీడియం



ప్రభుత్వ బడుల్లో మాత్రం ఇంగ్లిష్ మీడియం ఉండకూడదట

తెలుగు భాషాభిమానం పేరుతో కుతంత్రాలు

సాక్షి, అమరావతి: తన పాలనలో అన్ని రంగాల్లో 'ప్రైవేటు'కు పెద్దపీట వేసి ప్రభుత్వ రంగాన్ని నిండా ముంచిన చంద్రబాబు చివరకు పేదింటి పిల్లలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలలనూ విడిచిపెట్టలేదు. తన జమానాలో కార్పొరేట్ విద్యా సంస్థలైన 'చై-నా'లకే ఆయన పెద్దపీట వేయడం ఇందుకు నిదర్శనం. తక్కువ మంది విద్యార్థులు ఉన్నారని ఆరు వేల స్కూళ్లను మూసేసి వాటికి మంగళం పాడేశారు. పేదల విద్య ప్రభుత్వ బాధ్యతే కాదని ప్రకటించిందీ కూడా ఆయనే. ప్రభుత్వ ఉపాధ్యాయులకు అసలు నైపుణ్యం ఉండదనేది చంద్రబాబు ప్రగాఢ విశ్వాసం. నారాయణ స్కూళ్ల సిబ్బందితో ప్రభుత్వ టీచర్లకు శిక్షణ ఇప్పించిన తెంపరితనం ఆయనది. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదింటి పిల్లల చదువులకు పెద్దపీట వేసింది. దేశంలో కనివినీ ఎరుగని స్థాయిలో

మిగతా 2వ పేజీలో ▶

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో కురుస్తున్న వర్షం



పిడుగులుపడి ఏడుగురు మృత్యువాత

చెట్టు కూలి ఒకరి దుర్మరణం

ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షాలు..

రాజమహేంద్రిలో కుండపోత

వేమగిరిలో అత్యధికంగా 12.4 సెం.మీ. వర్షపాతం

మరో మూడు రోజులు వానలే

16లో

బాబొస్తే ఇంగ్లిష్ మీడియం రద్దే!

▶ మొదటి పేజీ తరువాయి
విప్లవాత్మక సంస్కరణలు, పథకాలు ప్రవేశపెట్టింది. పేద విద్యార్థులను ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను అమలు చేస్తోంది. దీన్ని చంద్రబాబు, ఆయన ముఠా జీర్ణించుకోలేకపోతోంది. పేద పిల్లలు ఇంగ్లిష్‌లో నిష్ణాతులైతే ఎక్కడ తమ పెత్తందారుల పిల్లలకు పోటీ వస్తారోనని ఇంగ్లిష్ మీడియం చదువులను తొలగించడానికి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారు. ఇందులో భాగంగానే టీడీపీ తాజా మేనిఫెస్టోలో 'కేజీ టు పీజీ విద్య రివ్యూ' అనే అంశాన్ని చేర్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పేద పిల్లల చదువుల ఆనందాన్ని తుంచేయాలనే..

వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం బోధనను అందిస్తుంటే తెలుగు మీడియం సరైందంటూ చంద్రబాబు కుట్రలు చేస్తున్నారు. తద్వారా పేద విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేయడమే లక్ష్యంగా కంకణం కట్టుకున్నారు. ఇదే జరిగితే పేదింటి పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 'నేను మా ఊళ్లో జిల్లా పరిషత్ స్కూల్లో చదువుకున్నాను. డిగ్రీ తర్వాత ఎంబీఏ చేశాను. ఈ సిలబస్ పూర్తిగా ఇంగ్లిష్‌లో ఉంది.. దీంతో చదవడం చాలా కష్టమైంది. ఎలాగోలా బట్టీపట్టి పరీక్షలు పాసయ్యాను గాని మంచి మార్కులు సాధించలేకపోయాను. ఇంటర్వ్యూలు ఇంగ్లిష్‌లోనే చేస్తుండడంతో ప్రశ్నలను అర్థం చేసుకోలేక ఉద్యోగం సాధించలేకపోయాను. నన్ను ఉద్యోగిగా చూడాలన్న నా తల్లిదండ్రుల ఆశను నెరవేర్చలేకపోయాను. ఆ బాధ ఇప్పటికీ నన్ను వెంటాడుతోంది. స్కూల్ స్థాయి నుంచి ఇంగ్లిష్ మీడియంలో చదివి ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదు. ఇదే పరిస్థితి నా ఇద్దరు పిల్లలకు రాకూడదని వారిని కాకినాడలో ఇంగ్లిష్ మీడియం స్కూల్లో చదివించాను. ఇప్పుడు ఇద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నారు' అని కాకినాడ జిల్లా పోలవరం గ్రామానికి చెందిన ఓ తండ్రి వెల్లడించారు. రాష్ట్రంలో అందరి తల్లిదండ్రుల పరిస్థితి ఇదే. ఇప్పటి లాగా తాము చదువుకున్నప్పుడు సరైన సదుపాయాలు ఉండి ఉంటే తాము మరింత ఉన్నతంగా ఉండేవారిమన్న అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. ఇప్పుడు ప్రభుత్వ బడుల్లో సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న ఇంగ్లిష్ మీడియం బోధన, డిజిటల్ ఎడ్యుకేషన్, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మఒడి, 3వ తరగతి నుంచే టోఫెల్ శిక్షణ, 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ఉచిత ట్యాబ్‌ల పంపిణీని వారంతా కీర్తిస్తున్నారు. తమలాంటి పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని పిల్లలకు సీఎం జగన్ పుణ్యమాఅని నాణ్యమైన విద్య ఇన్నేళ్లకు అందుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కానీ చంద్రబాబు మాత్రం పెత్తందారుల పిల్లలకు పేద పిల్లలు ఎక్కడ పోటీ వస్తారోనని.. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను రద్దు చేయడానికి కుట్రలు పన్నుతుండటం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ సంస్థలకు విద్యను ధారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చైతన్య-నారాయణలపై ప్రేమ అందుకే..

తన అనుకూలవర్గానికి చెందిన నారాయణ- చైతన్య విద్యా సంస్థలను తలదన్నేలా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఫలితాలు సాధిస్తుంటే చంద్రబాబు ఈర్ష్యతో రగిలిపోతున్నారు. సర్కారు బడులను నిర్వీర్యం చేయాలని కంకణం కట్టుకున్నారు. పేదలు ఎప్పుడూ అలాగే ఉండాలి, పైస్థాయికి వెళ్లగూడదన్న కక్షతో ఇంగ్లిష్ మీడియం చదువులు వద్దంటున్నారు. పెత్తందారుల పిల్లలకే ఇంగ్లిష్ మీడియం, ఐబీ సిలబస్ బోధన ఉండాలని భావిస్తున్నారు. తద్వారా పేద పిల్లలను కూలీలుగా మార్చాలని చూస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో 45 వేల ప్రభుత్వ బడులను ఇంగ్లిష్ మీడియంలోకి మార్చడం తప్పని, దీనివల్ల తెలుగు భాషకు అన్యాయం జరుగుతోందంటూ గగ్గోలు పెడుతున్నారు. వాస్తవానికి నారాయణ, చైతన్యతో పాటు రాష్ట్రంలోని మొత్తం 15,784 ప్రైవేటు స్కూళ్లలోను ఇంగ్లిష్ మీడియంలోనే బోధన సాగుతోంది. మరి అక్కడ లేని ఇంగ్లిష్ ఇబ్బంది ప్రభుత్వ బడుల విషయంలోకి వచ్చేసరికి ఏమొచ్చిందో చంద్రబాబుకే తెలియాలి. సర్కారు బడులను నాశనం చేసి, నారాయణ, చైతన్య స్కూళ్లను పెంచడమే ఆయన ఎత్తుగడల ఉద్దేశమని అంటున్నారు.

ప్రైవేటు స్కూళ్లలో చేరాలని పిలుపునిచ్చిందీ చంద్రబాబే. దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుభవం, రాష్ట్రానికి 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయనకు పేదలన్నా.. వారి చదువులన్నా ఎంతటి చులకన భావం ఉందో ఈ వ్యాఖ్యలే తెలియజేస్తాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు బాహాటంగా కొమ్ముకాస్తూ పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ విద్యను నామ రూపాల్లేకుండా చేశారు. తక్కువ మంది విద్యార్థులున్నారని 2014–19 మధ్య 1,785 పాఠశాలలను బాబు మూసివేశారు. అక్కడి విద్యార్థులను గాలికి వదిలేశారు. అంతకుముందు టీడీపీ పాలనలోనే మరో 4,300 ప్రభుత్వ పాఠశాలలను కూడా శంకరగిరి మాన్యాలు పట్టించారు.

విద్య ప్రభుత్వం బాధ్యత కాదని కాడిపారేసిన బాబు..

పేదలకు ఉచితంగా చదువు చెప్పడం ప్రభుత్వం బాధ్యత కాదని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే చంద్రబాబు ప్రకటించారు. ప్రభుత్వ బడుల్లో సదుపాయాలు ఉండవని.. ప్రైవేటు బడులు బాగుంటాయని చెప్పిందీ ఆయనే కావడం గమనార్హం. డబ్బున్నవారు వాటిల్లో చదువుకుని మేధావులుగా తయారవుతారని.. పేద పిల్లలు ఫీజులు కట్టి

అన్నంలో మన్ను

దాదాపు ఐదేళ్ల పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలను చంద్రబాబు ప్రభుత్వం అర్థాకలితో అలమటించేలా చేశారు. బడికి వచ్చే విద్యార్థులకు మధ్యాహ్నం పెట్టే భోజనంలోనూ చంద్రబాబు కక్కుర్తి పడ్డారు. రోజూ ముద్దయిపోయిన అన్నం, నీళ్ల సాంబారు ఇదొక్కటే మెనూ. ఈ అన్నం తినలేక, ఆకలితో ఉండలేక పేదింటి పిల్లలు ఆకలితో అలమటించారు. తిన్నవారికి కడుపునొప్పి సర్వసాధారణంగా మారింది. ఇక కౌమార దశ బాలికలైతే అనారోగ్య సమస్యలు ఎదుర్కొనేవారు. బడికి వచ్చిన పిల్లల్లో గరిష్ఠంగా 30 శాతం మంది ఈ నాసిరకం మధ్యాహ్న భోజనం చేయలేకపోయేవారు. రక్తహీనతతో ఆస్పత్రి పాలైన విద్యార్థులు కోకొల్లలు. ప్రభుత్వ బడుల్లో ఇన్ని ఘోరాలు జరుగుతున్నా చంద్రబాబుకు భుజం కాసే ఎల్లో మీడియా ఏనాడూ బడి పిల్లల ఆకలి కేకలను విననట్టే నటించింది. పేదల చదువుల బాధ్యత ప్రభుత్వానిది కాదని బహిరంగంగానే ప్రకటించిన చంద్రబాబు.. అందుకు తగ్గట్టుగానే సర్కారు బడులను నిర్వీర్యం చేసేందుకు మధ్యాహ్న భోజనంలో కోత పెట్టారు. ఏటా సగటున రూ.450 కోట్ల బడ్జెట్ మాత్రమే కేటాయించారు. ఈ నిధులను సైతం సరుకు సరఫరా చేసిన ఏజెన్సీలకు ఏనాడూ సకాలంలో చెల్లించిందీ లేదు. జగన్ సీఎం అయ్యేదాకా సర్కారు బడి పిల్లలను పట్టించుకున్న వారే కరువయ్యారు.

నేడు అంతర్జాతీయ స్థాయికి ఏపీ విద్యా సంస్కరణలు

టీడీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ విద్యను ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత అత్యంత ప్రాధాన్యత రంగాల్లో ఒకటిగా గుర్తించారు. పిల్లలను బడికి పంపించే తల్లులకు ఏటా అమ్మ ఒడి కింద రూ.15 వేల చొప్పున ఇచ్చారు. 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం చదువులను అందుబాటులోకి తెచ్చారు. 43 లక్షల మంది పిల్లలకు సమాన అవకాశాలు అందించారు. గిరిజన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 371 ఆశ్రమ పాఠశాలలు, 18 ప్రీ మెట్రిక్ హాస్టళ్లు, 159 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, 1,958 పాఠశాలలను ఆధునికీకరించారు. వీటిలో ఇప్పుడు 1,55,599 మంది విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్య అందుతోంది. వారి భోజన, సదుపాయాల కోసం ఒక్క 2023లోనే ప్రభుత్వం రూ.920.31 కోట్లను ఖర్చు చేసింది. గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో విద్యార్థులు గత నాలుగేళ్లలో 400 మందికి పైగా ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించారు. 50 మందికి పైగా నీట్ ర్యాంకులు సాధించి మెడిసిన్ చదువుతున్నారు.

భవనాలకు బీటలు.. బెంచీలకు చెదలు

చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఒక్క ప్రభుత్వ బడికి భవనాన్ని నిర్మించిన పాపాన పోలేదు. ఏనాడూ అవి ఎలా ఉన్నాయో చూసింది లేదు. బాబు 2014లో ప్రకటించిన మేనిఫెస్టోలో బడుల రూపురేఖలు మార్చడం, హైస్కూల్ స్థాయిలో ఇంగ్లిష్ మీడియం, ప్రతి స్కూల్లోనూ బాల, బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు వంటి హామీలు ఇచ్చారు. కానీ 2019లో జగన్ సీఎం అయ్యేనాటికి దాదాపు 6 వేల స్కూళ్లను చంద్రబాబు మూసివేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు దాదాపు మూతపడ్డాయి. 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్న చోట 1,725 స్కూళ్లకు తాళాలు వేసేశారు. 2019 మేనిఫెస్టోలో కూడా చంద్రబాబు ఇవే అంశాలను పొందుపరిచారు. చివరకు బడిలో సుద్దముక్కలు, పిల్లలు, ఉపాధ్యాయులకు బెంచీలు లేని పరిస్థితిని తెచ్చారు. చాలాచోట్ల పాఠశాలల భవనాలు శిథిలమైపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఉండేది. గత్యంతరం లేక వేల స్కూళ్ల నుంచి విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోవడం, అవకాశం లేనివారు బడి మానేసే దుస్థితి బాబు జమానాలోనే సంభవించాయి.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పేరుతో దోపిడీ

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యను అందించేందుకు వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు శ్రీకారం చుట్టారు. వీటికే 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్'గా చంద్రబాబు పేరు మార్చారు. కేవలం 33 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను తన అనుకూల వర్గాల చేతుల్లోని 383 ప్రైవేటు స్కూళ్లలో చేర్పించారు. నిరుపేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం చదువులంటూ భారీగా నిధులను దండుకున్నారు.

నాడు-నేడుతో బడులకు కొత్త సొబగులు

విద్యా సంస్కరణలకు సీఎం వైఎస్ జగన్ రూ.73 వేల కోట్లను ఖర్చు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 11 సౌకర్యాల కల్పనకు మనబడి నాడు-నేడు పథకాన్ని ప్రవేశపెట్టారు. నిరంతరం నీటి సరఫరాతో టాయిలెట్లు, శుద్ధమైన తాగునీరు, భవనాలకు మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణం, ఫ్యాన్లు, లైట్లతో విద్యుద్దీకరణ, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నీచర్, గ్రీన్ చాక్ బోర్డులు, భవనాలకు పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, అదనపు తరగతి గదులు నిర్మించారు. నాడు-నేడు మొదటి విడతలో 15,715 పాఠశాలల్లో రూ.3,669 కోట్లతో సౌకర్యాలు కల్పించి ప్రజలకు అంకితం చేయగా, రెండో దశలో రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలల్లో పనులు చేపట్టారు.

ప్రతి విద్యార్థికీ డిజిటల్ బోధన

నాడు-నేడు పనులు పూర్తయిన హైస్కూళ్లలో ఇంటర్నెట్‌తో పాటు 62 వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, 45 వేల స్మార్ట్ టీవీలను అందించారు. వీటితో 3డీ పాఠాలను బోధిస్తున్నారు. దేశంలో 25 వేల ఐఎఫ్‌పీలు ఉంటే.. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే 62 వేల డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయడం దేశ చరిత్రలో ఓ విప్లవం. 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కలిపి 2021–22, 2022–23 విద్యా సంవత్సరాల్లో 9.53 లక్షల మందికి బైజూస్ కంటెంట్‌తో ఉచితంగా ట్యాబ్స్ ఇచ్చారు. 'ఏపీ ఈ-పాఠశాల' మొబైల్ యాప్, దీక్ష వెబ్‌సైట్, డీటీహెచ్ చానెళ్లు, యూట్యూబ్ చానెల్స్ ద్వారా నిరంతరం పాఠాలను విద్యార్థులకు చేరువ చేసింది.

భాషపై పట్టుకోసం టోఫెల్

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించేందుకు వీలుగా ఒకటో తరగతి నుంచే ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రవేశపెట్టింది. భాషపై పట్టు సాధించేందుకు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకు 3వ తరగతి నుంచి టోఫెల్ శిక్షణ ఇస్తోంది. ఈ ఏడాది తొలిసారి నిర్వహించిన 'టోఫెల్' పరీక్షకు దాదాపు 16.50 లక్షల మంది విద్యార్థులు హాజరు కావడం గమనార్హం. విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచేందుకు మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లను నియమించింది. ఇందుకోసం అర్హత గల 25 వేల మందికి పైగా ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి హైస్కూళ్లలో నియమించింది.

సీబీఎస్ఈ బోధన

పేదింటి పిల్లలు జాతీయ, అంతర్జాతీయంగా పోటీ పడేలా తీర్చిదిద్దేందుకు వీలుగా మొదటి విడతలో ప్రభుత్వం 1,000 పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన ప్రారంభించింది. వచ్చే విద్యా సంవత్సరం ఈ విద్యార్థులు పదోతరగతి పరీక్షలను సీబీఎస్ఈలో రాయనున్నారు.

బాలికల కోసం జూనియర్ కాలేజీ

హైస్కూల్ చదువు పూర్తయిన బాలికలు చదువు మానేయకుండా ప్రతి మండలంలోనూ బాలికలకు ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జగన్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 292 ఉన్నత పాఠశాలలు బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. 352 కేజీబీవీల్లో ఇంటర్మీడియెట్‌ను ప్రవేశపెట్టారు. 2022–23 నుంచి 14 కో-ఎడ్ జూనియర్ కళాశాలలను గర్ల్స్ జూనియర్ కళాశాలలుగా మార్చి రాష్ట్రంలోని 679 మండలాల్లోనూ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలను తీసుకొచ్చారు.

ప్రపంచ టెక్నాలజీపై శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భవిష్యత్ టెక్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు 'ఫ్యూచర్ స్కిల్స్ కోర్సుల'ను జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆరు నుంచి ఇంటర్ వరకు మూడు దశల్లో విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), 3డీ ప్రింటింగ్, గేమింగ్ వంటి 10 విభాగాల్లో శిక్షణ ఇస్తారు. ఈ కోర్సులను 6,790 ఉన్నత పాఠశాలల్లో బోధించేందుకు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్స్ ఫెసిలిటేటర్స్‌గా ప్రభుత్వం నియమించింది.

పేదలకు 'ఐబీ' విద్య

పేదింటి పిల్లలు ప్రపంచానికి దిక్సూచిగా మారాలన్న సీఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో 'ఇంటర్నేషనల్ బాకలారియేట్(ఐబీ) బోధన 2025 జూన్ నుంచి ఒకటో తరగతి నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటి దాకా దేశంలో 210 వరల్డ్ క్లాస్ కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) సిలబస్ అమల్లో ఉంది. ఏటా ఒక తరగతి చొప్పున ఐబీ బోధన పెంచుతూ 2037 నాటికి +2 వరకు విద్యనందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది.

ప్రభుత్వ ఉపాధ్యాయులను హేళన చేసి..

పేదింటి పిల్లలనే కాకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులను సైతం చంద్రబాబు దారుణంగా అవమానించారు. వారిలో బోధనా నైపుణ్యాలు తక్కువగా ఉంటాయని గతంలో బహిరంగంగానే ప్రకటించిన చరిత్ర ఆయనది. అంతేకాకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులకు నారాయణ స్కూళ్ల సిబ్బందితో శిక్షణ ఇప్పించే సాహసానికి కూడా ఒడిగట్టారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించకుండా, సదుపాయాలు కల్పించకుండా ఫలితాలు తేవాలని ఒత్తిడి తెచ్చారు. ఎవరైనా ధైర్యం చేసి తమ స్కూళ్లకు సిబ్బందిని అడిగితే బహిరంగంగానే చంద్రబాబు సస్పెండ్ చేయడం పరిపాటిగా మారింది. దీంతో ఎంతోమంది ఉపాధ్యాయులు అవమానభారంతో ప్రాణాలు వదిలిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 2000లో అనంతపురం జిల్లా నార్పల మండలం గూగూడులో జన్మభూమి సమావేశం ఏర్పాటు చేసి స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని స్టేజీ మీదకు పిలిచి మరీ అవమానించారు. ఆ సంవత్సరం 100 శాతం ఫలితాలు తేవాలని చంద్రబాబు ఆదేశించారు. తమ పాఠశాలకు సరిపడినంత మంది టీచర్లు లేరని ఆయన ఎదుటే చెబితే.. ఆగ్రహంతో రగిలిపోయిన బాబు అదే వేదికపై సదరు హెచ్ఎంను సస్పెండ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 2003లో బాబు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నిమ్మల కిష్టప్ప గోరంట్ల జన్మభూమి కమిటీ సమావేశంలో టీచర్‌ను చెట్టుకు కట్టేసి కొట్టాలని అనుచరులను రెచ్చగొట్టారు. ఇలా చంద్రబాబు పాలనలో ఉపాధ్యాయులకు అడుగడుగునా అవమానాలే దక్కాయి.

అప్పుడూ అంతే.. ఇప్పుడూ అంతే

▶ మొదటి పేజీ తరువాయి
వీటన్నింటినీ ఛేదించుకుని తన యజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగించింది. ఇందుకు సుప్రీంకోర్టుకూ వెళ్లి పచ్చ మాఫియాపై విజయం సాధించింది. కానీ, ఎల్లో గ్యాంగ్ ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను అడ్డుపెట్టుకుని వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు వలంటీర్లు ఇళ్లకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయకుండా అడ్డుకుంది. దీంతో మండుటెండల్లో వృద్ధులు, వికలాంగులు సచివాలయాల చుట్టూ, బ్యాంకులు చుట్టూ తిరిగేలా చేసి అనేకమంది మృతికి ఈ పెత్తందార్లు కారణమయ్యారు. తమ రాజకీయాల కోసం వృద్ధులు, వికలాంగుల ప్రాణాలుపోయినా పర్వాలేదనే ధోరణిలో చంద్రబాబు బ్యాచ్ వ్యవహరించింది.

ఎప్పటినుంచో కొనసాగుతున్న పథకాలకూ బ్రేకులు..

నిజానికి.. ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ అన్నది కొత్త కార్యక్రమమేమీ కాదు. ఎప్పటి నుంచో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సూర్యోదయంలోపే వైఎస్సార్ పెన్షన్ కానుకను అందిస్తున్నారు. ఇలా కొనసాగుతున్న విధానానికి ఎన్నికల కోడ్ వర్తించకపోయినప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘానికి బాబు బృందం ఫిర్యాదు చేసి వృద్ధులు, వికలాంగులు, వితంతువులను రోడ్డు పాల్జేసింది. అలాగే.. పేద విద్యార్థుల చివరి త్రైమాసికం విద్యాదీవెన, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందకుండా చేసింది. అసలివి ఎప్పటినుంచో కొనసాగుతున్న డీబీటీ పథకాలే. లబ్ధిదారులు సైతం పాతవారే తప్ప కొత్తగా ఎవ్వరినీ ఎంపిక చేయలేదు. అయినాసరే, చంద్రసేన ఒత్తిడితో పోలింగ్ పూర్తయ్యే వరకు ఇవి చెల్లించవద్దని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. వాస్తవానికి.. 2023లో కరువు కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడమనేది ఇప్పటికే కొనసాగుతున్న ప్రక్రియే. చంద్రబాబు కుట్రల కారణంగా.. కరువుతో పంటలు కోల్పోయిన రైతులు ఇప్పుడు ఖరీఫ్‌లో విత్తనాల కొనుగోళ్లకు, ఇతర ఖర్చులకు డబ్బుల్లేక అప్పులు పాలవుతారనే కనీస ఆలోచన కూడా లేకుండా రైతులపట్ల కర్కశంగా, నిర్దయగా వ్యవహరించింది. ఇలా బాబు నిర్వాకంతో రాష్ట్రంలో 6,95,897 కరువు బాధిత రైతులకు చెల్లించాల్సిన రూ.847.22 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపులు నిలిచిపోయాయి.

తెలంగాణలో ఓకే.. ఏపీలో మాత్రం నో..

కానీ, తెలంగాణలో వర్షాలతో పంటలు కోల్పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించేందుకు అనుమతించిన కేంద్ర ఎన్నికల సంఘం ఏపీలో మాత్రం 'నో' చెప్పింది. ఈ విషయంలో ఏపీపట్ల ఎన్నికల సంఘం వివక్ష చూపిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే, పేద విద్యార్థుల పెద్ద చదువులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ గత ఐదేళ్ల నుంచి విద్యాదీవెన పథకం కింద డీబీటీ రూపంలో బటన్‌నొక్కి ప్రభుత్వం చెల్లిస్తూ వస్తోంది. విద్యాదీవెన కింద చివరి విడత కిస్తీని ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకముందే ప్రభుత్వం ప్రారంభించింది. ఇది కూడా ఇప్పటికే కొనసాగుతున్న పథకం అయినప్పటికి చంద్రబాబు బృందం ఒత్తిడితో ఎన్నికల సంఘం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.610.79 కోట్ల విద్యాదీవెన చెల్లింపులను నిలుపుదల చేసింది. విద్యార్థులు కాలేజీలకు ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వరనే కనీస జ్ఞానం కూడా లేకుండా రాజకీయానికే బాబు బ్యాచ్ ప్రాధాన్యతనిచ్చింది. దీంతో అప్పులుచేసి పేద విద్యార్థులు ఫీజులు చెల్లించే స్థితికి బాబు తీసుకొచ్చారు.

'చేయూత' నిధులకూ చెక్..

పేద అక్కచెల్లెమ్మలకు 'చేయూత' కింద ఆఖరి విడత నిధులను ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకముందే ప్రారంభించినప్పటికీ బాబు బృందం ఒత్తిడితో ఆ నిధుల చెల్లింపులకూ ఎన్నికల సంఘం మోకాలడ్డింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు పేద మహిళల జీవనోపాధికి సాయం అందించే 'చేయూత' పథకం అమలు కూడా ఎప్పుడో ప్రారంభమైంది. 3 విడతల్లో అమలైంది కూడా. ఇప్పుడు చివరి విడత కింద 29 లక్షల మంది పేద మహిళలకు సాయం అందాలి. దీనికి కూడా బాబు బృందం ఒత్తిడితో కేంద్ర ఎన్నికల సంఘం బ్రేకులు వేసింది. ఆసరా, ఈబీసీ నేస్తం తదితర పథకాలకూ ఇదే పరిస్థితి. ఐదేళ్లుగా కొనసాగుతున్న పథకాలను ఎన్నికల కోడ్ సాకుతో బాబు కోటరీ పెత్తందారీ పోకడలతో అడ్డుకోవడం ద్వారా పేద విద్యార్థులు, రైతులు, మహిళల పొట్టకొట్టి తమ వికృతరూపాన్ని ఆ ముఠా చాటుకుంది.

ప్రమాదంలో ముస్లిం సమాజం

- మతపరమైన రిజర్వేషన్ల ముసుగులో ముస్లింలను దెబ్బతీసేందుకు కూటమి కుతంత్రం
- ముస్లిం హక్కులు కాపాడుతానన్నాకే జగన్‌పై అన్ని పార్టీల మూకుమ్మడి దాడి
- సెక్యులర్ లీడర్ సీఎం జగన్‌ను గెలిపించుకోవడం మన బాధ్యత
- ముస్లిం మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం


రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం ప్రకటిస్తున్న ముస్లిం పెద్దలు

సాక్షి, అమరావతి: కూటమి కుతంత్రంతో ముస్లిం సమాజం పెను ప్రమాదంలో పడిందని, ఇలాంటి పరిస్థితుల్లో ముస్లిం హక్కులు కాపాడతానని భరోసా ఇచ్చిన సెక్యులర్ లీడర్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడం మన ధర్మమని ముస్లిం మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ముస్లిం ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ), ముస్లిం ఆలోచనపరుల వేదిక(ఎంటీఎఫ్)ల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. 'ముస్లిం సమస్యలు–ప్రజాస్వామ్య పరిరక్షణ మార్గాలు' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలోని ముస్లిం ఉలేమాలు, జమాత్‌ల ప్రతినిధులు, డాక్టర్లు, లాయర్లు, పలు రంగాలకు చెందిన నిపుణులు, ఆలోచనపరులు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించారు. పలువురు మాట్లాడుతూ.. విద్యాపరంగాను, సామాజికంగాను అత్యంత వెనుకబాటుకు గురైన ముస్లింలకు వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. అవి మతపరమైన రిజర్వేషన్లుగా దుష్ప్రచారం చేసి ఎన్డీఏ కూటమి ముస్లిం సమాజాన్ని దారుణంగా దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందన్నారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని, వక్ఫ్ బోర్డును తీసివేస్తామనే ప్రకటనలతో మైనార్టీల పట్ల వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లింలను అవమానిస్తున్న ఎన్డీఏ కూటమితో గతంలోనూ, ఇప్పుడు జతకట్టిన చంద్రబాబు ముస్లిం సమస్యలపై పోరాడుతానంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. కూటమిలో చేరిన టీడీపీ, జనసేన రానున్న కాలంలో బీజేపీలో విలీనం కావడం ఖాయమన్నారు. ప్రసంగించిన వారిలో తబ్లిక్ జమాత్ అధ్యక్షుడు అక్బర్ బాషా, జమాత్ అహ్లెహదీస్ అధ్యక్షుడు నసీర్ ఉమరి, కార్యదర్శి అతీఖ్ రెహమాన్, జమాత్ అయిమ్మ ఉలమ ప్రతినిధులు ముఫ్తీ యూసుఫ్, ముఫ్తీ హబీబ్, అహ్లె సున్నత్ వల్ జమాత్ ప్రతినిధి ఖలీల్, ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ ప్రతినిధి అబ్దుల్ మతీన్, ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ప్రతినిధి హబీబ్ రెహమాన్, అంజుమాన్ ఇస్లామియా ఉపాధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, మొహిద్దీన్, షఫీ అహ్మద్, ముస్లిం ఆలోచనపరుల వేదిక రాష్ట్ర కన్వీనర్ యజ్దానీఖాన్ తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిద్దాం



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుకోసం ముస్లింలంతా ఏకతాటిపై పనిచేయాలని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్టు ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ మీడియాకు తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లు కాపాడతానని సీఎం వైఎస్ జగన్ ప్రకటించాకే బీజేపీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు మూకుమ్మడిగా ఆయనపై దాడిని పెంచాయన్నారు. ధైర్యంగా ముస్లింలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించుకోవడం మన బాధ్యతగా తెలిపారు.

కాంగ్రెస్‌కు ఓటేసినా బీజేపీ కూటమికే లాభం



రాష్ట్రంలో ముస్లిం సమాజానికి చెందిన ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ విషయంలో ముస్లింలు చాలా అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ- విజయవాడ) మాజీ అధ్యక్షుడు డాక్టర్ రెహమాన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ముస్లిం ఓట్లు చీలిపోయి పరోక్షంగా బీజేపీ, దాని కూటమి పార్టీలకే మేలు చేసినట్టవుతుందన్నారు. ప్రతి ముస్లిం ఓటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే పడేలా ఎవరికి వారే బాధ్యత వహించాలని సూచించారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్
జమాయిత్ ఉల్లామా పెద్దలు


మాట్లాడుతున్న జమాయిత్ ఉల్లామా పెద్దలు

నెల్లూరు(దర్గామిట్ట): ముస్లిం సమాజానికి వైఎస్సార్ కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లను సీఎం జగన్ కొనసాగిస్తానంటూ మైనారిటీల పక్షపాతిగా నిలిచారని జమాయిత్ ఉల్లామా మతపెద్ద హాజీ మౌలానా అబ్దుల్ సుభాని చెప్పారు. నెల్లూరులోని ఓ హోటల్లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ముస్లిం మైనారిటీ కచ్చితంగా పార్లమెంట్, అసెంబ్లీ రెండు ఓట్లు వైఎస్సార్‌సీపీకే వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముస్లిం ఫెడరేషన్ అధ్యక్షుడు మహమ్మద్ జియావుల్ హక్ మాట్లాడుతూ సీఎం జగన్.. నెల్లూరు సభలో ముస్లింలకు వ్యతిరేకంగా ఏ బిల్లు వచ్చినా తాను వ్యతిరేకిస్తానని చెప్పడం హర్షణీయమన్నారు. జగన్‌తోనే ముస్లింలకు సామాజిక, రాజకీయ అభివృద్ధి అన్నారు. ఎన్డీఏ వస్తే ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మౌలానా, అబ్దుల్ సలాం, సనావుల్లా, హన్నాన్ తదితరులున్నారు.

ముస్లిం ప్రయోజనాల పరిరక్షణలో సీఎం జగన్ చిత్తశుద్ధి అభినందనీయం
వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగ చైర్మన్ జనాబ్ వి ఖాదర్ బాషా



సాక్షి, అమరావతి: ముస్లిం ప్రజల కోసం పరితపించే వైఎస్సార్ అడుగుజాడల్లో సీఎం జగన్ రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగించారని వక్ఫ్ బోర్డు పూర్వపు చైర్మన్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగ చైర్మన్ జనాబ్ వి ఖాదర్ బాషా కొనియాడారు. వైఎస్సార్‌సీపీ స్టార్ కాంపెయినర్‌గా సీమ జిల్లాల్లో గత కొద్ది రోజులుగా ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలలో వెనుబడిన వర్గాల కోసం అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నానని సీఎం జగన్ స్పష్టీకరించడం.. ముస్లింల పట్ల ఆయనకున్న ప్రేమకు నిదర్శనమన్నారు. ముస్లింలకు ఏం చేస్తామో చెప్పుకోలేని స్థితిలో కూటమి ఉందన్నారు. ప్రతి ముస్లిం ఫ్యాను గుర్తుకే ఓటు వేసి సీఎం జగన్‌కు అఖండ విజయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

నేడు ఏపీలో ప్రధాని ఎన్నికల ప్రచారం

మధ్యాహ్నం పీలేరులో సభ, రాత్రికి విజయవాడలో రోడ్‌షో

సాక్షి, అమరావతి: ప్రధాని మోదీ బుధవారం రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఆయన మధ్యాహ్నం 1:50 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 2.55 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా 3.45 గంటలకు రాజంపేట లోక్‌సభ పరిధిలో ఉన్న కలికిరిలో బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 6.25 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విజయవాడకు చేరుకుంటారు. అక్కడ బందర్ రోడ్డులో ఇందిరాగాంధీ స్టేడియం వద్ద 7 గంటలకు రోడ్ షోను ప్రారంభించి, గంట పాటు బెంజ్ సర్కిల్ వరకు రోడ్ షో నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

భూ హక్కు చట్టంపై తప్పుడు ప్రచారం వద్దు

బీజేపీ సీనియర్ నేత లక్ష్మీపతిరాజా

సాక్షి, అమరావతి : చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లతో టీడీపీ నాయకులు భూ హక్కు చట్టం విషయంలో చేస్తున్న తప్పుడు ప్రచారం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. అయితే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చినా ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని అమలు చేయాల్సి ఉంటుందని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు మంగళవారం సోషల్‌మీడియా 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఆరేడు నెలల కిందటి వరకు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర పార్టీ మీడియా విభాగం ఇన్‌చార్జిగా పనిచేసిన లక్ష్మీపతిరాజా ఈ ట్వీట్ చేశారు. 'దేశంలో భూహక్కుల పరిరక్షణ కోసం నీతి ఆయోగ్ ప్రతిపాదించిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌కు తప్పుడు భాష్యం చెప్పడం ద్వారా సాధించేదేమీ లేదు! ఎన్నికల వేళ ఇలాంటివి సృష్టించడం వలన కూటమికి ప్రయోజనం కంటే నష్టమే జరుగుతుందని విజ్ఞులు గుర్తించాలి. కూటమి అధికారంలోకొస్తే ఈ చట్టాన్ని అమలు చేయాల్సి ఉంటుంది' అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు.

'డబుల్ ఇంజిన్'తోనే రాష్ట్రాభివృద్ధి: జీవీఎల్

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాకారమవుతుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలి పారు. మంగళవారం విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఏపీ నుంచి బీజేపీకి మంచి ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. ప్రధాని రాకతో కూటమికి వెయ్యి ఏనుగుల బలం వచ్చిందని తెలిపారు. నూరు శాతం పారదర్శక పాలనకు మోదీ ప్రతీక అన్నారు.

ఈసీ నిర్ణయాన్ని రద్దుచేయండి

తక్షణమే నిధుల పంపిణీకి ఆదేశాలివ్వండి

హైకోర్టును ఆశ్రయించిన రైతులు, విద్యార్థులు, ఓ గృహిణి

- ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు
- ఎన్నికల సంఘంవల్ల విద్యాదీవెన నిధుల పంపిణీ ఆగిపోయింది
- హైకోర్టును అభ్యర్థించిన సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి
- ఈ పథకాలేవీ కొత్తవి కావు.. గతంలో నుంచే అమలుచేస్తున్నాం
- ఈ పథకాల కింద నిధుల పంపిణీ ఎంత అవసరమో చెప్పినా ఈసీ ఆపేసింది
- హైకోర్టుకు వివరించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- నిధుల పంపిణీ ఎందుకు అత్యవసరమో చెబుతూ వినతి ఇస్తే పరిశీలించి తగిన నిర్ణయం వెలువరిస్తాం
- హైకోర్టుకు తెలిపిన కేంద్ర ఎన్నికల సంఘం
- మీ నిర్ణయాన్ని మా ముందుంచండి అంటూ సీఈసీకి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ రేపటికి వాయిదా



సాక్షి, అమరావతి : రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యార్థులకు విద్యాదీవెన, మహిళలకు వైఎస్సార్ 'చేయూత' నిధులను పంపిణీ చేసేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతి నిరాకరించడాన్ని సవాలుచేస్తూ రైతులు, విద్యార్థులు, ఓ గృహిణి హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన, వైఎస్సార్ చేయూత నిధుల పంపిణీని వాయిదా వేయాలంటూ ఈసీ ఈ నెల 4న జారీచేసిన లేఖను రద్దుచేయాలని కోరుతూ అనంతపురం, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ఓ గృహిణి హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. విద్యాదీవెన కింద రూ.610.79 కోట్ల నిధులను తక్షణమే పంపిణీ చేసేందుకు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ గుంటూరు, అడవి తక్కెళ్లపాడుకు చెందిన బంకా అరుణ్, పల్నాడు, గుడిపాడుకు చెందిన పఠాన్ సూరజ్‌లు ఓ వ్యాజ్యం దాఖలు చేశారు. అలాగే, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రైతులకు ఇవ్వాల్సిన రూ.847.22 కోట్లనూ పంపిణీ చేసేందుకు అనుమతి నిరాకరిస్తూ ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 30న జారీచేసిన లేఖను సైతం రద్దుచేసి, తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను పంపిణీ చేసేందుకు ఆదేశాలివ్వాలంటూ అనంతపురం జిల్లాకు చెందిన యల్లక్కగారి నారాయణ, గాజుల శ్రీనివాసులు మరో వ్యాజ్యం దాఖలు చేశారు. అంతేకాక.. 'చేయూత' నిధులనూ పంపిణీ చేసేలా ఆదేశాలివ్వాలంటూ గుంటూరు, భారత్‌పేటకు చెందిన గృహిణి కె. శాంతకుమారి మరో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ మూడింటిపై అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో విచారణ జరపాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి, న్యాయవాది వీఆర్ రెడ్డి న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్‌ను కోరారు. ఈ అభ్యర్థనను మన్నించిన న్యాయమూర్తి విచారణకు అంగీకరించారు. అనంతరం మ.3 గంటలకు విచారణ చేపట్టారు.

రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోలేదు

పిటిషనర్ల తరఫున మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రకృతి విపత్తుల కారణంగా పంట కోల్పోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ కింద సాయం అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీవల్ల రైతులు కోలుకుని తిరిగి వ్యవసాయ పనులు కొనసాగించుకునేందుకు ఆస్కారం కల్పిస్తుందన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, అందులో భాగంగానే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తోందన్నారు. నిజానికి.. 2023 ఖరీఫ్‌లో కరువువల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రూ.847.22 కోట్లను ఇన్‌పుట్ సబ్సిడీ కింద ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. అయితే, ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో స్క్రీనింగ్ కమిటీ ఇన్‌పుట్ సబ్సిడీ నిధుల పంపిణీ కోసం ఈసీ అనుమతి కోరిందన్నారు. కానీ, అందుకు ఈసీ అనుమతిని నిరాకరిస్తూ ఈనెల 30న లేఖ జారీచేసిందన్నారు. నిధుల పంపిణీని ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆపిందన్నారు. రానున్న సీజన్‌కు విత్తనాలు కొనుగోలు చేసి నాట్లు వేసుకోవాల్సి ఉంటుందని.. అందువల్ల ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీలో ఏదైనా జాప్యం జరిగితే అది రైతులపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీవీ మోహన్‌రెడ్డి వివరించారు. వర్షాలకు ముందే పంట భూములను సిద్ధంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిని మధ్యలో ఇలా ఆపేయడంవల్ల ఎదురయ్యే పర్యవసానాల గురించి ఎన్నికల కమిషన్ ఆలోచించలేదన్నారు. దీనివల్ల రైతులు, వ్యవసాయ కార్యకలాపాలపై ఆధారపడి జీవిస్తున్న వారు తీవ్రంగా ప్రభావితమవుతారని తెలిపారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని ఆయన కోర్టును కోరారు.

విద్యాదీవెనకూ బ్రేక్.. విద్యార్థులు అప్పులబాట

ఇక ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యాదీవెన పథకం కింద ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు ఇస్తోందని సీవీ మోహన్‌రెడ్డి వివరించారు. యువతను విద్యాపరంగా ప్రోత్సహించి, వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడేలా చేయాలన్న ఉద్దేశంతో 2019లో ప్రభుత్వం ఈ విద్యాదీవెన పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. దీని కింద మార్చి 1 నాటికి రూ.708 కోట్లను విద్యార్థులు, వారి తల్లుల జాయింట్ అకౌంట్లలో జమచేయాల్సి ఉందన్నారు. అక్టోబర్, నవంబరు, డిసెంబరు నెలలకు ఈనిధులను చెల్లించాల్సి ఉందన్నారు. ఇందులో కేవలం 97.89 కోట్లు మాత్రమే పంపిణీ చేశారని.. మిగిలిన 610.79 కోట్ల పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతిని నిరాకరించిందన్నారు. విద్యాదీవెన నిధులపై ఆధారపడి చదువుకునే విద్యార్థులు తీవ్రంగా ప్రభావితం అవుతున్నారని మోహన్‌రెడ్డి వివరించారు. సకాలంలో నిధులు అందకపోతే చదువును కొనసాగించేందుకు విద్యార్థులు అప్పులుచేయాల్సి వస్తుందన్నారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని నిలిపివేసిన నిధులను తక్షణమే పంపిణీకి ఆదేశాలు జారీచేయాలని ఆయన కోర్టును కోరారు. అలాగే.. వైఎస్సార్ చేయూత పథకం కింద నిధుల పంపిణీని కూడా ఈసీ నిలిపేసిన విషయాన్ని మరో న్యాయవాది వీఆర్ రెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కోడ్ అమల్లోకి రావడానికి ముందునుంచే ఈ పథకం అమలవుతోందన్నారు. ఈసీ నిర్ణయంతో ఎందరో మహిళలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

ప్రభుత్వ వినతిని పరిశీలిస్తాం..

ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల కోడ్‌కు లోబడే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యా దీవెన పథకం కింద నిధుల పంపిణీని ఎందుకు ఆపామో కారణాలను కూడా తెలియజేశామన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యా దీవెన నిధుల పంపిణీ విషయంలో ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎందుకు ఆగలేరో వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తమకు వినతిపత్రం సమర్పిస్తే, దానిని పరిశీలించి తగిన నిర్ణయం వెలువరిస్తామని హైకోర్టుకు వివరించారు. అవసరమైతే ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలిస్తామని తెలిపారు. ఇలా.. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి, అవినాష్ చెప్పిన వివరాలనూ పరిగణనలోకి తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సమర్పించే వినతిపై తీసుకున్న నిర్ణయాన్ని తగిన ప్రొసీడింగ్స్ ద్వారా కోర్టు ముందుంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను గురువారం 9వ తేదీ ఉ.10.30కు వాయిదా వేస్తూ జస్టిస్ కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త పథకాలకే కోడ్ వర్తిస్తుంది..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన కొత్త పథకాలు కావని, ప్రభుత్వం ఎప్పటి నుంచో అమలుచేస్తున్నవేనన్నారు. కరువు మండలాల గుర్తింపు, లబ్ధిదారుల గుర్తింపు ఎప్పుడో జరిగిందన్నారు. మొత్తం 6.95 లక్షల మంది రైతులను గుర్తించామని, అందుకు అవసరమైన మొత్తాలను సైతం సిద్ధం చేశామని ఆయన చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ ఈ పథకాల కింద లబ్ధిదారులకు నిధుల పంపిణీ ఎంత అవసరమో వివరిస్తూ ఈసీకి ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. సాధారణంగా కొత్త పథకాలకు ఎన్నికల నియమావళి వర్తిస్తుందన్నారు. గతంలో ఇంటింటికీ రేషన్ సరఫరాను రాష్ట్ర ఎన్నికల సంఘం అడ్డుకుందని, దీనిపై హైకోర్టు జోక్యం చేసుకుందన్నారు. ఆ పథకం కొత్త పథకం కాదని, అప్పటికే కొనసాగుతున్న పథకమని హైకోర్టు గుర్తుచేసిందని ఆయన న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై మహిళా కమిషన్ సీరియస్

ఈసీకి, ఎన్‌డబ్ల్యూసీకి ఫిర్యాదు

సాక్షి, అమరావతి: మహిళలను కించపరిచేలా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఏపీ మహిళా కమిషన్ సీరియస్ అయింది. ఈ విషయమై మంగళవారం పలువురు ఫిర్యాదు చేయడంతో బాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీ)కి, జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ)కి ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలోని పలు మహిళా సంఘాల నాయకులు కోట సామ్రాజ్యం, గజ్జ వెంకటలక్ష్మి, ఏనుగుల దుర్గాభవాని, సెల్వం దుర్గ, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ కృష్ణాజిల్లా అధ్యక్షులు అంబటి నాగరాధాకృష్ణ, డేవిడ్ మంగళగిరిలోని ఏపీ మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయంలో చైర్‌పర్సన్ వెంకటలక్ష్మిని కలిసి బాబు వ్యాఖ్యలపై చర్యలు చేపట్టాలని వినతిపత్రం ఇచ్చారు. అనకాపల్లిలో నిర్వహించిన ఎన్నికల సభలో బాబు మహిళల సమక్షంలోనే మహిళలను కించపరిచేలా నిస్సిగ్గుగా మాట్లాడారని వారు తెలిపారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గురించి ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌ను ఉద్దేశించి నీ అమ్మా మొగుడిదా, అమ్మమ్మ మొగుడిదా, నానమ్మ మొగుడిదా అంటూ చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తల్లి మొగుడిదా అంటూ అంత వయసున్న బాబు ఎలా మాట్లాడతారని, మహిళను, మాతృమూర్తి స్థానాన్ని అవహేళన చేస్తూ మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. పవన్ కూడా సీఎం జగన్‌ను ఉద్దేశించి నీ అమ్మా మొగుడు వచ్చినా భయపడనన్నారని వారు గుర్తుచేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళలను గౌరవించలేని వ్యక్తులు రాజకీయాలు ఎలా చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను కించపరిచి, బెదిరించిన ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘానికి, జాతీయ మహిళా కమిషన్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఉత్తమ ఫలితాలు

జేఈఈ మెయిన్ టాపర్ల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్–2024 టాపర్లుగా నిలవడానికి ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ దోహదం చేసిందని జేఈఈ మెయిన్‌లో 15, 19వ ర్యాంకులు సాధించిన సాయి దివ్యతేజ రెడ్డి, రిషి శేఖర్ చెప్పారు. తెలంగాణ నుంచి టాపర్లుగా నిలిచిన వీరు తమ విజయంలో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ కీలకంగా వ్యవహరించిందన్నారు. రిషి మాట్లాడుతూ జేఈఈ ప్రిపరేషన్‌లో వినడం, చదవడం, ప్రాక్టీస్ చేయడం, సందేహాలు నివృత్తి చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపాడు. ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ టీచర్లు తనకు విలువైన సలహాలు, సూచనలిచ్చారని చెప్పాడు. వారిచ్చిన మద్దతు తనకు ఎంతో ఉపయోగపడిందని, దాంతో ఫైనల్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించానని పేర్కొన్నాడు. సాయి దివ్యతేజ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌లో రెండేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో చేరానని చెప్పాడు. ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌లో టీచర్లు ఇచ్చిన గైడెన్స్ తన విజయంలో దోహదం చేసిందన్నాడు. రోజువారీ మాక్ టెస్టులు, రివిజన్ సెషన్లలో పాల్గొనడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయని పేర్కొన్నాడు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం... నిజాలివిగో..

▶ మొదటి పేజీ తరువాయి

వివాదాస్పదంగా మారుస్తోంది. అసలు ఈ చట్టంపై కూటమి నేతల ఆరోపణలు.. వాస్తవాలేమిటో తెలుసుకుందాం..

ఆరోపణ: ప్రజల ఆస్తులు లాక్కోవడానికే ప్రభుత్వం ఈ చట్టం తెచ్చింది.

వాస్తవం: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అసలు లక్ష్యమే ప్రజల ఆస్తులు కాపాడటం, వాటికి పూర్తి భద్రత కల్పించడం. ప్రభుత్వమే గ్యారెంటీ సర్టిఫికెట్ ఇవ్వడం. భూ యజమానులకు నష్టం కలిగితే పూర్తి పరిహారం చెల్లించడం. భూములు లాక్కోవడం అనేది ఈ చట్టంతో సాధ్యం కాదు.

ఆరోపణ: భూ పత్రాలు ప్రభుత్వం వద్దే ఉంటాయి.

వాస్తవం: భూ పత్రాలు ప్రభుత్వం చేతిలో ఉండవు. మీ వద్ద ఉన్న పత్రాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకోదు. కేవలం రికార్డులు పరిశీలించి, ప్రజలకు గ్యారెంటీ సర్టిఫికెట్ ఇస్తుంది. ఇదే తుది కాపీ అవుతుంది. భవిష్యత్తులో 30 రకాల పత్రాల అవసరం ఉండదు.

ఆరోపణ: కొత్త చట్టం అమల్లోకి వస్తే యాజమాన్య హక్కులను నిరూపించుకోవాలి.

వాస్తవం: మీ వద్ద భూములు ఉంటే వాటి హక్కులను నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. కొత్త చట్టం ప్రకారం ప్రభుత్వం వద్ద ఆ వివరాలు ఉంటాయి. ఆ వివరాల ప్రకారమే గ్యారెంటీ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అందులో అభ్యంతరాలు ఉంటే రెండేళ్ల పాటు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ అప్పీళ్లను పరిశీలించి శాశ్వత రిజిస్టర్‌లో నమోదు చేస్తారు.

ఆరోపణ: కోర్టులకు వెళ్లే అవకాశం ఉండదు.

వాస్తవం: ఇది పూర్తిగా అవాస్తవం. రెవెన్యూ రికార్డుల్లో పొరపాట్లను అప్పిలేట్ అథారిటీ పరిష్కరిస్తుంది. అక్కడ న్యాయం జరగకుంటే హైకోర్టులోని ప్రత్యేక బెంచ్‌ని ఆశ్రయించవచ్చు. ఆ బెంచ్ ద్వారా సత్వర న్యాయం పొందవచ్చు. కోర్టు ఇచ్చిన తుది తీర్పునే అప్పిలేట్ అథారిటీ అమలు చేస్తుంది. దీనిని మార్చే అధికారం మళ్లీ కోర్టుకే ఉంటుంది.

ఆరోపణ: కోర్టుల్లో కేసులు వేసేందుకు టీఆర్‌ఓకు సమాచారమివ్వాలి.

వాస్తవం: సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ, మీరు కోర్టులో కేసు వేసినట్లు సంబంధిత అధికారులకు తెలపాలి. తద్వారా మీ భూమి ఎక్కడికీ పోకుండా ఉంటుంది.

ఆరోపణ: కొత్త చట్టం కింద భూహక్కుల నిర్ధారణ ఎవరు చేస్తారు?

వాస్తవం: ఇప్పటికే ఉన్న భూమి వివరాలతో ఒక టైటిల్ రిజిస్టర్ మీ గ్రామానికి లేదా పట్టణానికి వస్తుంది. ఆ రిజిస్టర్‌లోని రికార్డులకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుంది. ఒకవేళ మీకు నష్టం కలిగితే ప్రభుత్వమే పూర్తి నష్ట పరిహారం చెల్లిస్తుంది. మీకు అధికారుల ద్వారా జరిగిన మార్పుల్లో అభ్యంతరాలుంటే కోర్టుల్లో సవాల్ చేయొచ్చు.

ఆరోపణ: వారసత్వ హక్కుల వివాదాలు వస్తాయి.

వాస్తవం: వారసత్వంగా సంక్రమించే ఆస్తులను టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ద్వారా మీ పేరు మీద బదిలీ చేసుకోవచ్చు. వారసత్వం విషయంలో వివాదాలు ఉంటే కోర్టుకు వెళ్లాలి. కోర్టు తీర్పు ఆధారంగా రిజిస్టర్లో మీ పేర్లను నమోదు చేస్తారు.

ఆరోపణ: ఈ చట్టం ఎక్కడా అమల్లో లేదు. ఏపీలోనే ఉంది.

వాస్తవం: ల్యాండ్ టైట్లింగ్ చట్టం ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల్లో అమల్లో ఉంది. ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు, ఆఫ్రికా దేశాల్లో ఈ విధానం అమల్లో ఉంది. తద్వారా అక్కడి భూముల హక్కులకు భద్రత పెరిగింది. ఆయా దేశాల్లో ఈ వ్యవస్థ విజయవంతంగా నడుస్తోంది.

ఆరోపణ: ఇది రాష్ట్ర ప్రభుత్వ చట్టమే. కేంద్రానిది కాదు.

వాస్తవం: ల్యాండ్ టైట్లింగ్ చట్టం కోసం 1986లో ప్రొఫెసర్ డి.సి.వాధ్వా ఏకసభ్య కమిషన్‌ను కేంద్రం నియమించింది. ఈ కమిటీ 1989లో టైటిల్ గ్యారెంటీ చట్టం అమలును సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత 2008, 2011, 2015, 2019లో నాలుగుసార్లు ఇందుకు సంబంధించిన ముసాయిదా చట్టాన్ని రాష్ట్రాలకు పంపారు. 2019లో నీతి ఆయోగ్ కమిటీ కొత్త ముసాయిదాను రాష్ట్రాలకు పంపింది. 2024 డిసెంబర్‌లోపు అమలు చేయాలని ఆదేశించింది.

> **ల్యాండ్ టైట్లింగ్ చట్టం సమగ్ర స్వరూపం**
> పూర్తి వివరాల కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆరోపణ: కొత్త చట్టం ఏపీలో అమల్లోకి వచ్చింది.

వాస్తవం: ఇంకా అమల్లోకి పూర్తిస్థాయిలో రాలేదు. చట్టం అమల్లోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, దీనికి సంబంధించిన నిబంధనలు తయారు కావాలి. గెజిట్‌కు సంబంధించిన నోటిఫికేషన్ ఇంకా రూపొందించలేదు.

ఆరోపణ: ఈ చట్టం వల్ల రైతులకు నష్టం.

వాస్తవం: ఈ చట్టం వల్ల రైతులకు పూర్తి హక్కులు సంక్రమిస్తాయి. 30 రకాల పత్రాల అవసరం ఉండదు. భూ వివాదాలు, సర్వే నంబర్లు, సరిహద్దుల సమస్యలు పరిష్కారం అవుతాయి. పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగాల్సిన అవసరం ఉండదు. మీ భూమిపై మీకు శాశ్వత హక్కులు వస్తాయి. భూకబ్జాల పీడ వదులుతుంది. మీ భూమిపై ఇతరులు దౌర్జన్యం చేసే అవకాశం ఉండదు. బ్యాంకులు సైతం సులువుగా లోన్లు జారీ చేస్తాయి.

ఆరోపణ: ప్రజల వద్ద ఉన్న పాస్ పుస్తకాలు, రిజిస్టర్డ్ దస్తావేజులు చెల్లకుండా పోతాయి.

వాస్తవం: ఈ చట్టం జాతీయ స్థాయిలో చర్చించి నీతి ఆయోగ్ సిఫారసు చేసిన చట్టం. అసెంబ్లీలో కూడా ఆమోదముద్ర పడింది. ప్రతిపక్ష పార్టీ టీడీపీ కూడా మద్దతు ఇచ్చింది. రాష్ట్రమంతటా ఈ చట్టం ఒక్క రోజే అమల్లోకి రాదు. భూముల సర్వే తర్వాత అభ్యంతరాలను పరిష్కరించాక తుది రిజిస్టర్ రూపొందించిన ప్రదేశాల్లో కాలానుగుణంగా చట్టం అమల్లోకి వస్తుంది. అప్పటివరకు రైతుల వద్ద ఉన్న పాస్ పుస్తకాలు, రిజిస్టర్డ్ దస్తావేజులు చెల్లుబాటులోనే ఉంటాయి. ఒక్కసారి తుది రిజిస్టర్ ద్వారా ప్రభుత్వం టైటిల్ గ్యారెంటీ ఇచ్చాక పాత రికార్డులు చెల్లవు.

ఆరోపణ: వందల చట్టాలు అమల్లో ఉండగా ఈ కొత్త చట్టం ఎందుకు?

వాస్తవం: భూ రికార్డులకు సంబంధించి ఏపీలో 124 రకాల చట్టాలు అమల్లో ఉన్నాయి. ఈ చట్టాలేవీ ఇవ్వని భరోసా కొత్త చట్టం ఇస్తుంది. ఆర్వోఆర్ చట్టం ద్వారా కేవలం రికార్డు మాత్రమే ఉంటుంది. ఆ రికార్డు ద్వారా సంక్రమించే హక్కులకు గ్యారెంటీ ఉండదు. కానీ కొత్త చట్టం హక్కులకు గ్యారంటీ ఇస్తుంది.

ఆరోపణ: స్టాంపు కాగితాలకు బదులు జిరాక్సులు ఇస్తున్నారు.

వాస్తవం: గత వంద సంవత్సరాలుగా స్టాంపు కాగితాలపైనే లావాదేవీలు నడిచాయి. కానీ, ప్రభుత్వం ఇచ్చే గ్యారెంటీ సర్టిఫికెట్ స్టాంపు కాగితాలకంటే విలువైనది. వీటిని జిరాక్స్ కాపీలు అని అనడం నీచమైన చర్య. ఒకవేళ గ్యారెంటీ సర్టిఫికెట్ పోగొట్టుకున్నా, టైట్లింగ్ ఆఫీసర్ వద్ద మీ వివరాలు పదిలంగా ఉంటాయి. మళ్లీ సర్టిఫికెట్ పొందవచ్చు.

ఆరోపణ: న్యాయవాదులకు అన్యాయం జరుగుతుంది.

వాస్తవం: ఈ చట్టం అమల్లోకి వస్తే భూ వివాదాలు తగ్గిపోతాయి. తద్వారా సివిల్ కేసులు కూడా భారీగా తగ్గుతాయి. అందువల్లే న్యాయవాదులు ఆందోళన చెందుతున్నారు. కానీ, ఈ చట్టం వల్ల పూర్తి పారదర్శకత లభిస్తుంది. ప్రజలకు మంచి జరుగుతుంది. హైకోర్టులో అప్పీల్ చేయడానికి అవకాశం ఉంటుంది కనుక న్యాయవాదులకు సివిల్ కేసులు కూడా వస్తాయి.

ఆరోపణ: పాస్ పుస్తకాలపై సీఎం బొమ్మ ఉంది కాబట్టి ఆ భూమి మీది కాదు.

వాస్తవం: ఇది దిక్కుమాలిన వాదన. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, రాజకీయ లబ్ధి పొందేందుకు కొన్ని అరాచక శక్తులు చేస్తున్న ఆరోపణ ఇది. కొత్త పాస్ పుస్తకాలను ప్రభుత్వం గ్యారెంటీతో ఇస్తుంది. ఈ పుస్తకాల ద్వారా రైతు లేదా భూ యజమానికి పంట సాయం వస్తుంది. సబ్సిడీలు వస్తాయి. బ్యాంకుల ద్వారా రుణాలొస్తాయి. పరిహారం వస్తుంది. భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు ఈ పుస్తకం ఆధారం. చాలా ప్రభుత్వ పథకాల అమలు సందర్భంగా ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రుల బొమ్మలు పెడుతుంటారు. కరోనా వేక్సినేషన్ సర్టిఫికెట్ల మీద ప్రధాని బొమ్మ ముద్రించారు. ముఖ్యమంత్రి బొమ్మ ఉన్నంత మాత్రాన ఏమీ జరగదు.



మీకు సంపూర్ణమైన తృప్తిని కలిగించే స్థితి లేదా స్థాయి ఏదైనా ఉందేమో పరిశీలించండి. వాటి నిజస్వభావం తెలిస్తే అటువంటి స్థితి ఏదీ లేదని తెలుస్తుంది. విజ్ఞతతో విషయాల్ని తెలుసుకొని జీవించటం మన బాధ్యత.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 8 మే 2024

గుట్టలుగా... అవినీతి కట్టలు

ఆరు కౌంటింగ్ మిషన్లు... పదుల కొద్దీ సిబ్బంది... 12 గంటల పైగా లెక్కింపు... 32 కోట్లకు పైగా విలువైన నగదు... దాదాపు అన్నీ అయిదొందల నోట్లు. జార్ఖండ్ రాజధాని రాంచీలోని గాడీఖానా చౌక్‌లోని ఆ చిన్న రెండు బెడ్‌రూమ్‌ల ఫ్లాట్‌లో అంత పెద్ద మొత్తం, పెద్ద పెద్ద సంచీల కొద్దీ నోట్ల కట్టలు ఉంటాయని ఎవరూ ఊహించరు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో పేరుకుపోయిన అవినీతికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం నాటి సోదాల్లో ఎదురైన దృశ్యాలే కళ్ళుచెదిరే సాక్ష్యాలు. సదరు శాఖ మంత్రి గారి వ్యక్తిగత కార్యదర్శి ఇంట, ఆ కార్యదర్శికి పనివాడి ఫ్లాట్‌లో, ఇతరుల వద్ద సోదాల్లో మొత్తం కలిపి రూ. 35 కోట్ల పైనే బయటపడేసరికి అంతా అవాక్కయ్యారు. అంతలేసి ధనం లెక్కాపత్రం లేకుండా ఎవరింట్లోనైనా ఉందంటే, అది అక్రమధనం కాక మరేమిటి? 'ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్' (పీఎంఎల్‌ఏ) కింద వారిద్దరినీ అరెస్ట్ చేశారు. ఇక, మంగళవారం రాంచీలో మరో 5 చోట్ల సోదాలు జరిపితే, ఓ కాంట్రాక్టర్ వద్ద 1.5 కోట్లు దొరికాయి. పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్... ఇలా ప్రాంతాలు, ప్రభుత్వాలు ఏవైనా సోదా చేస్తే చాలు... నల్లధనం విశ్వరూపం గుట్టల కొద్దీ కట్టల రూపంలో సాక్షాత్కరిస్తున్న తీరు ఆందోళనకరం.

జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖలో పై నుంచి కింద దాకా సమస్తం అవినీతిమయమేనని ఈడీ మాట. తీగ లాగితే డొంకంతా కదలడానికి తాజా కేసు ఉదాహరణ. గత ఏడాది ఫిబ్రవరిలో ఆ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో ఛీఫ్ ఇంజనీర్ వీరేంద్రరామ్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. కేవలం పదివేల రూపాయల లంచం తీసుకున్నందుకు జరిగిన ఆ అరెస్టు కథ చివరకు అనూహ్యంగా ఇంత పెద్ద కరెన్సీ గుట్టు విప్పింది. ప్రభుత్వ అధికార యంత్రాంగంలో చిన్నస్థాయిలోనే ఉన్నప్పటికీ, అవినీతి పరులైన ఉద్యోగులు నిఘా సంస్థల కంటబడకుండా తమ అక్రమార్జనను ఎలా తరలిస్తున్నదీ వీరేంద్రరామ్ విచారణలో తెలిసింది. సంక్లిష్టమైన అవినీతి వ్యవస్థలో తాను, తన లాంటి అధికారుల కోటరీ ఎలా భాగమైనదీ, టెండర్ల ప్రక్రియ సందర్భంగా లంచం సొమ్మును వివిధ మార్గాల్లో తరలించే పద్ధతీ ఆయన బయటపెట్టారు. ఆ వివరాలకు తగ్గట్లే... గ్రామీణాభివృద్ధి శాఖలో విస్తృతంగా అవినీతి సాగుతోందని గ్రహించిన ఈడీ తగిన చర్య చేపట్టాల్సిందిగా గత ఏడాది మేలోనే రాష్ట్ర సర్కారుకు గోప్యంగా లేఖ రాసింది. దానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పెద్దగా స్పందించలేదు. పైగా, నిఘా నీడలోని అవినీతి అధికారుల చేతిలోనే ఆ లేఖ పడడం విడ్డూరం.

తిరుగులేని సాక్ష్యాధారాలు లభించడంతో గ్రామీణాభివృద్ధి మంత్రి ఆలంగిర్ ఆలమ్ వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్‌లాల్ సహా పలువురు కీలక అనుమానితులపై ఈ సోమవారం ఈడీ దాడులు జరిపింది. కాంట్రాక్టులు ఇస్తూ అవినీతి ముఠాలో కీలకంగా వ్యవహరిస్తూ, లాల్ కోట్లు కూడబెట్టారట. లాల్ పనివాడి ఇంట్లో ఏకంగా రూ. 32 కోట్ల పైగా డబ్బు గుట్టలుగా దొరకడంతో వ్యవహారం సంచలనమైంది. ఇదికాక, మరో వ్యక్తి ఇంట్లో మరో 3 కోట్లు దొరికిందంటే, అక్కడి ప్రభుత్వ శాఖలో ఏ స్థాయిలో అక్రమాలు, అవినీతి రాజ్యమేలుతున్నాయో అర్థమవుతోంది. ఈడీ దాడుల్లో లభించిన దస్తావేజులను బట్టి ముందుగా ఊహించిట్టే ఇందులో మంత్రి గారి హస్తం ఉండనే ఉందని రుజువవుతోంది. ఆయన మెడకు ఉచ్చు బిగుస్తోంది. జార్ఖండ్‌లోని పాకూర్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన డెబ్బై ఏళ్ళ ఈ సీనియర్ కాంగ్రెస్ నేతను ఈడీ ప్రశ్నించడమే ఇక బాకీ. పనివాడినీ, అతని ఇంటిని అవినీతి సొమ్ముకు గిడ్డంగిగా మార్చిన వ్యక్తిగత కార్యదర్శినీ అరెస్ట్ చేసినా అమాత్యవర్యులు అదరక, బెదరక అమాయకత్వం ప్రకటిస్తుండడం విడ్డూరం.

జార్ఖండ్‌లోని చంపాయ్ సోరెన్ ప్రభుత్వంపై పడ్డ ఈ అవినీతి మచ్చ ఎన్నికల ప్రచారంలో బీజేపీకి బాగా అంది వస్తోంది. కాంగ్రెస్‌కు పెద్దదిక్కయిన గాంధీ కుటుంబానికి సన్నిహితులైన వారి ఇళ్ళల్లోనే గతంలోనూ, మళ్ళీ ఇప్పుడూ... ఇంత భారీగా అక్రమ ధనం లభించడాన్ని వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో మోదీ ప్రస్తావిస్తున్నారు. అవినీతిని ఆపడానికి తాను ప్రయత్నిస్తుంటే, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తమను విమర్శిస్తున్నాయని ఆయన వాదన. కాగా, ఇదంతా ప్రత్యర్థులే లక్ష్యంగా మోదీ సర్కార్ సాగిస్తున్న దర్యాప్తు సంస్థల దుర్వినియోగమని ప్రతిపక్ష కూటమి ఆరోపణ. గత డిసెంబర్‌లో జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూకు చెందిన ఒడిశా మద్యం డిస్టిలరీల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు జరిపితే, కనివిని ఎరుగని రీతిలో రూ. 350 కోట్ల పైగా మొత్తం దొరికిన సంగతి తెలిసిందే. పరస్పర ఆరోపణలెలా ఉన్నా, ఈ ఘటనలన్నీ ప్రమాదకరమైన పరిణామాన్ని సూచిస్తున్నాయి. అక్రమధనంపై దీర్ఘకాలంగా దేశవ్యాప్త ఉద్యమం జరుగుతూనే ఉంది. దర్యాప్తు సంస్థలు చురుగ్గానే ఉన్నాయి. అయినా సమస్య తీరకపోగా, కొత్తవి బయటపడడం పెను సవాలు.

అవినీతిని అంతం చేసి, అక్రమధనాన్ని అందరికీ పంచిపెడతామంటూ ప్రగల్భాలు పలికిన నేతలు గత పదేళ్ళుగా గద్దె మీదే ఉన్నారు. అవినీతి, కుటుంబ పాలనపై పోరాటమని చెబుతూనే వస్తున్నారు. ఫలితం శూన్యం. పెద్దనోట్ల రద్దు లాంటివి ఎంత విఫలయత్నాలో అర్థమవుతూనే ఉంది. ఈడీ, ఐటీ, సీబీఐ కేసుల్లో నిందితులైన నేతలు సైతం జెండా మార్చి, కాషాయం కప్పుకుంటే పరమ పునీతులైపోతున్న పరిస్థితులూ చూస్తున్నాం. ఏలికల చేతుల్లో ఏజెన్సీలు, పీఎంఎల్‌ఏ లాంటి అసమంజస కఠిన చట్టాలున్నా సమస్య తీరకపోవడానికి కారణమేమిటో ఆలోచించాలి. ఇవాళ వ్యాపారం, రాజకీయాలు, సమాజం ఏ స్థితికి చేరాయో గ్రహించాలి. నేతలు, అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై, ఒకరి కోసం ఒకరు నడిచే తీరు దేశానికి క్షేమం కాదు. ఎన్నికల వేళ ఈ అక్రమధనం పెనుసమస్య. దాని పర్యవసానాలు ఎన్నికలపైనే కాదు, ఆ తర్వాతా ఉంటాయని విస్మరించరాదు.

జగన్ ఒక నిజం... ఒక భావోద్వేగం

ఎన్నో ఆటుపోట్లను భరించి ఒంటరిగా రాజకీయ పార్టీని స్థాపించారు. వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక బలమైన నిజాయితీ గల ప్రజానాయకుడిగా ఎదిగారు. కనీవినీ ఎరుగని మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. కరోనా వల్ల రెండేళ్లు కలిసిరాక పోయినా ప్రజల్ని కంటిరెప్పల్లా కాపాడుకున్నారు. మిగిలిన కాలంలోనే పేద బిడ్డలకు కార్పొరేట్ స్థాయి ఆంగ్ల విద్యను అందుబాటులోకి తెచ్చారు. పేద తల్లిదండ్రులకు అద్భుతమైన ఆరోగ్య సేవలను అందించారు. వలంటీర్ వ్యవస్థ, గ్రామ సచివాలయాల ద్వారా పాలనను ప్రజల గడప వద్దకు తెచ్చారు. పెట్టుబడులను ప్రోత్సహించి పరిశ్రమలు వచ్చేట్టు చూశారు. ఒక్కమాటలో సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారు. అందుకే జగన్ అంటే జనాల్లో అంత ఆదరణ! జగన్ అంటే ఒక నిజం, ఒక భావోద్వేగం, ఒక విజయ సంకేతం.

వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రవేశం చేసినప్పటినుంచీ పది సంవత్సరాలు ఆటుపోట్లతో నడిచింది. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణం తరువాత రాజకీయంగా కాకలు తీరిన, కుట్రలు కుతంత్రాలు తెలిసిన నాయకులను ఎదిరించి ఒంటరిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. అప్పుడే ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్‌కు బీజం పడింది. తరువాతి కాలంలో సోనియా గాంధీ కుట్రలకు బలైపోయి పదహారు నెలలు జైలు జీవితం గడిపారు.

2017 జూలైలో తూర్పు గోదావరి జిల్లా, వైరా మండలం చాపరాయి గ్రామంలో పదహారు మంది ఆదివాసీలు విషజ్వరాలతో వైద్య సదుపాయం అందక మరణించిన విషయం తెలిసిందే. అప్పుడు జగన్ పది కిలోమీటర్లు అటవీ ప్రాంతంలో పోలీసు రక్షణ కూడా లేకుండా నడక దారిన వెళ్లి ఆ విషయాన్ని వెలుగులోకి తెచ్చి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టారు. పేదల పక్షాన శాసనసభలో గళం వినిపించారు. ఇక జగన్ రాజకీయ జీవితంలో మరువలేని ప్రధాన ఘట్టం ప్రజా సంకల్ప యాత్ర పేరుతో 3,648 కిలోమీటర్లు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు నడిచిన పాదయాత్ర. ఈ పాదయాత్రలో జగన్ ప్రజలతో మమేకమై వారి కష్టాలు చూసి చలించి 'నేను చూశాను, నేను విన్నాను, నేను ఉన్నాను' అంటూ ప్రజలకు భవిష్యత్తుపై నమ్మకం కలిగించారు. ఆంధ్ర రాష్ట్రంలో ఒక బలమైన నిజాయితీ గల ప్రజానాయకుడిగా ఎదిగారు. 2019లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 175 స్థానాల్లో 151 గెలిచి ఏపీ ముఖ్యమంత్రిగా అశేష జన వాహిణి మధ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న యాభై ఎనిమిది నెలల పాలనా కాలంలో కరోనాతో 24 నెలలు ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకోవడంలోనే గడిచింది. మిగిలిన దాదాపు మూడు సంవత్సరాల కాలంలో తన మేనిఫెస్టోలోని పథకాల ద్వారా ప్రజల ఆర్థిక అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఈ పథకాల ద్వారా మహిళా సాధికారతకు అడుగులు పడ్డాయి. వై.ఎస్.ఆర్. చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలతో పేద ప్రజల బతుకులలో వెలుగులు ప్రసరించాయి. వడ్డీ లేని రుణాలు ఇప్పించడం వలన గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక పుష్టి కలిగింది. ముప్పై ఒక్క లక్షల మంది నిరుపేద మహిళలకు జగన్ ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసింది. అందులో ఇరవై ఎనిమిది వేల ఎనిమిది వందల కోట్లతో పదహారు లక్షల ఇల్లు... రోడ్లు, డ్రైనేజి, నీటి వసతి, వీధి దీపాలు వంటి పూర్తి మౌలిక సదుపాయాలతో ఏర్పాటయ్యాయి. ఒక్కో ఇంటి విలువ స్థలంతో కలిపి పది లక్షలనుండి పదుహైదు లక్షల వరకు చేరి, పేదవారికి సొంత ఇంటి కల నెరవేరింది.

జగన్ సుపరిపాలనలో మరో ముందడుగు 2019 ఆగస్టు 15 నుంచి ప్రారంభమైన వలంటీర్ వ్యవస్థ. ఇక 2019 అక్టోబర్ 2న ప్రారంభించిన గ్రామ వార్డు సచివాలయాలు ఒక సువర్ణ అధ్యాయం.



వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే పెన్షన్, బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతోంది. సచివాలయాల ద్వారా ప్రజలకు రెవెన్యూ రికార్డులు, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, భూముల సర్వే సేవలు, ఆరోగ్యసేవలు ఏమాత్రం వ్యయ ప్రయాసలు లేకుండా, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా వేగవంతంగా లభిస్తున్నాయి. గ్రామ స్థాయిలో తెచ్చిన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్ర సామగ్రి సేవలు మార్కెట్ కంటే తక్కువ ధరలకు అందుతున్నాయి.

వైద్య రంగంలో జగన్ ప్రభుత్వం తెచ్చిన గొప్ప మార్పు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు పైసా ఖర్చు లేకుండా అందించడం. నాడు నేడు పథకం కింద ప్రభుత్వ హాస్పిటల్స్‌ను ఆధునీకరించారు. మహానేత రాజశేఖర రెడ్డి ప్రారంభించిన ఆరోగ్య శ్రీ సేవల పరిమితిని రూ.ఇరవై ఐదు లక్షలకు పెంచారు. చికిత్స సేవలు 1,059 నుంచి 3,250 వరకు పెంచారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రజలకు గడప గడపకు వైద్య సేవలు అందుతున్నాయి. ఇవి కాక శ్రీకాకుళం జిల్లాలో దశాబ్దాలుగా ఉద్దానం ప్రాంతంలో ఉన్న కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా వంశధార నది నుంచి 100 కిలోమీటర్లు పైప్‌లైన్ ద్వారా 807 గ్రామాలలోని ఏడు లక్షల మంది ప్రజలకు రక్షిత మంచినీరు అందించడం జరుగుతోంది. పలాసలో జగన్ తన పాదయాత్రలో చెప్పిన మాట ప్రకారం 200 పడకల సూపర్ స్పెషాలిటీ మరియు కిడ్నీ పరిశోధన హాస్పిటల్ నిర్మించడంతో అక్కడి ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందుతున్నాయి. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా చేసేనాటికి రాష్ట్రంలో 7 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండేవి. ఆయన శ్రీకాకుళం, కడప, ఒంగోలులో ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇంకా మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించడానికి కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, విజయనగరంలలో ప్రారంభించారు. మిగిలిన 12 వైద్య కళాశాలలు కూడా త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

పేద పిల్లల అభివృద్ధికి విద్య అత్యవసరం అని జగన్ విశ్వసించారు. ఈ దిశగా జగన్ ప్రభుత్వం సమూల మార్పులు చేసింది. నాడు నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేసింది. పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉన్న ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులు ఐక్యరాజ్యసమితిలోని అధికారులతో స్థిరమైన ఆర్థికాభివృద్ధిపై చర్చలో పాల్గొనడం సామాన్యమైన విషయం కాదు.

పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చే సులభతర విధానంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఏపీకి రూ.32,800 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ప్రస్తుత ప్రభుత్వంలో రూ.1.03 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. చిత్తూరు జిల్లా కోటర్ల పల్లె గ్రామం దగ్గర స్మార్ట్ డీవీ ప్రాజెక్ట్, అనకాపల్లి అచ్యుతాపురం దగ్గర టైర్ల తయారీ కంపెనీ, తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురం దగ్గర బిర్లా క్యాస్టిక్ సోడా యూనిట్, వైఎస్ఆర్ జిల్లా బద్వేల్ దగ్గర సెంచ్యురీ ప్యానల్స్ లాంటి పరిశ్రమలు వచ్చాయి. ఇంకా, అరబిందో, దివీస్ సంస్థల విస్తరణలతో కాకినాడ ఫార్మా యూనిట్‌గా ఎదుగుతోంది. విశాఖపట్నంలో ఇన్ఫోసిస్, విప్రో, భారత్ ఎలక్ట్రానిక్స్ తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. ఆంధ్ర రాష్ట్రానికి 972 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉన్నా కొత్తగా పోర్టులు గానీ, ఫిషింగ్ హార్బర్‌లు గానీ ఇదివరకు రాలేదు. ప్రస్తుతం జువ్వలదిన్నె, నిజాంపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్‌లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. వీటి వలన మత్స్యకార కుటుంబాల వారు చేపల వేటకు గుజరాత్ తీర ప్రాంతానికి వలసలు పోనవసరం లేదు.

ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో పేద ప్రజలకోసం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. తన ప్రభుత్వం వలన తమ కుటుంబాలకు మంచి జరిగితేనే తనకు తోడుగా నిలవమని అడుగుతున్నారు. జగన్ ఒక సంఘ సంస్కర్తగా, ప్రజారంజక పాలకుడిగా పేరు పొందిన మాట వాస్తవం. ప్రజలతో జగన్ బంధం భావోద్వేగాలతో ముడిపడి ఉంది. అందుకే సిద్ధం యాత్రలో లక్షలాది మంది పిల్లలు, యువతీ యువకులు, వృద్ధులు, మహిళలు ఎర్రటి ఎండల్లో కూడా జగన్ కోసం నిరీక్షిస్తున్నారు. ఆయన కనబడితే కేరింతలు కొడుతూ జై జగన్ అని నినాదాలు చేస్తున్నారు. ఇవి జగన్ విజయానికి సంకేతాలు.

– అమూరు రాఘవరెడ్డి । జె.డి.ఎస్.డబ్ల్యు. (రిటైర్డ్),
– జి.సాంబశివారెడ్డి । రిటైర్డ్ ప్రిన్సిపల్, యోగి వేమన యూనివర్సిటీ, కడప

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కోల్పోయే స్థానాలు



మొదటి రెండు దశల్లో ఎన్డీయే తాను ఐదేళ్ల క్రితం గెలిచిన 111 సీట్లలో 20 కోల్పోయి ఉంటుంది. మూడో దశలో 94 స్థానాల్లో తనకున్న 80లో మరో 20 దాకా కోల్పోవచ్చు. కనబడని ఆధిక్యాన్ని నిలుపుకోవాలంటే, బీజేపీ దాని మిత్రపక్షాలు అద్భుతమైన సామర్థ్యాన్ని చూపవలసి ఉంటుంది.

– యోగేంద్ర యాదవ్, ఎన్నికల విశ్లేషకుడు

అర్థం కావట్లేదా?



అమెరికా జెండాను దహనం చేసే విద్యార్థులు మీ దగ్గర ఉండొచ్చు, వాళ్లు 'అమెరికాకు మరణం' అని స్లోగన్లు ఇస్తుండవచ్చు, పశ్చిమ దేశాల మీద తమ ద్వేషాన్ని బహిరంగంగానే బిగ్గరగా ప్రకటిస్తుండవచ్చు. అయినా జనం దీన్ని ఇంకా గాజా గురించే అనుకుంటున్నారు.

– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్

మన మిఠాయిలు లేవా?



ఎందుకు భారతీయులు తమ పుట్టినరోజులను ప్రిజర్వేటివ్స్, కృత్రిమ ఫ్లేవర్లు, రంగులు ఉన్న కేకులతో జరుపుకొంటున్నారు? ఎందుకు మనం ఇంట్లో చేసిన ఖీర్, లడ్డూలు, ఇంకా సంప్రదాయ మిఠాయిలతో జరుపుకోం? సంప్రదాయ మిఠాయిలను 'తిరోగమనం'గా చూస్తూ, పాశ్చాత్య వంటకాలను నాగరికతగా భావిస్తున్నాం. మనం ఎప్పుడూ మానసిక బానిసలుగానే ఉంటున్నాం.

– సావిత్రీ ముముక్షు, డిజైనర్

ఇదో విపరీతం!



ఇండియా అడ్వర్టైజింగ్ చట్టాల విపరీతం చూడండి. ఒక ఐపీఎల్ సీజన్‌లో కింగ్‌ఫిషర్, టుబోర్గ్ వరుసగా తమ ప్రకటనలను ఇచ్చాయి. కానీ తన ప్రకటనలో 'బీరు' అనే మాటను వాడింది కేవలం పార్క్ ఎవెన్యూ బీర్ షాంపూ మాత్రమే.

– జాయ్ భట్టాచార్య, క్విజ్జర్

లూజరా? విన్నరా?



పొగతాగని వాళ్లు లూజర్లు అంటూ ఒక అమ్మాయి పోస్టు పెట్టడం చూశాను. ట్రిపుల్ బైపాస్ సర్జరీకి నేను పంపిన అత్యంత పిన్న వయస్కురాలు ఒక 23 ఏళ్ల స్మోకర్ అమ్మాయి. ఆమె మాటల్లో చెప్పాలంటే... లూజర్‌గా ఉన్నాసరే, ఆరోగ్యంగా జీవించండి.

– దీపక్ కృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్

'ఆకస్' ప్రపంచ శాంతికి భంగకరం

సందర్భం



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ఆకస్ (ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్, యూఎస్) త్రైపాక్షిక భద్రతా కూటమిఇండో– పసిఫిక్ ప్రాంత సైనిక సాంకేతిక భాగస్వామ్యం కోసం 2021 సెప్టెంబర్ 15న ఏర్పడింది. ఈ ఒప్పందం ప్రకారం ఆస్ట్రేలియా అణుశక్తి జలాంతర్గాములను పొందడంలో అమెరికా, యూకేలు సాయపడాలి. సభ్య దేశాల సైనిక సామర్థ్యాల అభివృద్ధికి ఆకస్ పనిచేస్తుంది. ఇది ఘర్షణ, ఉద్రిక్తతలను పెంచుతుంది. శాంతికి విఘాతం కలిగిస్తుంది.

ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని అరికట్టడం ఆకస్ లక్ష్యమని అమెరికా అధ్యక్ష భవనం నివేదిక అంటోంది. ఆకస్ ఐరోపా యూనియన్‌కు మేలుకొలుపనీ, ఐరోపా దేశాలు ఐక్యంగా ఉండాలనీ జర్మనీ హెచ్చరించింది. అధికార కేంద్రీకరణ, ఆయుధ పోటీకి దారితీస్తుందని ఇండోనేషియా చెప్పింది. ఆసియాలో సైనిక ఒత్తిళ్లను పెంచుతుందని మలేషియా పేర్కొనగా, మా అభిప్రాయాన్ని అడిగి ఉండాల్సిందని న్యూజిలాండ్ అన్నాయి. ఉత్తర కొరియా, రష్యాలు అణ్వాయుధ యుగంలో ఆకస్ హానికర మన్నాయి. ఇది ఫ్రెంచ్– ఆస్ట్రేలియా జలాంతర్గామి ఒప్పందాన్ని అంతం చేసింది. ఫ్రాన్స్ దీన్ని వెన్నుపోటుగా పేర్కొంది. 2021 సెప్టెంబర్ 17న ఆస్ట్రేలియా, అమెరికాల నుండి తన రాయబారులను విరమించుకుంది.

ఆకస్‌ను విస్తరించాలని దాని సభ్యదేశాలు ఆలోచిస్తున్నాయి. ఆకస్‌లో చేరాలని జపాన్, కెనడా ప్రయత్నిస్తున్నాయి. చారిత్రక, ఆచరణ కారణాల దృష్ట్యా, జపాన్ సైనిక, భద్రతా చర్యలను పొరుగు దేశాలు, అంతర్జాతీయ సమాజం నిశితంగా గమనిస్తున్నాయి. ఆకస్ విస్తరణ ఆసియా–పసిఫిక్ ప్రాంత శాంతి భద్రతలను దెబ్బతీస్తుందని చైనా రక్షణ శాఖ ప్రతినిధి ఉకియాన్ బీజింగ్‌లో ఏప్రిల్ 25న తెలిపారు.

అమెరికా–ఆస్ట్రేలియా–జపాన్–ఇండియాలతో ఏర్పడిన చతుర్భుజ భద్రతా సమూహం 'క్వాడ్', 13 దేశాలతో కలిసి 2022 మే 23న అమెరికా స్థాపించిన 'ఇండో–పసిఫిక్ ఆర్థిక చట్రం' ఇండో– పసిఫిక్ ప్రాంతాల్లో చైనా నిరోధానికి అమెరికా ఏర్పరచినవే. ఒక సభ్య దేశం కోసం మరొక సభ్య దేశం యుద్ధం చేయాలన్న షరతున్న నాటో సభ్యత్వం కోసం ఉక్రెయిన్‌ను నాటోలోకి లాగుతూ... అమెరికా, పశ్చిమ దేశాలు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి కారణమయ్యాయి.

ఆస్ట్రేలియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ ప్రకారం... అమెరికా డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ కర్ట్ క్యాంప్‌బెల్... ఆకస్ కింద పొందిన ఆస్ట్రేలియన్ అణు జలాంతర్గాములను అవసరమైతే తైవాన్ ద్వీపంపై ఏదైనా సైనిక వివాదంలో చైనాకు వ్యతిరేకంగా మోహరించవచ్చని సూచించారు. అంటే చైనా అనుమానాలు నిజమేనని స్పష్టమవుతోంది.

దేశాల మధ్య ఒప్పందాలు నిస్సైనికీకరణకు, శాంతి భద్రతలకు, యుద్ధ నివారణకు, దేశాల సార్వభౌమత్వ, సమైక్యత–సమగ్రతల రక్షణకు పనిచేయాలి. అంతే కాని దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యానికీ, వేర్పాటువాద చర్యల ప్రోత్సాహానికీ, అంతర్జాతీయ సత్సంబంధాల విచ్ఛిత్తికీ ఉపయోగపడరాదు.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

రిజర్వేషన్లకు ఎవరు భరోసా?

అభిప్రాయం



జి. శ్రీరామమూర్తి

రిజర్వేషన్ల మీద జాతీయ స్థాయిలో ఇంతటి ప్రస్తావన చోటు చేసుకోవడం ఒక మంచి పరిణామం. ఇది ప్రస్తావన మాత్రంగానే సాగుతున్న వ్యవహారం కాబట్టి దీనిని చర్చ అనడం లేదు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో (లోక్‌సభ ఎన్నికలు–2024) బీజేపీకి పూర్తి స్థాయి మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందనీ, రిజర్వేషన్లను రద్దు చేస్తుందనీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారానికి కమలనాథులు తీవ్ర కలవరపాటుకు గురౌతున్నారు. ఆర్‌ఎస్ఎస్ చేత కూడా ఖండన ప్రకటనలిప్పిస్తున్నారు. రాజ్యాంగాన్ని మార్చే ఉద్దేశం కానీ, రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచన కానీ ఏ కోశానా లేవని చెప్పుకుంటున్నారు. రిజర్వేషన్లు జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించినవి కాబట్టి బీజేపీ ఇంతగా ఇది అయిపోతోందని అర్థమవుతోంది.

సామాజికంగా అణగారిన వర్గాలకు–అంటే సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వాలని రాజ్యాంగంలో స్పష్టంగా ఉంది. అందుకు విరుద్ధంగా ఆర్థిక వెనుకబాటుతనాన్ని రాజ్యాంగంలో చేర్పించి ఆ వర్గానికి ఏకంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన చరిత్ర బీజేపీ పాలకులది. ఇందు కోసం అగ్ర వర్ణాలనుంచి ఒత్తిడి వర్గాలను రంగంలో దింపిన ఘనత బీజేపీది. దేశంలో శతాబ్దాలుగా కఠోరంగా అమల్లో గల కుల వ్యవస్థ, బ్రాహ్మణీయ వివక్ష వల్ల చదువుకీ, ఆస్తికీ, ఆత్మగౌరవానికీ బహు దూరంగా బతుకుతూ... అదే సమయంలో సకల శ్రామిక, సేవక వృత్తులు చేస్తూ సమాజ రథాన్ని నడిపిస్తున్న వేలాది కింది కులాల ప్రజలను చేయి అందించి ముందుకు తీసుకురావలసిన కర్తవ్యాన్ని గుర్తించి రాజ్యాంగ కర్తలు సానుకూల వివక్షకు అవకాశం కల్పించారు. విద్య, ఉద్యోగాల్లో కొంత శాతాన్ని ప్రత్యేక పరిగణన ద్వారా వారికి కేటాయించాలని నిర్ణయించారు. రాజ్యాంగ అధికరణలు 15(4), 46 ఇందుకే చోటు చేసుకున్నాయి. ప్రమోషన్లలో, భర్తీ కాకుండా మిగిలిపోయిన బ్యాక్ లాగ్ ఉద్యోగాలలో కూడా ఈ రిజర్వేషన్లు వర్తింపజేయడానికి వేర్వేరు రాజ్యాంగ సవరణల ద్వారా అవకాశం కల్పించారు.

బాబా సాహెబ్ అంబేడ్కర్ అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించడంతో దేశంలో సమతా భావన బలపడడం ప్రారంభించింది. అయినా ఇప్పటికీ వెలి గ్లాసులు, వెలి బావులు వంటివి కొనసాగుతున్నాయి. అగ్రవర్ణాలకు కేటాయించిన మంచినీటి కుండలోని నీరు తాగేడనే నెపం మీద పాఠశాలలో దళిత బాలుడిని కొట్టి చంపిన మాదిరి దారుణ ఉదంతాలు జరుగుతున్నాయి.

రిజర్వేషన్లు కల్పించి ఏడు దశాబ్దాలు దాటినా



అణగారిన వర్గాల– ఎస్సీ, ఎస్టీ, బీసీల బతుకులు చాలీచాలని గుడిసెల్లోనే కొనసాగుతున్నాయి. నిరుద్యోగం, అధిక ధరలు వారి బతుకులను మరింతగా అంచులకు ఈడ్చివేశాయి. అందుకే జనాభాలో తామెందరో... విద్య, ఉద్యోగాల్లో అంత శాతం వాటా తమకు రావాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. కులగణన నినాదం బలం పుంజుకున్నది. కాంగ్రెస్ పార్టీ దీనిని ప్రధాన వాగ్దానంగా చేసుకుంది. ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా దామాషాను బట్టి రిజర్వేషన్లు వర్తిస్తుండగా దేశ జన సంఖ్యలో సగానికి పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లను 27 శాతానికే కుదించారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీం కోర్టు గీచిన హద్దు గీత, క్రీమీ లేయర్ నిబంధన బీసీల పాలిట శాపాలయ్యాయి. ఆర్థిక వెనుకబాటుతనం పేరిట అగ్రవర్ణ పేదలకు రాజ్యాంగ సవరణ ఆయుధంతో 10 శాతం కోటా కల్పించిన మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని, క్రీమీ లేయర్‌ను తొలగించడానికి రాజ్యాంగ సవరణ ఎందుకు చేయలేదు? కులగణను బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తోంది? బీసీల దయనీయస్థితి అంకెల్లో అచ్చు గుద్దినట్టు బయటపడి వారిని వాడుకుంటూనే తాను వారిని ఎంతగా వంచిస్తున్నదో బహిర్గతమవుతుందనే భయంతోనే కదా!

బీజేపీ చరిత్రంతా రిజర్వేషన్ల వ్యతిరేక చరిత్రే. దశాబ్దాల క్రితం మండల్ నివేదిక అమలుకు తలపెట్టినప్పుడు చెలరేగిన రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం, మందిర్ ఆందోళన పరివార్ శక్తుల ప్రమేయంతో చెలరేగినవే కదా! సమ్మిళిత లక్షణంతో సెక్యులర్ సదాశయంతో వారి వారి అణగారినతనం ఆధారంగా హిందూయేతర మతస్థులలోని వారికీ రిజర్వేషన్ల కల్పనకు రాజ్యాంగం వీలు కల్పించింది. 2005 లో యూపీఏ ప్రభుత్వం నెలకొల్పిన జస్టిస్ రాజిందర్ సచార్ కమిటీ దేశంలో ముస్లింలు దయనీయ స్థితిలో ఉన్నారనీ, వారికి విశేష స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ సిఫారసు చేసింది. ఇప్పుడు ముస్లింలకు అరకొరగా ఉన్న రిజర్వేషన్లను కూడా రద్దు చేస్తామని ప్రధాని మోదీ తన ఎన్నికల ప్రచార సభల్లో కఠోర స్వరంతో ప్రకటిస్తున్నారు. రాజ్యాంగ ధర్మాన్ని కాల రాస్తున్నారు. ముస్లింల రిజర్వేషన్లను తెగనరుకుతానంటున్న బీజేపీ, ఆ తర్వాత వారికి దగ్గరగా ఉన్న ఎస్సీ, ఎస్టీల కోటాకు టాటా చెప్పాబోదనే హామీ ఎక్కడిది?

ఈ ఎన్నికల్లో తమ పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి లోక్‌సభలో 400 సీట్లు వస్తే రిజర్వేషన్లను తొలగిస్తామనీ, రాజ్యాంగాన్ని మారుస్తామనీ రాజస్థాన్ మంత్రి కిరోరి లాల్ మీనా ప్రకటించినట్టు చూపించిన ఒక వీడియో గత నెలలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. బీజేపీ తన అభిమతాన్ని అధికారికంగా కాకుండా అనధికారిక మార్గాలలో వ్యక్తం చేస్తూ ఉంటుందనే అభిప్రాయం ఉంది. రిజర్వేషన్ల జోలికి వెళ్ళబోమనీ, అది తప్పుడు ప్రచారమనీ ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదే పదే చేస్తున్న ప్రకటనలను, ఇస్తున్న హామీలను నమ్మలేం. ఆర్‌ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ కూడా రంగ ప్రవేశం చేసి రిజర్వేషన్ల రద్దు జరగబోదని స్పష్టంగా ప్రకటించారు. అయితే గతంలో ఆయనొకసారి రిజర్వేషన్లను సమీక్షించాలని అన్నారు. 2015 లో బిహార్ ఎన్నికలకు కొద్ది వారాల ముందు మాట్లాడుతూ రిజర్వేషన్ విధానంపై సామాజిక సమీక్ష జరగాలని ప్రకటించారు. దాని మీద వివాదం చెలరేగడంతో ఇతర పేద వర్గాలకు కూడా మేలు చేసే ఉద్దేశంతోనే ఆయన అలా అన్నారని వివరణ వచ్చింది. ఆచరణలో బీజేపీ పదేళ్ల పాలనలో రిజర్వేషన్లు కనుమరుగయ్యేలా ప్రైవేటైజేషన్ ముమ్మరించింది. సామాజికంగా, విద్యా విషయకంగా వెనుకబడిన బీసీలకు విధానపరంగా అది ఉపయోగపడింది శూన్యమే. బడుగులను కేవలం పేదలుగా, పైనుంచి నెలకు 5 కిలోల బియ్యం 'ముష్టి' వేస్తే అదే మహా ప్రసాదమని కళ్ళకు అద్దుకొనేవారుగా మాత్రమే బీజేపీ పరిగణిస్తూ ఉంది.

హిందూ కుల వ్యవస్థ దశాబ్దాలుగా అణగదొక్కగా చదువు, ఆత్మగౌరవం పిసరంతైనా అంటని బానిస బతుకులు బతికినవారికి పరిహారంగా రిజర్వేషన్లను కల్పించడాన్ని తాము నెత్తిన పెట్టుకునే సనాతన నీతికి అవమానమని వారు భావిస్తున్నారు. ఉదాహరణకు మహిళలపై గతంలో మోహన్ భాగవత్ వెలిబుచ్చిన అభిప్రాయాలను గమనించవచ్చు. 'పెళ్లి ఒక కాంట్రాక్టు అని ఈ ఒప్పందం ప్రకారం నువ్వు నా ఇంటి బాధ్యతలు నెరవేరిస్తే నీ అవస రాలాన్నిటినీ నేను తీరుస్తాను, నిన్ను భద్రంగా కాపాడు తాను అని భర్త భార్యకు చెబుతాడు, భార్య ఈ ప్రకారం నడుచుకున్నంత కాలం భర్త ఆమె బాధ్యత వహిస్తాడు, ఆమె ఈ కాంట్రాక్టును ఉల్లంఘిస్తే ఆమెను అతడు వదిలేయవచ్చు'అని ఆయన అన్నారు. గ్రామీణ భారతంలో రేప్‌లు తక్కువనీ, పట్టణాల్లో, నగరాల్లోనే ఎక్కు వని కూడా అన్నారు. మహిళ ఆస్వతంత్రురాలుగా, పురుషుడి చేతుల్లో ఉండాలని ఆయన ప్రవచించారు. ఇటువంటి భావాలు గలవారి అధిపత్యంలో దేశం సెక్యు లర్ రాజ్యాంగానికీ, రిజర్వేషన్లకూ స్వస్తి చెప్పి మనుస్మృతిని అమల్లోకి తెస్తుందనే భయాలు కలగడం సహజాతి సహజం.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** అమావాస్య ఉ.8.55 వరకు, తదుపరి వైశాఖ శు.పాడ్యమి, **నక్షత్రం:** భరణి ప.2.02 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.1.34 నుండి 3.05 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.29 నుండి 12.20 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.28 నుండి 10.44 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.17.

క్లుప్తంగా...

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు



తిరుమల: తిరుమల శ్రీవారిని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేష సాయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేంద్ర మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కేఏ పాల్ ప్రచారంలో జై జగన్ నినాదాలు



ఆరిలోవ(విశాఖ తూర్పు): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌కు ఎన్నికల ప్రచారంలో చుక్కెదురైంది. ఆరిలోవ ప్రాంతంలోని టి.ఐ.సి.పాయింట్, దుర్గాబజార్ మీదుగా ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్‌కు మంగళవారం సాయంత్రం రోడ్‌షోగా వచ్చిన కేఏ పాల్ అక్కడ ప్రసంగిస్తుండగా యువకులు జై జగన్.. జైజై జగన్ అంటూ పలుమార్లు నినాదాలు చేశారు. దీంతో ఆయన 'ఎమ్మెల్యేకి ఫ్యాన్‌పై ఓటు వేసి ఎంపీకి కుండపై ఓటు వేయండి ప్లీజ్ తమ్ముళ్లు.. నేను గెలిస్తే మీ యువతకు మంచి చేస్తాను' అంటూ ప్రాధేయపడ్డారు. అయినా యువకులు ఆగకుండా జై జగన్ నినాదాలు కొనసాగించడంతో పాల్ అక్కడ నుంచి వెనుదిరిగారు.

చిన్నారులకు 'పచ్చ'మూకల బెదిరింపు!

మాచవరం: వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకుని ఆడుకుంటున్న అభం శుభం తెలియని చిన్నారులకు సైతం పచ్చమూకల బెదిరింపులు ఆగడంలేదు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం మాచవరం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మంగళవారం టీడీపీకి చెందిన ప్రచార వాహనం (డీజే) ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తుండగా, ఎస్సీ కాలనీలోని కొందరు చిన్నారులు వైఎస్సార్ సీపీ జెండాలు పట్టుకుని ఆడుకుంటున్నారు. దీంతో గ్రామానికి చెందిన నరసింహారావు, వెంకటరత్నం చిన్నారులను దుర్భాషలాడుతూ బెదిరించారు. అక్కడే ఉన్న ఎస్సీలను ఉద్దేశించి, కావాలనే మీ పిల్లల్ని తమ పార్టీ ప్రచారానికి అడ్డుగా పంపించారని వాగ్వాదానికి దిగారు. మీ వ్యవహారం చూస్తామంటూ బెదిరించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలకు సర్ది చెప్పారు.

ఉపాధి పథకాన్ని నీరుగార్చారు

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

పెండ్లిమర్రి/చెన్నూరు: ఉపాధిహామీ పథకం కూలీలకు కనీస వసతులు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని నీరుగార్చాయని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఆమె మంగళవారం వైఎస్సార్ జిల్లా కమలాపురం, పెండ్లిమర్రి, వీరపునాయనిపల్లె, చెన్నూరుల్లో ప్రచారం చేశారు. కమలాపురం మండలం పెద్దచెప్పలి, కమలాపురం క్రాస్ రోడ్డు వద్ద రోడ్ షో నిర్వహించారు. పెండ్లిమర్రి మండలంలోని యోగి వేమన యూనివర్సిటీ సమీపంలో ఉపాధి కూలీలతోను, తుమ్మలూరులో ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉపాధిహామీ పథకం పండుగలా సాగిందని చెప్పారు. ప్రస్తుతం కనీస వసతులులేవని, రోజంతా కష్టపడి పనిచేసినా రూ.200 కన్నా తక్కువ కూలీ వస్తోందని కూలీలు చెప్పారు. ఈ ప్రభుత్వాలు కనీసం మంచినీరు కూడా ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కూలీలకు రోజు వేతనం రూ.400 ఇస్తామని షర్మిల చెప్పారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తమ్ముడు వైఎస్ వివేకానందరెడ్డి హంతకులు మన ముందే తిరుగుతున్నా సీబీఐ చేతులు కట్టుకుని ప్రేక్షక పాత్ర వహిస్తోందని ఆమె విమర్శించారు.

17 నుంచి పద్మావతీ పరిణయోత్సవాలు

మూడు రోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం రద్దు

తిరుమల: తిరుమలలో శ్రీపద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో తొలిరోజు శ్రీమలయప్పస్వామి గజ వాహనం, రెండవ రోజు అశ్వ వాహనం, చివరిరోజు గరుడ వాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వస్తారు. ఆ తర్వాత కల్యాణమహోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. కాగా, పరిణయోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

ప్రధాని పదవికి విలువ లేకుండా చేశారు

మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: దేశంలో బీజేపీదే అతి పెద్ద అవినీతి చరిత్ర అని, ఆ పార్టీ చేస్తున్న అవినీతి దేశంలో ఏ పార్టీ చెయ్యలేదని మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. ప్రధాని పదవికి మోదీ విలువ లేకుండా చేశారని మండిపడ్డారు. బొత్స మంగళవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మోదీకి తోడు దొంగ అయిన చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టునే సోమవారం సభల్లో చదివారని చెప్పారు. తోడు దొంగల కూటమి ఏ స్క్రిప్ట్ ఇస్తే అది చదివేయడమేనా, నిజాలు పరిశీలించొద్దా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల అవసరాలు, స్టీల్ ప్లాంట్ గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మోదీ అదే నోటితో పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా మార్చుకున్నాడని చెప్పిన విషయాన్ని మర్చిపోయారా! అని అన్నారు. ప్రధాన మంత్రి మాటలంటే వాటికి పవిత్రత ఉండాలని చెప్పారు. ఇంతలా దిగజారిపోయి మాట్లాడే ప్రధానిని ఎప్పుడూ చూడలేదని అన్నారు.

పోలవరంపై విచారణ చేసుకోండి

పోలవరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భావిస్తే విచారణ జరిపించుకోవచ్చు కదా అని అన్నారు. రూ.15 వేల కోట్లకు ఈసీలు ఇవ్వకుండానే ప్రధాని నిధులు విడుదల చేశారా అని ప్రశ్నించారు. ప్రధాని స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత నిరాధారపూరితంగా మాట్లాడకూడదని చెప్పారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరానికి కేంద్రం సహకారం ఉంటే తప్పకుండా పూర్తవుతుందన్నారు. చంద్రబాబు హయాంలో పునరావాసం సొమ్మును ఫ్రీజ్ చేశారని షెకావత్ చెప్పారన్నారు. అప్పట్లో చూపిన లబ్ధిదారులు సరైనవాళ్లు కాదని వాస్తవ లబ్ధిదారులు ఆరోపిస్తున్నారని అన్నారు. నిర్వాసితులకు డబ్బు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. చంద్రబాబు నిర్వాకం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందన్నారు. చంద్రబాబు తప్పులను కూడా తాము సరిచేస్తున్నామని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ మంచి కార్యక్రమమని బీజేపీ వాళ్లు చెప్తుంటే.. చంద్రబాబు, పవన్ మాత్రం ప్రజల్ని మోసం చేసేలా మాట్లాడుతున్నారన్నారు. వాళ్లిద్దరికీ సుద్దులు చెప్పాల్సిన మోదీ.. తమకు చెప్తున్నారని మండిపడ్డారు.

నీచంగా మానవత్వం లేకుండా కూటమి చర్యలు

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ పథకాలకు మోకాలడ్డుతూ నీచంగా, మానవత్వం లేకుండా పేదల కడుపు కొడుతున్నాయని బొత్స ధ్వజమెత్తారు. వలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీని అడ్డుకొని, రెండు నెలల్లో 40 మంది అవ్వా తాతలను పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. సుమారు 79 లక్షల మంది లబ్ధిదారులున్న వైఎస్సార్ ఆసరా పథకంలో చివరి విడతలో ఇంకా రూ.1,839 కోట్లు చెల్లించకుండా అడ్డుకొన్నారని చెప్పారు. విద్యాదీవెన పథకంలో కూడా 28 లక్షల మంది లబ్ధిదారులకు రూ.703 కోట్లు ఇవ్వకుండా అడ్డుపడ్డారన్నారు. తుపాను, కరవు వల్ల నష్టపోయిన 13.60 లక్షల మంది రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1,294.58 కోట్లు బ్యాంకుల్లో ఉన్నా లబ్ధిదారుల ఖాతాల్లో వేయకుండా అడ్డుకున్నారన్నారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద 33 లక్షల మందికి రూ.565 కోట్లు విడుదల చేయడానికీ ఒప్పుకోలేదన్నారు. ఈబీసీ నేస్తం కింద 4.20 లక్షల మందికి రూ.629 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇవన్నీ అమలులో ఉన్న పథకాలే అని, సాధారణంగా జరగాల్సినవేనని, అందుకే ఎన్నికల సంఘాన్ని గత నెలలోనే అనుమతి కోరామని, అయినా అనుమతివ్వలేదని చెప్పారు. 2019లో పసుపు కుంకుమ కార్యక్రమం ఎన్నికల నోటిఫికేషన్ తరవాత ఇచ్చారని, తాము దానికి అడ్డుపడ్డామా అని ప్రశ్నించారు. దీనికి తోడు సీఎం వైఎస్ జగన్‌పై చంద్రబాబు కారు కూతలు కూస్తున్నారని, 14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తి అలాంటి మాటలు మాట్లాడవచ్చా! అని ప్రశ్నించారు. చంద్రబాబు పేరెత్తడానికే అసహ్యంగా ఉందన్నారు. తమకూ అలాంటి మాటలు వచ్చని, అయితే తమకు సభ్యత సంస్కారం ఉన్నాయని చెప్పారు. ప్రజలు 15 రోజులు ఓపిక పడితే మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని, అప్పుడు ఏ కూటమి దయాదాక్షిణ్యాలు అక్కర్లేదని అన్నారు.

ఈసీ వాస్తవాలు పరిశీలించాలి..

కూటమికి ఎన్నికల సంఘం వత్తాసు పలుకుతూ ఏ ఫిర్యాదు చేసినా వెంటనే స్పందించడం సరికాదని అన్నారు. ఎన్నికల నిబంధనలకు, రాజ్యాంగానికి తాము వ్యతిరేకం కాదని, కానీ ఈసీ విజ్ఞతతో వాస్తవాలు పరిశీలించాలని కోరారు. కూటమి ఫిర్యాదు వల్ల వ్యక్తులకు, వ్యవస్థకు నష్టమా అనేది ఆలోచించకుండా వృద్ధుల చావుకు కారణం అవ్వడం భావ్యమా అని అన్నారు. చంద్రబాబు నీచమైన భాషపై ఈసీ తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించారు. వృద్ధుల చావులకు కారణమైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందక రైతులకు జరిగే నష్టానికి, ఫీజులందక విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకపోవడం, టీసీలు ఇవ్వకపోవడం జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో టీడీపీ కార్యక్రమాలకు ఈసీ ఓకే చెప్పిందన్నారు. అందుకే నిన్న సీఎం వైఎస్ జగన్ సజావుగా ఎన్నికలు జరుగుతాయా! అన్న అనుమానం వ్యక్తం చేశారని తెలిపారు.

జగన్‌ది పేదవాడి ఆకలి తీర్చే మేనిఫెస్టో

- చంద్రబాబుది అధికార దాహం తీర్చుకునే మేనిఫెస్టో
- కులాల మధ్యే కాదు.. కుటుంబాల మధ్య కూడా చిచ్చుపెట్టే స్థాయికి చంద్రబాబు దిగజారాడు
- కాపుల ఆత్మీయ సమ్మేళనంలో ముద్రగడ ధ్వజం



మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

నరసాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది పేదవాడి ఆకలి తీర్చే మేనిఫెస్టో అని, చంద్రబాబుది అధికార దాహం తీర్చుకునే మోసపూరిత మేనిఫెస్టో అని కాపు ఉద్యమ నేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం విమర్శించారు. మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహించిన కాపు ఆత్మీయ సమ్మేళనంలో ముద్రగడ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చంద్రబాబు అమలు కాని హామీలు మేనిఫెస్టోలో పెట్టి ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. తాను చాలామంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ చెప్పింది చెప్పినట్టు చేసి చూపించి.. ప్రజల కోసం పాటుపడ్డ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. పేదవాడి చేతి ఐదు వేళ్లూ నోట్లోకి వెళ్లాలని కోరుకుని ఆ దిశగా తన ఐదేళ్ల పాలన కొనసాగించిన నేత జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అలా మంచి చేసే ముఖ్యమంత్రికి ప్రజలు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కుటుంబాల మధ్య చిచ్చు పెట్టే స్థాయికి దిగజారాడు

చంద్రబాబు అధికారం కోసం కులాల మధ్య చిచ్చుపెట్టే స్థాయి నుంచి చివరకు కుటుంబాల మధ్య కూడా చిచ్చుపెట్టే స్థాయికి దిగజారిపోయారని ముద్రగడ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంలో చంద్రబాబు చిచ్చు పెట్టారని, ఇప్పుడు తన కుటుంబంలో కూడా చిచ్చు పెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నీచ రాజకీయాలపై చంద్రబాబును అధికార పీఠంపై కూర్చోబెట్టాలని తపిస్తున్న సినీ నటుడు పవన్‌కళ్యాణ్ కూడా సమాధానం చెప్పాలన్నారు. తుని ఘటన తరువాత చంద్రబాబు తనను వేధించిన తీరు, అవమానాలు మర్చిపోలేకపోతున్నానని ఆయన వాపోయారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. సభకు మాజీ జెడ్పీటీసీ, కాపు నేత చాగంటి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నరసాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన బొండా కొడుకులు

- వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు, ప్రచార వాహన డ్రైవర్లపై బొండా ఉమా కుమారుల దౌర్జన్యం
- బ్యాగు లాక్కుని చించేసి, కరపత్రాలు కాలువలో పడేసి, పెన్‌డ్రైవ్‌లు లాక్కున్న వైనం
- బొండా రవితేజ, సిద్ధార్థ ఆగడాలపై పోలీసులను ఆశ్రయించిన బాధితులు



రవితేజ చించేసిన మహిళా కార్యకర్త బ్యాగును చూపుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్,పాయకాపురం (విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో మంగళవారం టీడీపీ అభ్యర్థి బొండా ఉమా కుమారులు రవితేజ, సిద్ధార్థ రెచ్చిపోయారు. సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు, ప్రచార వాహనాలు నడుపుతున్న డ్రైవర్లపై గూండాయిజం చేసి భయభ్రాంతులకు గురిచేశారు. మహిళ మెడలో ఉన్న వైఎస్సార్‌సీపీ బ్యాగు లాక్కుని చించేశారు. ఆమె చేతిలో కరపత్రాలను లాక్కుని కాలువలో పడేశారు. వాహనాల్లో పెన్‌డ్రైవ్‌లు లాగేసుకొని మీరు తిరగడానికి వీల్లేదంటూ హుకుం జారీచేశారు. దిక్కున్నచోట చెప్పుకోండంటూ బెదిరించారు. 62వ డివిజన్ పాయకాపురం పిండిమర వెనుక ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలను రవితేజ అడ్డుకున్నారు. కె.చిన్నారి అనే మహిళ మెడలో ఉన్న వైఎస్సార్‌సీపీ బ్యాగును చింపేసి అందులో ఉన్న పుస్తకాలను కిందపడేశారు. పక్కనున్న ఇద్దరు యువతుల చేతుల్లోని కరపత్రాలను లాక్కుని చించి కాలువలో పడేశారు. బాధిత యువతులు సమాచారం ఇవ్వడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు అలంపూరు విజయ్ వెంటనే పోలీసులకు తెలిపారు. బాధిత యువతుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. బొండా సిద్ధార్థ టీడీపీ నాయకురాలు దాసరి ఉదయశ్రీతో కలిసి సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీ సాయిబాబా గుడి వద్ద, ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ వద్ద వైఎస్సార్‌సీపీ ప్రచార వాహనాల్ని అడ్డుకున్నారు. వాటిలో పెన్‌డ్రైవ్‌లు తీసుకుని డ్రైవర్లను బెదిరించారు. ఈ విషయం తెలిసిన వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకులు పోలీసులకు సమాచారం అందించి అక్కడికి చేరుకున్నారు. బొండా సిద్ధార్థ కారును అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు ఇరువర్గాలను అదుపుచేశారు. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

ఓటమి భయంతోనే అల్లర్లు: ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన బొండా ఉమా, అతడి కుమారులు నియోజకవర్గంలో అల్లర్లు సృష్టించేందుకు సిద్ధమయ్యారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక పథకం ప్రకారమే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని చెప్పారు. బొండా ఉమా, అతడి కుమారులు పద్ధతి మార్చుకోకపోతే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా.. అన్నట్లు బొండా ఉమా రౌడీయిజాలు, గూండాయిజాలు చేస్తుంటే అతడి కొడుకులు కూడా అవే చేస్తున్నారని విమర్శించారు. అధికారులు స్పందించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

ఆది, శ్రీచైతన్య యాజమాన్యంతో ప్రాణహాని

- రూ.800 కోట్ల ఆస్తులు కబ్జాచేశారు
- నా కుమారుడిపై కేసులు పెట్టించారు.. నన్ను జైల్లో పెట్టించారు
- సీఎం జగన్ నాకు రక్షణ కల్పించాలి..
- వైరల్ అవుతున్న కేశవరెడ్డి వీడియో



జమ్మలమడుగు: మాజీమంత్రి ఆదినారాయణ రెడ్డి, శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం వల్ల తనకు ప్రాణహాని ఉందని కేశవరెడ్డి విద్యాసంస్థల యజమాని కేశవరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు కేశవరెడ్డి వీడియో వైరల్‌గా మారింది. 2019కు ముందు కేశవరెడ్డి విద్యాసంస్థ ఆర్థిక లావాదేవీలతో ఇబ్బందిపడటంతో తనను 4 సంవత్సరాల 3 నెలలు జైలులో పెట్టించి నరకం చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వీడియోలో ఏమన్నారంటే.. నాకు కేవలం రూ.45 కోట్ల నుంచి రూ.50 కోట్ల మేరకు అప్పులు ఉంటే దాదాపు రూ.800 కోట్ల ఆస్తులు కబ్జా చేశారు. మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి బినామీని పెట్టి నా ఆస్తులను రాయించుకున్నాడు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ సమీపంలో ఉన్న ఆస్తిని బినామీల పేరుతో ఆదినారాయణరెడ్డి, శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం కబ్జాచేశారు. చైతన్య విద్యాసంస్థల యాజమాన్యం, ఆదినారాయణరెడ్డి ఆస్తులను అమ్మి నాకు రావాల్సిన డబ్బులను పూర్తిగా ఇచ్చేయాలి. ఆదినారాయణరెడ్డీ ఖబడ్దార్.. నేను కూడా రాయలసీమరెడ్డినే, ఫ్యాక్షన్ కలిగిన జిల్లాలో పెరిగినవాడినే. నాకు రావాల్సిన డబ్బులను వెంటనే చెల్లించాలి. నీ అవసరాల కోసం పార్టీలు మారుతూ మమ్మల్ని బలిపశువులుగా మార్చావు. నా కుమారుడు భరత్‌రెడ్డి, కోడలు ఇద్దరు చాలా మంచివాళ్లు. వారిని ప్రశాంతంగా బతకనివ్వు. నీ దుర్మార్గపు ఆలోచనతో వారిని సైతం బలిపెడుతున్నావు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లేకపోతే నీ కుటుంబం ఎక్కడ ఉండేదో తెలుసుకోవాలి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచంలోని యువకులకు ఒక ఐకాన్. అలాంటి వ్యక్తితో పోటీపడే స్థాయి నీకు ఉందా. నీ అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ, తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీలోకి పోయి కేసులు ఉన్నాయంటూ తిరిగి బీజేపీలో చేరి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదు. శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం.. కేశవరెడ్డి విద్యాసంస్థలకు సంబంధించిన ఆస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఎత్తుకెళ్లిపోతున్నారు. పిల్లలకు సక్రమంగా భోజనం లేకుండా, ఆడుకోవటానికి కనీసం ఆటస్థలాలు సైతం లేకుండా విద్యాసంస్థలను భ్రష్టుపట్టిస్తున్నారు. కేశవరెడ్డి విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్మి రూ.15 కోట్లు తీసుకున్నారు. ఆ డబ్బును సైతం వెంటనే ఇవ్వాలి. మీ అరాచకాలకు అడ్డుకట్టవేస్తా. కేశవరెడ్డి విద్యాసంస్థలను వదిలి వెళ్లకపోతే ఖబడ్దార్. మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి దుర్మార్గపు ఆలోచనలతో నా కుమారుడు భరత్‌రెడ్డిపై సైతం కేసులు నమోదు చేయించాడు. పిల్లలకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేశవరెడ్డి విద్యాసంస్థల విద్యార్థులు 600 మార్కులకు 595 మార్కులు సాధించారు. ఏకంగా వరుసగా పదిర్యాంకులు సాధించారు. ఆనాడు రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నన్ను ఆదరించడం వల్లే ఇది సాధ్యమైంది. ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్ రెండు సంవత్సరాల వ్యవధి ఇస్తే మా పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తా. ఆదినారాయణరెడ్డి, శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యం వల్ల ప్రాణహాని ఉంది. నా కుటుంబానికి రక్షణ కల్పించాలి.

కూటమి నేతల బరితెగింపు

పోస్టల్ ఓటర్లకు డబ్బు పంపిణీ



గూడెంలో బాహాటంగా పోలింగ్ కేంద్రం వద్ద ఓట్ల కొనుగోలు

తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో కూటమి నేతలు బరితెగించారు. జనసేన అభ్యర్థికి ఓట్లు వేయాలంటూ పట్టణంలోని కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాలకు సమీపంలో మంగళవారం ఓటర్లకు డబ్బు పంపిణీ చేశారు. ఓటర్లను చెట్ల చాటుకు తీసుకెళ్లి కవర్లలో డబ్బులు పెట్టి అందజేశారు. ముఖాలు గుర్తుపట్టకుండా కొందరు మాస్కులు, సొమ్ములు ఇచ్చే సమయంలో ఇచ్చే వ్యక్తి ముఖం కనిపించకుండా కొందరు అడ్డుగా నిల్చుని సొమ్ములను బహిరంగంగానే పంచిపెట్టారు. ఈ విషయంలపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

బడుగులు ఆత్మగౌరవంతో బతకాలంటే జగన్‌ను గెలిపించాలి

- సామాజిక న్యాయం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలి
- అఖిల భారత బీసీ సమాఖ్య అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య



మాట్లాడుతున్న జస్టిస్ వి.ఈశ్వరయ్య, చిత్రంలో రమేష్‌గౌడ్, ఆల్మెన్ రాజు

అనంతపురం కార్పొరేషన్: 'బడుగు, బలహీన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలన్నా... సమాజికన్యాయం కొనసాగాలన్నా... పేద పిల్లల జీవితాలు బాగుపడాలన్నా... కూలీనాలి పనులకు వెళ్లకుండా బడిబాట పట్టాలన్నా... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందు కోసం ఓట్లు చీలిపోకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదలు అందరూ కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించుకోవాలి' అని అఖిల భారత బీసీ సమాఖ్య అధ్యక్షుడు, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం అనంతపురంలోని ఓ హోటల్లో విలేకరులతో మాట్లాడారు. 'బడుగుల అభివృద్ధికి విద్యే ప్రధానమన్న నారాయణగురు, పూలే, అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలుచేశారు. బడుగు, బలహీనవర్గాల వారిని ఉన్నత స్థితికి చేర్చేందుకు విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చారు. నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పేదలపై ఆర్థికభారం పడకుండా అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు.' అని జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు.

బాబు బూటకపు హామీలను నమ్మవద్దు

'గత టీడీపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబు, మంత్రిగా ఉన్న ఆయన కుమారుడు లోకేశ్ రాష్ట్రాన్ని దోచేశారు. 2014 ఎన్నికలకు ముందు బాబు వందల హామీలు ఇచ్చినా ఒక్కటీ పూర్తిగా నెరవేర్చలేదు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 95శాతం అమలుచేశారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై టీడీపీ దుష్ప్రచారం చేస్తోందని జస్టిస్ ఈశ్వరయ్య మండిపడ్డారు. 'ఇవాళ భూ వివాదాలపై ఎన్నో కేసులు నమోదవుతున్నాయి. అటువంటి వాటికి చెక్ పెట్టేందుకు దాదాపు వందేళ్ల తర్వాత భూ రీసర్వే చేయించడంతోపాటు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రవేశపెట్టాలని చూస్తున్నారు. దానిని చంద్రబాబు వక్రీకరించి ఎల్లో మీడియా ద్వారా ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతున్నారు. ఈ చట్టంతో పేదలకు మంచి జరుగుతుంది. దేశం అభివృద్ధి చెందకపోగా అంతర్యుద్ధానికి కారణమవుతున్న మోదీతో బాబు, పవన్ జతకట్టడం శోచనీయమన్నారు.

బెయిల్ ఇస్తే ఫైళ్లపై సంతకాలు చేయొద్దు

ముఖ్యమంత్రిగా అధికారిక విధులు నిర్వర్తించవద్దు

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయాలని భావించిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆశ నెరవేరలేదు. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టై ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ లభించలేదు. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది. తొలుత కేజ్రీవాల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ కోరడం సరైంది కాదని మెహతా వాదించారు. ''ఇలాంటి వాటికి కూడా బెయిల్ ఇస్తే రాజకీయ నాయకులను ప్రత్యేక తరగతిగా పరిగణించినట్లు అవుతుంది. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. రేపు ఓ రైతు తనకు పంట కోతలున్నాయంటూ మధ్యంతర బెయిల్ కోరవచ్చు. అందుకే రాజకీయ నాయకులకు మినహాయింపులు ఉండొద్దు. నిందితుడు సీఎం అయినంత మాత్రాన ఈ కేసును ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదు. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వొద్దు'' అని సుప్రీంకోర్టును కోరారు. ధర్మాసనం స్పందిస్తూ ఒక పార్టీ అధినేతగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయాల్సిన అవసరం కేజ్రీవాల్‌కు ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ''ఇది నిజంగా అసాధారణ పరిస్థితి. కేజ్రీవాల్ ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి. తరచూ నేరాలు చేసే వ్యక్తి కాదు. ఐదేళ్లకోసారి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసే అవసరం ఆయనకు ఉంది. ఈ కేసులో ఒకవేళ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తే ముఖ్యమంత్రిగా అధికారిక విధులు నిర్వర్తించేందుకు మేము అనుమతించం. అలా చేయడం విరుద్ధ ప్రయోజనాలకు దారి తీస్తుంది. అందుకే బెయిల్‌పై విడుదలైతే అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయొద్దు'' అని స్పష్టం చేసింది. అభిషేక్ సింఘ్వీ స్పందిస్తూ కేజ్రీవాల్ బెయిల్‌పై బయటకు వెళ్లినా ఎలాంటి ఫైళ్లపై, పత్రాలపై సంతకాలు చేయబోరని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై తీర్పును వాయిదా వేసింది. బుధవారం లేదా గురువారం లేదా శుక్రవారం.. ఎప్పుడైనా సరే దీనిపై తమ నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడించింది. మరోవైపు మనీ లాండరింగ్ కేసులో తనను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌పై కూడా ధర్మాసనం విచారణ జరిపింది. దర్యాప్తులో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేసింది. ధర్మాసనం ఆదేశాల మేరకు, కేజ్రీవాల్ అరెస్టుకు ముందునాటి ఫైళ్లను అధికారులు కోర్టుకు సమర్పించారు.



మూడో దశలో 63.53% పోలింగ్

స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

11 రాష్ట్రాలు, యూటీల్లోని 93 స్థానాలకు పూర్తయిన పోలింగ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల మూడో దశలో 93 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో మంగళవారం రాత్రి 10 గంటల వరకు 63.53 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్‌లో జరిగిన స్వల్ప ఘర్షణలు, చెదురుముదురు ఘటనలు మినహా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నిర్ణీత పోలింగ్ సమయం సాయంత్రం ఆరులోపు క్యూ లైన్లలో నిల్చున్న వారినీ ఓటేసేందుకు అనుమతించారు. దాంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశముందని కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. అస్సాంలో అత్యధికంగా 79.79 శాతం, ఉత్తరప్రదేశ్‌లో అత్యల్పంగా 57.34 శాతం పోలింగ్ నమోదైంది. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కాస్తంత మెరుగ్గా 57.62 శాతం పోలింగ్ నమోదవడం గమనార్హం. పశ్చిమబెంగాల్‌లో పోలింగ్‌బూత్ వద్ద ఘర్షణలు, ఓటర్లను మభ్యపెట్టడం, బూత్ ఏజెంట్లపై దాడులపై టీఎంసీ, బీజేపీ, కాంగ్రెస్–సీపీఐ(ఎం)లు విడివిడిగా ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నాయి. ముర్షీదాబాద్, జాంగీపూర్ స్థానాల నుంచి ఈసీకి ఉదయం 9లోపే 180కిపైగా ఫిర్యాదులందాయి. కొన్ని చోట్ల టీఎంసీ, సీపీఎం కార్యకర్తలు ఘర్షణకు దిగారు. గుజరాత్‌లోని బనస్కాంతా నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు సీఆర్‌పీఎఫ్ జవాన్లలా వచ్చి పోలింగ్‌బూత్ వద్ద ఓటర్లను మభ్యపెట్టారన్న ఉదంతంలో కలెక్టర్ దర్యాప్తునకు ఆదేశించారు.

గుజరాత్‌లో ఓటేసిన ప్రధాని మోదీ

సొంత రాష్ట్రం గుజరాత్‌లో ప్రధాని మోదీ ఓటేశారు. గాంధీనగర్ నియోజకవర్గంలోని అహ్మదాబాద్ నగరంలో ఉన్న నిషాన్ పబ్లిక్ స్కూల్‌లో ప్రధాని మోదీ ఓటేశారు. గాంధీనగర్ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి అమిత్ షా పోలింగ్ బూత్ వద్ద మోదీకి స్వాగతం పలికారు. ఇదే పోలింగ్‌బూత్‌లో ఓటు ఉండటంతో మోదీ అన్నయ్య సోమాభాయ్ మోదీ సైతం అక్కడికొచ్చారు. దీంతో ఆయన ఆశీర్వాదం తీసుకునే మోదీ ఓటేశారు. ఉదయాన్నే ఓటేసేందుకు వచ్చిన ప్రధానిని కలిసేందుకు ఓటర్లు ఎగబడ్డారు. అమిత్ షా సైతం ఇదే అహ్మదాబాద్‌లో మరో చోట ఓటేశారు. ' అన్ని నియోజకవర్గాల్లో వయోబేధంలేకుండా ఓటర్లంతా ఎన్‌డీఏ, అభివృద్ధి అజెండాపై నమ్మకం ఉంచారు. ఇండియా కూటమి వేగంగా నీరుగారిపోతోంది. ఓటుబ్యాంక్ రాజకీయాలకు స్వస్తిపలికి ఆర్థికాభివృద్ధికి జై కొట్టిన ఓటర్లకు కృతజ్ఞతలు' అని ఓటేశాక మోదీ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

282 స్థానాల్లో పోలింగ్ పూర్తి

అమిత్ షా(గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా(గుణ), మన్‌సుఖ్‌మాండవీయ(పోర్‌బందర్), పురుషోత్తం రూపాలా(రాజ్‌కోట్), ప్రహ్లాద్ జోషి(ధార్వాడ్), ఎస్పీ సింగ్ బఘేల్(ఆగ్రా) పోటీచేస్తున్న స్థానాల్లోనూ మంగళవారం పోలింగ్ పూర్తయింది. గుజరాత్‌లోని సూరత్‌ను బీజేపీ ఏకగ్రీవంగా గెల్చుకోవడంతో మిగతా 25 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరిగింది. కర్ణాటకలో 14, మహారాష్ట్రలో 11, ఉత్తరప్రదేశ్‌లో 10, ఛత్తీస్‌గఢ్‌లో 7, బిహార్‌లో 5, అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో చెరో 4, గోవాలో 2, దాద్రానగర్ హవేలీ, డయ్యూడామన్‌లో రెండు స్థానాలకు పోలింగ్ జరిగింది. మంగళవారం పోలింగ్ జరిగిన గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని మెజారిటీ స్థానాలను 2019లో బీజేపీ కైవసం చేసుకుంది. మూడో దశ పోలింగ్ ముగియడంతో మొత్తం 543 స్థానాలకుగాను ఇప్పటిదాకా 282 స్థానాలకు పోలింగ్ పూర్తయింది. తొలి దశలో 66.14 శాతం, రెండో దశలో 66.71 శాతం పోలింగ్ నమోదైంది.

రాష్ట్రం	పోలింగ్ శాతం
గుజరాత్	57.62
కర్ణాటక	70.03
మహారాష్ట్ర	61.44
ఉత్తరప్రదేశ్	57.34
మధ్యప్రదేశ్	66.05
ఛత్తీస్‌గఢ్	70.05
బిహార్	58.16
అస్సాం	79.79
బెంగాల్	73.96
గోవా	75.13
దాద్రానగర్, హవేలీ, దయ్యూదామన్	68.89



గువాహటిలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఓటర్లు

మెజారిటీ కోల్పోయిన హరియాణా బీజేపీ సర్కార్

చండీగఢ్: హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం అసెంబ్లీలో మెజారిటీ కోల్పోయింది. ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు మంగళవారం చేసిన ప్రకటన నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వాన్ని మైనారిటీలో పడేసింది. సోమ్‌బీర్ సంగ్వాన్, రణ్‌ధీర్ సింగ్, ధరంపాల్‌లు మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు గవర్నర్‌కు లేఖ రాశారు. కాంగ్రెస్ పక్షంలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. సైనీ ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇలా ఉండగా, 90 మంది సభ్యుల అసెంబ్లీ ప్రస్తుత బలం 88. ఇందులో బీజేపీకి 40, కాంగ్రెస్‌కు 30, జేజేపీకి 10 మంది సభ్యులున్నారు. బీజేపీ ప్రభుత్వానికి వేరే ఇద్దరు స్వతంత్రులు తాజాగా మద్దతు పలకడంతో మరో ముగ్గురు సభ్యులు తక్కువయ్యారు. హరియాణా అసెంబ్లీకి వచ్చే అక్టోబర్‌లో ఎన్నికలు జరగాల్సి ఉంది.

కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 20వ తేదీ వరకూ పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ఉత్తర్వులు జారీ చేశారు. కేజ్రీవాల్ కస్టడీ ముగియడంతో అధికారులు మంగళవారం ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. ఇదే కేసులో అరెస్టయిన మరో నిందితుడు చన్‌ప్రీత్ సింగ్ జ్యుడీషియల్ కస్టడీని సైతం న్యాయమూర్తి ఈ నెల 20 దాకా పొడిగించారు.

నేతల ఓటు మురిపెం

ముద్దు చేస్తూ..



అహ్మదాబాద్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద చిన్నారిని ఎత్తుకున్న ప్రధాని మోదీ

మేమిద్దరం



అహ్మదాబాద్‌లోని ఓ పోలింగ్ బూత్ వెలుపల భార్య సొనాల్‌తో అమిత్ షా

మేము సైతం



కర్ణాటకలోని కలబురగిలో ఖర్గే, రాధాబాయి దంపతులు

కుటుంబ సమేతం



యూపీలోని ఈటావాలో భార్య డింపుల్, కూతురు అదితితో అఖిలేశ్ యాదవ్

మేమూ వేశాం



భోపాల్‌లో దిగ్విజయ్ సింగ్, భార్య అమృతా సింగ్

పుతిన్ ఐదోసారి ప్రమాణం

మాస్కో: రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ ఐదోసారి ప్రమాణం చేశారు. మంగళవారం క్రెమ్లిన్ ప్రాసాదంలో 2,500 మంది ముఖ్య అతిథుల సమక్షంలో పుతిన్ రష్యా రాజ్యాంగంపై ప్రమాణం చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ..అన్ని అడ్డంకులను అధిగమిస్తూ ఐక్యంగా ఉంటూ లక్ష్యాలను అధిగమించి, విజయాలను అందుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమానికి అమెరికా నటుడు స్టీవెన్ సీగల్ వంటి పలువురు సెలబ్రిటీలు హాజరయ్యారు. అయితే, అమెరికా, యూకే, జర్మనీ దౌత్యవేత్తలు గైర్హాజరయ్యారు. అంతకుముందు పుతిన్ 30 గన్ సెల్యూట్ స్వీకరించారు. క్రెమ్లిన్ కేథడ్రల్ స్క్వేర్ వద్ద ప్రెసిడెన్షియల్ రెజిమెంట్ పరేడ్‌ను తిలకించారు. దగ్గర్లోని అనన్షియేషన్ కేథడ్రల్‌లో రష్యన్ ఆర్థోడాక్స్ పాటియార్క్ కిరిల్ ఆశీస్సులు అందుకున్నారు. ఆరేళ్ల పదవీ కాలానికి గాను 2030 వరకు ఆయన అధ్యక్ష పదవిలో కొనసాగుతారు.

టీచర్ల నియామకం రద్దుపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 25,753 టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై మంగళవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. స్కూల్ సర్వీస్ కమిషన్ చేపట్టిన నియామకాల్లో అవకతవకలు జరిగాయని, అనర్హులకు ఉద్యోగాలు దక్కాయని హైకోర్టు అభిప్రాయపడింది. దీనిపై బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఆదేశాలపై స్టే విధిస్తూనే ఈ వ్యవహారంలో సీబీఐ తమ దర్యాప్తును కొనసాగించవచ్చని పేర్కొంది. అవసరమైతే రాష్ట్ర మంత్రులపై కూడా విచారణ చేపట్టవచ్చని, అయితే అనుమానితులను అరెస్టు చేయడం లాంటి చర్యలకు దిగొద్దని సీబీఐకి తెలిపింది. సుప్రీం స్టేను పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వాగతించారు.

సునీత అంతరిక్షయానం వాయిదా

కేప్ కెనావెరల్(అమెరికా): భారతీయ మూలాలున్న అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతరిక్షయానం సాంకేతికసమస్యలతో చిట్టచివర్లో వాయిదాపడింది. అమెరికాలో ఫ్లోరిడా రాష్ట్రంలోని కేప్ కెనావెరల్‌లోని కెన్నడీ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లాల్సి ఉంది. బోయింగ్‌కు ఇది తొలి మానవసహిత అంతరిక్ష ప్రయోగంకావడం విశేషం. ఈ క్యాప్సూల్‌ను యునైటెడ్ లాంఛ్ అలయన్స్ సంస్థకు చెందిన అట్లాస్ వీ రాకెట్ మోసుకెళ్లనుంది. అయితే భారత స్థానికకాలమానం ప్రకారం మంగళవారం ఉదయం రాకెట్‌కు కౌంటింగ్ మొదలెట్టగా సరిగ్గా రెండు గంటల ముందు రాకెట్ అప్పర్‌స్టేజ్ ఆక్సిజన్ ప్రెషర్ రిలీఫ్ వాల్వ్‌లో సమస్య ఉత్పన్నమైంది. దీంతో కౌంట్‌డౌన్‌ను ఆపేశారు. అప్పటికే క్యాప్సూల్‌లోకి వెళ్లిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్‌లను మళ్లీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.


రఫా క్రాసింగ్‌పై ఇజ్రాయెల్ పట్టు

కైరో: కాల్పుల విరమణకు సరేనంటూ హమాస్ ముందుకొచ్చినా ఇజ్రాయెల్ మాత్రం తన దాడులను ఆపట్లేదు. మంగళవారం ఈజిప్ట్‌తో సరిహద్దు పంచుకుంటున్న గాజాలోని రఫా బోర్డర్ క్రాసింగ్‌ను ఇజ్రాయెల్ సైన్యం తన అధీనంలోకి తెచ్చుకుంది. ఇప్పుడు అక్కడ ఇజ్రాయెల్ యుద్ధట్యాంకులు మోహరించాయి. ఉత్తర గాజాపై భీకర గగనతల, భూతల దాడుల దెబ్బకు పాలస్తీనియన్లు మొదట దక్షిణ గాజాకు పారిపోయారు. ఆ తర్వాత చాలా మంది రఫా బోర్డర్‌క్రాసింగ్ ద్వారా ఈజిప్ట్‌కు వలసపోయారు. రఫా బోర్డర్ క్రాసింగ్ ద్వారానే అంతర్జాతీయ సాయం కింద ఔషధాలు, ఆహారం పాలస్తీనియన్లకు చేరేవి. ఇప్పుడు ఇది ఇజ్రాయెల్ వశంకావడంతో అంతర్జాతీయ సాయానికి అడ్డంకులు ఏర్పడినట్లేనని విశ్లేషణలు వినవస్తున్నాయి. రఫా బోర్డర్ క్రాసింగ్‌ను తమ ఆధీనంలోకి తీసుకోవడం హమాస్ మిలటరీ శక్తిని, ఆర్థిక సామర్థ్యాన్ని దెబ్బతీయడానికి ముఖ్యమైన అడుగని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ అన్నారు. బందీలను విడిచిపెట్టకపోతే రఫాపై సైనిక చర్య తప్పదని ఇజ్రాయెల్ రక్షణమంత్రి అన్నారు.

22 మంది బిలియనీర్లయ్యారు

మోదీ పదేళ్ల పాలనపై రాహుల్ ధ్వజం • తాము కోట్లాది మందిని లక్షాధికారులను చేస్తామని హామీ

చాయ్‌బాసా/గుమ్లా: నరేంద్ర మోదీ తన పదేళ్లపాలనలో 22 మందిని బిలియనీర్లను చేస్తే విపక్షాల 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కోట్లాదిమందిని లక్షాధికారులుగా మారుస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జార్ఖండ్‌లోని చాయ్‌బాసా, గుమ్లాల్లో చేపట్టిన ర్యాలీల్లో రాహుల్ ప్రసంగించారు. '' రాజ్యాంగ పరిరక్షణ పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేసేందుకైనా విపక్షాల 'ఇండియా' కూటమి నేతలు సిద్ధంగా ఉన్నారు. అదానీ, అంబానీ వంటి వారి కోసం పనిచేసే మోదీ గిరిజనుల అటవీభూములను 14–15 మంది పారిశ్రామికవేత్తలకు ఇవ్వాలనుకుంటున్నారు. పదేళ్లలో ఆయన 22 మందిని కుబేరులుగా మార్చారు. గిరిజనులను చిన్నాచితకా పనులు చేసుకునే వారిగా బీజేపీ పరిగణించింది. మీ వాళ్లు వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులుగా ఎదగాలని బీజేపీ ఏనాడూ కోరుకోలేదు. అడవుల్ని పారిశ్రామికవేత్తలను ఇవ్వడమే బీజేపీ పనిగా పెట్టుకుంది. దేశంలో గిరిజనుల జనాభా దాదాపు 8 శాతం. కానీ కేంద్రంలో అత్యున్నతమైన పదవుల్లో ఉన్న 90 మంది సీనియర్ ఐఏఎస్‌లలో కేవలం ఒక్కరే గిరిజన వ్యక్తి. ఇప్పుడు ఆయనను కూడా అప్రధాన్య పదవికి పరిమితం చేశారు'' అని రాహుల్ అన్నారు.



అప్రెంటిస్‌షిప్.. నెలకు రూ.8,500

''మేం అధికారంలోకి వస్తే గ్రాడ్యుయేషన్, డిప్లొమా ఉన్న నిరుద్యోగులకు అప్రెంటిస్‌షిప్ ద్వారా అవకాశాలు కల్పించి నెలకు రూ.8,500 వేతనం అందజేస్తాం. పేద మహిళలకు నెలకు రూ.8,500 చొప్పున మొత్తంగా ఏటా రూ.1 లక్ష అందిస్తాం. ప్రభుత్వరంగ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థను రద్దుచేస్తాం. ఆశా, అంగన్‌వాడీలకు అందే కేంద్రవాటాను రెట్టింపు చేస్తాం'' అని అన్నారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, గిరిజన నేత హేమంత్ సోరెన్‌ను అన్యాయంగా అరెస్ట్‌చేశారని ప్రస్తావించగానే కార్యకర్తలు 'జైలు తాళాలు బద్దలుకొట్టుకుని సోరెన్ బయటికొస్తారు' అని నినాదాలు చేశారు.

జీఎస్‌టీ చట్టాన్ని సవరిస్తాం

''సైన్యంలో అమలవుతున్న వివాదాస్పద అగ్నివీర్ పథకాన్ని సైన్యం తీసుకురాలేదు. ప్రధాని మోదీ సొంత నిర్ణయమిది. సైన్యంలో అమరులైన వారందరికీ సమాన గౌరవం దక్కాలి. గౌరవమర్యాదలకుతోడు పెన్షన్ అందేలా చూస్తాం. వివాదాస్పద అగ్నివీర్ పథకాన్ని రద్దుచేస్తాం. పేదలకు భారంగా మారిన జీఎస్‌టీ విధానంలో మార్పులు తెస్తాం. ఐదు పన్ను శ్లాబులకు బదులు ఒక్కటే కనిష్ఠ శ్లాబును ప్రవేశపెడతాం. దీంతో పేదల నెత్తిన పన్నుభారం తగ్గుతుంది. వస్తుసేవలపన్ను చట్టంలో తగు సవరణలు తెస్తాం. జార్ఖండ్‌లో ఆదివాసీలు, గిరిజనులు పాటించే మతవిశ్వాసాలను అనుగుణంగా విడిగా సర్నా స్మృతిని తీసుకొస్తాం'' అని అన్నారు.

మేనల్లుడు ఆకాశ్‌పై మాయావతి వేటు

- పార్టీలో తన వారసుడు కాడని ప్రకటన
- పార్టీ జాతీయ సమన్వయకర్త పదవి నుంచి ఉద్వాసన

లక్నో: తన వారసుడు ఇతనేనంటూ ప్రకటించిన ఐదు నెలలకే బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి మనసు మార్చుకున్నారు. మేనల్లుడు ఆకాశ్ ఇకపై పార్టీలో తన వారసుడు కాబోడని మంగళవారం ప్రకటించారు. పార్టీ జాతీయ సమన్వయకర్త పదవి నుంచి తప్పించారు. ఆకాశ్ రాజకీయాల్లో పరిపూర్ణత సాధించే వరకు అతడిని పక్కన పెడుతున్నానని, పార్టీ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మాయావతి ట్వీట్‌చేశారు. ఆకాశ్ తండ్రి ఆనంద్ కుమార్ బీఎస్పీలోనే క్రియాశీలక నేతగా ఉన్నారు. ఆనంద్ ఇకమీదటా పార్టీలోనే ఉంటారని మాయావతి స్పష్టంచేశారు. మూడో దశ పోలింగ్ పూర్తయిన రోజే బీఎస్పీ చీఫ్ నుంచి అనూహ్య నిర్ణయం వెలువడటం గమనార్హం. '' పార్టీ ప్రయోజనాలు, ప్రజాఉద్యమమే లక్ష్యంగా ఇలాంటి త్యాగాలు చేయడంలో బీఎస్పీ నాయకత్వం ఏనాడూ వెనుకంజ వేయలేదు. ఇకమీదటా అంబేడ్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తాం' అని మాయావతి అన్నారు. సీతాపూర్‌లో ఎన్నికల ర్యాలీలో వివాదాస్పద వ్యాఖ్యలతో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ఆకాశ్‌పై గత నెల 28న జిల్లా యంత్రాంగం సూమోటోగా కేసు నమోదు చేసింది.

ఓటు జిహాద్ కావాలా? రామరాజ్యం కావాలా?

నిర్ణయించుకోవాల్సింది ప్రజలే • మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రచార సభల్లో మోదీ

భోపాల్/బీడ్: చరిత్రలో భారత్ కీలకమైన టర్నింగ్ పాయింట్‌కు చేరుకుందని, ఇలాంటి సమయంలో దేశానికి ఓటు జిహాద్ కావాలో, రామరాజ్యం కావాలో ప్రజలే తేల్చుకోవాలని ప్రధాని మోదీ అన్నారు. మోదీకి వ్యతిరేకంగా ఓటు జిహాద్ చేయాలంటూ కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పిలుపునిస్తున్నాయని, ఇది నిజంగా ప్రమాదకరమైన ఉద్దేశమని చెప్పారు. మంగళవారం మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. విపక్షాల తీరుపై మండిపడ్డారు. మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే..

యువరాజు కుట్ర బట్టబయలు

''భారత్‌పై జిహాద్ చేయాలని పాకిస్తాన్ ఉగ్రవాదులు పిలుపునిస్తుంటారు. మన దేశంలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మోదీపై ఓటు జిహాద్ చేయాలని అంటున్నాయి. ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఓ మతస్థులను కోరుతున్నాయి. కాంగ్రెస్ ఏ స్థాయికి దిగజారిపోయిందో అర్థం చేసుకోండి. 1985 నాటి షా బానో కేసులో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చేసినట్లుగా అయోధ్య రామాలయం విషయంలో సుప్రీంకోర్టు తీర్పును తలకిందులు చేయడానికి కాంగ్రెస్ యువరాజు(రాహుల్ గాంధీ) పన్నిన కుట్రను ఆ పార్టీ నాయకుడొకరు బయటపెట్టారు. పాకిస్తాన్ పట్ల కాంగ్రెస్ ప్రేమ తారస్థాయికి చేరుతోంది. మన సైన్యంపై విద్వేషం ప్రదర్శిస్తున్నారు. సిగ్గులేకుండా పాకిస్తాన్‌ను వెనకేసుకొస్తున్నారు. 'కాంగ్రెస్ కా హాత్.. పాకిస్తాన్ కే సాత్' అంటున్నారు. పాక్‌ను ప్రేమిస్తే ఓటు బ్యాంక్ పటిష్టం అవుతుందని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు''

ఇతర మతాల గురించి మాట్లాడే దమ్ముందా?

''అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠను విపక్ష నాయకులు హేళన చేశారు. శ్రీరాముడిని, ఆయన భక్తులను కించపర్చారు. ఇతర మతాల ఆరాధనలు, పద్ధతుల గురించి మాట్లాడే దమ్ము ఆ నాయకులకు లేదు. బుజ్జగింపు రాజకీయాల కోసం రాముడిని, రామభక్తులను అవమానిస్తున్న పార్టీలతో మనకు ఒరిగేదేమిటి? కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 370ని మళ్లీ తీసుకురావొద్దంటే, అయోధ్య రామమందిరానికి తాళాలు వేయొద్దంటే ఈ ఎన్నికల్లో మాకు 400 సీట్లు ఇవ్వండి అని ప్రజలను కోరుతున్నా. ఓటు బ్యాంక్ కోసం ఓబీసీ కోటాను కాంగ్రెస్ లాక్కోవద్దంటే మాకు 400 సీట్లు అప్పగించండి'' అని విజ్ఞప్తి చేశారు.

ముస్లింలకు రిజర్వేషన్లుండాలి కానీ: లాలు

పట్నా: ఎన్నికల వేళ ముస్లింలకు రిజర్వేషన్ల కోటాపై ఆర్‌జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముస్లింలకు మత ప్రాతిపదికన కాకుండా సామాజికంగా వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లను కల్పించాలని చెప్పారు. మంగళవారం ఉదయం ఆయన ఈ మేరకు చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. ఈ విమర్శలపై పీటీఐతో ముఖాముఖిలో లాలు ప్రసాద్ బదులిచ్చారు. ముస్లింలకూ రిజర్వేషన్లు రావాలి కదా అంటూ..'రాజకీయాల్లో నరేంద్ర మోదీ కంటే సీనియర్‌ను. నాకు తెలిసిన చాలా విషయాలు ఆయనకు తెలియవు. నా హయాంలోనే బిహార్‌లో మండల్ కమిషన్ సిఫారసులు అమలయ్యాయి. వందలాదిగా ఉన్న సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ, అవి మత ప్రాతిపదికన మాత్రం కాదు. మత ఆధారిత రిజర్వేషన్ల గురించి ప్రస్తావన రాజ్యాంగంలో లేదు. అందుకే ముస్లింలకు వెనుకబాటుతనం ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి'అని వివరించారు.

శిరోమణి అకాలీదళ్‌కు అభ్యర్థి ఝులక్

చండీగఢ్: శిరోమణి అకాలీ దళ్(సుఖ్‌బీర్ సింగ్ బాదల్ వర్గం)కు ఆ పార్టీ చండీగఢ్ అభ్యర్థి గట్టి షాక్ ఇచ్చారు. పార్టీ అధ్యక్షుడు ఉదాసీనంగా ఉంటున్నారని ఆరోపిస్తూ పోటీ నుంచి, పార్టీ నుంచి వైదొలిగారు. చండీగఢ్ లోక్‌సభ నియోజకవర్గంలో ఆ పార్టీ హర్దీప్ సింగ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. హర్దీప్ ప్రస్తుతం చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా ఉన్నారు. 'నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటాం. మాకు అండగా నిలబడాలని అధ్యక్షుడిని కోరాం. కానీ, ఆయన ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి మద్దతూ ఇవ్వడం లేదు'అని సింగ్ ఆరోపించారు. హర్దీప్‌తోపాటు కొందరు నేతలు కూడా పార్టీకి రాజీనామా చేశారు. చండీగఢ్ స్థానానికి బీజేపీ సంజయ్ టాండన్‌ను, కాంగ్రెస్ మనీశ్ తివారీని బరిలో దించాయి. మొదటిసారిగా ఇక్కడ అభ్యర్థిని పోటీకి నిలిపిన శిరోమణి అకాలీదళ్‌కు చేదు అనుభవం ఎదురైంది.

మోడల్ కోడ్ మోదీ కోడ్‌గా మారింది: మమత

పురులియా: బీజేపీ హయాంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎన్నికల నిబంధనావళి) కాస్తా మోదీ కోడ్ ఆఫ్ కండక్ట్‌గా మారిపోయిందని టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతల విద్వేష ప్రసంగాలపై వస్తున్న ఫిర్యాదులను ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. పశ్చిమబెంగాల్‌లోని పురులియాలో మంగళవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మమత మాట్లాడారు. తాము మాత్రమే హిందువులమని భావిస్తున్న ప్రధాని మోదీ, బీజేపీ అగ్ర నేతలు ఇతర వర్గాల ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు. హిందువుల్లో దిగువ కులాల వారిని, మైనారిటీలు, ఇతర అణగారిన వర్గాలపై వీరు విద్వేష పూరిత ప్రసంగాలు చేస్తున్నా ఈసీ మౌనంగా ఉంటోందని విమర్శించారు. ఎన్నికల నిబంధనావళి అపహాస్యమైపోయిందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు ఇకపై మోదీ కోడ్ ఆఫ్ కండక్ట్‌గా నామకరణం చేయాలని ఎద్దేవా చేశారు. మోదీ మాదిరిగా అబద్ధాలు చెప్పే ప్రధానిని తానింత వరకు చూడలేదని ఆమె పేర్కొన్నారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 8 । మే । 2024



ప్రధాని పర్యటనకు పటిష్ట బందోబస్తు

ప్రధాని మోదీ పర్యటనకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తామని సీపీ రామకృష్ణ తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన మంగళవారం దిశానిర్దేశం చేశారు. -8లో▸



కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలో ఏర్పాటు చేసిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ ఢిల్లీరావు మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. -8లో▸



	కనిష్టం	గరిష్టం
మచిలీపట్నం	28	34
గుడివాడ	27	38
నందిగామ	29.5	39.2
జగ్గయ్యపేట	30.1	39

న్యూస్‌రీల్

3.2 కిలోల వెండి తొడుగు సమర్పణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మల్లేశ్వర స్వామి వారి నిత్య పూజలకు ఉపయోగించే చెక్కబల్లకు అవసరమైన 3.2 కిలోల వెండి తొడుగును దాతలు మంగళవారం సమర్పించారు. విజయవాడకు చెందిన కాంట్రాక్టర్ గుంటుపల్లి వెంకట్రావు దంపతులు కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలకు వినియోగించే చెక్కబల్లకు రూ.3 లక్షలు వెచ్చించి 3.200 కిలోల వెండిరేకుతో తయారు చేయించిన తొడుగును ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు, అర్చకులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనం కల్పించారు. దాతలకు ఆలయ ఈఓ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

12న కృష్ణాజిల్లా చెస్ జట్లు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 12వ తేదీన కానూరులోని గ్రీన్ స్కూల్‌లో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎం.ఫణికుమార్ మంగళవారం తెలిపారు. ఓపెన్, మహిళల విభాగాల్లో జట్ల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఒక్కో కేటగిరీలో నలుగురు క్రీడాకారుల చొప్పున ఎంపికచేస్తామని వివరించారు. ఎంపికైన మహిళల జట్టు ఈ నెల 25, 26 తేదీల్లో సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో, ఓపెన్ కేటగిరీ జట్టు 28, 29 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 97007 75220, 92471 53387 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కేయూలో శరవేగంగా భవనాల నిర్మాణ పనులు



కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణావిశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరుగుతున్న పలు భవనాల నిర్మాణ పనులను ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఏపీ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) చీఫ్ ఇంజినీర్ బి.గోపీచంద్ మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంక్, ఫుడ్ కోర్ట్, ఫార్మసీ కళాశాల, ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన కాంట్రాక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ఫుడ్ కోర్టు నిర్మాణ పనులు పూర్తవడంతో దాన్ని ప్రారంభించాలని సూచించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ గోపీచంద్ మాట్లాడుతూ.. ఫార్మసీ కళాశాల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. విశ్వవిద్యాలయం చుట్టూ చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈతో పాటు సంబంధిత విభాగం అధికారులు, యూనివర్సిటీ ఇన్‌చార్జి ఇంజినీర్ జి.సూర్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఉంటే తెలియజేయండి




చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గన్నవరం, గుడివాడ, పామర్రు, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విజ్ఞాపనలు, ఫిర్యాదులు ఉంటే తెలియజేయాలని సాధారణ పరిశీలకుడు నరహరిసింగ్ బంగర్ కోరారు. తన సెల్ నంబర్ 87126 93654కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

యువత.. నవ జనత

- మొదటి సారి ఓటుహక్కు పొందిన యువతలో ఉత్సాహం
- ఎన్టీఆర్ జిల్లాలో 18–19 ఏళ్లలోపు వయసున్న ఓటర్లు 43,053 మంది
- 13న కొత్తగా ఓటు వేయనున్న కుర్రకారు

యువ ఓటరు.. భవితకు రైటరు



ఓటు అంటే ఒట్టి మాటల కోట కాదు.. ప్రజాస్వామ్య బాట.. అంటూ తొలి ఓటును సంధించనున్న యోధులు వారు. ఎన్టీఆర్ జిల్లాలో నవ ఓటర్లు తమ భవితకు రైటర్లుగా మారుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి సిద్ధమవుతున్నారు. బంగరు భవితకు, నవ భారత నిర్మాణానికి మే 13వ తేదీన వజ్రాయుధమనే ఓటు వేయడానికి జోరు మీదున్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో నవ ఓటర్లు జోరు చూపడానికి సిద్ధమవుతున్నారు. యువత బంగరు భవితను లిఖించడానికి మే 13న ఓటు అనే వజ్రాయుధం సంధించడానికి సమాయత్తమవుతున్నారు. సమాజాన్ని మార్చే శక్తి ఓటుకు, దేశాన్ని మార్చే బలం యువతకు ఉంది. నవభారత నిర్మాణం యువత చేతిలోని వజ్రాయుధంతోనే సాధ్యమవుతుంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో తొలి ఓటు వేయడానికి నవ ఓటర్లు రెడీగా ఉన్నారు.

ఏడు నెలల ముందు నుంచే..

ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ నిర్వహించిన అవగాహన కార్యక్రమాలతో ఏడు నెలల ముందు నుంచే ఓటరు నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న యువత బీఎల్వోలు, ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. ఇప్పటికే తుది జాబితా విడుదలైంది. అనేక మందికి ఓటరు కార్డులు ఇప్పటికే జారీ అయ్యాయి. తొలిసారి ఓటు హక్కు పొందిన యువత మే 13వ తేదీన జరిగే పోలింగ్‌లో తమ వజ్రాయుధంతో తీర్పును ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. మంచి చేసిన, చేస్తాడనే నమ్మకం ఉన్న నాయకుడినే ఎన్నుకుంటామని, మాయమాటలతో హామీలు ఇచ్చి మోసాలు చేసే నేతలకు తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేస్తున్నారు.

18 నుంచి 19 ఏళ్లలోపు ఓటర్లు..

ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో యువ ఓటర్లు కీలకంగా మారనున్నారు. ఈ ఏప్రిల్ 27న విడుదల చేసిన తుది జాబితా ప్రకారం జిల్లాలో 17,04,077 ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 8,30,499, మహిళలు 8,73,427 మంది, ఇతరులు 151 మంది ఉన్నారు. తొలి సారిగా ఓటు హక్కు దక్కించుకున్న 18 నుంచి 19 ఏళ్ల మధ్య యువత 43,053 మంది ఉన్నారు. ఇందులో యువకులు 23,127 మంది, యువతులు 19,926 మంది ఉన్నారు.

మోసకారి నేతలకు బుద్ధి చెప్పాలని..

ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించే నాయకులను వద్దంటోంది యువత. ఇంటికో ఉద్యోగం.. లేదంటే నెలనెలా నిరుద్యోగ భృతి పేరుతో నమ్మించి వంచించిన ఆ నాయకుడు వస్తే తమ బతుకులు మళ్లీ అంధకారంలోకి వెళ్తాయని ఆందోళన చెందుతోంది. వారసులు, అయిన వారికి రాజకీయ ఉపాధి కల్పించి అడ్డదారిలో అసెంబ్లీకి తీసుకెళ్తారు తప్ప తమ బతుకుల గురించి ఆలోచించని వారెందుకని అంటోంది. బంగారు భవితకు బాటలు వేసిన నాయకుడే మళ్లీ రావాలని కోరుకుంటోంది.

18–19 ఏళ్లలోపు ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	యువకులు	యువతులు
తిరువూరు	2,824	2,286
విజయవాడ వెస్ట్	2,870	2,495
విజయవాడ సెంట్రల్	3,535	3,290
విజయవాడ తూర్పు	3,517	3,222
మైలవరం	4,219	3,613
నందిగామ	2,938	2,383
జగ్గయ్యపేట	3,224	2,637
మొత్తం	23,127	19,926

సంక్షేమం, అభివృద్ధిని కోరుకుంటున్న యువత



సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి కుటుంబాల తలరాతలు మార్చిన, రాష్ట్రాభివృద్ధికి కృషి చేసిన నాయకుడే మళ్లీ రావాలని యువత కోరుకుంటోంది. అవినీతి, సిఫార్సులు లేకుండా పథకాల అమలు, పాలన అందించిన నాయకుడికే మళ్లీ పట్టం కట్టాలనే ఆలోచనతో నవ ఓటర్లు ఉన్నారు. విద్య, వైద్యం, ఉపాధికి గతంలో ఎన్నడూ లేని విధంగా కృషి, ఇంటి వద్దకే పాలన, దీని కోసం ఉద్యోగాల విప్లవం తెచ్చిన నేత మళ్లీ అధికారంలోకి వస్తే.. తమతో పాటు పేదల తలరాతలు మారుతాయని చెబుతున్నారు.

శాంతించిన భానుడు

- నందిగామలో భారీ వర్షం
- తిరువూరులో పిడుగులతో వర్షం
- ఈదురు గాలులకు దెబ్బతిన్న మామిడి



కంచికచర్ల వద్ద భారీ మెరుపు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. వడగాడ్పులు, ఎండల ధాటికి ప్రజలు అల్లాడిపోయారు. మంగళవారం భానుడు శాంతించాడు. జిల్లాలోని పలు చోట్ల చిరు జల్లుల నుంచి భారీ వర్షం నమోదైంది. బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో మంగళవారం వాతావరణం చల్లబడింది. విజయవాడ నగరంలో ఈదురు గాలులతో కూడిన జల్లులు పడ్డాయి. నందిగామలో ఈదురు గాలులతో భారీ వర్షం నమోదైంది. మూడు సెంటీమీటర్ల వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. జాతీయ రహదారితో పాటు అంతర్గత రహదారులు నీట మునిగి చెరువులను తలపించాయి. వర్షాకాలం అన్నట్లుగా వాతావరణం మారిపోయింది. నందిగామ నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లోనూ వర్షం కురిసింది. ఈ వర్షానికి, ఈదురు గాలులకు అక్కడక్కడా మామిడి తోటల్లో కాయలు నేల రాలాయి. తిరువూరు నియోజకవర్గంలో ఈదురు గాలులు వీచాయి. రోలుపడి, చింతలపాడు, తిరువూరులో పిడుగులు పడ్డాయి. 15 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. మైలవరం నియోజకవర్గ పరిధిలో స్వల్పంగా గాలులు వీచాయి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో భారీ గాలులు వీచాయి. చిరు జల్లులు కురిశాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పట్టణంతో పాటు పలు ప్రాంతాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విజయవాడ నగరంలో ఓ మోస్తరు వర్షం పడింది. ఈ వర్షానికి నగర ప్రజలు సేదతీరారు. ద్రోణి ప్రభావంతో పిడుగులు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.



అకాల వర్షానికి నందిగామ వద్ద నీటమునిగిన జాతీయ రహదారి



విజయవాడ నగరాన్ని కమ్మేసిన కారుమబ్బులు

కలసిన చేతులు.. కలవని మనసులు

- దేవినేని ఉమా అనుచరులను నమ్మని వసంత వర్గం
- క్షోభతో రగిలిపోతున్న ఉమ వర్గం టీడీపీ నాయకులు
- వారిపై నిఘా ఉంచి అనుక్షణం గమనిస్తున్న వసంత
- కష్టం తమది, పెత్తనం కృష్ణప్రసాద్ ఉద్యోగులదని టీడీపీ కేడర్ ఆగ్రహం



జి.కొండూరు: వారిద్దరూ ఐదేళ్లుగా ఒకరిపై మరొకరు మాటల యుద్ధం చేసుకున్నారు. సభ్యత మరిచి నోటికొచ్చినట్లు తిట్టుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇద్దరూ ఒకే పార్టీ నాయకులయ్యారు. వారే వసంత కృష్ణప్రసాద్, దేవినేని ఉమామహేశ్వరరావు. ఈ ఇద్దరూ ఇప్పుడు చేతులు కలిపారు. తమ వర్గం నాయకులను కూడా కలసి పని చేయాలని పిలుపునిచ్చారు. వసంత నామినేషన్ కార్యక్రమంలోనూ కలసి చేతులు ఊపారు. అందరం కలసి ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తామంటూ గొప్పలు చెప్పారు. ఇదంతా పైకి కనిపిస్తున్న వ్యవహారం. అంతర్గతంగా మాత్రం రెండు వర్గాలు కలసి పనిచేసే పరిస్థితి కనిపించడంలేదు. కలసి పనిచేయడం అన్న మాట అటుంచి ఒకరిపై మరొకరు నమ్మకమే ఉంచలేకపోతున్నారు.

వెంటాడుతున్న వెన్నుపోటు భయం

మైలవరం నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి వసంత వెంకటకృష్ణప్రసాద్, టీడీపీ నుంచి దేవినేని ఉమా పోటీ చేశారు. ఉమా ఓటమిపాలవగా వసంత ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుత ఎన్నికలు వచ్చేసరికి వసంత కృష్ణప్రసాద్ టీడీపీ గూటికి చేరారు. అతను టీడీపీలో చేరడాన్ని, ఎమ్మెల్యే టికెట్ పొందడాన్ని దేవినేని ఉమా తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతర పరిణామాల్లో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వారిద్దరూ చేతులు కలిపారు. అయితే క్షేత్రస్థాయిలో ఉమా వర్గం, వసంత వర్గం కలసి పనిచేసే పరిస్థితి కనిపించడంలేదు. ఉమా వర్గాన్ని వసంత వర్గమే కాదు టీడీపీ కేడర్ కూడా నమ్మలేకపోతోందని సమాచారం. పార్టీ ఆదేశాల మేరకు కలసి పనిచేస్తున్నట్లు నటిస్తున్నా ఓటు వేసే సమయానికి ఉమా వర్గీయులు వెన్నుపోటు పొడుస్తారనే అనుమానం వసంతను వెంటాడుతోందని పార్టీలో చర్చ జరుగుతోంది.

ఉమా వర్గీయులపై నిఘా

ఉమా వర్గీయులపై నమ్మకం ఉంచలేని వసంత కృష్ణప్రసాద్ తన కంపెనీల్లో పని చేసే రెండు వేల మంది ఉద్యోగులను రంగంలోకి దింపారు. వారితో ఉమా వర్గంపై నిఘా ఉంచారని, అంతటితో ఆగకుండా ప్రచారం నుంచి డబ్బు పంపిణీ వరకు అన్ని పనులు ఆ ఉద్యోగులే చక్కబెట్టేందుకు సిద్ధమయ్యారని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి. వసంత తీరును జీర్ణించుకోలేని ఉమా వర్గీయులు అతనితో కలిసి పనిచేయలేమని తమ నాయకుడి వద్ద వాపోతున్నారని సమాచారం.

మళ్లీ ఇన్‌చార్జులే దిక్కా?

వసంత వెంకటకృష్ణప్రసాద్ స్థానికుడు కాదు. వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరారు. దీంతో మైలవరం నియోజకవర్గంలో టీడీపీ అస్తిత్వం గందరగోళంలో పడింది. ఒక వైపు ఉమా వర్గీయులు, మరో వైపు ఆయన వ్యతిరేకులు, ఇంకో వైపు వైఎస్సార్ సీపీ నుంచి వసంతతోపాటు టీడీపీలో చేరిన చిన్నాచితకా నాయకుల వర్గంగా టీడీపీ విడిపోయింది. ఈ మూడు వర్గాల పోరుతో టీడీపీలో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో ఎవరిని నమ్మాలో తెలియక, ఎవరికి బాధ్యతలు ఇస్తే ఎవరికి కోపం వస్తుందోనన్న భయంతో వసంత కృష్ణప్రసాద్ తన కంపెనీల నుంచి ఉద్యోగులను దింపి పెత్తనమంతా వారికే అప్పజెప్పారు. వైఎస్సార్ సీపీలో ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వసంత, స్థానికులను కాదని మండలానికి ఒక ఇన్‌చార్జ్‌ని నియమించి పార్టీలో వర్గ పోరుకు కారణమయ్యారు. ఇప్పుడు టీడీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో వసంత తీరును చూసిన టీడీపీ కేడర్, ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మళ్లీ ఇన్‌చార్జులతోనే పాలన చేస్తాడేమోనని ఆందోళనచెందుతోంది.

మద్యం కేసులో ఉమా వర్గీయులు

'సొమ్ము ఒకడిది సోకు ఒకడిది అన్నట్లు కష్టం మాది, కేసులు మాకు, పెత్తనం మీకా?' అంటూ ఉమా వర్గీయులు కుమిలిపోతున్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తెలంగాణ నుంచి భారీగా మద్యం తరలిస్తూ పట్టుబడిన చేబ్రోలు రాజు, మరో నలుగురు నిందితులు సైతం ఉమా వర్గానికి చెందిన నాయకులే. పట్టుబడిన మద్యంతో తనకు ఎటువంటి సంబంధంలేదని వసంత తప్పుకోవడంతో ఉమా వర్గీయులు మరింత ఆవేదన చెందుతున్నారని సమాచారం. కావాలనే మద్యం రవాణా, పంపిణీ వంటి అసాంఘిక కార్యకాలపాలను తమకు అప్పజెప్పి పెత్తనం మాత్రం వసంత అనుచరులు, ఆయన కంపెనీల ఉద్యోగులు చేస్తున్నారని ఉమా వర్గీయులు రగిలిపోతున్నారు. ఐదేళ్లు తమ నాయకుడికి జరిగిన అవమానంతో పాటు తమకు నియోజకవర్గంలో ఎదురవుతున్న క్షోభకు తగిన బుద్ధిచెప్పాలని ఉమా వర్గీయుల్లో చర్చ జరుగుతోందని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నాయి.

తొలిరోజు 90 శాతం హోం ఓటింగ్ పూర్తి



పోస్టల్ కాలనీలో హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో హోం ఓటింగ్ మంగళవారం ప్రారంభమైంది. తొలి రోజు 90 శాతం పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దే అధికారులు పోలింగ్ నిర్వహించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పటమట పీఅండ్‌టీ కాలనీలో హోం ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బి.హెచ్.భవానీశంకర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర ఎన్నికల సంఘం 85 ఏళ్లు నిండిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించిందన్నారు. హోం ఓటింగ్‌కు జిల్లాలో 1,052 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 651 మంది వృద్ధులు, 401 మంది దివ్యాంగులు ఉన్నారని వివరించారు. సెక్టోరల్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్, పోలింగ్ బూత్ అధికారి, ఆర్మ్‌డ్ సిబ్బంది, వీడియోగ్రాఫర్‌తో కూడిన బృందం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 32 బృందాలు హోం ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నాయని, తొలి రోజు 90 శాతం హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన పది శాతాన్ని ఈ నెల తొమ్మిదో తేదీన పూర్తి చేస్తామని తెలిపారు. పోలింగ్ అధికారి వి.నాగేశ్వరరావు, సహాయ పోలింగ్ అధికారి రత్నబాబు, ఓపీఓ బి.రవితేజ, మైక్రో అబ్జర్వర్ ఎ.శివతేజ, బీఎల్వో ఎం.సురేష్‌తో కూడిన బృందం పటమటలో నిర్వహించిన హోం ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించింది.

విధులకు హాజరు కాకపోతే క్రమశిక్షణ చర్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులు హాజరుకాకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి డి.కె.బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వివిధ కారణాలతో కొంత మంది ఉద్యోగులు ఉత్తర్వులను తీసుకోవటం లేదని తెలిపారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలుగా నియమితులైన వారు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు. వారికి ఎటువంటి మినహాయింపులు ఉండవని స్పష్టంచేశారు. ఉద్యోగులందరూ తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని ఆదేశించారు.

ప్రచార పర్వం



విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 48వ డివిజన్‌లో ఓటర్‌కు సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కుమార్తె శ్వేత
- చిట్టినగర్ (విజయవాడపశ్చిమ)



విజయవాడసెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని రామకృష్ణాపురంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్
- మధురానగర్(విజయవాడసెంట్రల్)



విజయవాడ తూర్పు నియోజకవర్గం ఆరో డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్
- మొగల్రాజపురం(విజయవాడతూర్పు)

క్లుప్తంగా

కౌంటింగ్, స్ట్రాంగ్ రూములు పరిశీలించిన కలెక్టర్ ఢిల్లీరావు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఇబ్రహీంపట్నం జూపూడిలోని నోవ, నిమ్రా కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలల్లోని కౌంటింగ్, స్ట్రాంగ్ రూములను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పరిశీలించారు. ఈ నెల 13వ తేదీ పోలింగ్ అనంతరం ఈవీఎంలను నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలల్లో భద్రపరచనున్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత తదితర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. పోలింగ్ కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత ఏర్పాట్లపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈవీఎం స్ట్రాంగ్ రూముల భద్రత పటిష్టంగా ఉండాలని, అలాగే బందోబస్తు కూడా పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. సీసీ కెమేరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. కౌంటింగ్ హాల్‌లో ఓట్ల లెక్కింపునకు అనువైన సౌకర్యాలను పరిశీలించి, స్ట్రాంగ్ రూముల పక్కనే ఓట్ల లెక్కింపు కేంద్రం ఉండేలా చూడాలని పేర్కొన్నారు. లెక్కింపు టేబుల్స్, పోలింగ్ ఏజెంట్లు వచ్చే మార్గం చుట్టు పక్కల శాంతి భద్రతల చర్యలను పరిశీలించారు. ఆయన వెంట మైలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ పి.సంపత్‌కుమార్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉన్నారు.

యార్డుకు 70,843 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 70,843 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా ,776 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 55,550 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ప్రధాని పర్యటనకు పటిష్ట బందోబస్తు

పోలీస్ కమిషనర్ రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రామకృష్ణ, వేదికపై పోలీసు అధికారులు

విజయవాడస్పోర్ట్స్/గన్నవరం: ప్రధాని నరేంద్ర మోదీ విజయవాడలో బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశామని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. ప్రధాని మోదీ పర్యటన దృష్ట్యా ఆంధ్రా లయోల కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీ దిశానిర్దేశం చేశారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు, పాత పీసీఆర్ జంక్షన్ నుంచి బెంజిసర్కిల్ వరకు రెడ్‌జోన్‌గా ప్రకటిస్తున్నామని సీపీ రామకృష్ణ తెలిపారు. ఈ ప్రాంతాల్లో డ్రోన్లు, బెలూన్లను ఎగురవేయడం నిషిద్ధమని హెచ్చరించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో ఏరియా డామినేషన్, రోడ్ ఓపెనింగ్ పార్టీస్, కట్ ఆఫ్ పార్టీస్, రూఫ్ టాప్స్, రోప్ పార్టీస్, యాంటీ సబ్ టేజ్ చెక్ తదితర బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరుగురు పోలీసు ఉన్నతాధికారుల నేతృత్వంలో ఏడుగురు డీసీపీలు/ఎస్పీ, 22 మంది ఏడీసీపీలు, 50 మంది ఏసీపీలు, 136 మంది సీఐలు, 250 మంది ఎస్‌ఐలతో పాటు ఐదు వేల మంది పోలీస్ సిబ్బందికి విధులు కేటాయించామని తెలిపారు. వారు నిర్దేశించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని, అనుమానితులు తారసపడితే వెంటనే అదుపులోకి తీసుకోవాలని, అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. రోడ్ షో జరిగే ప్రాతంలో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ప్రధాని మోదీ రోడ్‌షోలో ప్రజలు పాల్గొనేలా ఐరన్ బారిగేడ్లు ఏర్పాటుచేశామని వివరించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి విజయవాడ ఎంజీ రోడ్డు వరకు పూర్తి పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల రాకపోకలను దారి మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. ట్రాఫిక్ ఆంక్షలు మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు అమలులో ఉంటాయని వివరించారు. ఈ సమావేశంలో ఐజీపీ కె.వి.మోహన్‌రావు డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఏఐజీలు ఎం.రవీంద్రనాథ్‌బాబు, వకుల్ జిందాల్, మల్లికా గార్గ్, ఏ.ఆర్.దామోదర్, డీసీపీలు కె.శ్రీనివాసరావు, అధిరాజ్ సింగ్ రాణా, ఉదయరాణి, కరీముల్లా షరీఫ్, కె.చక్రవర్తి, టి.హరికృష్ణ, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌జీ దళాల ఆధీనంలో విమానాశ్రయం

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన విజయవాడలో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. ప్రధాని పర్యటన సందర్భంగా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. ఇప్పటికే ఢిల్లీ నుంచి వచ్చిన ఎస్‌ఎస్‌జీ దళాలు విమానాశ్రయాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. రోడ్‌షో అనంతరం ప్రధాన మంత్రి తిరిగి విమానాశ్రయానికి చేరుకుని న్యూఢిల్లీ బయలుదేరి వెళ్తారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- బుధవారం మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఆర్టీసీ వై జంక్షన్ నుంచి బెంజిసర్కిల్ వరకు ఎంజీ రోడ్డుపై ఎలాంటి వాహనాలనూ అనుమతించరు.
- ఆటోనగర్ వైపు నుంచి బస్టాండ్ వైపు వెళ్లే వాహనాలు ఆటోనగర్ గేటు, పటమట, కృష్ణవేణి స్కూల్ రోడ్డు, స్క్యూ బ్రిడ్జి, కృష్ణలంక మీదుగా ప్రయాణించాలి.
- ఎంజీ రోడ్డుపై ప్రయాణించే వాహనాలను ఏలూరు రోడ్డు, ఐదో నంబర్ రూట్‌కు మళ్లిస్తారు.
- మచిలీపట్నం – విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు ఆటోనగర్ గేటు, మహానాడు రోడ్డు, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, పడవల రేవు, బీఆర్టీఎస్ రోడ్డు, సీతన్నపేట గేట్, ఏలూరు లాకులు, పాత గవర్నమెంట్ ఆసుపత్రి మార్గాన్ని అనుసరించాలి.
- ఏలూరు–విజయవాడ మధ్య ప్రయాణించే ఆర్టీసీ బస్సులు రామవరప్పాడు రింగ్, పడవల రేవు, బీఆర్టీఎస్ రోడ్డు, సీతన్నపేట గేట్, ఏలూరు లాకులు, పాతగవర్నమెంట్ ఆసుపత్రి మార్గంలో రాకపోకలు సాగించాలి.
- విశాఖపట్నం – హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే భారీ వాహనాలు హనుమాన్‌జంక్షన్, తిరువూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం మార్గాన్ని అనుసరించాలి.
- విశాఖపట్నం – చెన్నయ్ మధ్య ప్రయాణించే భారీ వాహనాలు హనుమాన్‌జంక్షన్, గుడివాడ, పామర్రు, చల్లపల్లి, పులిగడ్డ, రేపల్లె, బాపట్ల, త్రోవగుంట మార్గాన్ని అనురించాలి.

చరిత్రహీనుడు చంద్రబాబు

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్
- ఉయ్యూరులో భారీ ర్యాలీ
- ప్రచారానికి అడుగడుగునా నీరాజనం



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్

ఉయ్యూరు: చరిత్రహీనుడు చంద్రబాబు అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్ ధ్వజమెత్తారు. ఉయ్యూరులో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని 20 వార్డుల్లో వేలాది మందితో రోడ్ షో చేశారు. పార్టీ శ్రేణులు ద్విచక్రవాహనాలతో ర్యాలీ చేసి అభిమానాన్ని చాటారు. జోహార్ వైఎస్సార్, జై జగన్, జోగి రమేష్ నాయకత్వం వర్థిల్లాలి నినాదాలతో ఉయ్యూరు పట్టణం మార్మోగింది. రోడ్‌షో దారి పొడవునా గజమాలలు, పూల వర్షం, హారతులతో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లూ వేయాలని మంత్రి జోగి రమేష్ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలు చోట్ల నిర్వహించిన సభల్లో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ కూటమి కుట్రలు ఎవరూ నమ్మరని తెలిపారు. మంచి చేసే జగనన్నపై విషం చిమ్మాలని చూస్తే తరిమికొడతారని చెప్పారు. రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించిన చంద్రబాబు చరిత్రహీనుడుగా మిగిలిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెన్నుపోటుదారుడు చంద్రబాబును నమ్మి ఎవరు నడిచినా నట్టేట మునిగిపోవటమేనని తెలిపారు. తప్పుడు మేనిఫెస్టోతో మరోసారి కూటమి పేరుతో మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబుకు ప్రజలే గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

వర్షంలోనూ ప్రచార జోరు....

వర్షం లోనూ మంత్రి జోగి రమేష్ ప్రచారం సాగించారు. చల్లనిగాలులు, మోస్తరు వర్షం పడుతున్నా కార్యకర్తల ఉత్సాహం నడుమ చిరునవ్వుతో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి జగనన్నకు అండగా నిలవాలంటూ ప్రచారం సాగించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలూ, వ్యాపార రంగాలూ, అగ్రకులాల్లో పేదలు ఆలోచన చేయాల్సిన అవసరం ఆసన్నమైందని చెప్పారు. వెన్నుపోటు ద్రోహులకు గుణపాఠం చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జోగి రమేష్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నేత చలసాని స్మిత గౌతమ్, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఎంపీపీ చీలి కల్పన, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మండల అధ్యక్షుడు దాసే రవి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, షాదీఖానీ చైర్మన్ అహ్మద్‌ఖాన్, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, ముదావత్ లక్ష్మి, ఊర శ్రీవాణి, గోన మదన్, గుంజా సుధాకర్, రాజులపాటి చిన్ని, ఎండీ బేగ్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, నాయకులు అబ్దుల్‌సద్దాం, సలీం బేగ్, కళాధర్, ఉయ్యూరు సుధాకర్, వెంట్రప్రగడ బాబ్జీ, పెనుమూడి సంజయ్, కొండపల్లి రమేష్, దిరిశం జ్యోతిర్మయి, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, బాలి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీతో జనసందోహంగా మారిన ఉయ్యూరు పట్టణం

నిర్భయంగా ఓటు హక్కు వినియోగం

పోలీస్ కమిషనర్ రామకృష్ణ



ఇటీవల నందిగామ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో స్వాధీనం చేసుకున్న మద్యం (ఫైల్)

విజయవాడస్పోర్ట్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని.. నిర్భయంగా ఓటు హక్కును వినియోగంచుకోవాలని పౌరులకు పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఆరు వేల మంది లా అండ్ ఆర్డర్, ఏఆర్ పోలీసులను, పది ప్లటూన్లు, 12 కంపెనీల పారామిలటరీ బలగాలు, 1,250 ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు విధులు కేటాయించామని వెల్లడించారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహించామని చెప్పారు. గత ఎన్నికల్లో అల్లర్లుకు పాల్పడిన 787 మందిని, ఇబ్బందులకు గురిచేసిన 2,023 మందిని, 373 మంది రౌడీషీటర్లను, 490 మంది లా – ఆర్డర్ సస్పెక్ట్‌లను, 890 మంది ఇతర చెడునడత కలిగిన వ్యక్తులను మొత్తం 4,533 మందిపై 3,776 కేసులు నమోదు చేశామని తెలిపారు. వీరందరినీ న్యాయమూర్తి వద్ద బైండోవర్ చేశామని పేర్కొన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ. 7.40 కోట్లను స్వాధీనం చేసుకుని, 282 కేసులు నమోదు చేశామని, రూ.5.76 కోట్ల విలువైన 8.58 కేజీల బంగారం, 33.15 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని 10 కేసులు నమోదు చేశామని వెల్లడించారు. అక్రమంగా తరలిస్తున్న రూ.1.15 కోట్ల విలువైన 24 వేల లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని 2,146 మందిని అరెస్ట్ చేసి వారిపై 1,847 కేసులు నమోదు చేశామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ.91 లక్షల విలువైన 12 వేల లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని 592 మందిని అరెస్ట్ చేసి వారిపై 521 కేసులు నమోదు చేశామని వివరించారు. 362 కేసుల్లో 85 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు రూ.43 లక్షల విలువైన 28 వేల లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రూ.40 లక్షల విలువైన 1.13 లక్ష లీటర్ల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న రూ.24 లక్షల విలువైన 510 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 87 మందిని అరెస్ట్ చేసి వారిపై 52 కేసులు నమోదు చేశామన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే ఉచిత వస్తువులు పంపిణీ చేయుటకు తరలిస్తున్న సుమారు రూ. 5.5 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లఘించిన వారిపై మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కింద 75 కేసులు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పోచంపల్లి(జగ్గయ్యపేట):పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పారా శ్రీను (48) సమీపంలోని పంట పొలంలో పురుగుల మందు తాగి ఉండటాన్ని గ్రామస్తులు గమనించారు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఈ కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని కుటుంబ సభ్యులు అంటున్నారు. చిల్లకల్లు ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. మహిళ మృతి

మరో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన విజయ

జగ్గయ్యపేట:ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలైన ఘటన పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని రెడ్డినాయక్‌తండ, బూదవాడ గ్రామాలకు చెందిన గుగులోతు విజయ, కూరపాటి సుధారాణి, బాణావత్ సక్కు, సాల్విలు ఆటోలో వారి గ్రామానికి జగ్గయ్యపేట నుంచి బలుసుపాడు రోడ్డు మీదుగా బయలుదేరారు. ఈ క్రమంలో బలుసుపాడు నుంచి జగ్గయ్యపేటకు వస్తున్న లారీ ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ (25) తలకు ఇనుప రాడ్డు బలంగా తగలటంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రాకు ఏం చేశారని వస్తున్నారు మోదీజీ?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధాని నరేంద్ర మోదీ తమ పదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేశారని ఇక్కడకి వస్తున్నారు? ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చారా, విభజన హామీలను నెరవేర్చారా అంటూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అమలుకాని హామీలతో మరో మారు ఆంధ్రులను మభ్యపెట్టేందుకే వస్తున్నారని పేర్కొన్నారు. పదేళ్ల ఎన్డీఏ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌కు ఏం వెలగొపెట్టారో చెప్పిన తరువాతే రాష్ట్రంలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదాను కాంగ్రెస్ ఐదేళ్ల ఇస్తామని ప్రకటిస్తే, కాదు..పదేళ్ల ఇవ్వాలని అప్పటి ప్రతిపక్ష నేత వెంకయ్య నాయుడు నిండు సభలో మాట్లాడారని గుర్తు చేశారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఈ పదేళ్లలో ఆంధ్రాకు కేవలం ఎన్నికల ముందే వస్తారని ఎద్దేవా చేశారు. విభజన హామీల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమయ్యిందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మార్గదర్శకాలను దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం, నీతి అయోగ్ ప్రవేశపెట్టాయని గుర్తు చేశారు. ఆ యాక్ట్‌పై ఎన్డీఏ కూటమికి చెందిన చంద్రబాబు దుష్ప్రచారం చేయడమే కాకుండా టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ఆ యాక్ట్‌ను రద్దు చేస్తామని హామీ ఇవ్వడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు.

వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆటో ఢీకొని మహిళ దుర్మరణం చెందిన ఘటన కెనాల్‌రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన తుంగని దొంబూరు అనే వ్యక్తి తన తల్లిదండ్రులతో కలిసి తిరుపతి దేవస్థానానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆ క్రమంలో కెనాల్‌రోడ్డులో రోడ్డు దాటుతుండగా దొంబూరు తల్లి సావిత్రమ్మ (57)ను ఆటో ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. 108 వాహనం ద్వారా హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో ఆమె మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాని మోదీ పర్యటన దృష్ట్యా.. నేడు ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: ఈనెల 8న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విజయవాడలో రోడ్ షో సందర్భంగా గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ మళ్లించినట్లు పోలీస్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడ వైపునకు వెళ్లే వాహనాలు బుడంపాడు అండర్ పాస్ నుంచి నారాకోడూరు, చేబ్రోలు, పొన్నూరు, చందోలు చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె, అవనిగడ్డ, మచిలీపట్నం మీదుగా హనుమాన్ జంక్షన్ దగ్గర్లోని జాతీయ రహదారి –16 వైపు వెళ్లాలని తెలిపారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు చుట్టుగుంట నుంచి పేరేచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్లాలని సూచించారు.

దేవస్థానానికి రూ.లక్ష విరాళం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాత మంగళవారం రూ.1,01,116లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ చేబ్రోలు వాస్తవ్యులు చిన్నంశెట్టి పోతురాజు, పార్వతి దంపతులు ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ విరాళాన్ని అందజేశారని వెల్లడించారు. అనంతరం దాతలు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ మెంబర్లు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు మల్లేశ్వరుడు

- రెండున్నర శతాబ్దాల చరిత ఎలకుర్రు ఆలయ ఘనత
- ఈ నెల 18 నుంచి 23 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు




ఎలకుర్రు గ్రామంలోని శ్రీ చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం

ఎలకుర్రు(పామర్రు): కోరుకున్న వారికి కొంగు బంగారమై భక్తుల పాలిట కల్పవృక్షంగా విలసిల్లుతున్నారు శ్రీభ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వర స్వామి. కృష్ణాజిల్లా పామర్రు మండలం ఎలకుర్రు గ్రామంలో ఉన్న శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయానికి 264 ఏళ్ల పైబడి చరిత్ర ఉంది.

ఆలయ చరిత్ర సంక్షిప్తంగా ...

శివదీక్షాపరుడు, చల్లపల్లి, గురజ జమీందారీ ఆస్థానాల్లో ఆగమ సలహాదారులుగా ఉంటూ జమీందారులకు గురువుగా శివదీక్షను ప్రసాదించి వారిచే ఎలకుర్రు, శోభనాద్రిపురం, మల్లేశ్వరం గ్రామాలను బహుమతిగా పొందారు కాశీనాథుని వంశస్తులైన కాశీనాథుని చిన వీర నారాధ్యులు. ఈయన ఆధ్వర్యంలో 1760వ సంవత్సరంలో ఎలకుర్రు గ్రామంలో భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆనాటి నుంచి కాశీనాథుని వంశస్తులచే ఆలయంలో ధూప దీప నైవేద్యాలతో ఆలయం విరాజిల్లుతోంది. భక్తులు కోరిన కోర్కెలు తీర్చుతూ కోరిన వారికి కొంగు బంగారమైన స్వామి భక్తులకు ఇలవేల్పుగా ఉన్నారు. వీరి వంశంలో జన్మించిన వారు విశ్వదాత, దివంగత దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు. వీరితో పాటు ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు దివంగత కాశీనాధుని విశ్వనాథ్ (కె.విశ్వనాథ్) ఈ వంశానికి చెందిన వారే. ప్రతి సంవత్సరం వైశాఖ మాస ఏకాదశి నుంచి పౌర్ణమి వరకూ గ్రామంలోని ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.



ఆలయంలో వేంచేసియున్న శ్రీభ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి

ఈ నెల 18 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు ఆలయ 264వ వార్షిక కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక కుటుంబ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నెల 18 వ తేదీన ధ్వజారోహణం , చిన్నాపురం వాస్తవ్యుడు జన్ను నారాయణరావు సమర్పించు సిద్దు ఆదంబి సంవాదం నాటకం ఉంటుందన్నారు. 19 న వేద పఠనం, సహస్ర నామార్చన, హరికథా కాలక్షేపం, రాత్రి 9 గంటలకు వేదాంతం రాధే శ్యామ్ బృందం వారి భక్త ప్రహ్లాద నాటకం ఉంటుందన్నారు. మే 20 న హరికథా కాలక్షేపం, రాత్రి 7 గంటలకు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ వారిచే విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. 21న వేద పఠనం, రాత్రి 7గంటలకు జగజ్జ్యోతి, రాత్రి 9 గంటలకు భ్రమరాంబ చెన్న మల్లేశ్వర నాట్యమండలి, మాచిరాజు రాధాకృష్ణ సమర్పించు సత్య హరిశ్చంద్ర నాటకం ఉంటుందని, రాత్రి 2 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. మే 22 ఉదయం హరికథా కాలక్షేపాలు, రాత్రి 9 గంటలకు వీరభద్రస్వామి వీధిపళ్లెం కార్యక్రమం, 10 గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు. మే 23న స్వామివారి త్రిశూల స్నానం, రాత్రికి ఏకాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ అనంతరం మహా అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు అందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని నాగేశ్వరరావు కోరారు.

క్లుప్తంగా

7వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజలకు సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసేందుకు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌ను ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఆశీర్వదించాలని దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కుమార్తె కేశినేని హైమా కోరారు. ఏడో డివిజన్ పరిధిలోని ప్రజాశక్తినగర్‌లో మంగళవారం ఉదయం దేవినేని సుధీర, కేశినేని హైమా ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వారు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి వివరించారు. ప్రచారంలో కార్పొరేటర్ మాధురి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి అన్నారు. ఎంపవరింగ్ యూత్ ఫర్ డెమోక్రటిక్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ రూపొందించిన ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. యువతను రాజకీయంగా ప్రోత్సహించేందుకు ఎంపవరింగ్ యూత్ ఫర్ డెమోక్రటిక్ ఇండియా సంస్థ చేస్తున్న కృషిని సీఐ అభినందించారు. సంస్థ ప్రతినిధి మజ్జి బాబు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులందరికీ కుంకుమ ప్రసాదం పంపిణీ చేపట్టాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా చూడాలని ఈవో కె.ఎస్.రామరావు ఆలయ అధికారులకు సూచించారు. మహా మండపం ఆరో అంతస్తులో జరుగుతున్న కుంకుమ ప్యాకెట్ల తయారీని ఈవో మంగళవారం పరిశీలించారు. కుంకుమ ప్యాకింగ్ చేస్తున్న విధానం గురించి అడిగి తెలుసుకోవడమే కాకుండా కుంకుమ నాణ్యతను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులు తొలుత అమ్మవారి దర్శనం ప్రశాంతంగా జరగాలని చూస్తారని, ఆ తర్వాత అమ్మవారి కుంకుమ ప్రసాదం దొరికితే మహా ప్రసాదంగా భావిస్తారన్నారు. దేవస్థానం చేపట్టిన ఉచిత కుంకుమ ప్రసాద పంపిణీని మరింత విస్తృతంగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా శుక్ర, శని, ఆదివారాలలో భక్తులందరికీ కుంకుమ ప్రసాదం అందేలా అవసరమైన ప్యాకెట్లను సిద్ధం చేసి ఆలయంలో అందుబాటులో ఉంచాలన్నారు. రోజుకు ఎన్ని ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు.. ఎంత మంది సేవలకు తమ సేవలను అందిస్తున్నారనే వివరాలను ఏఈవో ఎస్.రమేష్‌బాబు ఈవోకు వివరించారు.

తూర్పులో మార్పు మొదలు..

- సంక్షేమం, అభివృద్ధికే ప్రజల మద్దతు
- అన్ని వర్గాల చూపు అవినాష్ వైపే
- గద్దెను ఇంటికే పరిమితం చేస్తాం అంటున్న నియోజకవర్గ ప్రజలు



దేవినేని అవినాష్‌కు నీరాజనం పలుకుతున్న ప్రజలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పులో మార్పు మొదలైంది. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ వైపే ఉన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తూర్పు నియోజవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేసేందుకు అవినాష్ విశేష కృషి చేశారు. ఒక పక్క ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా రిటైనింగ్ వాల్ నిర్మించి కృష్ణానది ముంపు వాసుల సమస్య పరిష్కరించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి మరువలేనిది.

ఇలా ఒకటేమిటి దశాబ్దాలుగా జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విషయంలో అవినాష్ చూపిన చొరవ ప్రశంసనీయమని పలువురు అంటున్నారు. తూర్పులో పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న గద్దే రామ్మోహన్ చెప్పుకోవడానికి శూన్యం తప్ప ఏమీ లేదని ప్రజలు అంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలు పట్టించుకోకుండా గద్దే తీవ్ర నిర్లక్ష్య వైఖరి అనుసరించారు. ఎన్నికల వేళ గద్దే రామ్మోహన్ ఏ మొహంతో ఓట్లు అడుగుతున్నారని తూర్పు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గద్దే చెప్పే మాటలు నమ్మి మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేమని అంటున్నారు.

కుట్రలు చేయడమే గద్దే నైజం...

తూర్పులో అభివృద్ధి చేసిందేమి లేక, విద్వేషాలు సృష్టించి లబ్ధిపొందాలని చూస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో ఎన్నికల సమయంలో జరిగిన ఘటనలే నిదర్శనంగా చెబుతున్నారు. అంతేకాదు వాళ్లు ప్రజల వద్దకు వెళుతూ చెపుతున్న మాటలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయంటున్నారు. ఎవరైనా ప్రజలను కలిసి మేము మీ ప్రాంతానికి ఇది చేసాం ఓట్లు వేయండని అడుగుతుంటారనీ. కానీ గద్దే రామ్మోహన్, ఆయన భార్య అనురాధ కాలనీలకు వెళ్లి నియోజకవర్గం ప్రశాంతంగా ఉండాలంటే మాకు ఓట్లు వేయండంటూ అసత్య ప్రచారం చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. వాళ్ల నైజం అదేనని అల్లర్లు సృష్టించి లబ్ధి పొందాలని కుట్రలు చేయడమే అంటున్నారు.

మార్పు ఎప్పుడో మొదలైంది..

గద్దే రామ్మోహన్ చెప్పే మాటలు నమ్మి మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేమని తూర్పు ప్రజలు అంటున్నారు. ఇప్పటికే అన్నివర్గాలకు మేలు చేసిన అవినాష్‌కు మద్దతుగా నిలిచేందుకు నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. తూర్పులో మార్పు మొదలైందని, ఎవరెన్ని కుట్రలు చేసినా, అసత్య ప్రచారం చేసినా అభివృద్ధి, సంక్షేమానికే జనం జై కొడుతున్నారు. అభివృద్ధి సారథులు వైఎస్ జగన్, దేవినేని అవినాష్‌లకు మద్దతుగా నిలిచేందుకు నిర్ణయించుకున్నట్లు తూర్పు ప్రజలు చెబుతున్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజలతో మమేకమవుతున్న అవినాష్‌కు అండగా నిలుస్తామని అన్ని వర్గాల ప్రజలు నినదిస్తున్నారు.

అన్ని వర్గాలను గద్దే మోసం చేశాడు



గద్దెకు ఏదైనా సమస్య చెబితే చేసేస్తాం అని హామీ ఇవ్వడమే కానీ, దానిని పట్టించుకున్న సందర్భం ఒక్కటీ లేదు. అందుకు లబ్బీపేటలోని షాదీఖానా నిదర్శనం. మా ప్రాంతానికి వచ్చి షాదీఖానా నిర్మించేస్తున్నామని ప్రచారం చేసుకున్నాడు. కానీ చేయలేక పోయాడు. ఇలా అన్ని ప్రాంతాల్లో ప్రజలను మోసం చేశాడు. ఇప్పుడు ప్రజల వద్దకు వచ్చి చేసింది చెప్పుకోవడానికి ఏమీ లేక అసత్య ప్రచారం చేస్తున్నాడు.

–ఎండీ రెహానా నాహీద్, కార్పొరేటర్,19వ డివిజన్

పదేళ్లలో ఏమీ చేయలేదు



పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి తూర్పు నియోజకవర్గానికి గద్దే రామ్మోహన్ చేసిందేమీ లేదు. ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేక పోయాడు. 2014–19 వరకూ అధికార పార్టీలో ఉన్నప్పుడు కూడా చేసింది శూన్యం. ఇప్పుడు మళ్లీ ఓట్లు వేయమని ఎలా అడుగుతాడు. యువకుడైన అవినాష్ నియోజకవర్గంలో రూ.650 కోట్లతో అభివృద్ధి చేశాడు. గద్దే చేసిందేమీ లేక, ఎదుటి వారిపై అసత్య ప్రచారం చేస్తున్నారు.

–గల్లా పద్మావతి, డైరెక్టర్, కమ్మ కార్పొరేషన్

80 శాతం ఓటింగ్ లక్ష్యంగా చర్యలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): నైతిక విలువలతో కూడిన ఓటింగ్ దిశగా ప్రతి ఓటరూ పయనించాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని మైలవరం నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకులు నరేందర్ సింగ్ బాలి పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ గొల్లపూడిలోని డీటీటీసీ భవనంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి నాయకులు రావాలంటే అది ఓటర్ల చేతుల్లోనే ఉంటుందన్నారు. ఓటు వేయడం ప్రతి భారతీయ పౌరుని బాధ్యత అని చెప్పారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనేది మహిళా ఓటర్లతోనే సాధ్యమవుతుందన్నారు. ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అలాగే గ్రామాల్లోని యువతీ యువకులు తమ ప్రాంతంలోని ఓటర్లను తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనేలా చైతన్యపరచాలని చెప్పారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ 50 శాతం మంది మాత్రమే నిజాయతీగా ఓటు వేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఓటు వేయని మహిళ ఉండకూడదని పేర్కొన్నారు. రూరల్ ఎంపీడీఓ రమ్యశ్రీ మాట్లాడుతూ తమ పరిధిలోని మహిళలు తప్పనిసరిగా ఓటు వేసేలా డ్వాక్రా మహిళలు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత కళాజాతా స్కిట్స్, ఫ్లాష్‌మాబ్ ద్వారా పిచ్చయ్య, డప్పు రమేష్ ఓటర్లకు అవగాహన కల్పించారు. చివరిగా డ్వాక్రా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈఓపీఆర్‌డీ శేషగిరిరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లియోనా, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలి



పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. 61వ డివిజన్ శాంతినగర్‌లో ముస్లిం మైనార్టీల యువజన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు ఉన్న రిజర్వేషన్లు తీసివేస్తామని చెబుతున్న కూటమి రాజకీయ పార్టీల అభ్యర్థులను ఓడించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన వారిని నామినేటెడ్ పదవుల్లో అనేక మందిని నియమించారన్నారు. సంక్షేమం పరంగా పెద్దపీట వేశారని అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావులను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఎంసీ సెంట్రల్ నియోజకవర్గ యూత్ సెక్రటరీగా గాలిబ్ బేగ్‌ను నియమించి ఆయనకు నియమాక పత్రం అందజేశారు. ఏఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, ప్రతినిధులు అన్వర్ బేగ్, సిలార్ బేగ్, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్
- 6వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



6వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ హయాంలోనే కొండ ప్రాంతాల అభివృద్ధి జరిగిందని, అందువల్ల వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. స్థానిక 6వ డివిజన్ పరిధిలో మంగళవారం ఉదయం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించడానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఓడిపోయినా ఏ మాత్రం వివక్షత చూపకుండా నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అత్యధికంగా నిధులు కేటాయించారని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కొండ ప్రాంతాల్లోని సమస్యలను గాలికి వదిలేసిందన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

తూర్పు నియోజకవర్గంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేసినంత అభివృద్ధిని గద్దె రామ్మోహన్ జీవితంలో ఎన్నడూ చూసి ఉండరని అవినాష్ చెప్పారు. కొండ ప్రాంతాల్లో మెట్లు, డ్రెయిన్లు, రోడ్లు, వాటర్ ట్యాంక్‌లు నిర్మాణం చేశామన్నారు. దాదాపుగా రూ.80 కోట్లను వివిధ సంక్షేమ పథకాల రూపంలో లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. గత టీడీపీ హయాంలో ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన స్థానాల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేపట్టేవారు కాదని, కాని జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలు చూడకుండా అభివృద్ధి చేశారన్నారు. ఒక సారి ఎంపీగా, పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా ఎందుకు వదిలేశార అవినాష్ ప్రశ్నించారు. ప్రజా పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, దౌర్జన్యాలు చేసిన చంద్రబాబునాయుడు పాలన మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. సంక్షేమాన్ని అందించే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సోషల్ మీడియాలో దిగజారిపోయి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

గిరిజన సంఘాల మద్దతు



అవినాష్‌కు మద్దతు తెలుపుతున్న గిరిజన సంఘ నాయకులు

గుణదల(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినిష్‌కు గిరిజన సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీకి మద్దతుగా గిరిజన రాజకీయ చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం దేవినేని అవినాష్‌ను గుణదలలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడమల రామచంద్రయ్య, ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మానుపాటి నవీన్ మాట్లాడుతూ.. గిరిజన ద్రోహి చంద్రబాబు అన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మి ఓట్లు వేస్తే మన భవిష్యత్‌ను మనమే నాశనం చేసుకోవడమేనన్నారు. గద్దె రామోహ్మన్‌రావు తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 650 కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించారని చెప్పారు. సామాన్యులకు సైతం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే దేవినేని అవినాష్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి తోకల చిన్న విరోజి, ఎన్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్నాథం చంటి, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేసనం హేమంత్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని ప్రజలు తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే రాబోయే రోజుల్లో మరింతగా అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తానని అవినాష్ హామీ ఇచ్చారు. ప్రచారంలో స్థానిక కార్పొరేటర్ అమర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేము చేసిన అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది

19వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో దేవినేని అవినాష్



లబ్బీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): మేము చేసిన అభివృద్ధి పనులు కళ్లకు కనిపిస్తున్నాయని, ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలే చెబుతారని వైఎస్సార్ సీపీ తూర్పు అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. అభివృద్ధిని చూడలేని గద్దే రామ్మోహన్ సొల్లు కబుర్లు చెబుతున్నారని, ఆయన చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని సవాల్ విసిరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం లబ్బీపేట, పోలీస్‌క్వార్టర్స్, పున్నమ్మతోట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ మైనార్టీల చిరకాల కోరిక నెరవేరుస్తూ షాదీఖానా నిర్మాణం చేస్తున్నామన్నారు. అందుకోసం స్థలం కేటాయించడమే కాకుండా రూ.2 కోట్లు వెచ్చించి భవన నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఏ ప్రాంతానికి వెళ్లినా మేము చేసిన అభివృద్ధి కనిపిస్తోందన్నారు.

గద్దె ఓ అసమర్థుడు..

ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ అసమర్థుడని పదేళ్లు ఆయనతో కలిసి ఉన్న ఎంపీ కేశినేని శ్రీనివాస్ అంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రెండు వేల కోట్లు అభివృద్ధి చేశానని చెబుతున్నాడని, కానీ ఆ పనులు ఎక్కడా కనిపించడం లేదన్నారు. గద్దే గన్‌మెన్‌లను పెట్టుకోక పోవడానికి కారణం చీకటి వ్యవహారాలే అన్నారు. పేకాట, బెట్టింగ్, గంజాయి వ్యవహారాలు ప్రజలకు తెలుస్తాయని సెక్యూరిటీకి దూరంగా ఉన్నట్లు తెలిపారు. కాల్‌మనీ, సెక్స్‌రాకెట్‌తో మహిళల జీవితాలను నాశనం చేశాడన్నారు. ప్రజల ముందు మంచిగా ఉంటూ నటించడం గద్దెకి అలవాటేనన్నారు. దురలవాట్లు లేవని ప్రమాణం చేస్తే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఎక్కడ దాక్కున్నావని ఎద్దేవా చేశారు. మేము ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేశామని, ముస్లింలకు నీవు ఏమి చేశావో చెప్పగలవా అని నిలదీశారు. ప్రధాని మోదీని తిడుతూ గతంలో కవితలు రాసిన గద్దె అనురాధ, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఆయన దగ్గరికి వెళతారని ప్రశ్నించారు. ప్రజలు టీడీపీ నేతలను నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, పార్టీ నాయకులు చింతగుంట విజయ్, బుర్రి జగ్జీవన్ రామ్, రంగా, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నేటి యువత దేశానికి సేవ చేయాలని ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బుడమేరు వంతెన సెంటర్‌లో మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి లఖంరాజు సునీత ఆధ్వర్యాన అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ బి.జానారెడ్డితో కలిసి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు వర్మ, వికాస్, పెద్దబాబు అమ్ముల వివేకానంద తదితరులు పాల్గొన్నారు. గిరిజన హక్కుల కోసం పోరాడి, వారిలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం తెలుగు జాతికే గొప్ప గౌరవమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుడమేరు వంతెన వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

ముత్యాలంపాడులోని గోకరాజు రంగరాజు కల్యాణ మండపంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం, అల్లూరి స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన మంగళవారం అల్లూరి వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా అల్లూరి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరాజు, కార్యదర్శి ప్రసాద రాజు, గ్రంథాలయం అధ్యక్షుడు కె సుబ్బరాజు, డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, కార్యదర్శి పీవీ సుబ్బరాజు, క్షత్రియ సౌత్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు టీవీఎస్ ఆంజనేయరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజు, టీపీఎస్ఎన్ రాజు, టి.శ్రీనివాసరాజు, సాగి వర్మ, డాక్టర్ రామలింగరాజు, కె.సాంబశివరాజు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఈదురుగాలుల బీభత్సం





గాలులకు నిర్మానుష్యంగా మారిన పంటకాలువ రోడ్డు

నగరంలో కమ్మేసిన మబ్బులు

నగరంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి భానుడి భగభగలతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వాతావరణం చల్లబడడంతో సేదతీరారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈదురుగాలులు వీచి, మబ్బులు కమ్మేశాయి. కొన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఊడిపోయాయి. పంటకాలువ రోడ్డులో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

–ఆటోనగర్(విజయవాడతూర్పు)

300 మద్యం సీసాలు స్వాధీనం

పోలంపల్లి(వత్సవాయి) : మండలంలోని పోలంపల్లి పంట పొలాల్లో బస్తాల్లో దాచి ఉంచిన 300 మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పొలాల్లో మద్యం సీసాలను నిల్వ చేశారనే సమాచారం తెలుసుకున్న ఎస్ఈబీ సీఐ మణికంఠ, తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 300 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా మద్యం దాచినవారి వివరాలను కనిపెట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని కళావేదికపై మంగళవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి. తెనాలికి చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా కేంద్రం నిర్వాహకురాలు, నాట్యాచారిణి ఎ.వెంకట లక్ష్మి శిష్యులు మహాగణపతి, నమఃశివాయ, అంబ నీరాజనం, అష్టలక్ష్మి వైభవం, జయ జయ దుర్గ, మార్కేండేయ విజయం, అర్ధనారీశ్వరం హనుమాన్ చాలీసా వంటి అంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో నృత్యం చేశారు. అనంతరం ఆలయ అధికారులు కళాకారిణులకు తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు

● గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పరిశీలకులు ప్రీతీందర్ సింగ్ అన్నారు. జిల్లాలో చెక్‌పోస్టుల తనిఖీలో భాగంగా గుంటుపల్లి వద్ద హైవే పక్కన ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చిపోయే వాహనాలు పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే వదిలిపెట్టాలన్నారు.

టీడీపీ మేనిఫెస్టోను కాపులు విశ్వసించటం లేదు

జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో కాపు సామాజిక వర్గం తెలుగుదేశం, జనసేనలు ప్రవేశపెట్టిన ఉమ్మడి మేనిఫెస్టోను విశ్వసించటం లేదని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి శ్రీహరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ పాలనలో కాపులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు నేడు తమ సామాజికవర్గానికి ఏదో చేస్తానని చెబితే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. ముఖ్యంగా ఈ ఎన్నికల్లో టీడీపీ జనసేన, బీజేపీ కూటమి ఎన్ని సీట్లు కాపులకు ఇచ్చాయో చర్చకు రావాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి సుమారు 30కు పైగా అసెంబ్లీ సీట్లు, ఐదు ఎంపీ సీట్లు కాపులకు కేటాయించి గౌరవించారన్నారు. పాలనలో కాపులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ఉపముఖ్యమంత్రిగా, మంత్రులుగా, అనేక పదవులు కేటాయించి కాపులను అక్కున చేర్చుకున్న జగన్‌మోహన్ రెడ్డికి యావత్ కాపు సామాజికవర్గం రుణపడి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయటానికి కాపులు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ప్రధానంగా కాపులను విస్మరించిన టీడీపీ కూటమికి తగిన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు.

ఆ పాపం బాలశౌరిదే

ఎదురుమొండి వారధి ఆలస్యానికి కారణం ఆయనే

- టెండర్లకు వెళ్లకుండా అడ్డుకున్నారు
- ఓటు అడిగే హక్కు వారికెక్కడిది?
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ధ్వజం



ఎదురుమొండి వారధి మంజూరు జీవో కాపీ చూపిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి

అవనిగడ్డ: ఎదురుమొండి వారధి ఆలస్యం పాపం వల్లభనేని బాలశౌరిదేనని, టెండర్లకు వెళ్లకుండా దుర్బుద్ధితో అడ్డుకున్నారని అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.109 కోట్లు నాబార్డు నిధులతో ఎదురుమొండి వారధి నిర్మాణం కోసం 2022 ఏప్రిల్ 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని చెప్పారు. ఆ తర్వాత రూ.140 కోట్లకు అంచనాలు పెంచారని, వీటితో సంబంధం లేకుండా వారధి నిర్మాణం వరకూ రూ.109 కోట్లతో టెండర్ పిలవమని ఆర్అండ్‌బీశాఖను సంప్రదిస్తే.. ఎంపీ బాలశౌరి పాత అంచనాలు కాకుండా కొత్త అంచనాలతో టెండర్లు పిలవాలని ఒత్తిడి తేవడం వల్లనే ఆలస్యం అవుతోందని చెప్పారన్నారు. ఈ విషయం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చెప్పడంతో పాత పద్ధతినే గత ఏడాది నవంబర్‌లో టెండర్లు పిలిచారని అప్పటికే ఎన్నికలు దగ్గరకు రావడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని ఎమ్మెల్యే సింహాద్రి తెలిపారు. ఎదురుమొండి వారధి కడితేనే ఓట్లు అడుగుతానని గతంలో తాను చాలెంజ్ చేశానని, అది పూర్తయితే ఎక్కడ తనకు పేరు వస్తుందోననే నీచబుద్ధితో బాలశౌరి టెండర్లకు వెళ్లకుండా అడ్డుకున్నారని విమర్శించారు.

కరోనా సమయంలో ఎక్కడ దాక్కున్నారు?

కరోనా సమయంలో జనం పిట్టల్లా రాలిపోయినపుడు, కోవిడ్ వల్ల ప్రజలు తీవ్ర భయాందోళలకు గురై ఇళ్ల నుంచి బయటకు రాని సమయంలో బాలశౌరి, బుద్ధప్రసాద్ ఎక్కడ దాక్కున్నారో నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలని సింహాద్రి డిమాండ్ చేశారు. తనకు రెండుసార్లు కరోనా వచ్చినా లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి ప్రజల మధ్యనే తిరిగి వైద్యసేవలు అందేలా చేసినందుకా తనకు ఓటు అడిగే హక్కులేదంటున్నారని ప్రశ్నించారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలి..

వేటాడతాం, వెంటాడతాం అంటూ యువకులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి వారి జీవితాలను నాశనం చేయొద్దని బాలశౌరికి సింహాద్రి రమేష్‌బాబు హితవు పలికారు. ఎన్నికలు అయ్యాక బాలశౌరి గుంటూరు, ఢిల్లీనో వెళ్లి వ్యాపారాలు చేసుకుంటారని, రెచ్చగొట్టడం వల్ల యువకులు ఏదైనా చేసి కేసుల్లో ఇరుక్కుంటే కోర్టుల చుట్టూ తిరిగేది యువతే అనే విషయం మరువరాదన్నారు. రెండుసార్లు ఎంపీగా బాలశౌరి, మూడుసార్లు ఎమ్మెల్యేగా బుద్ధప్రసాద్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ఈ సారి గెలిస్తే అన్నీ చేసేస్తామని పిట్టలదొర కబుర్లు చెబుతున్నారని సింహాద్రి ఎద్దేవా చేశారు.

పథకాలు అమలు కాకుండా అడ్డుకుంది చంద్రబాబే..

రుణమాఫీ, చేయూత, ఇతర పథకాలకు డబ్బులు పడకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయించి చంద్రబాబు అడ్డుకున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. 2019 ఎన్నికలకు మూడు రోజుల ముందు పసుపు కుంకుమకు చంద్రబాబు డబ్బులు వేసినా ఆ నాడు జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి ఫిర్యాలు చేయలేదన్నారు.

వెన్నుపోటు దారుడు బుద్ధప్రసాద్..

టీడీపీలో ఎంపీ, ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన అంబటి బ్రాహ్మణయ్య తదనంతరం ఆయన కుమారుడుకి సీటు రాకుండా అడ్డుకున్నది ఎవరో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసుకుని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు.
టీడీపీలో ముఖ్యనాయకుడిగా ఎదిగిన బ్రాహ్మణయ్య పేరుని ఉల్లిపాలెం వారధికి పెట్టకుండా అడ్డుకుంది బుద్ధప్రసాద్ కాదా అని ప్రశ్నించారు. పైకి నీతి సూక్తులు చెబితే సరిపోదని, ఆయన పొడిచిన వెన్నుపోట్లు, రైతులకు చేసిన ద్రోహం నియోజకవర్గ ప్రజలు మర్చిపోరన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సర్నాల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



మైలవరం: మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి నివాసంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులను కలుసుకుని ముచ్చటించారు. పార్టీ పరిస్థితి, ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతి రావు ప్రచార కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డిని శాలువతో సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ వింగ్ ఆర్డినేటర్ వేములకొండ తిరుపతిరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మామయ్యల తరఫున అల్లుళ్ల ప్రచారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విజయం కాంక్షిస్తూ వారి అల్లుళ్లు కాజ రఘునాథం, మంచుకొండ చక్రవర్తి మంగళవారం 31వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యంలతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసే ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని సార్వత్రిక ఎన్నికలలో ఆయనను సీఎం చేసేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేం ఓటేశాం

జగ్గయ్యపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వారి కోసం ఎన్నికల సంఘం హోం ఓటింగ్ అవకాశం కల్పించింది. ఈ హోం ఓటింగ్ కార్యక్రమాన్ని జగ్గయ్యపేట నియోజకవర్గంలో ప్రారంభించారు. నియోజకవర్గవ్యాప్తంగా తొలిరోజు మంగళవారం 79 మంది వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నట్లు జగ్గయ్యపేట ఆర్వో వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే ఐదు బృందాలు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నవారి ఇళ్లకు వెళ్లగా, ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు వివరించారు.



ఓటేసి సిరాగుర్తు చూపుతున్న వృద్ధుడు



ఓటు వేస్తున్న వృద్ధురాలు

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం

పెనుగొలను(గంపలగూడెం): రాష్ట్రంలో గడచిన 58 నెలలుగా అభివృద్ధి సంక్షేమాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, తిరువూరు నియోజవర్గ పార్టీ ఇన్‌చార్జి పి. గౌతమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి గంపలగూడెం మండలం చల్లగుండ్లవారిపాలెం, పెనుగొలను గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలో వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి నల్లగట్లస్వామిదాసుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మేలుచేసే సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రాష్ట్రంలో మరోమారు, పార్టీ అధికారంలోకి రావాలన్నారు. అనంతరం స్వామిదాసు మాట్లాడుతూ ఈనెల13వ తేదీన జరిగే ఎన్నికల్లో తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నానిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, సర్పంచ్ సంగెపు లలిత, మండలపార్టీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కోట దాసు పాల్గొన్నారు.



పెనుగొలను ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామిదాసు, గౌతమ్‌రెడ్డి

వైఎస్సార్ సీపీలోనే బీసీలకు ప్రాధాన్యం

- సోషల్ ఇంజినీరింగ్ అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్
- బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిశేషగిరిరావు



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిశేషగిరిరావు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం లభించిందని బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషగిరిరావు అన్నారు. బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాలలో కూడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సోషల్ ఇంజినీరింగ్ అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజికవర్గానికి చెందిన ఐదుగురికి రాజ్యసభ, 11 మందికి ఎంపీలు, 12 మందికి ఎమ్మెల్సీలు, 48 మందికి మేయర్ పదవులకు అవకాశం కల్పించిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. అట్టడుగున ఉన్న బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన సామాజిక వేత్త జగన్ అని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు అపవిత్రమైనదని, బీసీలను బలిపశువులను చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. జనసేన పార్టీ కోసం 10 ఏళ్లు కష్టపడిన పోతిన మహేష్‌కు పశ్చిమ సీటు కేటాయించకపోవడం బీసీలపై కూటమికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. స్థానికుడు, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి షేక్ ఆసిఫ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజలకు అనేక విధాలుగా మేలు చేసి మూడోసారి పోటీ చేస్తున్న కేశినేని శ్రీనివాస్(నాని) హ్యాట్రిక్ కొట్టేలా గెలిపించుకోవాలని కోరారు.

పశ్చిమంలో బీసీ ఎమ్మెల్యే అభ్యర్థి దొరకలేదా?

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మొత్తం మీద పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి దొరకలేదా..? సుజనా చౌదరి వంటి టూరిస్ట్ పొలిటీషియన్‌ను తీసుకువచ్చారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉండే పశ్చిమ నియోజకవర్గంలో డబ్బు విరజిమ్మి గెలుస్తానని సుజనా చౌదరి అనుకోవడం ఆయన అగ్రకుల అహంకారానికి నిదర్శనమన్నారు.

బీసీల అభ్యున్నతికి బాటలు..

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి బాటలు వేసింది సీఎం జగన్ అని అన్నారు. ముఖ్యంగా విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని చెప్పారు. విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం జాతికి గర్వకారణమన్నారు. సమావేశంలో బీసీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, బట్టిపాటి శివ, సైకం సాయిబాబా, శీరం వెంకట్రావు, యంగల శ్రీనివాసరావు, నాగోతి కిశోర్, నాగరాజు, సుభాషిణి, కోళ్ల రజని, ఐతా కృష్ణకిషోర్, పిళ్లా సూరిబాబు, మంజు భార్గవి పాల్గొన్నారు. తొలుత వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బొండాకు ఓటుతో బుద్ధి చెప్పాలి

వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్షేమ పథకాలతో యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచిన సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కోరారు. స్థానిక 30వ డివిజన్ రామకృష్ణాపురంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ బి. జానారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కార హీనుడు, రౌడీ బొండా ఉమాకు ఎన్నికలలో గుణపాఠం చెప్పాలన్నారు. అందరికీ అందుబాటులో ఉండే మంచి మనిషి వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపిస్తే సెంట్రల్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

బొండాకు ఓట్లు అడిగే అర్హత లేదు..

వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలలో బొండాకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రౌడీ బొండా సెంట్రల్ నియోజకవర్గానికి అవసరమా అని ప్రశ్నించారు. అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోకుండా భూ కబ్జాలు రౌడీయిజం చేసిన బొండాకు సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు బుద్ధిచెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. దారి పొడవునా మహిళలు, స్థానికులు హారతులు ఇస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అమ్ముల వివేకానంద, లఖంరాజు సునీత, వర్మ, దుర్గారావు, కృష్ణ పాల్గొన్నారు.


జగనన్నది ఇచ్చే గుణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డిది ప్రజలకు ఇచ్చే గుణమే తప్ప తీసుకునే తత్వం కాదని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ చట్టం ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా లక్షా 54వేల మంది గిరిజన కుటుంబాలకు మూడు లక్షల 22వేల ఎకరాల భూమిని పంపిణీ చేసిన మహోన్నత వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గిరిజనులకు భూమి ఇవ్వటంతో పాటు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా కూడా అందించారని అటువంటి జగన్‌మోహన్‌రెడ్డి భూములు లాక్కుంటారంటూ చంద్రబాబు అండ్ కో మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు నోరు అదుపులో పెట్టుకోవాలని లేని పక్షంలో గిరిజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

బ్రాహ్మణులు, ఆర్యవైశ్యులకు అన్యాయం

- బీజేపీ 16 సీట్లలో ఒక్క సీటు కేటాయించలేదు
- సామాజిక న్యాయమని మాట్లాడే అర్హత కూటమికి లేదు
- వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్



మాట్లాడుతున్న పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి బ్రాహ్మణ, ఆర్యవైశ్య సామాజికవర్గాలకు ఈ ఎన్నికల్లో దారుణమైన అన్యాయం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ అన్నారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి కుట్రపూరితంగా బ్రాహ్మణ ఆర్యవైశ్య సామాజిక వర్గాలకు చేసిన అన్యాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా గమనించాలన్నారు. బీజేపీకి సంప్రదాయ ఓటర్లుగా ఉన్న బ్రాహ్మణులకు ఆర్యవైశ్యులకు కనీసం భారతీయ జనతా పార్టీ 16 సీట్లలో ఒక్క సీటు కూడా కేటాయించకపోవటం అన్యాయమన్నారు. దీనిపై బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సమాధానం చెప్పాలన్నారు. బీజేపీకి అత్యంత ఆప్తుడైన, హిందూ ధర్మాన్ని కాపాడుతున్నటువంటి గురువుల్లో ఒకరైన పరిపూర్ణానంద స్వామీజీకి ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన శివస్వామికి బీజేపీ టికెట్లు ఇవ్వకుండా అన్యాయం చేసిందన్నారు. భారతీయ జనతా పార్టీలోని ఆయా సామాజికవర్గాలను పురందేశ్వరి ఎంత దారుణంగా అణగదొక్కారో స్పష్టంగా అర్థం చేసుకోవాలన్నారు.

జగన్ ఎంతో చేశారు..

2019 నుంచి 2024 ఐదేళ్ల కాలంలో సీఎం జగన్ అర్చకుల రిటైర్మెంట్ విధానాన్ని రద్దు చేశారని, అర్చకుల వేతనాన్ని పెంపు అమలు చేశారని పోతిన అన్నారు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల్లో అర్చకులకు భాగస్వామ్యం కల్పించారన్నారు. రాష్ట్రంలో 5,046 ఆలయాలకు నిత్య ధూప దీప నైవేద్యాలకు నిధులు కేటాయించారు. చంద్రబాబు కూల్చేసిన అనేక ఆలయాలను విజయవాడ నగరంలో పునర్నిర్మించారన్నారు. కనకదుర్గమ్మ గుడిలో ఆలయ అభివృద్ధి కోసం రూ.200 కోట్ల పనులు చేపట్టారన్నారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో రూ.175 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. వేల ఎకరాల దేవాలయాల భూముల వివాదాలను పరిష్కారం చేసినటువంటి గొప్ప వ్యక్తి సీఎం జగన్ అని వివరించారు. ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ పార్టీ కొన్ని కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. నియోజకవర్గంలోని ఆర్య వైశ్యులు వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు. ఆలయాలను కూల్చే కూటమికి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో నేమాల సంజీవరావు, అడ్డూరి తమ్మారావు, షేక్ అమీర్ భాష, మద్దెల కనకారావు, సాబిన్కర్ నరేష్, సీరం శీను బాబు, పిల్లా శంకర్ లండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ కోసం పిడిగుద్దులు

టీడీపీ, జనసేన నాయకుల బాహాబాహీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): టీడీపీ, జనసేన నాయకులు టిఫిన్ కోసం కొట్టుకున్న సంఘటన కొండపల్లిలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు మైలవరం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ సతీమణి వసంత శిరీష మంగళవారం కొండపల్లిలో పర్యటించారు. పట్టణానికి చెందిన ఒక టీడీపీ నాయకుడు మధ్యాహ్నం 2.00గంటల సమయంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. ఇంటి యజమాని వసంత శిరీషను భవనం రెండో అంతస్తులోకి ఆహ్వానించగా మిగిలిన నాయకులు, కార్యకర్తలు గ్రౌండ్‌ఫ్లోర్‌లో అల్పాహారం చేశారు. తుమ్మలపాలెంకు చెందిన జనసేన మహిళా కార్యకర్తలు శిరీష వద్దకు వెళ్తున్న క్రమంలో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. కొద్దిసేపు వాదన తర్వాత పైకి పంపారు. అక్కడ కూడా వీరికి ఆమెను కలిసేందుకు అవకాశం ఇవ్వకుండా అవమానించారు. జనసేన పట్టణ నాయకులు విషయం తెలుసుకుని టీడీపీ నాయకులతో గొడవకు దిగారు. అక్కడి వివాదం టీడీపీ కార్యాలయానికి చేరింది. టీడీపీ వారు తొలి నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలను అవమానిస్తున్నారని నిలదీశారు. మాటామాటా పెరిగి ఇరువర్గాలు పిడిగుద్దులు గుద్దుకున్నారు. వ్యవహారం స్మృతిమించుతుందని భావించిన పట్టణ టీడీపీ ఇన్‌చార్జ్ కలగజేసుకుని విషయం బయట తెల్చుకోవాలని అక్కడి నుంచి బయటకు పంపించేశారు. టీడీపీతో కలిసేది లేదని జనసేన నాయకుల అలిగి వెళ్లిపోయారు. విషయం పార్టీ పెద్దల వద్ద తేల్చుకుంటామని తెగేసి చెప్పారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

తోట్లవల్లూరు: సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని కృష్ణా-గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి. కల్పలతారెడ్డి అన్నారు. పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్, బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుల విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని దేవరపల్లిలో మంగళవారం సాయంత్రం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించటంతో పాటు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కల్పలతారెడ్డి కోరారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచి, వైఎస్సార్ సీపీకి అఖండ మెజారిటీ అందించాలని విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమం కోసం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు భీమవరపు లక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు జొన్నల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

నేతన్నల ఆప్తబంధువు జగనన్న

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవ్వారు రవి

కంకిపాడు: నేతన్నల ఆప్తబంధువు సీఎం జగనన్న అని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవ్వారు రవి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ మచిలీపట్నం ఎంపీ స్థానానికి సింహాద్రి చంద్రశేఖరరావు, పెనమలూరు అసెంబ్లీ స్థానానికి జోగి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవ్వారు రవి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద వర్గాలకు అండగా నిలిచారన్నారు. చేనేత కార్మికులకు రూ. 1.50 లక్షలు నుంచి రూ. 2.40 లక్షలు వరకూ అర్హులైన ప్రతి ఒక్కరికీ నేతన్న నేస్తం అందించారన్నారు. విద్య, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యం కల్పించారన్నారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. అన్ని రంగాల్లోనూ చేనేత వర్గానికి ప్రాతినిధ్యం కల్పించి సామాజిక వర్గ ఉన్నతికి చర్యలు తీసుకున్నారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగనన్నకు అండగా నిలవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఎంపీటీసీ కోనా కిషోర్, తంబాబత్తుల ఓంకారం, కంకిపాటి వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, తట్టుకూరి శ్రీకాంత్, స్థానిక నేతలు పాల్గొన్నారు.



కంకిపాడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న అవ్వారు రవి

అనాసాగరంలో టీడీపీ ఖాళీ!

వైఎస్సార్ సీపీలో చేరిన 42 కుటుంబాలు



టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: పట్టణ సమీపంలోని అనాసాగరంలో టీడీపీ దాదాపు ఖాళీ అయినట్లేనని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. అనాసాగరానికి చెందిన 45 కుటుంబాలు మంగళవారం రాత్రి టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. టీడీపీ నేత, కాపు సంక్షేమ సంఘ నాయకుడు కర్రి రమేష్, వరగాల నాగేశ్వరరావు, పున్నవల్లి శ్యామల, మెల్లంపూడి శ్రీరామ్మూర్తి, గుడిశ రామ్మూర్తిలతో పాటు పార్టీలో చేరిన వారికి అరుణకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని ప్రజలు నమ్మటం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కాపులకు తీరని అన్యాయం చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో కాపులకు సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. టీడీపీ అధినేత వ్యవహార శైలితో పాటు స్థానిక నేతల తీరుతో విసుగు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి క్యూ కడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు పాల్గొన్నారు.



తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



విశాఖ జిల్లా గాజువాకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

పథకాలను అడ్డుకున్నా.. గెలుపును ఆపలేరు

కోరుకొండ, ఇచ్ఛాపురం, గాజువాక ఎన్నికల సభల్లో సీఎం జగన్

ఉద్దానం కిడ్నీ కష్టాలకు విముక్తి

దశాబ్దాలుగా ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ సమస్యల పరిష్కారం కోసం రూ.780 కోట్లతో హిరమండలం నుంచి తాగునీటిని తరలించింది మీ బిడ్డ ప్రభుత్వమే. రూ.80 కోట్లతో కిడ్నీ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌ను నిర్మించింది మన ప్రభుత్వమే. ఉత్తరాంధ్రలో కొత్తగా మెడికల్ కళాశాలలు కడుతున్నాం. పార్వతీపురం, పాడేరు, నర్సీపట్నం, విజయనగరం జిల్లాల్లో ఇవి ఏర్పాటవుతున్నాయి. సాలూరులో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నది మన ప్రభుత్వమే. కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కళాశాల కడుతున్నది మన ప్రభుత్వమే. ఐటీడీఏల పరిధిలో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయంటే కారణం మీ బిడ్డే. సెల్‌ఫోన్ కనెక్టివిటీ లేని గిరిజన ప్రాంతాల్లో రూ.400 కోట్ల వ్యయంతో టవర్లను ఏర్పాటు చేశాం. 1.53 లక్షల గిరిజన కుటుంబాలకు 3,23,000 ఎకరాల పట్టాలిచ్చి వారికి రైతు భరోసా అందిస్తూ జీవనోపాధి చూపించింది కూడా మీ బిడ్డే.

కోరుకొండ భూముల సమస్య పరిష్కరిస్తా..

కోరుకొండ భూముల గురించి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గుర్తుచేశాడు. ఫైల్ ప్రాసెస్‌లో ఉన్న సమయంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మళ్లీ మనం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ భూముల సమస్యను పరిష్కరిస్తామని సవినయంగా తెలియజేస్తున్నా.

ఓటు అనే ఆయుధంతో ఢిల్లీ పీఠం కదలాలి

వీళ్లు ఎన్ని కుట్రలు చేసినా.. దేవుడు అంతా గమనిస్తున్నాడు. మీ బిడ్డకు ప్రజల దీవెనలున్నాయి. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, రైతన్నల చేతుల్లో ఓటు అనే బలమైన ఆయుధం ఉంది. ఆ ఓటు అనే ఆయుధంతో వీళ్లను కొట్టే దెబ్బకు ఢిల్లీ పీఠం కూడా కదులుతుందని గట్టిగా చెబుతున్నా.

- ఇచ్ఛాపురం సభలో సీఎం జగన్




ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజా, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌లను గెలిపించాలని కోరుతున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ/సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/సాక్షి, విశాఖపట్నం:

'దేవుడి దీవెనలు, మీ ఆశీస్సులున్నంత వరకూ మీ బిడ్డ విజయాన్ని ఏ ఒక్కరూ ఆపలేరు. జూన్ 4న మనందరి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుంది. మనం నొక్కిన బటన్లు అన్నీ వారం రోజుల్లోనే క్లియర్ చేస్తాం. ఢిల్లీతో కలిసి మీ బిడ్డ ప్రభుత్వాన్ని దెబ్బ తీసే కుట్రలు చేస్తున్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, మూడుసార్లు సీఎంగా చేశానంటాడు. అన్నేళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేరు చెబితే పేదలకు ఒక్క స్కీమ్ అయినా గుర్తుకొస్తుందా? జగన్ అంటే పథకాలు.. చంద్రబాబు అంటే మోసాలు, కుట్రలు, కుతంత్రాలే గుర్తుకొస్తాయి' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు మోసాలు, కుతంత్రాలకు ఓటు అనే వజ్రాయుధంతో మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, విశాఖ జిల్లా గాజువాకలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్ ప్రసంగించారు.

ఇంతలా దిగజారిపోయారు..

కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ జగన్ నొక్కిన బటన్ల సొమ్ము నా అక్కచెల్లెమ్మలకు అందకుండా ఢిల్లీ వాళ్లతో కలిసి అడ్డుకునే కార్యక్రమం చేస్తున్నారు. సాక్షాత్తూ మీ జగన్ ఓ ముఖ్యమంత్రిగా కోర్టుకు వెళ్లి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ కేసులు వేసే పరిస్థితిలోకి ప్రజాస్వామ్యం దిగజారిపోయిందంటే వీళ్లను ఏమనాలి? మీ జగన్ బటన్ నొక్కిన పథకాలన్నీ ఎన్నికలు వస్తున్నాయని కొత్తగా తెచ్చినవి కాదు. గత ఐదేళ్లుగా ఏటా క్రమం తప్పకుండా ఇస్తున్న పథకాలకే మీ జగన్ బటన్ నొక్కాడు. ఈ స్కీములు ఇవాళ ఏదో కొత్తగా తెచ్చినవి కాదు. ఇవన్నీ ఆన్ గోయింగ్ స్కీమ్స్. బడ్జెట్ కేటాయింపులున్నవే. అసెంబ్లీలో బడ్జెట్ ద్వారా ఆమోదం కూడా తెలిపినవే. 58 నెలలుగా ఇస్తున్న పథకాలకు అడ్డుపడుతూ జగన్‌ను కట్టడి చేసేందుకు ఢిల్లీతో కలసి కుట్రలు పన్నుతున్నారు. మీ బిడ్డ బటన్లు నొక్కిన సొమ్మును అక్కచెల్లెమ్మల కుటుంబాలకు అందకుండా అడ్డు తగిలే దౌర్భాగ్య పరిస్థితుల్లోకి వీళ్లు దిగజారిపోయారు. గత ఐదేళ్లుగా క్యాలెండర్‌లో చెప్పిన విధంగా క్రమం తప్పకుండా ఇస్తూ పోతున్న మీ జగన్‌ను ఇబ్బంది పెట్టడానికి కుట్రలు పన్నుతున్నారు. చివరిలో అడ్డుపడితే నా అక్కచెల్లెమ్మల కుటుంబాలు ఊరుకుంటాయా? పెన్షన్ సొమ్ము ఇన్నేళ్ల పాటు మీ బిడ్డ ఇంటికే పంపించిన తర్వాత చివరి రెండు నెలలు ఆ డబ్బులు ఇంటికి రాకపోతే ఏం జరిగిందో ఆ అవ్వాతాతలు గ్రహించలేరనుకున్నారా? ఓటు అనే అస్త్రంతో చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరుతున్నా. జూన్ 4న అధికారంలోకి వచ్చిన వెంటనే ఓ వారం రోజుల్లోనే ఈ బటన్లు అన్నీ మీ బిడ్డ క్లియర్ చేస్తాడు.

బాబు ఒక్క బటనూ నొక్కలేదు..

మనపై ఇన్ని కుట్రలు చేస్తున్న చంద్రబాబు దగ్గర డబ్బులు ఎక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ఆయన మీ జగన్ మాదిరిగా ఎన్నడూ బటన్లు నొక్కలేదు. ఏ రోజూ ఏ ఒక్క అక్కచెల్లెమ్మకూ డబ్బులు, పథకాలు ఇవ్వలేదు. మీ బిడ్డ జగన్ ఈ 59 నెలల కాలంలో 130 సార్లు బటన్లు నొక్కి ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి పంపాడు. చంద్రబాబు దగ్గర ప్రజలను దోచేసిన సొమ్ము చాలా ఉంది. ఆ దోచేసిన సొమ్ముతో లోబర్చుకునేందుకు ఎన్నికల రోజు రూ.2 వేలు, రూ.3 వేలు, కొన్ని చోట్ల రూ.4 వేలు, రూ.5 వేలు కూడా ఇస్తాడు. చంద్రబాబు ఎన్నికల రోజు ఇచ్చే ఆ డబ్బంతా మనదే. మన దగ్గర దోచేసిన డబ్బే అది. కాబట్టి ఆయన ఇస్తే ఏ ఒక్కరూ వద్దు అనొద్దు. కానీ ఓటు వేసేటప్పుడు మాత్రం ఒక్కటే గుర్తు పెట్టుకోండి. మీకు, మీ కుటుంబానికి ఎవరి వల్ల మంచి జరిగిందో ఒక్కసారి గుర్తు చేసుకోండి.

ఈ అభివృద్ధి, పథకాలను కొనసాగిద్దాం..

మరో ఆరు రోజుల్లో కురుక్షేత్ర మహా సంగ్రామం జరగబోతోంది. ఇవి కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కావు. ఈ ఎన్నికలు రాబోయే ఐదేళ్లలో మీ ఇంటింటి అభివృద్ధి, పథకాల కొనసాగింపును నిర్ణయించేవి. జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు, ఇంటింటి అభివృద్ధి. పొరపాటున చంద్రబాబుకు ఓటేస్తే పథకాలన్నీ ముగింపు, మళ్లీ మోసపోవడమే. చంద్రబాబును నమ్మడం అంటే కొండచిలువ నోట్లో తల పెట్టడమే. చంద్రబాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్ర లేపటమే. రాష్ట్రంలో గతంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఉంటే మీ బిడ్డ వచ్చాక ఏకంగా మరో 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాడు. మేనిఫెస్టో హామీల్లో 99 శాతం అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్నాం. గడప గడపకూ మేనిఫెస్టోతో వెళ్లి మరోసారి ఆశీర్వదించాలని కోరాం.

మన పథకాలు.. మచ్చుకు కొన్ని

'నాడు-నేడు'తో బాగుపడ్డ గవర్నమెంట్ బడులు, ఇంగ్లిష్ మీడియం, 6వ తరగతి నుంచే క్లాస్ రూముల్లో డిజిటల్ బోధన, 8వ తరగతికి రాగానే ప్రతి పిల్లాడి చేతిలో ట్యాబ్‌లు, 3వ తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, సబ్జెక్టు టీచర్లు, సీబీఎస్‌ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం, పిల్లల చేతుల్లో బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్ (ద్విభాషా పాఠ్య పుస్తకాలు), బడులు తెరవగానే పిల్లలకు విద్యాకానుక, రోజుకో రుచికరమైన మెనూతో గోరుముద్ద, పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ అమ్మ ఒడి, పూర్తి ఫీజులు చెల్లిస్తూ జగనన్న విద్యాదీవెన, ఖర్చులకు ఇబ్బంది పడకుండా వసతి దీవెన, అంతర్జాతీయ వర్సిటీల నుంచి ఆన్‌లైన్ సర్టిఫైడ్ కోర్సులతో భాగస్వామ్యం, తప్పనిసరి ఇంటర్న్‌షిప్... ఇలాంటి విద్యా విప్లవాలు గతంలో ఎప్పుడైనా ఉన్నాయా?

మహిళా సాధికారత.. వినూత్న వ్యవస్థలు

అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబన కోసం ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, 31 లక్షల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, 22 లక్షల గృహ నిర్మాణాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా? అవ్వాతాతలకు ఇంటికే రూ.3 వేలు పెన్షన్, ఇంటి వద్దకే పౌర సేవలు, రేషన్, పథకాలు.. ఇలా నేరుగా డోర్ డెలివరీ చేసిన ప్రభుత్వాలు గతంలో ఉన్నాయా? గతంలో ఎప్పుడూ జరగని విధంగా రైతన్నలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా, ఉచిత పంటల బీమా, సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ, పగటి పూటే 9 గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్, చేయి పట్టుకుని నడిపించే ఆర్బీకేలు, సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు గతంలో ఉన్నాయా?

విశాఖలోనే ప్రమాణ స్వీకారం..

జూన్ 4 తర్వాత మీ బిడ్డ విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తాడు. అదే రోజు పరిపాలనా రాజధానిగా విశాఖ నుంచే పాలన చేయబోతున్నానని గర్వంగా చెబుతున్నా. మూడు రాజధానుల్లో విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తున్నాం. మీ బిడ్డకు మాత్రమే ఆ ధైర్యం ఉంది. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేస్తూ మూడు జిల్లాలను ఆరు జిల్లాలుగా చేసింది మీ బిడ్డ ప్రభుత్వమే. ఆరుగురు కలెక్టర్లు, ఆరుగురు ఎస్పీలతో పరిపాలనా వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు పాలన చేరువ చేశాం. శ్రీకాకుళం జిల్లాలోని బుడగట్లపాలెం, మంచినీళ్లపేటలో ఫిషింగ్ హార్బర్లు వస్తున్నాయి. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ వస్తోంది. రూ.4,400 కోట్లతో మూలపేట పోర్టు పనులు వాయువేగంతో జరుగుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులను శరవేగంగా చేస్తున్నాం, విశాఖ-భోగాపురం 6 లేన్ల రహదారిని నిర్మిస్తున్నాం. విశాఖలో అదాని డేటా సెంటర్, ఇన్ఫోసిస్ మొదలైంది కూడా మీ బిడ్డ పాలనలోనే.

స్వయం ఉపాధికి అండగా..

వాహనమిత్ర, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, చిరువ్యాపారులకు తోడు, చేదోడు, లా నేస్తం లాంటి పథకాలతో స్వయం ఉపాధికి అండగా నిలిచిన ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడైనా చూశారా? రూ.25 లక్షల వరకూ విస్తరించిన ఉచిత ఆరోగ్యశ్రీ, జీవన భృతి అందిస్తూ ఆరోగ్య ఆసరా, గ్రామంలోనే విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, ఇంటికే ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యంపై ఇంత ధ్యాస పెట్టిన ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడైనా చూశారా? ఏ గ్రామానికి వెళ్లినా 600 రకాల సేవలందిస్తున్న సచివాలయం, ఫైబర్‌గ్రిడ్, నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు, అక్కచెల్లెమ్మల భద్రత కోసం గ్రామంలోనే మహిళా పోలీసు, దిశా యాప్ లాంటివి ఇంతకు ముందెప్పుడైనా చూశారా? నాడూ నేడూ అదే రాష్ట్రం.. అదే బడ్జెట్. చంద్రబాబు ఏ రోజూ పేదల కోసం బటన్లు నొక్కలేదు. అప్పుల గ్రోత్ రేట్ కూడా గతంలో కంటే ఇప్పుడే తక్కువ.

ఇది కాదా అభివృద్ధి..?

మీ జగన్ పేరు చెబితే ఎన్నో పథకాలు గుర్తుకొస్తాయి. బాబు పేరు చెబితే ఏ స్కీమూ గుర్తు రాదు కాబట్టి జగన్ హయాంలో అభివృద్ధి లేదంటూ అబద్ధాలు చెబుతున్నాడు. చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు కేవలం రూ.32,000 కోట్లు అయితే మీ బిడ్డ జగన్ పాలనలో రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయంటే అంటే ఇది అభివృద్ధి పాలన కాదా? మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, 10 ఇండస్ట్రియల్ నోడ్స్ మీ బిడ్డ హయాంలోనే వస్తున్నాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీని వరుసగా ఏటా నంబర్ వన్‌గా నిలబెట్టాం. కొత్తగా 4 సీ పోర్టులు నిర్మిస్తున్నాం. 10 ఫిషింగ్ హార్బర్లు నిర్మాణంలో ఉన్నాయి. 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు అందుబాటులోకి వస్తున్నాయి. గ్రామ స్వరాజ్యానికి అర్థం తీసుకొచ్చాం. 15,000 గ్రామ సచివాలయాలు, 11,000 విలేజ్, వార్డు క్లినిక్‌లు, 11,000 ఆర్బీకేలు నెలకొల్పాం. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత 61% ఉంటే మన రాష్ట్రంలో మాత్రం 3.95% మాత్రమే ఉంది. వైద్య ఆరోగ్యశాఖలో 54 వేల మందికిపైగా సిబ్బందిని నియమించాం. మీ బిడ్డ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలు 11 కాగా కొత్తగా మరో 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టింది మన ప్రభుత్వమే.

మీ కుటుంబంతో చర్చించండి..

ఈ రోజు రాష్ట్రంలో జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు. అది క్లాస్ వార్. పేదవాడు ఒకవైపు, పెత్తందార్లు మరోవైపున నిలిచి ఈ యుద్ధం జరుగుతోంది. మీరంతా ఓటేసేముందు మీ కుటుంబంతో కలసి కూర్చొని చర్చించండి. చిన్న పిల్లల అభిప్రాయాన్ని కూడా తీసుకోండి. ఏ ప్రభుత్వం వల్ల, ఎవరి వల్ల మీ ఇంటికి, మీ కుటుంబానికి మంచి జరిగిందో ఆలోచించండి. ఎవరు ఉంటే ఆ మంచి కొనసాగుతుందో గమనించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా. మంచి చేసే ఫ్యాను ఇంట్లో ఉండాలి. చెడు చేసే సైకిల్ ఎక్కడ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ సింక్‌లోనే ఉండాలి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా.. పేదవాడి భవిష్యత్ మారాలన్నా.. పథకాలన్నీ కొనసాగాలన్నా.. లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా.. మన పిల్లలు, వారి చదువులు, వారి బడులు బాగుపడాలన్నా.. మన వ్యవసాయం, హాస్పిటళ్లు మెరుగ్గా ఉండాలన్నా రెండు బటన్లు ఫ్యాన్ మీద నొక్కాలి. 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో మన అభ్యర్థులను భారీ మెజార్టీలతో గెలిపించాలి.

తుప్పు సైకిల్.. ఢిల్లీ మెకానిక్స్!

ఎన్నికల ముందు రకరకాల వాగ్దానాలు గుప్పించే చంద్రబాబు వాటిని అమలు చేయకపోవడం వల్ల తమకు కలిగిన నష్టానికి ప్రతీకారంగా రైతన్నలు, నిరుద్యోగులు, అక్కచెల్లెమ్మలు, వివిధ సామాజిక వర్గాలు, పల్లెలు, పట్టణాల వాసులు అంతా కలసి సైకిల్‌ను ఏ ముక్కకు ఆ ముక్క విరిచి పక్కన పడేశారు. ఆ తుప్పు పట్టిన సైకిల్‌కు రిపేరు చేయాలని చంద్రబాబు తంటాలు పడుతున్నాడు. ముందుగా ఎర్రచొక్కాల దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఫలితం లేకపోవడంతో దత్తపుత్రుడి దగ్గరకు వెళ్లాడు. తుప్పు పట్టిన సైకిల్ కేరియర్ మీద మాత్రమే కూర్చుంటా! టీ గ్లాస్ పట్టుకుని తాగుతా! మిగిలింది నావల్ల కాదని దత్తపుత్రుడు చెప్పాడు. దీంతో వదినమ్మను ఢిల్లీకి పంపాడు. అక్కడి మెకానిక్స్‌ను ఇక్కడికి దింపి సైకిల్‌ను ఓ షేపులోకి తేవాలని కోరాడు. ఆ ఢిల్లీ మెకానిక్స్ ఇక్కడికి వచ్చి తుప్పు పట్టిన సైకిల్‌ను చూసి... హ్యాండిల్ లేదు! సీటు లేదు! పెడల్స్ లేవు! చక్రాలు, ట్యూబులు లేవు! మధ్యలో ఫ్రేమ్ కూడా లేదు! ఇంత తుప్పు పట్టిన సైకిల్‌ను ఎలా బాగు చేస్తాం చంద్రబాబూ! అని అడిగితే పిచ్చి చూపులు చూస్తూ.. ఇదొక్కటే మిగిలిందంటూ ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు మోగిస్తున్నాడు. ఆ బెల్లు పేరే అబద్ధాల మేనిఫెస్టో!



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఎన్నికల ప్రచార సభకు హాజరైన భారీ జనసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్



మన అభ్యర్థులను దీవించండి..

నాకు సొంత తమ్ముడు లేడనే బాధ ఉండేది. రాజాను (రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజా) చూశాక ఆ బాధ పోయింది. నా తమ్ముడిని గొప్ప మెజార్టీతో గెలిపించాలి. మీరు రాజాకు ఓటేస్తే గణేష్, అమ్మ (జక్కంపూడి విజయలక్ష్మి), రాజా భార్య అంతా కలిసి మీ మంచి కోసం ఇంకా ఎక్కువగా కృషి చేస్తారు. మంచి వైద్యుడిగా పేరున్న శ్రీను అన్న (రాజమండ్రి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్)ను గొప్ప మెజార్టీతో ఆశీర్వదించండి. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయమ్మ, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను దీవించాలని కోరుతున్నా. గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, నాకు అక్క లాంటి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని భారీ మెజార్టీతో గెలిపించండి.

2014లో బాబు ముఖ్యమైన మోసాలు..

- రైతులకు రూ.87,612 కోట్ల రుణమాఫీ జరిగిందా?
- డ్వాక్రా సంఘాలకు రూ.14,205 కోట్ల రుణాలను మాఫీ చేస్తానని రూపాయైనా మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి స్కీమ్ కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నాడు. మరి ఏ ఒక్కరికైనా ఒక్క రూపాయి ఇచ్చాడా?
- ఇంటికో ఉద్యోగం.. లేదంటే నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి అన్నాడు. ఐదేళ్లలో ఏ ఇంటికైనా రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, పక్కా ఇల్లు ఇస్తామన్నాడు. ఏ ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత పవర్ లూమ్స్ రుణాల మాఫీ జరిగిందా?
- ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా?
- సింగపూర్‌ను మించి అభివృద్ధి, ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మాణం జరిగిందా?
- రాజానగరంలో ఎవరికైనా కనిపిస్తోందా?
- ప్రత్యేక హోదా తేకపోగా అమ్మేశాడు.
- అదే ముగ్గురు మరోసారి కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజి కార్ అంటూ నమ్మబలుకుతున్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత



సాక్షి, అమరావతి: 'ఏపీలో ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. చంద్రబాబుకు అనుకూలంగా ఈసీ పనిచేస్తున్నట్లు అనుమానం కలుగుతోంది' అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ఆవేదన వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఆన్ గోయింగ్ స్కీమ్స్‌గా ఉన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, చేయూత, విద్యాదీవెన పథకాల డబ్బులను లబ్ధిదారులకు అందకుండా ఈసీ అడ్డుకుందన్నారు. విద్యాదీవెన నిలిపివేయడం వల్ల రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద విద్యార్థులకు నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పథకాలను అడ్డుకోవడం దుర్మార్గం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్యానికి విలువనిచ్చి ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్.. రాష్ట్రంలో చంద్రబాబు కమిషన్ లాగా పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మండిపడ్డారు. పేదలను ఆదుకునే పథకాలను అడ్డుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు చూస్తే ఎన్నికల కమిషన్ విశ్వసనీయతపై అనుమానాలు వస్తున్నాయన్నారు.

అమల్లో ఉన్నవి ఆపడమేంటి?

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి ముందునుంచే అమలు చేస్తున్న పథకాలను ఎన్నికల సంఘం నిలుపుదల చేయాలనడం సరికాదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏటా మార్చి1, మార్చి 6న సీఎం జగన్ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన విడుదల చేస్తారని గుర్తు చేశారు. సీఎం జగన్ వ్యక్తిత్వాన్ని పదేపదే కించపరుస్తూ.. చంద్రబాబు చేస్తున్న దుర్మార్గపు వ్యాఖ్యలపైన, వ్యతిరేక కథనాలు ప్రచురిస్తున్న ఈనాడు పత్రికపైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని వైఎస్సార్‌సీపీ బృందం కోరింది. మంగళవారం వెలగపూడి సచివాలయంలో సీఈవో మీనాను కలిసి ఫిర్యాదు చేసింది.

బాబు, పవన్ డ్రామాలను గమనిస్తున్న ప్రజలు

వైఎస్సార్‌సీపీ నేత అడపా శేషు



సాక్షి, అమరావతి: ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఆడుతున్న డ్రామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ఓటుతో వారికి తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ నేత అడపా శేషు అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదలు, రైతుల భూములు దోచుకున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు ల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించి మాట్లాడే అర్హత అస్సలు లేదన్నారు. నిజంగా ఈ చట్టం ప్రజలకు నష్టం కలిగించేదే అయితే నిలిపివేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు చెప్పవచ్చు కదా.. అని ప్రశ్నించారు.

బీజేపీతో పొత్తు.. ఈసీపై ఒత్తిళ్లు

వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: చంద్రబాబు ఎన్నికల కోడ్‌ను సాకుగా చేసుకుని రాష్ట్రంలో పేదల పొట్టకొడుతున్నారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి మండిపడ్డారు. ఆయన మంగళవారం తాడే పల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు అధికారం అండ చూసుకుని ఈసీపై ఒత్తిళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అమల్లో ఉన్న పథకాల కింద ప్రజలకు డీబీటీ అందకుండా చంద్రబాబు కుట్రలు పన్నారని మండిపడ్డారు.బాబు ఫిర్యాదులతో డీబీటీ కింద పథకాల నిధుల విడుదలకు ఈసీ నిరాకరిస్తోందని, అది ఎన్నికల కమిషనా లేక ఎన్డీయే కమిషనా అనే అనుమానం కలుగుతోందన్నారు. వృద్ధాప్యంతో కదల్లేని పరిస్థితుల్లో ఉన్న వారికి వలంటీరతో పింఛన్ వారి ఇంటివద్దే అందిస్తుంటే, బాబు ఆయన ముఠా ఫిర్యాదులతో వాటిని అడ్డుకున్నారన్నారు. బాబు ఫిర్యాదులపై ఈసీ నిర్ణయం సమంజసం కాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోందన్నారు.

ఆ అవినీతిపరుడే గొప్పవాడయ్యారా?

గాజువాక ఎన్నికల సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్





కోరుకొండలో భవనాలపైకి ఎక్కి సీఎం జగన్ ప్రసంగం వింటున్న ప్రజానీకం

- పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని అన్నది ప్రధాని మోదీనే
- ఈ 2024 డ్రామాలో హామీలేమిటి?.. హోదా ఇస్తారా?
- ఐదేళ్లుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందంటే.. జగన్ అనే సీఎం ఒప్పుకోలేదు కాబట్టే
- తిట్టిన వారి చంక నెక్కే విద్యలో బాబు నిపుణుడు

సాక్షి, విశాఖపట్నం

పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా మార్చుకున్నారని స్వయంగా ప్రధాని మోదీ గత ఎన్నికల్లో ఆరోపించారు. మరిప్పుడు చంద్రబాబు ఎలా మంచోడయ్యాడో అర్థం కావట్లేదు. ప్రధాని మోదీ మాటలు వింటుంటే రాజకీయాలు ఇంత దిగజారిపోయాయా? అని బాధగా ఉంది. తిట్టిన వారి చంకనెక్కే విద్యలో చంద్రబాబు నిపుణుడు. మీ జగన్ ఆమోదం లేదు కాబట్టే విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఆగింది. గాజువాకలో పొరపాటున టీడీపీ గెలిచిందంటే.. ఎన్డీఏ గెలిచిందంటే స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఎవరూ ఆపడం సాధ్యం కాదు. ఎందుకంటే?.. వాళ్లు దీన్నే ఎన్నికల రిఫరెండంగా తీసుకుంటారు! స్టీల్ ప్లాంట్ అమ్మకానికి ప్రజలంతా మద్దతు తెలిపారు కాబట్టే టీడీపీ అభ్యర్థి, ఎన్డీఏ అభ్యర్థి గెలిచాడని చెబుతారు! ప్రతి ఒక్కరూ ఈ అంశాన్ని గుర్తు పెట్టుకోవాలని కోరుతున్నా. చంద్రబాబు, దత్తపుత్రుడు, మోదీ గారు కలసి ఆడుతున్న ఈ 2024 డ్రామాలో రాష్ట్ర ప్రజలకు వీరి హామీ ఏమిటి? అని అడుగుతున్నా. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని జట్టు కట్టారా? పోనీ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేయబోమని జట్టు కట్టారా?'' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సాయంత్రం విశాఖ జిల్లా గాజువాకలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు. ఆ వివరాలివీ..

అవినీతిపరుడని అన్న నోటితోనే..

విచిత్రం ఏమిటంటే.. మనం ఇంతగా అభివృద్ధి బాటలో కనిపిస్తుంటే నిన్న సభలో ప్రధాని మోదీ గారు చేసిన విమర్శలు చూస్తుంటే గత ఎన్నికల్లో చంద్రబాబు గురించి ఆయన ఏమన్నారో గుర్తు తెచ్చుకోమని కోరుతున్నా. పోలవరాన్ని ఏటీఎంలా మార్చుకున్న చంద్రబాబు గురించి, వెన్నుపోట్లు గురించి చెప్పలేదా? చంద్రబాబు అత్యంత అవినీతి పరుడని చెప్పిన నోటితోనే ఇవాళ ఇదే మోదీగారు మళ్లీ ఇవాళ బాబు తమ ఎన్డీఏ గూటికి వచ్చాడు కాబట్టి ఇంతకంటే గొప్పవాడు లేడంటున్నారు. అంటే.. రాజకీయాలు ఏ స్థాయికి దిగజారిపోయాయో గమనించాలని కోరుతున్నా. వారితో ఉంటే ఒకలా.. లేదంటే మరోలా మాటలు మారుస్తున్నారంటే రాజకీయాలు ఏ స్థాయికి దిగజారిపోయాయో గమనించాలి. చంద్రబాబు, దత్తపుత్రుడు, మోదీ గారు కలిసి ఆడుతున్న ఈ 2024 డ్రామాలో రాష్ట్ర ప్రజలకు వీరి హామీ ఏమిటి? అని అడుగుతున్నా. ప్రత్యేక హోదా ఏమైనా ఇస్తామని జట్టు కట్టారా? పోనీ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేయబోమని జట్టు కట్టారా?

జగన్ ఆమోదం లేదు కాబట్టే ఆగింది..

మీ జగన్ ఆమోదం లేదు కాబట్టే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం వెనకడుగు వేసింది. ఐదేళ్లుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగలేదంటే దానికి కారణం జగన్ అనే ముఖ్యమంత్రి ఒప్పుకోలేదు కాబట్టే! ప్రతి ఒక్కరూ దీన్ని గమనించాలని కోరుతున్నా. స్టీల్ ప్లాంట్ విక్రయాన్ని ఆపేలా ఈ ఎన్నికల్లో ఆ బాబు, దత్తపుత్రుడు, బీజేపీ కూటమిని ఓడించి నా తమ్ముడు అమర్‌కు ఓటు వేసి మొత్తం దేశానికి ఒక గట్టి మెసేజ్ ఇక్కడ నుంచి పంపాలని కోరుతున్నా.

రెండు బిల్డింగ్‌లు కడితే రైల్వే జోన్ కాదు..

రైల్వే జోన్‌కు మనం భూములు ఇచ్చినా కూడా కావాలని అవి తీసుకోకుండా లిటిగేషన్ పెడుతున్నారు. రైల్వే జోన్‌కు అర్థం.. ఆర్థికంగా నిలబడగలిగిన జోన్ అని. కేవలం రెండు బిల్డింగులు కట్టి మమ.. అనిపించడం వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదు. ఇవాళ వీళ్లు మనమీద చూపిస్తున్నది దొంగ ప్రేమేనని గమనించాలని కోరుతున్నా. తిట్టిన వారి చంకనెక్కడం లాంటి విద్యల్లో చంద్రబాబు నిపుణుడు.

గాజువాకలో టీడీపీకి ఓటు.. స్టీల్ ప్లాంట్ అమ్మకానికి ఓటేసినట్టే

గాజువాకలో మీరు టీడీపీకి ఓటు వేయడం అంటే దాని అర్థం.. ప్రైవేటైజేషన్ చేస్తామని అంటున్న ఎన్డీఏకి ఓటు వేయడమే. అంటే.. స్టీల్ ప్లాంట్ అమ్మకానికి మీరే ఆమోదం తెలిపినట్లు అవుతుందని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోమని కోరుతున్నా. గాజువాకలో పొరపాటున టీడీపీ గెలిచిందంటే, ఎన్డీఏ గెలిచిందంటే.. స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపడం సాధ్యం కాదు. దీన్ని రిఫరెండంగా తీసుకుంటారు. ఆ తర్వాత దీన్ని ఆపడానికి జగన్ ఎంత ప్రయత్నం చేసినా "నీకెందుకయ్యా బాధ? వాళ్లకు లేని బాధ నీకెందుకు? ఎన్డీఏకి ఓటు వేశారంటే స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వారంతా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే కదయ్యా..! మరి నీకెందుకయ్యా బాధ?" అని అంటారని గుర్తు పెట్టుకోండి.

ప్రభుత్వ పాఠశాలల్లో యూత్ పార్లమెంట్ పోటీలు

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులతో ఏటా 'యూత్ పార్లమెంట్ పోటీలు' నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రజాస్వామ్య మూలాలను బలోపేతం చేయడం, క్రమశిక్షణ, ఇతరుల అభిప్రాయాలను సహనంతో వినడం, ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడం, పార్లమెంటు పనివిధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇందుకోసం భారత ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్థిక సహాయం అందిస్తారని పేర్కొన్నారు. యూత్ పార్లమెంట్ పోటీల సమగ్ర సమాచారం https://mpa.gov.in/activities/youth-parliament వెబ్‌సైట్‌లో ఉందని సూచించారు. కాగా, యూత్ పార్లమెంట్ పోటీలు నిర్వహణ నోడల్ అధికారిగా ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్ రెడ్డిని నియమించారు.

ఆన్‌లైన్‌లో మాత్రమే మెడికల్ బిల్లుల నమోదు

విద్యాశాఖలో రిటైరైన ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రతిపాదనలను బుధవారం నుంచి డీడీవోల ద్వారా సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులు, ప్రభుత్వ యాజమాన్యంలో పదవీ విరమణ చేసిన గెజిటెడ్ ఉద్యోగులైన డీఈవోలు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారులు, అసిస్టెంట్ డైరెక్టర్లు, ఎంఈవోలు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులైన సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్స్ బిల్లులు డీడీవోల ద్వారా www.cse. ap.gov.in పోర్టల్‌లో మాత్రమే సమర్పించాలని సూచించారు. ఈ మేరకు ఆర్జేడీలు, డీఈవోలు డీడీవోలకు తగిన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.

అభిమాని ప్రేమ.. స్వర్ణ ఫ్యాన్



పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బంగారు ఆభరణాల తయారీ కార్మికుడు గొలితి ఈశ్వర్ స్వర్ణంతో ఫ్యాన్ తయారు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తన అభిమానాన్ని చాటుకున్నాడు. అర గ్రాము బంగారంతో తయారు చేసిన ఈ బుల్లి ఫ్యాన్‌ను భీమవరంలో మంగళవారం జరిగిన భీమవరం బులియన్ ధర్మకాటా అసోసియేషన్ సమావేశంలో ప్రదర్శించాడు.

– భీమవరం(ప్రకాశం చౌక్)

థర్డ్ డిగ్రీ, సాక్షులను కొట్టడం మీ డ్యూటీనా?

కస్టోడియల్ విచారణ విధుల్లో భాగమా?

- చెప్పిన విధంగా వాంగ్మూలం ఇవ్వాలని ఎలా ఒత్తిడి చేస్తారు?
- దర్యాప్తు అధికారి ఇలాగేనా వ్యవహరించాల్సింది?
- వివేకా హత్య కేసులో సీబీఐ అధికారి రామ్‌సింగ్ తీరును ఎండగట్టిన హైకోర్టు
- సునీత, రాజశేఖర్‌రెడ్డి, రామ్‌సింగ్‌ల పిటిషన్లపై ముగిసిన వాదనలు
- తీర్పు వాయిదా వేసిన న్యాయస్థానం



సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ తీరును హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. తాను చెప్పిన విధంగానే వాంగ్మూలం ఇవ్వాలని ఫిర్యాదుదారుడిపై రామ్‌సింగ్ ఎలా ఒత్తిడి చేస్తారని ప్రశ్నించింది. దర్యాప్తు అధికారి వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అంటూ నిలదీసింది. సాక్షులను కొట్టడం, థర్డ్ డిగ్రీ ఉపయోగించడం వంటివి చేయవచ్చా అంటూ సీబీఐ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)ని ప్రశ్నించింది. ఇలాంటి కస్టోడియల్ విచారణ చేయడం విధి నిర్వహణలో భాగమా అంటూ నిలదీసింది. పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రామ్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై వాదనలు విన్న హైకోర్టు విచారణను ముగించింది. తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వివేకా హత్య విషయంలో తాము చెప్పినట్లు వినకుంటే అంతు చూస్తామంటూ బెదిరించడమే కాకుండా తనను శారీరకంగా, మానసికంగా వేధించారంటూ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి గతంలో పులివెందుల కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు పులివెందుల పోలీసులు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రామ్‌సింగ్‌లపై కేసు నమోదు చేశారు. పులివెందుల కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ సునీత, రాజశేఖరరెడ్డి, రామ్‌సింగ్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన శ్రీనివాసరెడ్డి, పులివెందుల కోర్టులో విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు మంగళవారం మరోసారి విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా సునీత, రాజశేఖరరెడ్డి తరపు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ, మేజిస్ట్రేట్ యాంత్రికంగా ఉత్తర్వులిచ్చారన్నారు. పోలీసుల నుంచి నివేదిక కోరకుండా నేరుగా కేసు నమోదుకు ఆదేశాలివ్వడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. కేసు నమోదుకు జారీ చేసిన ఉత్తర్వుల్లో కారణాలను వెల్లడించలేదన్నారు.

సీబీఐ తరపున ప్రత్యేక పీపీ అనిల్ తన్వర్ వాదనలు వినిపిస్తూ.. పులివెందుల కోర్టు పరిధి దాటి ఉత్తర్వులిచ్చిందని అన్నారు. ఫిర్యాదుదారుడి నుంచి ప్రమాణపూర్వక వాంగ్మూలాన్ని నమోదు చేయకుండానే కేసు నమోదుకు ఆదేశాలిచ్చారని తెలిపారు. రామ్‌సింగ్ ఏం చేసినా విధి నిర్వహణలో భాగంగానే చేశారన్నారు. ఆ విధంగానే తన ముందు హాజరు కావాలని ఫిర్యాదుదారుడిని రామ్‌సింగ్ ఆదేశించారన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. సాక్షులను కొట్టడం, థర్డ్ డిగ్రీ ప్రయోగించడం వంటివి కూడా విధి నిర్వహణలో భాగమేనా అంటూ నిలదీశారు.

సుప్రీంకోర్టు దర్యాప్తు నుంచి రామ్‌సింగ్‌ను తప్పించింది

అనంతరం ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి తరపున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రామ్‌సింగ్‌పై తీవ్రమైన ఆరోపణలున్నాయన్నారు. అందుకే సుప్రీంకోర్టు ఆయన్ని వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు నుంచి తొలగించిందన్నారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వులు సరైనవేనని తెలిపారు. కారణాలను తెలియచేయాల్సిన అవసరం లేదన్నారు. ముందస్తు అనుమతి అవసరం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు తీర్పులను ప్రస్తావించారు.

నిబంధనల మేరకే మేజిస్ట్రేట్ వ్యవహరించారు

పోలీసుల తరపున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి, అదనపు పీపీ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి, స్పెషల్ అసిస్టెంట్ పీపీ సూరా వెంకట సాయినాథ్ వాదనలు వినిపించారు. ప్రైవేటు ఫిర్యాదుపై విచారణకు ఆదేశించే విషయంలో మేజిస్ట్రేట్ ఎలాంటి కారణాలను తెలియచేయాల్సిన అవసరం లేదన్నారు. నిబంధనలకు అనుగుణంగానే మేజిస్ట్రేట్ వ్యవహరించారని వివరించారు. మేజిస్ట్రేట్ కేసును విచారణకు స్వీకరించలేదని, దర్యాప్తునకు మాత్రమే ఆదేశించి తుది నివేదిక కోరారని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ కూడా దాఖలు చేశారన్నారు. అయితే కోర్టు ఈ చార్జిషీట్‌ను సాంకేతిక కారణాలతో రిటర్న్ చేసిందన్నారు. సీబీఐ అధికారి ప్రాసిక్యూషన్‌కు ముందస్తు అనుమతి అవసరం లేదన్నారు. ఏ దశలోనైనా అనుమతి తీసుకోవచ్చని తెలిపారు. అందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించారు.

నర్రెడ్డి సునీత, రాజశేఖర్‌రెడ్డి

చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు

- రక్తపు వాంతులని నేను చెప్పలేదు
- వివేకా లేఖ దాచిపెట్టమని చెప్పింది రాజశేఖరే
- అవినాశ్, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పేర్లు చెప్పాలని సీబీఐ అధికారి రామ్‌సింగ్ తీవ్రంగా కొట్టాడు
- సునీత, రాజశేఖర్ నన్ను హైదరాబాద్‌కు పిలిపించుకుని బెదిరించారు
- నా కుమారుడి వివాహాన్ని రద్దు చేయించారు
- వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి



పులివెందుల: నర్రెడ్డి సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి చాలా నీచంగా మాట్లాడుతున్నారని వైఎస్ వివేకానందరెడ్డి వద్ద పీఏగా పనిచేసిన కృష్ణారెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. నర్రెడ్డి దంపతులు ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినవనీ అబద్ధాలేనని తెలిపారు. కడుపుకు అన్నం తినేవాళ్లెవరూ ఇలా మాట్లాడరన్నారు. భార్యాభర్త రోజుకో అబద్ధపు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారన్నారు. నర్రెడ్డి బ్రదర్స్ నాటకాలాడుతున్నారని చెప్పారు. వైఎస్ వివేకా రక్తపు వాంతులతో చనిపోయాడని తాను నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డితో చెప్పలేదన్నారు. రూము మొత్తం రక్తపు మరకలున్నాయని, తలపైన గాయం ఉందని, బాడీ మొత్తం రక్తంలో ఉందని, సైడు వాకిలి, బెడ్ రూము వాకిలి తెరచి ఉన్నాయని, ఏసీ ఆన్‌లో ఉందని చెప్పానని తెలిపారు. రక్తపు వాంతులని ఎర్ర గంగిరెడ్డి అనగా, ఇంత రక్తం ఉంటే వాంతులంటావేమిటని తాను ఆయనతో వాదించానన్నారు. అలాంటిది రాజశేఖర్‌రెడ్డికి రక్తపు వాంతులని ఎలా చెబుతానని అన్నారు. అలాగే తాను వైఎస్ వివేకా లెటర్‌ను దాచిపెట్టడానికి ప్రయత్నం చేశానన్నారని, అదీ అబద్ధమేనని తెలిపారు. లెటర్ గురించి తాను రాజశేఖర్‌రెడ్డికి ఫోన్‌లో చెప్పగా ఆయనే దాచమన్నారని చెప్పారు. పోలీసులతో సమస్య కదా అని తాను అంటే ఆ విషయం ఆయనే చూసుకుంటానని చెప్పారన్నారు.

అవినాశ్‌రెడ్డి తనను మేనేజ్ చేశారనడం నిజం కాదన్నారు. నర్రెడ్డి దంపతులే తనను మేనేజ్ చేయాలని చూసి విఫలమయ్యారని చెప్పారు. లెటర్ దాచిపెట్టమని చెప్పిన వారిని కేసులో పెడతారని, కానీ వీరు అప్పట్లో ప్రభుత్వంలో ఉన్న టీడీపీ నాయకులతో కలిసి పోలీసులను మేనేజ్ చేసి తనను, మరో అమాయకుడైన ప్రకాష్‌ను కేసులో ఇరికించారన్నారు. తనది చిన్న ప్రాణం కాబట్టి ఇరికించారని, వారి కారణంగా తాను ఉద్యోగానికి 9 నెలలు సస్పెన్షన్‌కు గురయ్యానని, ప్రమోషన్, పాస్‌పోర్ట్ రెన్యువల్ ఆగిపోయాయన్నారు. తాను ఇప్పుడు 20 శాతం విషయాలే చెబుతున్నానని, మరలా మిగిలిన విషయాలు చెబుతానన్నారు.

తాను వైఎస్ వివేకా దగ్గర 37 సంవత్సరాలు ఏ జీతం తీసుకోకుండా పని చేశానని తెలిపారు. వివేకాను తాను చూసుకున్నట్లు వారి ఇంట్లో వారు కూడా చూసుకోలేదన్నారు. వివేకా తన ముందరే ఎన్నోసార్లు వారిని ఛీ కొట్టారని తెలిపారు. నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి, శివప్రకాష్‌రెడ్డి వారి బావ వివేకా ద్వారా కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారని, అయినా వారిలో ఆశ చావలేదన్నారు. వివేకా రెండో వివాహం కారణంగా వారికి ఆయనతో తీవ్ర మనస్పర్థలు వచ్చాయన్నారు. వివేకా రెండో భార్య షమీమ్ కుమారుడికి ఆస్తులు పోకుండా రాజకీయంగా వివేకా ద్వారా ఎదగాలని విఫలమై ఈ రోజు వేరేవారిపై నిందలు వేస్తున్నారన్నారు. గతంలో డ్రైవర్‌గా దస్తగిరిని తొలగిస్తేనే పులివెందుల వస్తానని వివేకాకు రాజశేఖర్ గట్టిగా చెప్పడంతో ఆయన తొలగించారన్నారు. ఇప్పుడు అదే దస్తగిరిని ముందర పెట్టుకుని వీరు నాటకాలు ఆడుతున్నారని అన్నారు.

రామ్‌సింగ్ చెప్పినట్లు వినాలని సునీత బెదిరించారు

ఓసారి సునీత దంపతులు తనను హైదరాబాద్‌కు పిలిపించుకొని, రామ్‌సింగ్ చెప్పినట్లు వినకపోతే కేసులో ఇరుక్కుంటావని బెదిరించారన్నారు. తాను అబద్ధం చెప్పనని కరాఖండిగా చెప్పానన్నారు. ఆ సమయంలో కృష్ణారెడ్డి మన మాట వినకపోతే నువ్వు కేసులో ఇరుక్కుంటావని రాజశేఖర్‌తో సునీత అన్నారని చెప్పారు. దీనికి అర్థమేమిటో మీడియా సోదరులే ఆలోచించుకోవాలని అన్నారు. ఎప్పటికైనా ఈ కేసులో రాజశేఖర్ జైలుకు వెళ్లక తప్పదన్నారు.

వారి ముగ్గురు పేర్లు చెప్పాలని రామ్‌సింగ్ కొట్టాడు

ఢిల్లీలో సీబీఐ అధికారి రామ్‌సింగ్ నెలరోజుల పాటు తనను తీవ్ర చిత్రహింసలకు గురిచేశాడన్నారు. హత్యలో వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి హస్తం ఉన్నట్లు సాక్ష్యం చెప్పాలని తీవ్రంగా కొట్టేవాడన్నారు. ఎంతకీ తాను ఒప్పుకోకపోవడంతో వదిలేశారన్నారు. ఆ తర్వాత ఒకరోజు రామ్‌సింగ్ వాట్సప్ కాల్ చేసి తన కుమారుడిని తీసుకొని కడపకు రమ్మని చెప్పాడన్నారు. తామిద్దరం మరుసటిరోజు రామ్‌సింగ్ వద్దకు వెళ్లగా, వివేకా హత్యలో అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డిల హస్తం ఉన్నట్లు చెప్పాలంటూ తన కుమారుడి ఎదుటే కట్టెతో కొట్టాడన్నారు. దస్తగిరి, రంగన్న చెప్పినట్లు విన్నారని, వారిని సేవ్ చేశామని, నువ్వు వినకపోతే కేసులో ఇరికిస్తామని చెప్పాడన్నారు. తన బెయిల్ రద్దు చేసి మళ్లీ జైలుకు పంపిస్తామని బెదిరించాడన్నారు. తాను అబద్ధం చెప్పనని గట్టిగా చెప్పడంతో పంపించేశాడన్నారు. కృష్ణారెడ్డి మాట వినలేదని సునీత దంపతులకు రామ్‌సింగ్ చెప్పగా.. తన కుమారుడితో వివాహం కుదుర్చుకున్న గుంటూరుకు చెందిన మా వియ్యంకుడికి సునీత ఫోన్ చేసి కృష్ణారెడ్డిని ఏ క్షణమైనా అరెస్టు చేయిస్తామని, ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని, వివాహం రద్దు చేసుకోవాలని బెదిరించారని, దీంతో వారు భయపడి వివాహం రద్దు చేసుకున్నారని తెలిపారు.

నాకేదైనా జరిగితే వారిదే బాధ్యత

తనకు ఇప్పటికీ కొంతమంది నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, వారి పేర్లు త్వరలో బయటపెడతానన్నారు. తన ప్రాణానికి ముప్పు ఉందని, తనకు ఏదైనా జరిగితే సునీత, రాజశేఖర్, శివప్రకాష్‌రెడ్డిలే బాధ్యులవుతారని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారు స్పందించకపోవడంతో కోర్టు ద్వారా పోరాటం చేస్తున్నానన్నారు. కేవలం రాజకీయ ఎదుగుదల కోసం సునీత దంపతులు అవినాశ్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని కృష్ణారెడ్డి తెలిపారు.

ప్రపంచంలో చాలామంది ఒకే తరహా పనిని ఏళ్లుగా చేస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కొందరు మాత్రం ఏకకాలంలో ఎన్నో పనులు చేస్తూ సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు ఇందు గుర్జార్. జైపూర్‌వాసి అయిన 32 ఏళ్ల ఇందు గుర్జార్ సింగిల్ పేరెంట్‌గా తన తొమ్మిదేళ్ల కూతురును చూసుకుంటూ, బ్యాంకు ఉద్యోగం చేస్తూ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా, మౌంటెనీర్ బైకర్‌గా గుర్తింపు తెచ్చుకుంటోంది. సవాళ్లను అధిగమిస్తూ ఇందు చేస్తున్న ప్రయత్నం ఒడిదొడుకులను ఎదుర్కొనేవారికి స్ఫూర్తిగా నిలుస్తుంది.


ఇందు గుర్జార్

ఉండాల్సింది ధైర్యం మాత్రమే!

''సమస్యలు వచ్చేదే మనలోని శక్తిని గుర్తించడానికి. ధైర్యం తెచ్చుకొని ప్రయత్నిస్తే తిరిగి మనకో కొత్త జీవితం ఏర్పడుతుంది. నా చిన్నతనంలో మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మా నాన్నకు టీ కొట్టు ఉండేది. కానీ, దాని నుంచే ఆయన తన కొడుకులలో ఒకరిని డాక్టర్‌ని చేసి, మా అందరికీ ఉత్తమవిద్యను అందించడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. చిన్ననాటి నుంచి క్రీడలంటే చాలా ఆసక్తి. రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ ఆడాను. కాలేజీలో స్పోర్ట్స్ ఆప్షన్ లేకపోవడంతో నా ఇష్టాన్ని అక్కడితో వదిలేయాల్సి వచ్చింది.

■ గృహహింస

మా కమ్యూనిటీలో అమ్మాయిలకు పెళ్ళిళ్లు త్వరగా చేస్తారు. కానీ, నా తల్లిదండ్రుల సహకారంతో గ్రాడ్యుయేషన్ వరకు చదువుకున్నాను. ఆ వెంటనే పెళ్లి చేశారు. పెళ్లి నా జీవితాన్ని విచ్ఛిన్నం చేసింది. బిడ్డను కనాలని, వరకట్నం తేవాలని... ప్రతిరోజూ ఏదో ఒక విషయం మీద నరకం చూసేదాన్ని. అత్తింటివాళ్లు నా తల్లిదండ్రులకు నా మీద ఏవేవో చాడీలు చెప్పేవారు. పాప పుట్టిన తర్వాత పుట్టింటి నుండి తిరిగి అత్తవారింటికి వెళ్లడానికి భయపడ్డాను. కానీ, పెద్దవారిని కూర్చోబెట్టి, ఒప్పించి తిరిగి తీసుకెళ్లారు. కానీ, అక్కడి పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. నెల రోజుల వ్యవధిలోనే మా అత్తింటిని వదిలి, తిరిగి పుట్టింటికి వచ్చేశాను. ఏడాది కాలం పుట్టింట్లోనే ఉన్నాను. పరిస్థితుల్లో మార్పు రాదని గ్రహించి, విడాకులకు కోర్టులో కేసు వేశాను. ఒంటరిగా బిడ్డను పెంచడం నాకు అంత తేలికైన పనికాదు. ఇంటి నిర్వహణకు, నా ఇష్టాలను నెరవేర్చుకోవడానికి ఇంధనం అవసరం. ఆ మనోవర్తి రూపంలో ఆ ఇంధనం రాబట్టుకోవడం కోసం ఏడేళ్లపాటు విడాకుల కేసుపై



పోరాడుతూనే ఉన్నాను. కానీ, న్యాయం జరగలేదు.

■ డిప్రెషన్ నుంచి కోలుకొని...

ఆటుపోట్లతో ఉన్న జీవితాన్ని చూసి చాలా బాధపడేదాన్ని. ఒక వ్యక్తి జీవితంలో చెడుకాలం వచ్చినప్పుడు పరిస్థితుల ముందు లొంగిపోతాడు. కానీ, నాకు నేనుగా ఏదైనా లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలనుకున్నాను. బ్యాంకు ఉద్యోగం సంపాదించుకొని, నాకు నేనుగా జీవించడం మొదలుపెట్టాను.



■ ఫిట్‌గా ఉండేందుకు..

ఉద్యోగం చేయడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే కోవిడ్ వచ్చింది. మొదటి వేవ్‌లో కరోనా బాధితురాలిని అయ్యాను. వాడిన మందుల వల్లనేమో కోవిడ్ తర్వాత బరువు పెరగడం మొదలైంది. దీంతో ఫిట్‌గా ఉండేందుకు రోజూ రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసేదాన్ని. ఆ తర్వాత స్టేడియంకు వెళ్లడం మొదలుపెట్టాను. అక్కడ సైక్లిస్టుల బృందాన్ని కలిశాను. ఆ క్రీడలో పాల్గొనడానికి వయోపరిమితి ఏమీ లేదని తెలిసింది. దాంతో నాలో చిన్న ఆశ కలిగింది. బహుశా విధి నాకు అలాంటి అవకాశం ఇచ్చింది అనుకున్నాను. మొదట్లో రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసే నేను ఈ రోజు 50– 100 కిలోమీటర్లు తిరుగుతున్నాను. యూసీఐ (ఇంటర్నేషనల్ సైకిలిస్ట్ యూనియన్) ఎలిమినేటర్ ప్రపంచకప్‌లో పాల్గొన్నాను. ఎన్నో పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొని, అంతర్జాతీయ సైక్లిస్టులను కలిశాను.

■ పర్వత బైకర్‌గా...

వృత్తిరీత్యా బ్యాంకర్‌గానే కాకుండా మూడేళ్లుగా మౌంటెన్ బైకర్‌గా కూడా ఉన్నాను. పర్వతాల్లో చేసే సాహసోపేతమైన పోటీల్లో విజేతగా నిలుస్తుండేదాన్ని. ఆ పోటీలు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేవి. రెండేళ్ల క్రితం లదాఖ్‌లోని లేహ్‌లో జరిగిన యుసిఐ ఎలిమినేటర్ ప్రపంచ కప్‌లో ఎలైట్ మహిళల విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపించింది.

■ శక్తిని గుర్తించాలి..

నా కూతురికి ఇప్పుడు తొమ్మిదేళ్లు. ఆమె కూడా క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నాను. అందుకు ట్రెనింగ్ కూడా ఇప్పిస్తున్నాను. చదువుతోపాటు టాలెంట్‌ను కూడా గుర్తించి, దానిని మెరుగుపరచుకునే ప్రయత్నం చేయాలని అమ్మాయిలకు చెబుతుంటాను. ఈ నెల పదిన జరిగే రేస్‌లో పాల్గొంటున్నాను. గెలుపు – ఓటమి, విజయం – అపజయం అని చింతించకుండా 100 శాతం శక్తినీ, సామర్థ్యాన్నీ వినియోగించి లక్ష్యాన్ని సాధించి, ఫలితాన్ని భగవంతునికే వదిలేయాలి. ఇంకో విషయం.. ఏదైనా కొత్తగా చేయడానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా విజయం సాధించవచ్చు. మీకుండాల్సింది ధైర్యం మాత్రమే'' అంటుంది ఇందు.

స్ఫూర్తి

పరీక్షల సీజన్ వస్తే రమా పద్మనాభన్ ఇంటి వ్యవహారాలను పెద్దగా పట్టించుకోదు. పెళ్లిళ్లు, ప్రయాణాలు అసలే ఉండవు. ఆమె తనకు వచ్చే కాల్స్‌ను అటెండ్ చేసే పనిలో ఉంటుంది. 'అక్కా.. ఈ ఎగ్జామ్ రాయాలి' 'ఆంటీ... ఈ డేట్‌న ఎంట్రన్స్ ఉంది' ఇలా దివ్యాంగులు ఆమెకు కాల్స్ చేస్తుంటారు. వారి కోసం ఆమె పరీక్ష హాల్‌కు వెళ్లి వారి ఆన్సర్స్‌ను రాసి పెడుతుంటుంది. 'ఇది గొప్ప తృప్తినిచ్చే సేవ' అంటోందామె.


ఓ దివ్యాంగుడికి పరీక్ష రాసిపెడుతున్న రమా పద్మనాభన్

పరీక్షా కాలంలో పలికే చేయి

చదువుకునే రోజుల్లో ఎవరైనా పరీక్షలు రాయవచ్చు. చదువు అయిపోయాక ఏవైనా కోర్సులు సరదాగా చదివితే పరీక్షలు రాయవచ్చు. కాని రమా పద్మనాభన్ అలా కాదు. ఆమె ప్రతి ఆరు నెలలకు విద్యార్థులకు సెమిస్టర్ ఎగ్జామ్స్ జరిగినప్పుడల్లా 50 పరీక్షలు రాస్తుంది. అంటే రాసి పెడుతుంది. గత పదకొండేళ్లుగా ఆమె అలా చేస్తూనే ఉంది. దివ్యాంగులకు పరీక్షలు రాసి పెట్టే స్క్రయిబ్‌గా ఆమెకు కోయంబత్తూరులో ఉండే పేరు అలాంటిది.

గృహిణిగా ఉంటూ...

కోయంబత్తూరుకు చెందిన రమా పద్మనాభన్ సైకాలజీలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత 'గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్'లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చదివింది. భర్త ఫైనాన్షియల్ సెక్టార్‌లో పని చేస్తాడు. ఆమెకు ఇద్దరు అబ్బాయిలు. గృహిణిగా పిల్లలను చూసుకుంటూ కాలం గడుపుతున్న రమా పద్మనాభన్ జీవితం 2013లో మారింది. 'ఆ రోజు నేను యోగా క్లాసుకు బయలుదేరాను. నా స్నేహితురాలి నుంచి 'ఒక అంధ విద్యార్థికి పరీక్ష రాసి పెడతావా?' అనే విన్నపం వచ్చింది. అలా రాయగలనా అనుకున్నాను. పరీక్ష కేంద్రం దగ్గరే కనుక ట్రై చేద్దామనిపించింది. వెళ్లి రాసి పెట్టాను. పరీక్ష ముగిశాక ఆ అంధ విద్యార్థి ముఖంలో కనిపించిన కృతజ్ఞత నాకు ఎంతో మనశ్శాంతిని ఇచ్చింది. ఆ తర్వాత నాకు కాల్స్ రావడం మొదలైంది. కోయంబత్తూరులో లూయిస్ బ్రెయిలీ అకాడెమీ ఉంది. వాళ్లు కాల్ చేస్తూనే ఉంటారు. వీరు కాకుండా దివ్యాంగులు, ఆటిజమ్ విద్యార్థులు... వీరు పెన్ పట్టి పరీక్ష రాయడం కష్టం. వారికి పరీక్షలు రాసి పెడుతుంటాను' అని తెలిపింది రమా పద్మనాభన్.



అంతా ఉచితమే

దివ్యాంగులకు, అంధులకు పరీక్షలు రాసేందుకు రమ ఎటువంటి రుసుమూ తీసుకోదు. పరీక్షా కేంద్రానికి కూడా సొంత ఖర్చులతోనే వెళ్లి వస్తుంది. 'అయితే అందుకు నా భర్తను అభినందించాలి. నీ డబ్బులు ఖర్చు పెట్టి వేరొకరి పరీక్షలు ఎందుకు రాస్తున్నావు అని ఎప్పుడూ అడగలేదు' అంటుంది రమ. 'అంధ విద్యార్థులు తమకు పరీక్షలు రాసి పెట్టే వారు లేరని తెలిస్తే చాలా టెన్షన్ పడతారు. ఆబ్సెంట్ అయితే పరీక్ష పోతుంది. అందుకే వారికి స్క్రయిబ్‌లు కావాలి. వారు చెబుతుంటే జవాబులు సరిగ్గా రాయగలగాలి. నేను ఆటిజమ్ విద్యార్థులకు రాసి పెట్టేటప్పుడు మరింత శ్రద్ధగా ఉంటాను. వారు సమాధానాలు కంటిన్యూస్‌గా చెప్పడంలో ఇబ్బంది పడతారు. ప్రోత్సహిస్తూ రాబట్టాలి. అదే కాదు హైస్కూల్ పాఠాల దగ్గరి నుంచి ఇంజినీరింగ్ పాఠాల వరకూ అవగాహన ఉండాలి. అందుకే ఆ పాఠాలు కూడా తెలుసుకుంటూ ఉంటాను. స్క్రయిబ్‌గా నేను మారేటప్పటికి నా పిల్లలు చిన్నవాళ్లు. నా చిన్నకొడుకుకైతే ఐదారేళ్లవాడు. ఇంటిదగ్గర వాణ్ణి ఒక్కణ్ణే వదిలి తాళం వేసుకుని పరీక్ష రాసి పెట్టిన సందర్భాలున్నాయి' అని తెలిపిందామె.

కొనసాగే అనుబంధం

'నేను రాసిన పరీక్షలతో కోర్సులు పాసై ఉద్యోగాలు పొందిన దివ్యాంగులు చాలా మంది ఉన్నారు. వాళ్లంతా నా కాంటాక్ట్‌లో ఉంటారు. తమ జీవితంలో సాధిస్తున్న ప్రగతిని తెలియజేస్తుంటారు. అదంతా వింటుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. జీవితానికి ఒక అర్థం దొరికినట్టు ఉంటుంది. నా పెద్దకొడుకు సీనియర్ ఇంటర్‌కు వచ్చాడు. వాణ్ణి వీలున్నప్పుడల్లా స్క్రయిబ్‌గా పని చేయడానికి పంపుతున్నా. వాడు ఆ పని చేస్తున్నందుకు ఎంత సంతోషపడుతున్నాడో చెప్పలేను' అని ముగించింది రమా పద్మనాభన్.

యూత్ పల్స్

విద్యాప్రమాణాలు మెరుగుపడడం, కొత్త రంగాలు ఉనికిలోకి రావడం వల్ల 'ఉద్యోగమే సర్వస్వం' 'ఉద్యోగం దొరికితే చాలు' అనుకోవడం లేదు యువతరంలో చాలామంది. దీనికి కారణం...ప్రత్యామ్నాయ అవకాశాలు. 'ఉద్యోగం ఎందుకు చేయాలి?' నుంచి 'చేస్తే ఎలాంటి ఉద్యోగం చేయాలి' వరకు కెరీర్ బాట పట్టడానికి ముందు రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నారు. మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

నవతరం... ఉద్యోగ పర్వం



44 దేశాల్లో మిలీనియల్స్, జెన్ జెడ్‌పై సర్వే చేసింది డెలాయిట్. దీని ప్రకారం ప్రైమరీ జాబ్‌తోపాటు మరో జాబ్ చేస్తున్న యువ ఉద్యోగుల సంఖ్య తక్కువేమీ కాదు. బెంగళూరులో ఒక ప్రైవేట్ కాలేజీలో పని చేస్తున్న పరిమళ ఆన్‌లైన్‌లో వ్యాపారం కూడా చేస్తుంటుంది.

'డబ్బు కోసం కాదు. అదొక ప్యాషన్' అంటుంది తన ఆన్‌లైన్ వ్యాపారం గురించి.

లింక్డ్ ఇన్ సర్వే ప్రకారం 2023లో మన దేశంలో 88 శాతం మంది జెన్ జెడ్ ఉద్యోగులు 'ఉద్యోగ మార్పు'నకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జెన్ జెడ్ ఉద్యోగులపై ఆర్పీజీ గ్రూప్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పదిమందిలో ఆరుగురు మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

'పని ఒత్తిడి వచ్చినట్లు భరించాల్సిందే' అని రాజీ పడడం కంటే 'జీతం తక్కువ అయినా సరే నాకు నచ్చిన ఉద్యోగం చేస్తాను' అని ఆలోచిస్తున్న వారి సంఖ్య యువతరంలో ఎక్కువగానే ఉంది.

ముంబైలోని ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం చేసిన అనన్యకు పనిభారంతో ఊపిరాడేది కాదు. ఒక ఫైన్ మార్నింగ్ 'ఇది కాదు జీవితం' అనిపించింది. తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తోంది. 'నేను పని చేస్తున్న కంపెనీతో పోల్చితే ఇది చాలా చిన్న ఉద్యోగం కావచ్చు. కాని ఎంతో సంతోషంగా ఉంది' అంటుంది అనన్య.

ఒక మార్కెటింగ్ సంస్థలో ఉద్యోగం చేసిన ఇరవై సంవత్సరాల సారా బోహ్రా ఆ ఉద్యోగం మానేసి సొంతంగా మార్కెటింగ్ ఫర్మ్ మొదలుపెట్టింది. వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. 'ఇప్పుడు చాలా సౌకర్యంగా ఫీలవుతున్నాను. పని ప్రకారం కాదు గంటల ఆధారంగా ప్రొడక్టివిటీని కంపెనీలు అంచనా వేస్తున్నాయి' అంటుంది సారా.

తీయటి పాఠాలు

రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్శిటీలో బీబీఏ డిగ్రీ పూర్తి చేసిన అనువ కక్కర్ ఉద్యోగం కంటే సొంత స్టార్టప్‌కే ప్రాధాన్యత ఇచ్చింది. అయితే కస్టమైజ్డ్ పోస్టర్ కార్డ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ బిజినెస్‌లో ఫెయిల్ అయింది. అయితే ఈ ఫెయిల్యూర్ నుంచి పాఠాలు నేర్చుకున్న అనువ 'టిగెల్' చాకోలెట్ బ్రాండ్‌తో సక్సెస్ అయింది. హాట్ చాక్లెట్+వింటర్= హ్యాపీనెస్ నినాదంతో చిన్న బడ్జెట్‌లో కంపెనీ మొదలు పెట్టింది. కస్టమర్ చాయిస్‌లను అర్థం చేసుకోవడంలో పట్టు సాధించింది. 'టిగెల్' స్టార్ట్ చేసినప్పుడు అనువ వయసు 21 సంవత్సరాలు. 'చిన్న వయసులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానం మొదలు పెట్టడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది' అంటుంది అనువ కక్కర్.



బెస్ట్ ప్లాన్ బెడిసి కొడితే?

'ఈ రంగంలో మాత్రమే పనిచేస్తాను అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏ రంగంలో పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. యాంత్రిక జీవితం కంటే ఉల్లాసకరమైన మార్పు చాలామంచిది' అంటుంది చెన్నైకి చెందిన శ్రీతేజ.

కోల్‌కత్తాకు చెందిన 23 సంవత్సరాల మనీష తన ఉద్యోగానికి సంబంధించి ఇప్పటికీ మూడు రంగాలు మారింది. అలా అని ఆమెలో పశ్చాత్తాపం ఏమీ లేదు.

'ఏ రంగంలో అయినా పనిచేయగలను అనే నమ్మకం వచ్చింది' అంటుంది మనీష.

వర్క్ నుంచి గ్యాప్ తీసుకోవాలనుకునే యువతరం కోసం ఈమధ్య కాలంలో ఎన్నో 'గ్యాప్ ఇయర్ కమ్యూనిటీస్' వచ్చాయి. 'గ్యాప్ ఎక్స్' పేరుతో హరియాణాలోని అశోకా యూనివర్శిటీలో 40 మంది స్టూడెంట్స్‌తో కూడిన గ్రూప్ ఉంది.

'యువతలో చాలామంది కెరీర్ మార్గాన్ని నిర్ణయించుకునే ముందు వివిధ అవకాశాల గురించి అన్వేషిస్తున్నారు. ఆలోచిస్తున్నారు' అంటున్నాడు ఢిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ దినేష్ సింగ్.

చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి నచ్చిన ఉద్యోగం చేయడం, సొంతంగా కంపెనీ మొదలుపెట్టడం, ఉద్యోగ విరామం తీసుకొని ఆన్‌లైన్ కోర్సులలో చేరడం వరకు తమదైన దారిలో ప్రయాణం చేస్తోంది నవతరం.

రంగుల ప్రపంచానికి ఆవల...

అదర్ సైడ్

● సోషల్ యాక్టివిస్ట్ ● ఫ్యాషన్ డిజైనర్ ● రైటర్ ● మోటివేషనల్ స్పీకర్

కరీనా కపూర్ అనగానే రంగుల ప్రపంచం కళ్ల ముందు ఆవిష్కారం అవుతుంది. అయితే ఈ అందాల నటికి మరో ప్రపంచం కూడా తెలుసు. స్త్రీ సాధికారత నుంచి మెన్‌స్ట్రువల్ హైజీన్ వరకు ఎన్నో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు వెళుతోంది. పేదింటి బిడ్డలతో మాట్లాడుతోంది. తాజాగా యూనిసెఫ్ ఇండియా నేషనల్ అంబాసిడర్‌గా నియామకం అయిన కరీనా కపూర్‌లో ఫ్యాషన్ డిజైనర్, రైటర్, మోటివేషనల్ స్పీకర్, సోషల్ యాక్టివిస్ట్ ఉన్నారు...


కరీనా కపూర్

ఉత్తమనటిగా సుపరిచితమైన కరీనా కపూర్ సృజనాత్మకమైన డిజైనర్ కూడా. క్లాతింగ్ రిటైలర్ 'గ్లోబస్'తో కలిసి పనిచేసింది. న్యూట్రిషనిస్ట్ రుజుత దివాకర్‌తో కలిసి తీసుకు వచ్చిన 'డోంట్ లూజ్ యువర్ మైండ్, లూజ్ యువర్ వెయిట్' పుస్తకం అమ్మకాల్లో రికార్డ్ సృష్టించింది. కరీనా కపూర్ వాయిస్‌తో ఈ పుస్తకం ఆడియో బుక్‌గా రావడం మరో విశేషం. 'ది స్టైల్ డైరీ ఆఫ్ బాలీవుడ్ దివా' పేరుతో తన జ్ఞాపకాల పుస్తకాన్ని తీసుకువచ్చింది. అదితి షా భీమ్జానీతో కలసి ప్రెగ్నెన్సీపై రాసిన పుస్తకం కమర్షియల్‌గా సక్సెస్ అయింది. రుజుత దివాకర్‌తో కలిసి న్యూట్రిషన్‌కు సంబంధించి 'ది ఇండియన్ ఫుడ్ విజ్‌డమ్ అండ్ ది ఆర్ట్ ఆఫ్ ఈటింగ్ రైట్' డాక్యుమెంటరీపై పనిచేసింది.

ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై వచ్చిన 'గర్ల్ రైజింగ్' అనే డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్‌కు వాయిస్–ఓవర్ ఇచ్చింది.

ఒకవైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ... పిల్లల విద్య, మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. మహిళలపై హింసను నిరోధించడానికి ఎన్‌డీ టీవి ప్రారంభించిన శక్తి క్యాంపెయిన్‌కు అంబాసిడర్‌గా పనిచేసింది. 2014 నుంచి బాలికల విద్యకు సంబంధించి యూనిసెఫ్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది. రాజస్థాన్, మహారాష్ట్రలోని పాఠశాలలకు వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. జాల్నా జిల్లాలో కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంది.

నిరుపేద పిల్లల చదువు కోసం షర్మిలా ఠాగుర్‌తో కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. చైల్డ్–ఫ్రెండ్లీ స్కూల్ అండ్ సిస్టమ్స్ (సీఎఫ్ఎస్ఎస్) ప్యాకేజీని లాంచ్ చేసింది. ఛత్తీస్‌ఘడ్‌లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ వీక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాగా చదివే పిల్లలు, పాఠాలు బాగా చెప్పే టీచర్‌లకు పురస్కారాలు అందజేసింది.

మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై యూనిసెఫ్ లక్నోలో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించింది. 'నవజాత శిశువులను కాపాడుకుందాం' పేరుతో కరీనా రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది. నవజాత శిశువులు, తల్లుల క్వాలిటీ హెల్త్ కేర్‌కు సంబంధించి 'ఎవ్రీ చైల్డ్ అలైవ్' అనే క్యాంపెయిన్‌ను నిర్వహించింది. మదర్స్ డే సందర్భంగా యూనిసెఫ్ ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో కరీనా ప్రధాన వక్త.

ప్రకృతి వైపరీత్య బాధితుల కోసం, ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థల కోసం నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంది కరీన. పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుదలకు సంబంధించిన అంశాలపై పనిచేసే స్వస్థ్ ఇమ్యునైజేషన్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసింది.

తాజా విషయానికి వస్తే...'నేషనల్ అంబాసిడర్‌గా యూనిసెఫ్‌తో నా అనుబంధం కొనసాగడం గౌరవంగా భావిస్తున్నాను. పిల్లల చదువు, హక్కుల కోసం నా గొంతు వినిపిస్తాను' అంటుంది కరీనా కపూర్.

'కరీనా కపూర్ ఎక్స్‌లెంట్ కమ్యూనికేటర్' అని కితాబు ఇచ్చింది యూనిసెఫ్.

> **చిన్న విజయం చాలు... పెద్ద సంతోషానికి**
>
> 
>
> సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో 'నేను ఎలా సాధించానంటే'లాంటి స్టోరీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రేస్ మొదలైంది. ఆ రేస్‌లో భాగంగా యువతరం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ రేసులో మెంటల్ హెల్త్ అనేది వెనక్కి వెళ్లిపోయింది. రేస్ అనేది శాంతి, సంతోషాల కోసం ఉండాలి. విద్యార్థులు తమ మానసిక శాంతిపై ఎక్కువ దృష్టి పెట్టాలి. చిన్న విజయాన్ని కూడా పెద్ద విజయంగా భావించుకోవాలి. 'ఇదీ ఒక విజయమేనా!' అనుకున్నప్పుడు అసంతృప్తి ఉంటుంది. అసంతృప్తి నుంచి అశాంతి జనిస్తుంది.
>
> – కరీనా కపూర్



వేలంలో మారడోనా గోల్డెన్ బాల్ ట్రోఫీ

అర్జెంటీనా దివంగత దిగ్గజ ఫుట్‌బాలర్ డీగో మారడోనా 1986లో గెల్చుకున్న 'గోల్డెన్ బాల్' ట్రోఫీ వేలానికి రానుంది. జూన్ 6వ తేదీన పారిస్‌లోని అగుటెస్ ఆక్షన్ హౌజ్‌లో మారడోనా గోల్డెన్ బాల్ ట్రోఫీ వేలం జరుగుతుందని, దీనికి కనీస ధరను ఇంకా నిర్ణయించలేదని వేలం నిర్వాహకులు తెలిపారు. మెక్సికో ఆతిథ్యమిచ్చిన 1986 ప్రపంచకప్ లో మారడోనా సారథ్యంలో అర్జెంటీనా విశ్వవిజేతగా నిలిచింది. ఈ టోర్నీలో మారడోనా ఐదు గోల్స్ చేయడంతోపాటు ఉత్తమ ప్లేయర్‌కు అందించే గోల్డెన్ బాల్ ట్రోఫీని సాధించాడు.

బంగ్లాదేశ్‌దే టి20 సిరీస్



జింబాబ్వేతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే బంగ్లాదేశ్ జట్టు 3-0తో సొంతం చేసుకుంది. చట్టోగ్రామ్‌లో మంగళవారం జరిగిన మూడో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తొమ్మిది పరుగుల తేడాతో నెగ్గింది. మొదట బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 165 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ తౌహిద్‌హృదయ్ (38 బంతుల్లో 57 : 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), జాకిర్ అలీ (34 బంతుల్లో 44 : 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం జింబాబ్వే 20 ఓవర్లలో 9 వికెట్లకు 156 పరుగులు చేసి ఓడిపోయింది.

భారత బాక్సర్ల పసిడి పంచ్


ప్రీతి

అస్తానా (కజకిస్తాన్): ఆసియా అండర్-22 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు ఏడు స్వర్ణ పతకాలు సాధించారు. మహిళల విభాగంలో ప్రీతి (54 కేజీలు), పూనమ్ పూనియా (57 కేజీలు), ప్రాచి (63 కేజీలు), ముస్కాన్ (75 కేజీలు)... విశ్వనాథ్ సురేశ్ (48 కేజీలు), నిఖిల్ (57 కేజీలు), ఆకాశ్ గోర్ఖా (60 కేజీలు) పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు. ఫైనల్స్‌లో ప్రీతి 3-0తో బజరోవా ఎలీనా (కజకిస్తాన్)పై, పూనమ్ 4-1తో సకిష్ అనెల్ (కజకిస్తాన్)పై, ప్రాచి 4-1తో అనర్ తుసిన్‌బెక్ (కజకిస్తాన్)పై, ముస్కాన్ 3-2తో జకిరోవా అజీజియా (ఉజ్బెకిస్తాన్)పై గెలిచారు. విశ్వనాథ్ సురేశ్ 5-0తో కరాప్ యెర్నర్ (కజకిస్తాన్)పై, సబీర్ యెర్బోలత్ (కజకిస్తాన్)పై నిఖిల్, ఆకాశ్ 4-1తో రుస్లాన్ (కజకిస్తాన్)పై విజయం సాధించారు. ఓవరాల్‌గా ఆసియా అండర్-22, యూత్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు 12 స్వర్ణాలు, 14 రజతాలు, 17 కాంస్యాలతో కలిపి మొత్తం 43 పతకాలు సంపాదించారు.

హర్మీత్-యశస్విని జోడీ పరాజయం

జిద్దా: సౌదీ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) డబుల్స్ విభాగాల్లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో హర్మీత్ దేశాయ్-యశస్విని ద్వయం క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించగా... మహిళల డబుల్స్‌లో ఐహిక ముఖర్జీ-సుతీర్థ ముఖర్జీ జోడీ...పురుషుల డబుల్స్‌లో మానవ్-మనుష్ జంట ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాయి. హర్మీత్-యశస్విని 19 నిమిషాల్లో 6-11, 10-12, 4-11తో వాంగ్ చుకిన్-సన్‌యింగ్‌షా (చైనా) చేతిలో ఓటమి పాలయ్యారు. ఐహిక-సుతీర్థ 11-6, 9-11, 12-10, 6-11, 8-11తో మియు నాగసాకి (జపాన్)-కిమ్ నయోంగ్ (కొరియా) చేతిలో... మానవ్-మనుష్ 20-18, 4-11, 6-11, 11-9, 7-11తో లుబోమిర్ పిస్టెజ్ (స్లొవేకియా)-చాన్ బాల్డ్‌విన్ (హాంకాంగ్) చేతిలో పరాజయం పాలయ్యారు. హర్మీత్-యశస్వినిలకు 3,500 డాలర్ల (రూ. 2 లక్షల 92 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 పాయింట్లు లభించాయి. ఐహిక-సుతీర్థలకు 2,000 డాలర్లు (రూ. 1 లక్ష 66 వేలు), 175 పాయింట్లు... మానవ్-మనుష్‌లకు 2,000 డాలర్లు (రూ. 1 లక్ష 66 వేలు), 175 పాయింట్లు దక్కాయి.




లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం జరిగిన మూడో దశ పోలింగ్‌లో తన భార్య, శాసన సభ్యురాలు రివాబాతో కలిసి గుజరాత్‌లోని జామ్ నగర్‌లో ఓటు వేసిన భారత స్టార్ క్రికెటర్ రవీంద్ర జడేజా

రోహిత్ తెలివైన కెప్టెన్: యువీ



న్యూఢిల్లీ: వచ్చే నెలలో అమెరికా-వెస్టిండీస్‌లలో జరిగే టి20 ప్రపంచకప్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ టీమిండియాను సమర్థంగా నడిపిస్తాడని భారత మాజీ స్టార్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తెలిపాడు. 'అనుభవజ్ఞుడైన రోహిత్ తెలివైన కెప్టెన్. ఎంత ఒత్తిడిలో ఉన్నా సరైన నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట. మంచి మనసున్న వ్యక్తిత్వం అతనిది. ఎంతగా ఎదిగినా ఒదిగిఉండే మనస్తత్వమే రోహిత్‌ను గొప్ప నాయకుడిగా మలిచింది. అందుకే నేను అతని చేతుల్లో ప్రపంచకప్‌ను, మెడలో స్వర్ణ పతకాన్ని చూడాలని గట్టిగా కోరుకుంటున్నాను' అని టి20 ప్రపంచకప్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న యువరాజ్ వ్యాఖ్యానించాడు.

ఢిల్లీ రేసులోకొచ్చింది!

20 పరుగుల తేడాతో రాజస్తాన్‌పై విజయం

- చెలరేగిన ఫ్రేజర్, పోరెల్
- సామ్సన్ పోరాటం వృథా


పోరెల్, ఫ్రేజర్

న్యూఢిల్లీ: జోరుమీదున్న రాజస్తాన్ రాయల్స్‌పై కీలకమైన విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ రేసులో పడింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ పోరులో ఢిల్లీ 20 పరుగుల తేడాతో గెలిచింది. ఆరో విజయంతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. ఓపెనర్లు జేక్ ఫ్రేజర్ మెగర్క్ (20 బంతుల్లో 50; 7 ఫోర్లు; 3 సిక్స్‌లు), అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 65; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసి ఓడింది. కెప్టెన్ సంజూ సామ్సన్ (46 బంతుల్లో 86; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. ఖలీల్, ముకేశ్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ తలా 2 వికెట్లు తీశారు.

4,4,4,6,4,6...

ఓపెనర్లు ఫ్రేజర్, పోరెల్ ఒకరి తర్వాత ఒకరు రాయల్స్ బౌలర్లను చితగ్గొట్టారు. ముందుగా ఫ్రేజర్... బౌల్ట్ వేసిన మూడో ఓవర్లో ఒక సిక్స్, 2 బౌండరీలతో 15 పరుగులు రాబట్టాడు. అవేశ్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో 4, 4, 4, 6, 4, 6లతో 28 పరుగులు పిండుకోవడంతో ఫ్రేజర్ ఫిఫ్టీ 19 బంతుల్లోనే పూర్తయ్యింది. అతని దూకుడును అశ్విన్ తన తొలి ఓవర్లోనే అడ్డుకున్నాడు. అనంతరం అక్షర్ పటేల్ అండతో పోరెల్ బాదడం మొదలుపెట్టాడు. 9వ ఓవర్లో జట్టు స్కోరు వందకు చేరింది. మరుసటి ఓవర్లోనే అక్షర్ (15)ను అశ్విన్ బోల్తా కొట్టించగా, పోరెల్ సిక్సర్‌తో 28 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. వరుస ఓవర్లలో పోరెల్‌ను అశ్విన్... రిషభ్ పంత్ (15)ను చహల్ పెవిలియన్ పంపారు. మిడిలార్డర్‌లో స్టబ్స్ (20 బంతుల్లో 41; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో ఢిల్లీ 200 పైచిలుకు స్కోరు చేసింది.

కెప్టెన్ పోరాడినా...

క్లిష్టమైన లక్ష్యం ముందరుంటే ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (4), బట్లర్ (19) గట్టి పునాది వేయలేకపోయారు. ఈ దశలో కెప్టెన్ సామ్సన్, రియాన్ పరాగ్ (22 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు) అండతో రాయల్స్‌ను నడిపించాడు. 11వ ఓవర్లో జట్టు స్కోరు 100 పరుగులు దాటాక అదే ఓవర్ ఆఖరి బంతికి పరాగ్‌ను రసిఖ్ బౌల్డ్ చేశాడు. అయితే శుభమ్ దూబే వచ్చాక సామ్సన్ 28 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న సామ్సన్‌ను ముకేశ్ అవుట్ చేయడం రాజస్తాన్‌ను కుదిపేసింది. శుభమ్‌తో నాలుగో వికెట్‌కు 59 పరుగులు జోడించాక భారీ షాట్‌కు ప్రయత్నించి సామ్సన్ నిష్క్రమించగా... తర్వాత ఓవర్‌కు ఒకటి, రెండు చొప్పున వికెట్లను కోల్పోయిన రాయల్స్ ఓటమి పాలైంది.


సామ్సన్

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: ఫ్రేజర్ (సి) ఫెరీరా (బి) అశ్విన్ 50; పోరెల్ (సి) సందీప్ (బి) అశ్విన్ 65; షై హోప్ (రనౌట్) 1; అక్షర్ (సి) పరాగ్ (బి) అశ్విన్ 15; పంత్ (సి) బౌల్ట్ (బి) చహల్ 15; స్టబ్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సందీప్ 41; గుల్బదిన్ (సి) అశ్విన్ (బి) బౌల్ట్ 19; రసిఖ్ (రనౌట్) 9; కుల్దీప్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 1; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 221. వికెట్ల పతనం: 1-60, 2-68, 3-110, 4-144, 5-150, 6-195, 7-215, 8-221. బౌలింగ్: బౌల్ట్ 4-0-48-1, సందీప్ శర్మ 4-0-42-1, అవేశ్ 2-0-42-0, అశ్విన్ 4-0-24-3, పరాగ్ 2-0-17-0, చహల్ 4-0-48-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) అక్షర్ (బి) ఖలీల్ 4; బట్లర్ (బి) అక్షర్ 19; సామ్సన్ (సి) హోప్ (బి) ముకేశ్ 86; పరాగ్ (బి) రసిఖ్ 27; శుభమ్ (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 25; పావెల్ (బి) ముకేశ్ 13; ఫెరీరా (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 1; అశ్విన్ (సి) హోప్ (బి) కుల్దీప్ 2; బౌల్ట్ (నాటౌట్) 2; అవేశ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 201. వికెట్ల పతనం: 1-4, 2-67, 3-103, 4-162, 5-180, 6-181, 7-185, 8-194. బౌలింగ్: ఖలీల్ 4-0-47-2, ఇషాంత్ 3-0-34-0, ముకేశ్ 3-0-30-2, అక్షర్ 3-0-25-1, కుల్దీప్ 4-0-25-2, రసిఖ్ 3-0-36-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	16	1.453
రాజస్తాన్	11	8	3	16	0.476
చెన్నై	11	6	5	12	0.700
హైదరాబాద్	11	6	5	12	-0.065
ఢిల్లీ	12	6	6	12	-0.316
లక్నో	11	6	5	12	-0.371
బెంగళూరు	11	4	7	8	-0.049
పంజాబ్	11	4	7	8	-0.187
ముంబై	12	4	8	8	-0.212
గుజరాత్	11	4	7	8	-1.320

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × లక్నో
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

విమానం దారి మళ్లింపు... వారణాసిలో కోల్‌కతా జట్టు

న్యూఢిల్లీ: కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆటగాళ్లకు సోమవారం రాత్రి కునుకు లేకుండా గడిచింది. క్రికెటర్లు ప్రయాణించిన విమానం లక్నో నుంచి కోల్‌కతాకు బయలుదేరాల్సి ఉండగా... ప్రతికూల వాతావరణంతో పలుమార్లు దారి మళ్లించారు. వారి చార్టర్ ఫ్లయిట్‌ను తొలుత గువాహటికి మళ్లించారు. అక్కడి నుంచి కోల్‌కతాకు క్లియరెన్స్ రావడంతో టేకాఫ్ అయిన విమానానికి మళ్లీ వాతావరణం ఏమాత్రం అనుకూలించలేదు. దీంతో ఉన్నపళంగా ఫ్లయిట్‌ను వారణాసి ఎయిర్‌పోర్ట్‌కు మళ్లించాల్సి వచ్చింది. అలా తీవ్రమైన ప్రయాణ బడలిక, క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల మధ్య ఆటగాళ్లు సోమవారమంతా వారణాసిలోని హోటల్‌లో గడపాల్సి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం తర్వాత తమ విమాన ప్రయాణం ఉండటంతో ఈలోపు కోల్‌కతా జట్టు క్రికెటర్లు వారణాసిలో కాశీ విశ్వనాథ్ ఆలయాన్ని సందర్శించుకున్నారు. ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం తర్వాత నైట్‌రైడర్స్ జట్టు కోల్‌కతాకు చేరుకోగలిగింది. ఈ నెల 11న సొంతగడ్డపై కోల్‌కతా నైట్‌రైడర్స్ తమ తదుపరి లీగ్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో తలపడుతుంది.


భరత్, రూథర్‌ఫర్డ్, మనీశ్ పాండే

రష్మిక ఓటమి



ఫ్లోరిడా: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ-75 మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయింది. క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో రష్మిక 3-6, 0-6తో అకాషా ఉర్హోబో (అమెరికా) చేతిలో ఓడిపోయింది. 63 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయింది.

సుమిత్ నగాల్ ర్యాంక్ 93...

అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ (ఏటీపీ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ ర్యాంక్ దిగజారింది. తాజా ర్యాంకింగ్స్‌లో సుమిత్ 11 స్థానాలు పడిపోయి 93వ ర్యాంక్‌లో నిలిచాడు. డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న రెండు స్థానాలు పడిపోయి నాలుగో ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీ 55వ ర్యాంక్‌లో, శ్రీరామ్ బాలాజీ 83వ ర్యాంక్‌లో, విజయ్ సుందర్ ప్రశాంత్ 98వ ర్యాంక్‌లో ఉన్నారు.


● అల్లు అర్జున్, 'దిల్' రాజు, సుకుమార్, దేవి శ్రీ ప్రసాద్

ఆర్య కథ వినగానే ఇది నా ఇడియట్ అనిపించింది

– అల్లు అర్జున్

''హీరో తరుణ్ నాకు మంచి ఫ్రెండ్. 'దిల్' సినిమా ప్రీమియర్‌కి తను పిలవడంతో వెళ్లాను. అక్కడ నన్ను చూసిన సుకుమార్‌గారు మరుసటి రోజు వచ్చి 'ఆర్య' కథ చెప్పారు.. మైండ్ బ్లోయింగ్‌గా నచ్చింది. 'ఇడియట్' మూవీ చూసి ఇలాంటి యూత్ సినిమా నాకు పడితే ఎలా ఉంటుంది? అనే కోరిక మనసులో ఉండేది. 'ఆర్య' కథని సుకుమార్‌గారు చెబుతున్నప్పుడు ఇది నా 'ఇడియట్' మూవీ కథ అనిపించింది'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా, అనూ మెహతా జంటగా తెరకెక్కిన చిత్రం 'ఆర్య'. ఈ మూవీ ద్వారా సుకుమార్ దర్శకునిగా పరిచయమయ్యారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు నిర్మించిన ఈ సినిమా 2004 మే 7న విడుదలైంది. ఈ చిత్రం విడుదలై 20 ఏళ్లు అయిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో 'ఆర్య 20 ఇయర్స్ సెలబ్రేషన్స్' నిర్వహించారు. ఈ వేడుకలో అల్లు అర్జున్ మాట్లాడుతూ–''ఆర్య' ఒక సినిమా మాత్రమే కాదు.. మా అందరి జీవితాలను మార్చింది. ఈ మూవీ 20ఏళ్ల వేడుకని నిర్వహించిన రాజుగారికి థ్యాంక్స్. నా జీవితాన్ని పూర్తిగా మార్చిన సినిమా 'ఆర్య'. నా తొలి మూవీ 'గంగోత్రి' హిట్ అయింది. అయితే చూడ్డానికి నేనంత గొప్పగా లేనని ఆ తర్వాత మంచి సినిమాలేవీ రాలేదు. ఏడాది పాటు ఖాళీగా కూర్చున్నా. కానీ, రోజుకి మూడు కథలు వినేవాణ్ణి.. కానీ నచ్చేవి కాదు. 'ఆర్య' కథ బాగా నచ్చింది.. కానీ, సుకుమార్‌గారు సరిగ్గా తీయగలరా? లేదా? అనే చిన్న అనుమానం. వీవీ వినాయక్‌గారు ఇంటికొచ్చి.. నాన్నగారు(అల్లు అరవింద్), నాతో మాట్లాడి.. సుకుమార్ తీయగలడు.. అతన్ని నమ్మండి అన్నారు. ఆయన మాట నాకు కొండంత ధైర్యం ఇచ్చింది. ఆ తర్వాత వారం రోజులు ట్రైల్ షూట్ చేస్తే అద్భుతంగా తీశారు సుకుమార్‌గారు. ఆ తర్వాత ధైర్యంగా ముందుకెళ్లాం.. సినిమా అద్భుతంగా వచ్చింది.. బ్లాక్ బస్టర్ అయింది. ఇందుకు సుకుమార్‌గారికి థ్యాంక్స్'' అన్నారు.

'దిల్' రాజు మాట్లాడుతూ–''ఆర్య' వచ్చి 20 ఏళ్లు అయింది. ఆ సినిమా కోసం పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణుల కళ్లల్లో ఇప్పటికీ ఓ ఆనందం కనిపిస్తోంది. అది చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది. 'ఆర్య' కి పనిచేసిన బన్నీ, నేను, సుకుమార్, దేవిశ్రీ, రత్నవేలు.. ఇలా అందరూ ఈరోజు సక్సెస్‌ఫుల్‌గా టాప్ పొజిషన్‌లో ఉన్నాం. ఒక సినిమాతో ఇంత మ్యాజిక్ జరగడం అనేది తెలుగు ఇండస్ట్రీనే కాదు ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే 'ఆర్య' ప్రత్యేకమైన సినిమా. 20 ఏళ్ల తర్వాత కూడా అందరూ ఇలా సక్సెస్‌ఫుల్‌గా ఉండటం అనేది గ్రేట్ మూమెంట్.. దీనికి కారణం సుకుమార్. 'ఆర్య' ప్రయాణాన్ని మాత్రం ఎప్పటికీ మరచిపోలేను'' అన్నారు.

సుకుమార్ మాట్లాడుతూ–''ఆర్య' నా తొలి చిత్రం కాబట్టి ప్రతి మూమెంట్ నాకు గుర్తుంది. ప్రస్తుతం కొత్త డైరెక్టర్స్‌కి అవకాశాలు చాలా బాగున్నాయి. కానీ, అప్పట్లో లేవు. కొత్త డైరెక్టర్‌తో ఓ సినిమా చేయాలంటే ధైర్యం కావాలి. ధైర్యం చేసి నాకు అవకాశం ఇచ్చిన రాజుగారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ఈరోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి పునాది బన్నీనే.. దాన్ని ఎప్పుడూ మరచిపోలేను'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత అల్లు అరవింద్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్, కెమెరామేన్ రత్నవేలు, నటీనటులు అభినయశ్రీ, మధుమిత, శివ బాలాజీ, 'చిత్రం' శ్రీను, సుబ్బరాజు, బబ్లు, దేవి చరణ్, 'ఆదిత్య' మ్యూజిక్ నిరంజన్ పాల్గొన్నారు.



పల్లె పిలిచింది

పల్లెటూరి కథలకు ఎప్పుడూ క్రేజ్ ఉంటుంది. ఎక్కువగా సిటీ చుట్టూ తిరిగే కథలే చూస్తుంటారు కాబట్టి పల్లె కథలు వచ్చినప్పుడు ప్రేక్షకులు చూడాలని అనుకుంటారు. పైగా ఆ కథల్లో స్టార్ హీరోలు నటిస్తే క్రేజ్ రెండింతలు ఉంటుంది. అలా 'పల్లె పిలిచింది' అంటూ కొందరు హీరోలు రూరల్ స్టోరీలతో చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

పల్లెటూరి ఆట

రామ్‌చరణ్ రూరల్ బ్యాక్‌డ్రాప్ సినిమా అంటే ప్రేక్షకులకు 'రంగస్థలం' (2018) సినిమా గుర్తుకు వస్తుంది. ఈ సినిమా తర్వాత మరో రూరల్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు రామ్‌చరణ్. కాగా తనకు 'రంగస్థలం' వంటి హిట్ ఫిల్మ్‌ను అందించిన సుకుమార్‌తో మరో సినిమాకు రామ్‌చరణ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇది 'రంగస్థలం'కు సీక్వెల్ అనే ప్రచారం జరుగుతోంది. అలాగే ఇది వార్ డ్రామా మూవీ అనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ సినిమా బ్యాక్‌డ్రాప్‌పై స్పష్టత రావాల్సి ఉంది. అయితే 'ఉప్పెన' ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబుతో రామ్ చరణ్ హీరోగా చేయనున్న సినిమా మాత్రం పక్కా రూరల్ బ్యాక్‌డ్రాప్ సినిమాయే. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో అన్నదమ్ముల పాత్రలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేయనున్నారట. ఈ పల్లె కథలో జాన్వీ కపూర్ హీరోయిన్.

రాజు కథ

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 24 మంది మత్స్యకారులు 2018లో జీవనోపాధికి గుజరాత్ సముద్ర తీరానికి వెళ్లి, పాకిస్తాన్ కోస్ట్ గార్డులకు బందీలుగా చిక్కుతారు. ఈ ఘటనలో ఉన్న ఓ మత్స్యకారుడి జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'తండేల్'. ప్రధానంగా గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో నాగచైతన్య, సాయి పల్లవి హీరో, హీరోయిన్. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి కనిపిస్తారు. రాజు పాత్ర కోసం నాగచైతన్య పూర్తిగా మేకోవర్ అయ్యారు. అలాగే శ్రీకాకుళం యాస కూడా నేర్చుకున్నారు. 'తండేల్'ను డిసెంబరు 20న విడుదల చేయాలనుకుంటున్నారు.

దసరా కాంబో రిపీట్

'దసరా' వంటి రూరల్ బ్యాక్‌డ్రాప్ మూవీతో మంచి హిట్ అందుకున్నారు హీరో నాని. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. హీరో నాని– దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో మళ్లీ ఓ సినిమా రానుంది. ఈ సినిమా కథాంశం కూడా గ్రామీణ నేపథ్యంలో ఉంటుందని సమాచారం. అలాగే 'బలగం' దర్శకుడు వేణు ఎల్దండి గ్రామీణ నేపథ్యంలో నాని హీరోగా ఓ సినిమా చేయనున్నారట. ఈ చిత్రం షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుందని సమాచారం.

మాస్ కుర్రాడు

సిల్వర్ స్క్రీన్‌పై విజయ్ దేవరకొండ ఎక్కువగా సిటీ అబ్బాయిలానే కనిపించారు. ఫస్ట్ టైమ్ పూర్తి స్థాయిలో ఓ రూరల్ బ్యాక్‌డ్రాప్ మూవీలో హీరోగా నటించేందుకు రెడీ అవుతున్నారు. 'రాజావారు రాణిగారు' వంటి పల్లె ప్రేమకథను తీసిన దర్శకుడు రవి కిరణ్ కోలా ఈ సినిమాను తెరకెక్కిస్తారు. ఈ సినిమా గురించిన పూర్తి వివరాలు ఈ నెల 9న... విజయ్ దేవరకొండ బర్త్ డే సందర్భంగా వెల్లడి కానున్నాయి.

లంకల రత్న


విశ్వక్ సేన్ హీరోగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. గోదావరి పరిసర ప్రాంతాల్లోని గ్రామాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. చీకటి సామ్రాజ్యంలో లంకల రత్న అనే సాధారణ వ్యక్తి అసాధారణ స్థాయికి ఎలా చేరుకుంటాడు? అన్నదే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' కథ అని యూనిట్ పేర్కొంది. లంకల రత్న పాత్రలో విశ్వక్ సేన్ కనిపిస్తారు. కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ కానుంది.

అలాగే హీరోలు రక్షిత్ అట్లూరి 'శశివదనే', నార్నే నితిన్ 'ఆయ్..' సినిమాలు గోదావరి నేపథ్యంలో సాగే కథలే. ఇంకా గ్రామీణ నేపథ్యంలో పలు చిత్రాలు ఉన్నాయి.

బాహుబలి విజయాన్ని కొనసాగించాలని...

– డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి

''బాహుబలి' కోసం ప్రీ స్టోరీ, పోస్ట్ స్టోరీ రాసినప్పుడు ఈ యూనివర్స్‌లో ప్రేక్షకులకు చెప్పడానికి ఇంకా కథ ఉందనిపించింది'' అని డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బాహుబలి'. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదలైంది. కాగా 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్' యానిమేషన్ సిరీస్‌ని డిస్నీ+హాట్‌స్టార్ ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. జీవన్ జె. కాంగ్, నవీన్ జాన్ దర్శకత్వం వహించారు. గ్రాఫిక్ ఇండియా, ఆర్కా మీడియా వర్క్స్, రాజమౌళి, శరద్ దేవరాజన్-శోభు యార్లగడ్డ నిర్మించిన 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్' సిరీస్ ఈ నెల 17 నుంచి డిస్నీ+హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''వెస్ట్రన్ కంట్రీస్‌లో ఒక సినిమా విజయవంతమైతే ఆ బ్రాండ్ అనేక మీడియమ్స్‌లో ముందుకెళ్తుంది. అయితే మన వద్ద అలా జరగడం లేదు. సినిమా హిట్ అయితే అక్కడితో అయిపోతుంది. మేము 'బాహుబలి' విజయాన్ని కొనసాగించాలని తీసిన 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్' సిరీస్ ప్రేక్షకులని అద్భుతంగా అలరిస్తుంది'' అన్నారు. డిస్నీ+హాట్‌స్టార్, హెచ్ఎస్ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ హెడ్ గౌరవ్ బెనర్జీ, కో క్రియేటర్, రచయిత, మేకర్ శరద్ దేవరాజన్, బాహుబలి పాత్రకి వాయిస్ ఓవర్ ఇచ్చిన శరద్ కేల్కర్ మాట్లాడారు.


● శోభు, గౌరవ్, రాజమౌళి, శరద్ దేవరాజన్, శరద్ కేల్కర్

వంద కోట్ల చుట్టూ...


● విరాట్ చక్రవర్తి, సాయి కార్తీక్, చేతన్

రాహుల్, చేతన్, యమీ, సాక్షీ చౌదరి, లహరి, అన్నపూర్ణమ్మ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం '100 క్రోర్స్'. విరాట్ చక్రవర్తి దర్శకత్వంలో దివిజా కార్తీక్, సాయి కార్తీక్ నిర్మించారు. డీమానిటైజేషన్ నేపథ్యంలో వంద కోట్ల చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు మేకర్స్. దర్శకులు వీరశంకర్, మల్లిక్ రామ్, నిర్మాతలు దామోదర ప్రసాద్, హర్షిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, '100 క్రోర్స్' ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, సినిమా హిట్ అవ్వాలని ఆకాంక్షించారు. సాయి కార్తీక్ మాట్లాడుతూ– ''2016లో జరిగిన వాస్తవ ఘటనలను ఆధారంగా చేసుకుని, వినోద భరితంగా '100 క్రోర్స్' చిత్రాన్ని నిర్మించాం. ఈ మూవీ చాలా బాగా వచ్చింది.. పెద్ద విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది'' అన్నారు. ''ఈ మూవీలో నటించే చాన్స్ ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు చేతన్.

సామాన్యుడి పోరాటం

ఓ సూపర్ విలన్‌తో ఓ సామాన్యుడు చేసే పోరాటం నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'మాయవన్'. ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ మూవీలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. సీవీ కుమార్ దర్శకుడు. కాగా సందీప్ కిషన్, సీవీ కుమార్ కాంబినేషన్‌లోనే రూపొందిన 'ప్రాజెక్ట్ జెడ్' సినిమాకు సీక్వెల్‌గా 'మాయవన్' తెరకెక్కుతోంది. మంగళవారం సందీప్‌కిషన్ బర్త్ డే (మే 7). ఈ సందర్భంగా 'మాయవన్'లోని సందీప్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అత్యున్నత సాంకేతిక విలువలు, భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను అడ్వెంచర్స్ ఇంటర్‌నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఆకాంక్షా రంజన్ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నీల్ నితిన్ ముఖేష్, క్యాథరిన్ డేవిసన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం: సంతోష్ నారాయణన్.


● సందీప్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	384	73,512
నిఫ్టీ ▽	140	22,303

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,350	△ 11
డోజోన్స్	38,882	△ 30
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,314	△ 100
డాక్స్	18,430	△ 255
షాంఘై	3,148	△ 8
నికాయ్	38,835	▽ 599

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారెట్)	70,590
బంగారం (22 క్యారెట్)	67,230
వెండి (కిలో)	88,500

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.08	84.10
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.59	106.79
€	యూరో	ఒకటి	88.83	91.19
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.51	54.69
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.40	56.36
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.59	63.09
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.85	23.65
¥	చైనా యువాన్	ఒకటి	10.44	12.45

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,307 కోట్లు

క్యూ4లో 36% అప్ • డివిడెండ్ రూ. 40

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కీలకమైన అమెరికా మార్కెట్లో అమ్మకాల దన్నుతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ రూ. 1,307 కోట్ల లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో నమోదైన రూ. 959 కోట్లతో పోలిస్తే 36 శాతం వృద్ధి సాధించింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 6,297 కోట్ల నుంచి రూ. 7,083 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను లాభం రూ. 4,507 కోట్ల నుంచి రూ. 5,568 కోట్లకు, ఆదాయం రూ. 24,588 కోట్ల నుంచి రూ. 27,916 కోట్లకు పెరిగింది. 2023–24కి గాను రూ. 5 ముఖ విలువ గల షేరు ఒక్కింటిపై కంపెనీ రూ. 40 డివిడెండు ప్రకటించింది. అమెరికా మార్కెట్లో అమ్మకాలు పటిష్టంగా ఉండటం లాభాల వృద్ధికి తోడ్పడిందని విలేకరుల సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న సంస్థ సహ–చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు. కంపెనీ ఏర్పాటై 40 ఏళ్లయిందని, రాబోయే దశాబ్ద కాలంలో నవకల్పనలు, డిజిటల్ థెరప్యూటిక్స్ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టడం ద్వారా అధిక వృద్ధి సాధనకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

మరిన్ని విశేషాలు..

- క్యూ4లో గ్లోబల్ జనరిక్స్ ఆదాయం 13 శాతం వృద్ధితో రూ. 6,119 కోట్లకు చేరింది.
- యూరప్ మార్కెట్లో ఆదాయం 5 శాతం వృద్ధితో రూ. 521 కోట్లుగా నమోదైంది. మరోవైపు, భారత్ మార్కెట్లో ఆదాయం 12 శాతం క్షీణించి రూ. 1,126 కోట్లకు పరిమితమైంది.
- అటు వర్ధమాన మార్కెట్లలో ఆదాయం 9 % వృద్ధి చెంది రూ. 1,209 కోట్లుగా ఉంది.
- ఫార్మా సర్వీసులు, యాక్టివ్ ఇంగ్రిడియంట్స్ (పీఎస్ఏఐ) విభాగం ఆదాయం 6 శాతం వృద్ధితో రూ. 779 కోట్ల నుంచి రూ. 822 కోట్లకు చేరింది.

మంగళవారం బీఎస్ఈలో ఈ షేరు ధర స్వల్పంగా క్షీణించి రూ. 6,259 వద్ద ముగిసింది.



ఎఫ్‌ఎంసీజీ వినియోగం పెరిగింది

- మార్చి త్రైమాసికంలో 6.5% వృద్ధి
- నీల్సన్‌ఐక్యూ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: ఫాస్ట్ మూవింగ్ కంజ్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) వినియోగం దేశవ్యాప్తంగా మార్చి త్రైమాసికంలో 6.5 శాతం పెరిగింది. కొనుగోళ్ల విలువ 6.6 శాతం దూసుకెళ్లింది. 2023 జనవరి–మార్చిలో పరిమాణం 3.1 శాతం వృద్ధి సాధించింది. కంజ్యూమర్ ఇంటెలిజెన్స్ కంపెనీ నీల్సన్‌ఐక్యూ నివేదిక ప్రకారం.. ఆహార, ఆహారేతర ఉత్పత్తులు రెండూ 2024 జనవరి–మార్చి కాలంలో వృద్ధికి కారణం అయ్యాయి. ఆహార ఉత్పత్తులతో పోలిస్తే ఆహారేతర ఉత్పత్తుల వృద్ధి దాదాపు రెండింతలు పెరిగింది. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఎఫ్‌ఎంసీజీ వినియోగం అధికం అయింది. గడిచిన అయిదు త్రైమాసికాల్లో గ్రామీణ భారత్ తొలి స్థానానికి రావడం ఇదే మొదటిసారి. గృహ, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల విభాగాలు ఆహారోత్పత్తులను మించి అమ్మకాలు సాధించాయి. పట్టణ, ఆధునిక వాణిజ్యంలో వినియోగం మందగమనం ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

8-5-2024 ఫామ్ ధర...

విశాఖ	475–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	465–00
విజయవాడ	465–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.46

బ్లూచిప్స్‌కు అమ్మకాల షాక్

నిఫ్టీకి మూడో రోజూ నష్టాలు • సెన్సెక్స్ 384 పాయింట్ల పతనం



ముంబై: అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(1%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (1.25%) ఐసీఐసీఐ బ్యాంక్(1.50%) షేర్ల పతనంతో స్టాక్ సూచీలు మంగళవారం అరశాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 384 పాయింట్లు పతనమై 73,512 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140 పాయింట్లు క్షీణించి 22,303 పాయింట్ల వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. అయితే దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలలో తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుండటం, మార్కెట్లలో ప్రీమియం వాల్యుయేషన్ల ఆందోళనలతో ఇన్వెస్టర్లు లాభాల పలు కీలక రంగాల రంగాల్లో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 636 పాయింట్లు క్షీణించి 73,259, నిఫ్టీ 211 పాయింట్లు పతనమై 22,232 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 2%, 1.65% చొప్పున నష్టపోయాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాలతో ట్రేడవుతున్నాయి.

- సూచీల వారీగా రియల్టీ 3.50%, యుటిలిటీస్ 3%, కమోడిటీస్, వినిమయ, టెలికం, ప్రభుత్వరంగ బ్యాంకులు 2.50% క్షీణించాయి. ప్రైవేట్ బ్యాంకులు, ఆటో, మెటల్, ఇంధన ఇండెక్సులు రెండుశాతం చొప్పున నష్టపోయాయి.

శనివారం (మే18న) ప్రత్యేక ట్రేడింగ్ సెషన్

ప్రాథమిక సైట్‌లో ఏమైనా లోపాలు లేదా అంతరాయాలు తలెత్తితే ఎదుర్కొనే సన్నద్ధతను పరీక్షించేందుకు శనివారం(మే 18న) ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలు తెలిపాయి. ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు తొలి సెషన్ ప్రధాన ప్రాథమిక సైట్‌లో.., ఉదయం 11.30 నుంచి 12.30 మధ్య మరో సెషన్ డిజాస్టర్ రికవరీ సైట్‌లో ట్రేడింగ్ జరగనుంది. అన్ని సెక్యూరిటీస్, డెరివేటివ్ ఉత్పత్తులను ట్రేడింగ్‌కు అందుబాటులో ఉంటాయి. గరిష్ట పరిమితిని 5 శాతంగా నిర్ణయించాయి. ఎక్స్ఛేంజీలు ఈ తరహా ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను ఈ మార్చి 2న నిర్వహించాయి.

ట్రేడింగ్ వేళల పెంపునకు నో

ఎన్ఎస్ఈ ప్రతిపాదనకు సెబీ చెక్

ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో ట్రేడింగ్ వేళల పెంపు ప్రతిపాదనను క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తిరస్కరించింది. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ చేసిన ప్రతిపాదనకు సెబీ తాజాగా నో చెప్పింది. ఈ అంశంపై స్టాక్ బ్రోకర్ల నుంచి ఎలాంటి స్పందన లభించకపోవడంతో సెబీ తాజా నిర్ణయం తీసుకున్నట్లు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ పేర్కొన్నారు. దశలవారీగా ఈక్విటీ డెరివేటివ్స్ విభాగంలో లావాదేవీలు చేపట్టే వేళలను పెంచమంటూ ఎన్ఎస్ఈ.. సెబీకి దరఖాస్తు చేసింది. అయితే ఇందుకు స్టాక్ బ్రోకర్ల అభిప్రాయాలను కోరినప్పటికీ స్పందన లభించకపోవడంతో సెబీ దరఖాస్తును తిప్పిపంపినట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది. వెరసి ప్రస్తుతానికి ట్రేడింగ్ వేళల పెంపు ప్రతిపాదన వీగిపోయినట్లేనని తెలియజేసింది. ప్రపంచ మార్కెట్ల నిరంతర సమాచారం కారణంగా తలెత్తే ఓవర్‌నైట్ రిస్కులను తగ్గించుకునేందుకు వీలుగా ఎన్ఎస్ఈ ట్రేడింగ్ వేళల పెంపు ప్రతిపాదనకు తెరతీసింది. రోజువారీ(ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 3.30వరకూ) సెషన్ ముగిశాక కమోడిటీ డెరివేటివ్స్ తీరులో సాయంత్రం 6–9 మధ్య ట్రేడింగ్‌కు గతేడాది సెప్టెంబర్‌లో ప్రతిపాదించినట్లు ఎన్ఎస్ఈ బిజినెస్ డెవలప్‌మెంట్ చీఫ్ శ్రీరామ్ కృష్ణన్ పేర్కొన్నారు. తదుపరి స్టాక్ బ్రోకర్ల స్పందనను బట్టి క్రమంగా రాత్రి 11.55 వరకూ పొడిగించేందుకు యోచించినట్లు తెలియజేశారు.

వోల్టాస్ డివిడెండ్ రూ. 5

క్యూ4 లాభం రూ. 111 కోట్లు



న్యూఢిల్లీ: ఏసీలు, ఇంజినీరింగ్ సర్వీసుల దిగ్గజం వోల్టాస్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం క్షీణించి రూ. 111 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 143 కోట్లకుపైగా ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 2,957 కోట్ల నుంచి రూ. 4,203 కోట్లకు జంప్‌చేసింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 2,761 కోట్ల నుంచి రూ. 4,045 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు షేరుకి రూ. 5 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి వోల్టాస్ నికర లాభం రూ. 136 కోట్ల నుంచి రూ. 248 కోట్లకు దూసుకెళ్లింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,499 కోట్ల నుంచి రూ. 12,481 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో ఏసీల అమ్మకాలలో 20 లక్షల మార్క్‌ను అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.

కంపెనీ షేరు 4.5% పతనమై రూ. 1,383 వద్ద ముగిసింది.

హ్యాపియెస్ట్ మైండ్స్.. హ్యాపీ

లాభం 25 % అప్ • షేరుకి రూ. 3.25 డివిడెండ్



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ హ్యాపియెస్ట్ మైండ్స్ చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4) లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 72 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం రూ. 378 కోట్ల నుంచి రూ. 417 కోట్లకు బలపడింది. ఇది 10 శాతం వృద్ధి. వాటాదారులకు షేరుకి రూ. 3.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి హ్యాపియెస్ట్ మైండ్స్ నికర లాభం 7.5 శాతం పుంజుకుని రూ. 248 కోట్లను అధిగమించింది. 2022–23లో రూ. 231 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం ఎగసి రూ. 1,625 కోట్లకు చేరింది.

ఎన్ఎస్ఈలో షేరు 2.5% లాభంతో రూ. 825 వద్ద ముగిసింది.

మూడేళ్లలో రూ. 9 లక్షల కోట్లు తగ్గిన పొదుపు..

2022–23లో రూ. 14.16 లక్షల కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: కుటుంబ పొదుపు గత మూడేళ్లలో నికరంగా రూ.9 లక్షల కోట్లు తగ్గింది. 2022–23లో రూ. 14.16 లక్షల కోట్లకు పడిపోయింది. కేంద్ర గణాంకాల శాఖ నేషనల్ అకౌంట్ స్టాటిస్టిక్స్ 2024 నివేదిక ప్రకారం 2020–21లో కుటుంబాల పొదుపు మొత్తం రూ. 23.29 లక్షల కోట్లకు ఎగిసింది. ఆ తర్వాత నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2021–22లో రూ. 17.12 లక్షల కోట్లకు, ఆ తర్వాత 2022–23లో అయిదేళ్ల కనిష్టమైన రూ. 14.16 లక్షల కోట్లకు క్షీణించింది. చివరిసారిగా ఇంత తక్కువ స్థాయిలో 2017–18లో రూ. 13.06 లక్షల కోట్లుగా ఇది నమోదైంది. ఆ తర్వాత 2018–19లో రూ. 14.92 లక్షల కోట్లకు, 2019–20లో రూ. 15.49 లక్షల కోట్లకు చేరింది.

జేపీ అసోసియేట్స్ రూ. 4,616 కోట్ల రుణాల డిఫాల్ట్

న్యూఢిల్లీ: సంక్షోభంలో చిక్కుకున్న జైప్రకాశ్ అసోసియేట్స్ తాజాగా రూ. 4,616 కోట్ల రుణాల చెల్లింపులో డిఫాల్ట్ అయ్యింది. రూ. 1,751 కోట్ల అసలు, రూ. 2,865 కోట్ల వడ్డీ చెల్లించడంలో విఫలమైనట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ వెల్లడించింది. సంస్థ మొత్తం రుణ భారం (వడ్డీతో సహా) రూ. 29,805 కోట్లుగా ఉండగా, ఇందులో రూ. 4,616 కోట్లు మాత్రమే ఏప్రిల్ 30 నాటికి బాకీ ఉన్నట్లు వివరించింది.

నేటి నుంచి ఏపీఎల్ ఆటగాళ్ల రిజిస్ట్రేషన్

9 వరకు రిజిస్ట్రేషన్‌లు..10న ట్రయిల్స్

విశాఖ స్పోర్ట్స్: ప్రస్తుత సీజన్‌లో ఏపీఎల్ మూడో ఎడిషన్ కోసం రైజింగ్ స్టార్స్ పేరిట మరికొంత మంది ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి చెప్పారు. ఇప్పటికే ఏసీఏ విడుదల చేసిన వేలం అర్హత జాబితాలో చోటు దక్కని ఆటగాళ్లు ట్రయిల్స్‌లో పాల్గొని ఏపీఎల్‌లో స్థానం సంపాదించుకోవమే రైజింగ్ స్టార్స్ ప్రకటన ఉద్దేశమన్నారు. ట్రయిల్స్‌ను ఈ నెల 10న విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం బి గ్రౌండ్, మంగళగిరి ఏసీఏ స్టేడియం, కడపలోని వైఎస్సార్ స్టేడియంల్లో నిర్వహించనున్నారు. ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ బుధవారం నుంచి ఈ నెల 9 వరకు చేసుకునే వీలు కల్పించారు. http://15.206.63.242/AC/payesopenrfirtration/gorm/ లింక్ ద్వారా ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఆటగాళ్లు 18–28 మధ్య వయస్సు కలిగిన వారై ఉండాలి.

సీఎం జగన్‌తోనే ఉద్యోగులకు నమ్మకమైన సేవలు

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి



ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రభుత్వ ఉద్యోగులకు నమ్మకమైన సేవలు సాధ్యమవుతాయని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. విశాఖలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పెండింగ్‌లో పెట్టిన డీఏలను సీఎం జగన్ ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిందని గుర్తుచేశారు. కోవిడ్ సమయంలో ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు పూర్తి జీతాన్ని సీఎం జగన్ ప్రభుత్వం అందజేసిందన్నారు. జూన్‌లో మరో డీఏను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. 60 శాతం రాయితీతో ఉద్యోగులకు ఇళ్ల స్థలాలిస్తామని సీఎం జగన్ ప్రస్తుత మేనిఫెస్టోలో పెట్టారని తెలిపారు. సీఎం జగన్ హామీపై ఉద్యోగులకు వంద శాతం నమ్మకముందని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో ఉద్యోగుల జీతాల చెల్లింపుల్లో ఇబ్బందులు సైతం తొలగిపోతాయని చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జన్మభూమి మీటింగుల పేరుతో చంద్రబాబు ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి మరీ చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇళ్ల స్థలాలిస్తానని చెప్పి బాబు మోసగించిన విషయాన్ని ఉద్యోగులు గుర్తించాలని సూచించారు. ప్రస్తుతం చంద్రబాబు అదే మోసాలను మరోసారి కొత్తగా వల్లేవేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని ఉద్యోగులకు సూచించారు.

చంద్రబాబును మరోసారి నమ్మొద్దు

తోకలు కత్తిరించాలంటూ ఉద్యోగుల ఆత్మాభిమానంపై కొట్టారు



విజయవాడలోని హోటల్ ఐలాపురంలో ఓపెన్ మైండ్స్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజలు ప్రభుత్వం ఉద్యోగుల సదస్సులో మాట్లాడుతున్న ఓపెన్ మైండ్స్ అధ్యక్షుడు ఎన్. రాజశేఖర్ రెడ్డి

- అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టు వ్యవస్థను తెచ్చారు
- బాబొస్తే 15వ తేదీకి కూడా జీతాలు రావు
- ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ కనుమరుగు ఖాయం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగులందరికీ న్యాయం
- 'ప్రజలు–ప్రభుత్వం–ఉద్యోగులు' అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు

సాక్షి, అమరావతి: అధికారంలో ఉన్నన్నాళ్లూ ప్రభుత్వ ఉద్యోగులను ముప్పతిప్పలు పెట్టిన చంద్రబాబును మరోసారి నమ్మవద్దని పలువురు విశ్రాంత ఉద్యోగులు, మేధావులు, విద్యావేత్తలు కోరారు. సమస్యలపై ప్రశ్నిస్తే ఉద్యోగుల తోకలు కత్తిరించాలంటూ వారి ఆత్మాభిమానంపై దెబ్బకొట్టారని గుర్తుచేశారు. 'ప్రజలు–ప్రభుత్వం–ఉద్యోగులు' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు విజయవాడలో మంగళవారం జరిగింది. ఓపెన్ మైండ్స్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఉద్యోగుల మద్దతు వారికి మేలు చేసిన వైఎస్సార్‌సీపీకే ఉంటుందని తేల్చిచెప్పారు. ఉద్యోగులు, సీఎం వైఎస్ జగన్ మధ్య అన్నదమ్ముల అనుబంధం ఉందని వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల డిమాండ్లు ఉంటే బాగుంటుందన్నారు. వారు కూడా ప్రభుత్వంలో అంతర్భాగం కాబట్టి ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని హితవు పలికారు. పొరపాటున చంద్రబాబు అధికారంలోకి వస్తే 15వ తేదీకి కూడా జీతాలు అందవని హెచ్చరించారు. అసలు ప్రభుత్వ ఉద్యోగులనే వ్యవస్థే కనుమరుగయినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. కార్యక్రమంలో మెజర్ కిరణ్ కుమార్, లెక్చరర్ కళ్యాణి, సమాజిక కార్యకర్త శాంతమూర్తి, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు ఏమన్నారంటే..

రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది చంద్రబాబే..

రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చి, రాష్ట్రాన్ని చంద్రబాబు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారు. జగన్ అధికారంలోకి వచ్చాక దానికి కాయకల్ప చికిత్స చేయడం మొదలుపెట్టారు. కానీ కరోనా వల్ల ఆర్థిక వ్యవస్థ మళ్లీ దెబ్బతింది. రూ.60 వేల కోట్లను ప్రభుత్వం నష్టపోయింది. రాష్ట్ర బడ్జెట్‌లో సగం ఉద్యోగుల జీతభత్యాలకే పోతోంది. మిగిలిన సగం నాలుగున్నర కోట్ల మంది ప్రజలకు ఖర్చు చేయాల్సి ఉంది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టు వ్యవస్థను ప్రవేశపెట్టారు. కొత్త ఉద్యోగాలివ్వలేదు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక నియామకాల విప్లవం తెచ్చారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సైతం 1వ తేదీనే నేరుగా జీతాలందేలా చేశారు. దశాబ్దాలుగా పదోన్నతులు లేని వారికి పదోన్నతులిచ్చారు. చైల్డ్ కేర్ సెలవులను 180 రోజులకి పెంచారు. సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేశారు. తాజా మేనిఫెస్టోలో మరికొన్ని హామీలిచ్చి నెరవేరుస్తాననే నమ్మకమిచ్చారు. అదే చంద్రబాబు హామీలు నెరవేర్చాలంటే పీఆర్సీ, జీతాలు ఎగ్గొట్టాలి. లేదంటే రాష్ట్ర బడ్జెట్ సరిపోదు.

–డాక్టర్ ఎస్.రాజశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, ఓపెన్ మైండ్స్

చంద్రబాబు వస్తే జీతాలు కష్టమే..

అడగకుండానే సీఎం జగన్ క్లాస్ 4 ఉద్యోగుల జీతాలను పెంచారు. అదే చంద్రబాబు 'ఉద్యోగుల తోకలు కత్తిరించాలి' అన్నమాటను నేటికీ ఎవరూ మర్చిపోలేదు. ఇప్పుడు రూ.లక్ష కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తానని అంటున్నారు. అంటే అప్పుడు 15వ తేదీకి కూడా జీతాలు రావు. పోనీ ఉద్యోగులకు ఏదైనా చేస్తానని మేనిఫెస్టోలో చెప్పారా అంటే లేదు. గతంలో ఉద్యోగుల ఆత్మాభిమానాన్ని చంద్రబాబు దెబ్బతీశారు. ప్రభుత్వ ఉద్యోగులు అనే వ్యవస్థనే లేకుండా చేయాలనుకున్నారు.

–పి.విజయబాబు, అధ్యక్షుడు, ఏపీ ఇంటలెక్చువల్ ఫోరం

చంద్రబాబు ఉద్యోగులకు డీఏ అవసరం లేదన్నారు..

ప్రభుత్వ ఉద్యోగులు ఈ ప్రభుత్వానికి సహకరించాలి. ఎందుకంటే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయాల ద్వారా సీఎం జగన్ తీసుకువచ్చారు. విద్యకు ఆయన అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పెన్షన్‌దారులకు డీఏ అవసరం లేదన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగుల గురించి ఎంత దారుణంగా మాట్లాడారో చూశాం.

–ప్రొఫెసర్ జి. రామచంద్రారెడ్డి, విద్యావేత్త

ఆర్టీసీని ఆదుకుంది జగన్ ప్రభుత్వమే..

అప్పుల్లో ఉన్న ఆర్టీసీని సీఎం వైఎస్ జగన్ తమ ప్రభుత్వంలో విలీనం చేశారు. గతంలో జీతాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అప్పుచేసి జీతాలిచ్చేవారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రతి నెలా రూ.300 కోట్లు ఇస్తోంది. రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ ఉద్యోగుల జీతాలు పెరిగాయి. ప్రభుత్వ సహకారంతో అప్పులు రూ.6 వేల కోట్ల నుంచి రూ.2 వేల కోట్లకు ఆర్టీసీ తగ్గించగలిగింది.

–కోటేశ్వరరావు, విశ్రాంత ఆర్టీసీ అధికారి

మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి

వైఎస్ జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేసింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. వేతన సవరణ అడగకుండానే ఇచ్చింది. మళ్లీ అధికారంలోకి రాగానే ఇళ్ల స్థలాలు ఉచితంగా ఇస్తామంటోంది. ఇంత మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని అందరం కాపాడుకోవాలి.

–ప్రొ.వి.నారాయణరెడ్డి, మాజీ రిజిస్ట్రార్

ప్రభుత్వానికి ఉద్యోగులు మద్దతు ఇవ్వాలి

ప్రభుత్వాన్ని ఉద్యోగులు విమర్శించడం సరికాదు. అన్నదమ్ముల్లా ఉద్యోగులు, ప్రభుత్వం కలిసుండాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఏం కావాలో అవన్నీ చేస్తోంది. సంక్షేమ పథకాలను ఇంటి వద్దే అందిస్తోంది. ఉద్యోగులు కూడా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకునే ప్రభుత్వానికే మద్దతివ్వాలి.

–పి.సుశీలరెడ్డి, సామాజిక కార్యకర్త

మద్యం డబ్బును పంచుకున్నారు

- పుంగనూరు, తిరుపతిలో సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డిపై చంద్రబాబు ఆగ్రహం
- తిరుపతి నుంచి అన్ని పరిశ్రమలూ వెళ్లిపోయాయన్న పవన్



సాక్షి, చిత్తూరు/పుంగనూరు (చిత్తూరు జిల్లా)/సాక్షి, తిరుపతి/తిరుపతి సిటీ : మద్యం అమ్మకాల్లో వచ్చిన డబ్బును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు పంచుకుంటున్నారని చంద్రబాబు ఆరోపించారు. ప్రజల నుంచి దోచుకున్న ఈ డబ్బును జూన్ 4 తర్వాత కక్కిస్తానని ఆయనన్నారు. పాపాల పెద్దిరెడ్డీ.. నీ అవినీతినీ కక్కిస్తానంటూ ఆయన పదేపదే హెచ్చరించారు. పుంగనూరులో మంగళవారం ఆయన మాజీ సీఎం ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డితో.. తిరుపతిలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీలో ఎవరూ ఆనందంగా ఉండకూడదని.. మొత్తం డబ్బు తన దగ్గరే ఉండాలనేది జగన్ లక్ష్యమన్నారు. పెద్దిరెడ్డి అహంకారానికి గండి పెట్టడానికి కిరణ్‌కుమార్‌రెడ్డి వచ్చాడన్నారు. ఆయన చేసిన అరాచకాలు తన నరనరాల్లో ఉన్నాయన్నారు. ఎప్పటిలాగే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు దుష్ప్రచారం చేశారు. ఇక సభలో చంద్రబాబు చించిపడేసిన పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ముక్కల్లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను పరిశీలించగా.. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం, తుమ్మపూడి గ్రామ నివాసి కేశంనేని పూర్ణచంద్రరావుకు ప్రభుత్వం 4–19 ఎకరాల భూమికి వైఎస్సార్ శాశ్వత భూహక్కు పథకం కింద మంజూరు చేసినట్లుగా ఉంది. ప్రజలను మోసగించేందుకు బాబు ప్రయత్నాన్ని చూసి వారు నవ్వుకున్నారు. మరోవైపు.. బాబు నిర్ణీత సమయానికి మించి ప్రసంగించి కోడ్ ఉల్లంఘించారు. అలాగే, టీడీపీ శ్రేణులు జాతీయ పతాకాన్ని టీడీపీ జెండాలతో కలిపి పట్టుకున్నారు. ఆశించిన స్థాయిలో సభకు జనం రాలేదు. ప్రచార రథంలో జనసేన నేతలకు చోటు దక్కలేదు. ఇక తిరుపతిలో దొంగలు పడ్డారని.. దీని పవిత్రతను కాపాడుకునేందుకు మనందరం సిద్ధం కావాలని చంద్రబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో యువతకు ఉద్యోగాలు రాలేదన్నారు. సభలో మాజీ సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎయిడ్స్‌కంటే ప్రమాదకరమని.. అలాంటి వ్యక్తికి ఓటు వెయ్యొద్దన్నారు.

కోడిబొచ్చు అమ్ముకునే వ్యక్తి కరుణాకరరెడ్డి : పవన్

తిరుపతిలో కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు కోడి బొచ్చు అమ్ముకుని నెలకు రూ.20లక్షలు సంపాదిస్తున్నారని పవన్‌కళ్యాణ్ విమర్శించారు. అన్ని పరిశ్రమలు తిరుపతి నుంచి వెళ్లిపోయాయని, తమ కూటమి అధికారంలోకి రాగానే పెద్దఎత్తున పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. ఇదిలా ఉంటే.. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో టీడీపీ–బీజేపీ–జనసేన నేతలు మద్యాన్ని ఏరులై పారించారు. నడిరోడ్లపైనే మద్యం సేవించడం కనిపించింది.

చంద్రబాబు బెయిల్ రద్దు కేసు విచారణ వాయిదా

త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటుపై సీజేఐ ముందు ప్రస్తావిస్తామన్న సీఐడీ

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాలంటూ సీఐడీ దాఖలు చేసిన కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో సెక్షన్ 17ఏ అంశం ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి రిఫర్ చేశారని, అది ఇంకా పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. సెక్షన్ 17ఏతో సంబంధం లేకుండానే తాము హైకోర్టులో సవాల్ చేశామని తెలిపారు. హైకోర్టు మెరిట్స్‌పై బెయిలు మంజూరు చేసినందున సీఐడీ జోక్యం చేసుకోవచ్చా అని ప్రశ్నించారు. చార్జిషీటు కూడా ఫైల్ చేశారని తెలిపారు. చార్జిషీటు దాఖలు చేసినా దర్యాప్తు ఇంకా పెండింగ్‌లో ఉందని, దీనికి కోర్టు అనుమతి ఇచ్చిందని రంజిత్‌కుమార్ తెలిపారు. చార్జిషీటు దాఖలు చేశారనే పేరుతో బెయిల్ కొనసాగించాలనడం సబబు కాదన్నారు. త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటుపై వేసవి సెలవుల అనంతరం జూలైలో సీజేఐ ముందు ప్రస్తావిస్తామన్నారు. రూ.370 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందని తెలిపారు. బెయిల్ మంజూరు చేసినప్పటికీ స్వేచ్ఛగా దర్యాప్తు చేసుకోవచ్చని హైకోర్టు చెప్పిన విషయాన్ని లూత్రా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సెక్షన్ 17ఏకి సంబంధించి త్రిసభ్య ధర్మాసనం వాదనలు వినేవరకు ఈ కేసు వాయిదా వేయవచ్చా అని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. ఏపీ సీఐడీ దర్యాప్తు కొనసాగిస్తోందని రంజిత్‌కుమార్ మరోసారి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఈ కేసును పదివారాలు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

నేడు ఏపీ ఈసెట్-2024

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఆధ్వర్యంలో బుధవారం ఏపీ ఈసెట్ నిర్వహించనున్నారు. ఇప్పటివరకు 37,767 దరఖాస్తులు అందినట్లు ఈసెట్ చైర్మన్ ప్రొఫెసర్ జి.వి.ఆర్ శ్రీనివాసరావు, కన్వీనర్ ప్రొఫెసర్ పి.ఆర్.భానుమూర్తి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 93 పరీక్ష కేంద్రాలు, హైదరాబాద్‌లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. రోజూ రెండు సెషన్లు ఉంటాయి. ఉదయం సెషన్ అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి ఉదయం 7.30 గంటల నుంచి వెళ్లవచ్చు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్న సెషన్ 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుంది. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రంలోకి నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరు. అభ్యర్థులు హాల్‌టికెట్, డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు ఫారం, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలి. పరీక్ష కేంద్రంలోకి క్యాలిక్యులేటర్, సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు. అభ్యర్థులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

31 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించనున్న ఐదు వైద్య కళాశాలల్లో 31 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. డైరెక్ట్, లేటరల్ ఎంట్రీ విధానాల్లో పోస్టుల భర్తీ చేపడతామని బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. https://dme.ap.nic.in వెబ్‌సైట్‌లో పూర్తి నోటిఫికేషన్‌ను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అభ్యర్థులు బుధవారం నుంచి ఈనెల 17వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి తత్కాల్ అవకాశం

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఇంటర్ బోర్డు తత్కాల్ అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు అడ్వాన్స్‌డ్ పరీక్షలకు ఫీజు చెల్లించలేని వారు ఈ అవకాశం వినియోగించుకోవాలని పరీక్షల విభాగం కంట్రోలర్ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు రూ.3 వేలు ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావొచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోస్టల్ బ్యాలెట్‌తో 3.03 లక్షల మంది ఓటు

- ప్రలోభాలకు గురయ్యే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- వీవీఐపీల బందోబస్తుకు హాజరయ్యే పోలీసులకు 9న పోస్టల్ బ్యాలెట్ అవకాశం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వెల్లడి



సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న 4.30 లక్షల మందిలో మంగళవారం నాటికి 3.03 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'కొన్ని జిల్లాల్లో 3వ తేదీన, మరికొన్ని జిల్లాల్లో 4వ తేదీన హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్‌కు 4.30 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 3.20 లక్షల మంది ఉద్యోగులు, 40 వేల మంది పోలీసులు, హోమ్ ఓటింగ్ కేటగిరీ కింద 28 వేల మంది, ఎసెన్షియల్ సర్వీసెస్ కింద 31 వేల మంది ఉన్నారు. మిగిలిన వారిలో సెక్టార్ ఆఫీసర్లు, ఇతరులున్నారు. ఇప్పటివరకు 2.76 లక్షల మంది ఉద్యోగులు, దాదాపు 28 వేల మంది హోమ్ ఓటింగ్, ఎసెన్షియల్ సర్వీసెస్ కేటగిరీల వారు ఓట్లు వేశారు. కొందరు ఉద్యోగులు పలు రకాల కారణాల వల్ల పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఉపయోగించుకోలేకపోయారు. వారికి ఏ ఆర్వో పరిధిలో ఓటు ఉంటే.. ఆ ఫెసిలిటేషన్ కేంద్రంలోనే స్పాట్‌లో ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేలా మంగళ, బుధవారాల్లో అవకాశాన్ని కల్పించాం. ఈ విషయంపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు రెండు రోజుల క్రితమే ఆదేశాలు జారీ చేశాం. కానీ ఈరోజు కూడా కొన్ని సమస్యలు తలెత్తాయని మా దృష్టికి వచ్చింది' అని చెప్పారు.

ప్రలోభాలకు గురైతే కఠిన చర్యలు

పోస్టల్ బ్యాలెట్ విషయంలో ప్రలోభాలకు గురయ్యే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సస్పెండ్ చేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ.. 'ప్రభుత్వ ఉద్యోగులు కొందరు నగదు తీసుకొని ఓటు వేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇది చెడు సంకేతం. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో డబ్బులు పంచుతున్న నలుగురిని అరెస్టు చేశాం. అనంతపురంలో ఒక కానిస్టేబుల్ ఉద్యోగుల జాబితా పట్టుకుని నగదు పంపిణీ చేస్తున్నట్లు గుర్తించాం. అతన్ని వెంటనే సస్పెండ్ చేశాం. విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద ఇద్దరి నుంచి నగదు సీజ్ చేసి అరెస్టు చేశాం. ఒంగోలులో యూపీఐ విధానం ద్వారా కొందరు ఉద్యోగులకు నగదు పంపించినట్లు తెలిసింది. ప్రాథమిక విచారణ పూర్తయ్యింది. కాల్ డేటా, బ్యాంక్ లావాదేవీల ఆధారంగా దాదాపు 8, 10 మంది ఉద్యోగులను గుర్తించాం' అని ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. కాగా, మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో పలువురు వీవీఐపీలు పర్యటిస్తున్న నేపథ్యంలో బందోబస్తులో ఉండే పోలీసులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడంలో సమస్యలు తలెత్తుతున్నాయని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. బందోబస్తులో పాల్గొనే పోలీసులు వారి ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించాలని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీలకు ఆదేశాలిచ్చామన్నారు. ఇంకా ఎవరైనా పోలీసులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోకపోతే.. ఈ నెల 9న వారికి అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేశాం' అని చెప్పారు.

సింగపూర్ చేరిన భారత యుద్ధ నౌకలు

మూడు రోజుల పాటు ఇరు దేశాల ద్వైపాక్షిక విన్యాసాల ప్రదర్శన



సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ కిల్తాన్ యుద్ధ నౌకలు సింగపూర్ చేరాయి. భారత నౌకాదళ బృందానికి రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ నేవీ సిబ్బంది, భారత హైకమిషనర్ ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన ద్వారా దక్షిణ చైనా సముద్రంలో పైచేయి సాధించేందుకు బల ప్రదర్శన నిర్వహించనున్నాయి. ఈ పర్యటన ద్వారా రెండు సముద్ర దేశాల మధ్య సుదీర్ఘమైన స్నేహం, సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నామని ఇరు దేశాల నౌకాదళ అధికారులు స్పష్టం చేశారు. మూడు రోజుల పాటు దక్షిణ చైనా సముద్రంలో ఇరు దేశాలు ద్వైపాక్షిక విన్యాసాలు ప్రదర్శించనున్నాయి.

టెక్కలి పరిధిలో వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు

హైకోర్టుకు నివేదించిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకున్నామని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు మంగళవారం నివేదించింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేసింది. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు టెక్కలి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక, సున్నిత పోలింగ్ కేంద్రాల బయట, లోపల సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు, ఇతర భద్రతాపరమైన ఏర్పాట్లు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ దువ్వాడ శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కృష్ణమోహన్ విచారించారు. దువ్వాడ తరఫు న్యాయవాది ఎల్.సాయి మనోజ్ రెడ్డి వాదనలు వినిపించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణ అవసరం లేదంటూ దానిని పరిష్కరించారు.

ఏయూ ఈఈటీ ఫలితాలు విడుదల

విశాఖకే మొదటి మూడు ర్యాంకులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కోర్సుల్లో సెల్ఫ్‌సపోర్ట్ విధానంలో ప్రవేశాలకు నిర్వహించిన ఏయూ ఈఈటీ-2024 ప్రవేశ పరీక్ష ఫలితాలను మంగళవారం వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. మే 5న ఈ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా 8 ప్రాంతాల్లో, 14 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్షకు 4,349 మంది దరఖాస్తు చేయగా 3,952 మంది హాజరయ్యారు. పరీక్ష ఫలితాలను ఏయూ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. త్వరలో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఏ నాయుడు పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ర్యాంకర్లు వీరే...

ఈఈటీ ఫలితాల్లో పెందుర్తికి చెందిన యు.సాయి ఈశ్వర్ మొదటి ర్యాంకు, చంద్రంపాలెంకు చెందిన కె.సాయి ప్రణీత్ రెండో ర్యాంకు, తగరపువలసకు చెందిన జి.మోహన్ సాయి సంపత్ మూడో ర్యాంకు, రాజమండ్రికి చెందిన ఎస్.డి.వి సంకల్ప్ నాలుగో ర్యాంకు, పాలకొల్లుకు చెందిన డి.జె.నాగ మంజుల ఐదో ర్యాంకు సాధించారు.

ఏపీకి 50 మంది వ్యయ పరిశీలకులు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం 50 మంది వ్యయ పరిశీలకులను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ఖర్చుల నివేదికను వీరు కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించనున్నారు.

పిడుగులుపడి ఏడుగురు మృత్యువాత

సాక్షి, విశాఖపట్నం/నెట్‌వర్క్: ద్రోణి ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. తీవ్రమైన ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షాలు బీభత్సం సృష్టించాయి. అనేక చోట్ల పిడుగులు పడగా.. ఏడుగురు మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి. వర్షాల వల్ల అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో పలుచోట్ల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాజమహేంద్రవరంలో కుండపోత వర్షానికి వీధులు జలమయమయ్యాయి. అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లా వేమగిరిలో 12.4 సెం.మీ. భారీ వర్షపాతం నమోదైంది. మండపేట (కోనసీమ)లో 12, రాజమహేంద్రవరం 9.2, నూజివీడు (ఏలూరు) 7.3, మచిలీపట్నం (కృష్ణా) 7.3 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో 45 చోట్ల 2 నుంచి 6 సెం.మీ. వర్షపాతం రికార్డయింది. ఏలూరు జిల్లావ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం సుమారు గంటసేపు ఈదురుగాలులు, ఉరుములతోపాటు మోస్తరు వర్షం కురిసింది. నందిగామ పాత బస్టాండ్ ప్రాంతంలో జాతీయ రహదారిపై దాదాపు అడుగుమేర నీరు నిలిచింది. పిడుగుపాటుకు గురై.. తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన కవల నాగేశ్వరరావు (55), ఏలూరు జిల్లా లింగపాలెం మండలం యడవల్లి గ్రామంలో పర్సా రామారావు (44),



రాజమహేంద్రవరం హైటెక్ బస్టాండ్ వద్ద పరిస్థితి

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెం ఎర్రకాలువ ప్రాంతంలో కరిపోతుల నాగేశ్వరరావు (72), పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఊటుకూరులో మొక్కజొన్న కోతలకు వెళ్లిన తల్లీకూతుళ్లు బొందెల నాగేంద్రమ్మ (53), నాగరాణి(33), పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం కుందురువారిపాలెంకు చెందిన ఆవుల కోటేశ్వరరావు (42), అతని మేనల్లుడు జమ్ముల గోపి(35) మరణించారు. పశ్చిమ గోదావరిజిల్లా శృంగవృక్షంలోని పట్టూరి వారి వీధిలో మంగళవారం వీచిన ఈదురుగాలులకు కొబ్బరి చెట్టు కూలి నిమ్మల శ్రీనివాస్ (49) అనే వ్యవసాయ కూలీ మృత్యువాతపడ్డాడు.

తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు

ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. సాధారణం కంటే 2-5 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. లద్దగిరి (కర్నూలు)లో 43.3, ఎండ్రపల్లి (ప్రకాశం) 43.2, మద్దూరు (వైఎస్సార్), మంగ నెల్లూరు (తిరుపతి)లో 42.9 చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మరో మూడు రోజులు వానలే..

అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో అల్లాడుతున్న రాష్ట్రానికి మంగళవారం ఉపశమనం లభించింది. తూర్పు విదర్భ నుంచి దక్షిణ తమిళనాడు వరకు తెలంగాణ, దక్షిణ అంతర్గత కర్ణాటక మీదుగా సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బుధవారం శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, పల్నాడు, అన్నమయ్య, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని తెలిపింది. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగిలిన ప్రాంతాల్లో జల్లులకు ఆస్కారం ఉందని వివరించింది. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే వీలుందని పేర్కొంది.


Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.





గుసగుస

అన్నయ్య తోడు



ట్వంటీ నైన్టీన్(2019) ప్రొజెక్టింగ్ మై సెల్ఫ్ చీఫ్ మినిస్టర్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్.. గత ఎన్నికలకు ముందు పవన్ పలికిన జీరాలివి. తీరా పోటీ చేసిన రెండు చోట్లా దారుణ పరాభవం. ఇప్పుడు ఇంకో రెండు పార్టీలతో కలిసి పిఠాపురంలో పోటీకి దిగారు. స్థానిక టీడీపీ నేత వర్మ ఇంటికెళ్లి మరీ తనను గెలిపించాల్సిందిగా కాళ్ల మీద పడినంత పనిచేశారు. హీరో చరిష్మాతో పార్టీ పెట్టిన పవన్‌కు వైఎస్సార్‌సీపీ మహిళా అభ్యర్థి(వంగా గీత)పై గెలవగలనన్న నమ్మకం సడలిపోయిందట. ఇప్పటికే ఓ అన్నయ్య నాగబాబు, తన కుటుంబ హీరోలు వరుణ్‌తేజ్, సాయిధరమ్‌తేజ్, జబర్దస్త్ టీం, బుల్లితెర, సినిమా నటులు పదుల సంఖ్యలో గత కొన్ని రోజులుగా పిఠాపురంలో తిష్ట వేశారు. తాజాగా అన్నయ్య చిరంజీవి కూడా వీడియో సందేశం ద్వారా పిఠాపురం ప్రజలను వేడుకుంటున్నారు.. హతవిధీ..!

అ'సత్యకుమార్'




ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌పై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు బావమరిది భాస్కరనాయుడు చేసిన ఆరోపణలు నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య **కల్లోలం** రేపుతున్నాయి. వెంకయ్య దగ్గర **ఓఎస్**డీగా పనిచేసిన సత్యకుమార్ **తిన్నింటి** వాసాలు లెక్కెట్టే రకమని, ఓసీ **అయినా** జీసీగా చెప్పకుని టికెట్ దక్కించు**కున్నా**రని, మోదీ, అమిత్ షా వద్ద **పైరవీలు** చేస్తానంటూ చాలా మంది **నుంచి** భారీగా ముడుపులు తీసుకు**న్నారని** బాహాటంగానే ఆరోపిస్తున్నారు. **అమిత్** షా సభ ద్వారా ఫాయిదా పెద్దగా **రాక** పోయినా.. ఈ ప్రచారంతో **ఉన్నది** కూడా మట్టిగొట్టుకు పోయిందట. **ఇప్ప**టికే కేతిరెడ్డి దాటికి ఓటమి త**ప్పదన్న** నిర్ణయానికొచ్చిన సత్యకుమార్ **స్వపక్షం** నుంచి వచ్చే ఆరోపణలకు సమా**ధానమి**వ్వలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ట్రబులార్!



ఉండిలో పొత్తు పార్టీల అభ్యర్థి రఘురామకృష్ణరాజు(ట్రిపులార్)కు ఏం చేయాలనుకున్నా కలిసిరావట్లేదు. పచ్చ మీడియా ప్రోత్సాహంతో మూడునాలుగేళ్లు నోటికొచ్చింది మాట్లాడటం అలవాటైంది. ఇప్పుడు ప్రజల్లో ఉన్నాం కదా.. అని ఆ నోటి నుంచి మంచిగా మాటలు రావాలంటే ఎలా? తాజాగా ఆయన క్రిస్టియన్లపై వ్యంగ్యంగా మాట్లాడటంతో ఆ వర్గం నుంచి వ్యతిరేకత మొదలయింది. మరోవైపు బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస వర్మ కూడా ఆర్ఆర్ఆర్ పేరెత్తకుండా తానేం బ్యాంకుల లూటీ చేయలేదని, రుణాలు ఎగ్గొట్టలేదని కార్యకర్తల సమావేశంలో ఆయన గాలి తీసేశారు. ఒక్కొక్కరుగా దూరమవుతున్న స్థానిక నేతలతో పాటు, రోజు రోజుకూ కొత్త ఇబ్బందులు తలెత్తడంతో గెలుపు మాట దేవుడెరుక.. డిపాజిట్లు కోల్పోకుండా ఉంటే చాలనుకుంటున్నారట.

బాబొస్తే ఆరోగ్యశ్రీ గో..వింద({ref}



బీమా పేరుతో ఈ పథకాన్ని అటకెక్కించే కుట్ర	అదే జరిగితే పేదలకు ఉచిత వైద్యం మాయం
టీడీపీ మేనిఫెస్టో సాక్షిగా బట్టబయలు	ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా అంటూ బురిడీ

- టీడీపీ మేనిఫెస్టోలో లేని ఆరోగ్యశ్రీ, ఉచిత చికిత్సల ప్రస్తావన
- తొలి నుంచి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేలా చంద్రబాబు చర్యలు
- ఈ పెద్దమనిషి జమానాలో ప్రభుత్వ వైద్య రంగానికి సుస్తీ
- ఎలుకలు కొరికి చిన్నారులు మృతి చెందే దుస్థితిలో ప్రభుత్వాస్పత్రులు
- 2014-19 మధ్య ప్రొసీజర్‌లు పెంచకుండా ఆరోగ్యశ్రీ నిర్వీర్యం
- సీఎం జగన్ హయాంలో ఆరోగ్యశ్రీ బలోపేతం.. ప్రజారోగ్యానికి అండ
- విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ వైద్య రంగంలో సువర్ణాధ్యాయం
- 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- ఫ్యామిలీ డాక్టర్‌తో పల్లె చెంతకే వైద్యం.. విలేజ్ క్లినిక్‌తో భరోసా

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం రాష్ట్రంలోని 1.40 కోట్లకుపైగా కుటుంబాలకు ఆపద్బాంధవి. దురదృష్టవశాత్తు ఏదైనా జబ్బు చేస్తే ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని కార్పొరేట్ ఆస్పత్రులకు వెళితే చేతి నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా చికిత్స అందుతోంది. ఏదైనా శస్త్ర చికిత్స జరిగినా డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లాక విశ్రాంత సమయంలో సైతం ప్రభుత్వం ఆరోగ్య ఆసరా ద్వారా భృతి కూడా ఇస్తోంది. వెరసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు కష్టకాలంలో ఈ పథకం కొండంత అండగా నిలుస్తోంది.

-మిగతా III లో

ఇంతటి గొప్ప పథకంపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శీతకన్ను వేశారు. నాడు వైఎస్సార్‌కు, నేడు సీఎం జగన్‌కు ఎంతో మంచి పేరు తెచ్చిన ఈ పథకాన్ని ఏదోరకంగా కనుమరుగు చేయాలని కంకణం కట్టుకున్నారు. ఈ క్రమంలో 2014–19 మధ్య ఈ పథకానికి పూర్తిగా ప్రాధాన్యం తగ్గించారు. ప్రొసీజర్‌లు, నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను పెంచకుండా అధికారం లోంచి దిగిపోయేనాటికి అంపశయ్య పైకి ఎక్కించారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ఈ పథకానికి ఊపిరిలూదారు. దీంతో బాబుకు మింగుడు పడలేదు. ఇలా అయితే లాభం లేదనుకుని పెద్ద స్కెచ్చే వేశారు. బీమా పేరుతో మాయ చేసి, మేనిఫెస్టోలో ఆరోగ్యశ్రీ ప్రస్తావనే లేకుండా చేశారు.

2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేశాయి. వైద్యం, ఆరోగ్యం అంటూ నాలుగు అంశాలను పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మెరుగ్గా అమలు పరుస్తామని గానీ, పేద ప్రజలకు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు (క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్), రోగ నిర్ధారణ పరీక్షల సౌకర్యం కల్పిస్తామని ఎక్కడా ప్రస్తావించలేదు. దీన్నిబట్టి బాబు వస్తే ఆరోగ్యశ్రీ పథకం కనుమరుగవుతుందనడానికి టీడీపీ మేనిఫెస్టో ఒక సంకేతం అని రాజకీయ విశ్లేషకులు, వైద్య రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం డాక్టర్ వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. ట్రస్ట్‌లో ఎంప్యానెల్డ్ అయిన ఆస్పత్రుల్లో పేదలు, మధ్యతరగతి కుటుంబాల వారు చేతి నుంచి నగదు చెల్లించకుండానే పూర్తి స్థాయిలో చికిత్సలు పొందుతున్నారు. కాగా, టీడీపీ తాజా హామీని గమనించినట్లయితే వాళ్ల అధికారంలోకి వస్తే.. ట్రస్ట్ స్థానంలో థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ఏజెన్సీలను ప్రవేశపెట్టనున్నారని ఇట్టే తెలుస్తోంది. ఇప్పటి వరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వమే నేరుగా పథకాన్ని అమలు చేయడంతో ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. అదే ఇన్సూరెన్స్ ఏజెన్సీల చేతుల్లోకి వెళితే వారి లాభాపేక్ష వల్ల ప్రజలకు వైద్య సేవల కల్పన ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో సందేహమే లేదు.

ట్రస్ట్ అయితే అందులో ఎంప్యానెల్డ్ అయిన ఆస్పత్రులు ఏ ప్రొసీజర్స్‌కు అయినా నిర్దేశించిన రేట్స్ ప్రకారమే వైద్య సేవలు అందిస్తాయి. అంతకు మించి ప్రజల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడ్డానికి వీలుండదు. అలా వసూళ్లకు పాల్పడితే జిల్లా స్థాయిలో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ట్రస్ట్ సీఈవో ఆధ్వర్యంలో ఆస్పత్రులపై చర్యలు తీసుకునే ఒక వ్యవస్థ ఉంటుంది. అదే ప్రైవేట్ ఇన్సూరెన్స్ ఏజెన్సీలు వస్తే ఆస్పత్రులపై ప్రభుత్వ నియంత్రణ పోతుంది. ఇష్టారాజ్యంగా బిల్లులు వేసి ప్రజల నుంచి అదనపు వసూళ్లు చేస్తాయి. లేదంటే ఆస్పత్రి నుంచి బయటకు పంపించేస్తాయి.

'ఇంధన' సంస్కరణల్లో ఏపీ నవశకం..

సరికొత్త కాంతులు



విద్యుత్ రంగంలో మునుపెన్నడూ లేని విప్లవాత్మక విధానాలు

- ఐదేళ్లలో అనేక పాలసీలకు రూపకల్పన చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించేందుకు పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం–2020
- పీక్ పవర్ డిమాండ్‌ను చేరుకోవడానికి ఏపీ పంప్డ్ స్టోరేజీ పవర్ పాలసీ– 2022
- వాతావరణ కాలుష్యానికి విరుగుడుగా ఏపీ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ–2023
- ఈ పాలసీలపై దేశవ్యాప్తంగా ప్రశంసలు
- ఆంధ్రప్రదేశ్ విధానాలపై కేంద్రం సైతం ఆసక్తి
- భారీ పెట్టుబడులతో ముందుకొస్తున్న పెట్టుబడిదారులు

సాక్షి, అమరావతి: విద్యుత్ రంగంలో మునుపెన్నడూ ఎరుగని విప్లవాత్మక సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం–2020, ఏపీ పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ పాలసీ– 2022, ఏపీ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ– 2023లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు వివిధ రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం రాష్ట్ర ప్రభుత్వ ఇంధన విధానాలపై ఆసక్తి చూపుతోంది. ప్రపంచ వేదికలపైనా ఏపీపై ప్రశంసలు కురుస్తున్నాయి. మరోవైపు పారిశ్రామిక దిగ్గజాలు సైతం విద్యుత్ రంగంలో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తున్నారు.

ఇప్పటికే పట్టాలెక్కిన పలు ప్రాజెక్టులు..

విద్యుత్ ఉత్పత్తి సంస్థ (డిస్కం)లపై భారం పడకుండా, ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను ఎగుమతి చేసేందుకు పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన ఎగుమతి పాలసీ–2020ని నోటిఫై చేసింది. ఏపీ పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ పాలసీ–2022, ఏపీ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ–2023లను తీసుకొచ్చింది. వీటి ఫలితంగా విశాఖపట్నంలో జరిగిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సులో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో, గ్రీన్ హైడ్రోజన్, బయోడీజిల్, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్రాజెక్టుల పెట్టుబడి ప్రతిపాదనలపై పలు ఒప్పందాలు కుదిరాయి. ఓవైపు ప్రభుత్వ ప్రోత్సాహం, మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు రంగ పెట్టుబడులతో రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపన శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే అనేక ప్రాజెక్టులు పట్టాలెక్కగా, మరికొన్నిటికి ప్రాజెక్టు నివేదికలు సిద్ధమవుతున్నాయి. 11,225 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ ప్రాజెక్టు (8,025 మెగావాట్ల సౌర విద్యుత్, 3,200 మెగావాట్ల పవన విద్యుత్)లను ఇప్పటికే ప్రైవేట్‌కు కేటాయించారు. అలాగే ఏఎం గ్రీన్ ఎనర్జీ (ఆర్సెలర్ మిట్టల్ గ్రూప్) 700 మెగావాట్ల సౌర విద్యుత్, 300 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి పనులు పురోగతిలో ఉన్నాయి.

మెరుగుపడుతున్న పంపిణీ సౌకర్యాలు



నంద్యాల, కర్నూలు జిల్లాల్లో 2,300 మెగావాట్ల సౌర విద్యుత్, 250 మెగావాట్ల పవన విద్యుత్‌కు సంబంధించి గ్రీన్‌కో గ్రూప్ సైట్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ.. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) మొదటి దశలో 4,500 మెగావాట్ల ఆర్ఈ పవర్, రెండో దశలో 9,000 మెగావాట్ల ఆర్ఈ పవర్‌ను తరలించడానికి నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం నందిపాడు వద్ద మౌలిక సదుపాయాలతో పాటు 765 కిలోవాట్స్(కేవీ) సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తోంది. అలాగే 2 వేల మెగావాట్ల విద్యుత్‌ను తరలించడానికి అనంతపురం జిల్లాలోని గుంతకల్‌లో 400 కేవీ సబ్‌స్టేషన్‌ను

-మిగతా III లో

ప్రభుత్వ అక్రమాలను ఎత్తిచూపే పాత్రికే**యమే** రాజకీయ అవతారమెత్తితే...ఇంకేముంది.. **ప్రజాధ**నాన్ని ఎలా దోచుకోవాలో ...ఎంతగా **దోచుకో**వాలో ఆనుపానులు కనిపెడుతుంది...అ**నంత**పురం జిల్లాలోని కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న **నియో**జకవర్గంలో ఇలాంటి ప్రతినిధి ఒకరు పచ్చ **మీడి**యా అధినేత ఆశీస్సులతో టీడీపీలోకి ప్రవే**శించి,** మొదట ఎంపీ అయ్యారు.. అ తర్వాత **ఎమ్మెల్యే** అయ్యారు. చీఫ్‌విప్ ...మంత్రి పదవులూ **దక్కిం**చుకున్నారు.. పనిలోపనిగా గుడ్‌విల్ పేరిట **అక్రమా**ర్జన పనిలో పడ్డారు. అతి తక్కువ వ్యవ**ధిలోనే** రూ.1500 కోట్లను ఆర్జించారంటే ఈ నేత **దోపిడీ** పనితనం ఎంత గొప్పదో అర్థమవుతుం**ది.. ఇ**సుక... మట్టి, సాగునీటి ప్రాజెక్టులు.. చెరు**వుల** పూడికతీత పనుల్లో దోపిడీకి అవకాశమున్న మేరకు దోచుకున్నారు... ఈ అపర వెంకన్న దోపిడీ ధనం 'కాలువై' పొంగి పొర్లుతోంది.. ఆ దోపిడీ ప్రవాహం ఎలా సాగిపోయిందంటే....

- మాఫియాను తలపించిన ఇసుక, మట్టి వ్యాపారం
- నీరు–చెట్టు పేరుతో కోట్లు కొల్లగొట్టిన మాజీ మంత్రి
- బీటీపీ పనుల్లోనూ అంచనాలు పెంచి రూ.వందల కోట్ల దోపిడీకి ప్లాన్
- టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.1,500 కోట్ల అక్రమార్జన
- అన్ని పనుల్లోనూ మేత.. ప్రశ్నిస్తే ధర్నాలు...



అవినీతి 'కాలువ'

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆయన పేరు తిరుమల వేంకటేశ్వరుడికి పర్యాయ నామం. పేరుకు తగ్గట్టుగా వ్యవహరించడం ఆయనలో లేదు. మనిషిని చూస్తే తెల్లగా, ఎర్రగా కనిపించినా అవినీతిలో మాత్రం స్వభావం నలుపే. పాత్రికేయ వృత్తితో అతి సామాన్య జీవనం ఆరంభించినా, రాజకీయం రారమ్మని తలుపు తట్టింది. రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగి టీడీపీ అధినేత చంద్రబాబుకు విధేయుడిగా మార్కులు కొట్టేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పదవి దక్కించుకున్నారు. ఆ పార్టీ తరఫున ఎంపీగా ఓ సారి గెలిచి.. రెండో సారి ఓటమి పాలయ్యారు. తన జిత్తుల మారి ఎత్తులతో 2014లో అసెంబ్లీ టికెట్ సాధించుకున్నారు. స్వల్ప మెజార్టీతో ఎమ్మెల్యేగా గట్టెక్కారు. ఆ తర్వాత చీఫ్‌విప్‌గా ఉంటూ అమాత్యుడిగా అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ అవకాశాన్ని రెండు చేతులతో సద్వినియోగం చేసుకుని ఆర్థిక బకాసురుడిగా ఎదిగారు. ఇసుక నుంచి మట్టిదాకా.. ప్రాజెక్టుల నుంచి రోడ్ల వరకూ దేన్నీ వదలకుండా దోచేశారు. ప్రతి పనిలోనూ అంచనాలు పెంచి గుడ్‌విల్ పేరుతో దిగమింగారు. ఈ విషయాలను అప్పట్లో సొంత పార్టీ నేతలే బాహాటంగా వ్యతిరేకించారు. తల్లి పంట మేస్తే... పిల్ల మేర మేసినట్టు తామేమీ తక్కువ కాదన్నట్టు ఆ నాయకుడి అండదండలతో తమ్ముళ్లు అవినీతిలో మునిగి తేలారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో రూ.1,500 కోట్లకు పైగా అవినీతి సొమ్ము పోగుచేసి ఉంటారనే అభియోగాలు ఉన్నాయి. ప్రజల్లో హాట్‌టాపిక్‌గా నిలిచిన ఈ వ్యవహారం ఇప్పటికీ మరచిపోలేని పరిస్థితి. ఆ మరకను ఎదుటి వారికి అంటించి కడుక్కోవాలని చూసినా ప్రజలు నమ్మలేకపోతున్నారు. ఆ మాజీ నేత మళ్లీ ప్రజాప్రతినిధిగా గెలవడానికి చేయని పనులు లేవు.
అక్రమాల తీరిలా.. : జీడిపల్లి రిజర్వాయర్ నుంచి భైరవానితిప్ప (బీటీ) ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తెస్తామనే నెపంతో ప్రజలను నమ్మించే

-మిగతా III లో



జరుగు జరుగు అంటున్నాడు బాబు
ఇక్కడ జాగా లేదని జనం జవాబు

మీకు తెలుసా?!

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీల సంఖ్య 1951-52 తొలి ఎన్నికలతో పోలిస్తే ఏకంగా 12 రెట్లు పెరిగింది. తొలి ఎన్నికల్లో 53 పార్టీలు పాల్గొంటే 2019 నాటికి వాటి సంఖ్య 673కు పెరిగింది. అభ్యర్థుల సంఖ్య కూడా 1951లో 1,874 నుంచి 2019కల్లా 8,054కు పెరిగింది.

58 స్థానాల్లో రెడ్ అలెర్ట్!

నాలుగో దశలో బరిలో ఉన్న 21 శాతం అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

ప్రకృతి విపత్తుల సమయంలో అలెర్ట్‌లు జారీ చేయడం చూశాం. ఎక్కువ మందికి తెలియదు గానీ, ఎన్నికలప్పుడూ అలెర్ట్‌లు జారీ అవుతుంటాయి. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో 96 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో ఏకంగా 58 స్థానాల్లో రెడ్ అలెర్ట్ జారీ చేశారు! ఒక స్థానంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ముగ్గురు, అంతకంటే ఎక్కువ మందిపై క్రిమినల్ కేసులుంటే ఇలా చేస్తారు. ఓటర్లను అప్రమత్తం చేయడమే దీని ఉద్దేశం. నాలుగో దశలో మొత్తం 1,717 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 1,710 మంది అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫామ్స్ (ఏడీఆర్) విశ్లేషించింది. ప్రతి ఐదుగురిలో ఒకరిపై, 360 మందిపై క్రిమినల్ కేసులున్నట్టు వెల్లడించింది. వీరిలో 274 మందిపై తీవ్ర నేరారోపణలున్నాయి. 11 మందిపై హత్య, 50 మందిపై అత్యాచారం, మహిళలపై వేధింపులు, 44 మందిపై విద్వేషపూరిత ప్రసంగాల కేసులున్నాయి. బీజేపీ నుంచి 40 మంది (57 శాతం), కాంగ్రెస్ నుంచి 35 మంది (57 శాతం), మజ్లిస్ నుంచి ముగ్గురు (100 శాతం), ఆర్జేడీ నుంచి ఇద్దరు (50 శాతం), శివసేన (ఉద్ధవ్) నుంచి ఇద్దరు (50 శాతం), ఎస్పీ నుంచి ఏడుగురు (37 శాతం), బీజేడీ నుంచి ఇద్దరు (50శాతం), శివసేన నుంచి ఇద్దరు (67 శాతం), బీఆర్ఎస్ నుంచి 10 మంది (59 శాతం), టీడీపీ నుంచి 9 మంది (53 శాతం), టీఎంసీ నుంచి ముగ్గురిపై (38 శాతం) క్రిమినల్ కేసులున్నాయి.

ఉన్నత విద్యావంతులు సగం మంది

944 మంది (55%) డిగ్రీ, అంతకంటే ఎక్కువ చదివారు. 66 మంది డిప్లొమా చేశారు. 644 మంది (38 శాతం) ఆరో తరగతి నుంచి ఇంటర్ లోపు చదువుతో ఆపేశారు. 26 మందికి అక్షర జ్ఞానం లేదు.

మహిళలకు 10%

నాలుగో విడతలో మహిళలకు 10 శాతం సీట్లు దక్కాయి. 170 మంది మహిళలు పోటీ చేస్తున్నారు. 642 మంది (38 శాతం) 15-40 ఏళ్ల మధ్య వయస్కులు. 842 మంది 41-60 ఏళ్ల లోపువారు.

28 శాతం మంది కోటీశ్వరులు

నాలుగో విడతలో బరిలో ఉన్న కోటీశ్వరుల్లో తొలి మూడు స్థానాల్లోనూ తెలుగువారే ఉన్నారు! చంద్రశేఖర్ పెమ్మసాని (టీడీపీ) రూ.5,705 కోట్లతో దేశంలోనే అత్యంత సంపన్నుడిగా నిలిచారు. తర్వాతి స్థానాల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ) రూ.4,568 కోట్లు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (టీడీపీ) రూ.716 కోట్లతో ఉన్నారు. 476 మంది (28 శాతం)కి రూ.కోటి, అంతకంటే ఎక్కువ ఆస్తి ఉంది. బీజేపీలో 65 మంది (93 శాతం), కాంగ్రెస్‌లో 56 మంది (92 శాతం) కోటీశ్వరులే. టీడీపీ, జేడీ(యూ), శివసేన (ఉద్ధవ్), బీజేడీ, ఆర్జేడీ, శివసేన అభ్యర్థులంతా కోటీశ్వరులే. 24 మంది తమకెలాంటి ఆస్తులూ లేవని ప్రకటించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మహా మహులకూ తప్పని... ఓటమి

అంబేడ్కర్ నుంచి అరుణ్‌జైట్లీ దాకా...

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ప్రజలు ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇస్తారో, ఏ అనామకున్ని అందలమెక్కిస్తారో, ఏ దిగ్గజాన్ని తిరస్కరిస్తారో అనూహ్యం. తిరుగులేదనుకున్న మహామహ నేతలు ఓటమిపాలైన ఉదంతాలు మన దేశ ఎన్నికల చరిత్రలో ఎన్నో! అలాంటి పది మంది దిగ్గజ నేతల అనూహ్య ఓటమి చరిత్రను ఓసారి చూద్దాం...

– సాక్షి, నేషనల్ డెస్క్

బాబా సాహెబ్ అంబేడ్కర్




రాజ్యాంగ నిర్మాతగా యావద్దేశానికీ ప్రాతఃస్మరణీయుడు. అంతటి మహా నాయకుడు కూడా ఎన్నికల్లో ఓడతారని ఊహించగలమా?! కానీ 1951-52లో జరిగిన దేశ తొలి సార్వత్రిక ఎన్నికల్లో అంబేడ్కర్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది! నార్త్ బాంబే లోక్‌సభ నుంచి పోటీచేసి ఓడిపోవడమే కాదు, ఏకంగా నాలుగో స్థానంలో నిలిచారాయన! ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విఠల్ బాలకృష్ణ గాంధీ గెలుపొందారు.

సీకే జాఫర్ షరీఫ్



భారత రైల్వేల్లో స్వర్ణ యుగానికి నాంది పలికిన దార్శనికుడు. కాంగ్రెస్ సీనియర్ నేతల్లో ఒకరు. 2004లో తొలిసారి లోక్‌సభ ఎన్నికల ఎన్నికల బరిలో దిగిన హెచ్‌టీ సాంగ్లియానా చేతిలో ఓటమి చవిచూశారు. అప్పటిదాకా డీజీపీగా ఉన్న సాంగ్లియానా బీజేపీ ఆహ్వానం మేరకు పదవీ విరమణ చేసి పార్టీలో చేరారు. పాత బెంగళూరు ఉత్తర లోక్‌సభ స్థానం నుంచి బరిలో దిగి షరీఫ్‌పై విజయం సాధించారు.

సోమనాథ్ ఛటర్జీ



సీపీఎం దిగ్గజం. పదిసార్లు లోక్‌సభ సభ్యునిగా గెలిచిన ఎదురులేని నేత. 1971లో తొలిసారి సీపీఎం తరఫున పశ్చిమబెంగాల్లోని బుర్ద్వాన్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1984లో మాత్రం జాదవ్‌పూర్ లోక్‌సభ స్థానంలో యువ సంచలనం మమతా బెనర్జీ చేతిలో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత మాత్రం 1989 నుండి 2004 వరకు సోమనాథ్ విజయ పరంపర సాగింది. సీపీఎం కంచుకోటగా భావించే బోల్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి 2004లో పదోసారి గెలిచి 14వ లోక్‌సభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇందిరాగాంధీ




దేశ రాజకీయాల్లో అజేయ శక్తిగా వెలిగిపోయిన నాయకురాలు. తొలి, ఏకైక మహిళా ప్రధాని. దశాబ్దానికి పైగా తిరుగులేని అధికారం చలాయించిన ఇందిర 1977 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకతలో కొట్టుకుపోయారు. ఎమర్జెన్సీ నిర్ణయం ఆమె ఏకైక ఎన్నికల ఓటమికి బాటలు వేసింది. రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానంలో సోషలిస్టు పార్టీ ప్రముఖుడు, రాం మనోహర్ లోహియా సన్నిహితుడు రాజ్‌నారాయణ్ చేతిలో ఇందిర ఓటమి చవిచూశారు. ఆయన 1971 లోక్‌సభ ఎన్నికల్లో కూడా సంయుక్త సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా ఇందిరపై పోటీ చేసి ఓడిపోయారు. కానీ ఇందిర అవినీతికి పాల్పడ్డారని, ఆమె ఎన్నిక చెల్లదని కోర్టుకెక్కారు. ఇది అంతిమంగా ఎమర్జెన్సీ విధింపుకు దారితీయడం విశేషం! రాజ్‌నారాయణ్ వాదనతో అలహాబాద్ హైకోర్టు ఏకీభవించింది. రాయ్‌బరేలీ నుంచి ఇందిర ఎన్నిక చెల్లదని ప్రకటించింది. అంతేగాక ఆరేళ్ల పాటు లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధం విధించింది. దాంతో చిర్రెత్తుకొచ్చిన ఇందిర 1975లో దేశమంతటా ఎమర్జెన్సీ విధించారు. 1977లో ఎమర్జెన్సీ ఎత్తేసి లోక్‌సభ ఎన్నికలకు వెళ్లి రాజ్‌నారాయణ్ చేతిలో 50 వేల పైగా ఓట్ల తేడాతో ఓడారు. ఇది భారత ఎన్నికల చరిత్రలోనే సంచలనాత్మక ఫలితంగా నిలిచిపోయింది.

దేవెగౌడ



అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడు. ప్రధానిగా దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. అనంతరం కర్నాటక రాజకీయాల్లో కింగ్ మేకర్ అయ్యారు. ఆయనకు కూడా లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. 2004లో కర్నాటకలోని కనకపుర నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నేత తేజస్వినీ గౌడ రమేశ్ చేతిలో లక్ష పై చిలుకు ఓట్ల తేడాతో ఓడిపోయారు.

మినూ మసాని




మినోచర్ రుస్తోమ్ మసాని. స్వాతంత్ర్య సమరయోధుడు. స్వతంత్ర పార్టీ అగ్ర నేత. మూడుసార్లు పార్లమెంటు సభ్యుడు, ఇండియన్ లిబరల్ గ్రూప్ థింక్ ట్యాంక్ వ్యవస్థాపకుల్లో ఒకరు. సంపాదకుడు, సామాజిక కార్యకర్త. ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి. అసమానతలకు వ్యతిరేకంగా బలమైన గొంతుక వినిపించిన మసాని 1971 లోక్‌సభ ఎన్నికల్లో రాజ్‌కోట్ నుంచి ఓటమి చవిచూడాల్సి వచ్చింది. కాంగ్రెస్ నాయకుడు ఘన్‌శ్యామ్ బాయ్ ఓజా చేతిలో 60,000 ఓట్లకు పైగా తేడాతో ఓడిపోయారు.

బిజోయ్ కృష్ణ హండిక్




గొప్ప విద్యావేత్త. కాంగ్రెస్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలుపొందిన తిరుగులేని అస్సామీ నేత. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. జోర్హాట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కేపీ తాసా ఆయనపై లక్ష ఓట్ల పై చిలుకు మెజారిటీతో గెలుపొందారు.

అటల్ బిహారీ వాజ్‌పేయ్




రాజకీయ దురంధరుడు. భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు. అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్న ఆయనకూ ఎన్నికల ఓటమి తప్పలేదు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన కీలక కాంగ్రేసేతర నేతల్లో వాజ్‌పేయి ఒకరు. గ్వాలియర్‌లో కాంగ్రెస్ నేత మాధవరావు సింధియా రెండు లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో ఆయనపై విజయం సాధించారు.

అరుణ్ జైట్లీ



పార్టీలకతీతంగా అందరూ మెచ్చిన నేత. ప్రధాని నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితుడు. కేంద్ర ఆర్థిక మంత్రిగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తొలిసారి మోదీ హవా కొనసాగిన 2014 లోక్‌సభ ఎన్నికల్లో అరుణ్ జైట్లీ మాత్రం ఓటమి చవిచూశారు. అమృత్‌సర్ లోక్‌సభ స్థానం నుంచి పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరిందర్ సింగ్ లక్ష ఓట్ల పై చిలుకు మెజారిటీతో జైట్లీపై గెలుపొందారు.

పీవీ నరసింహారావు



పాములపర్తి వేంకట నరసింహారావు. ప్రధాని పదవిని అధిష్టించిన తొలి దక్షిణాది వ్యక్తి. ఒకే ఒక్క తెలుగువాడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థను విప్లవాత్మక సంస్కరణలతో పట్టాలెక్కించి ఆధునిక బాట పట్టించిన దార్శనికుడు. అంతటి నాయకునికి కూడా ప్రధాని కాకమునుపు ఓటమి తప్పలేదు. 1984 ఎన్నికల్లో బీజేపీ దేశవ్యాప్తంగా గెలిచిన రెండు లోక్‌సభ స్థానాల్లో తెలంగాణలోని హన్మకొండ ఒకటి. బీజేపీ అభ్యర్థి చందుపట్ల జంగారెడ్డి అక్కడ పీవీపై విజయం సాధించారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌పై సానుభూతి వెల్లువెత్తినా ఆ పార్టీ తరఫున పోటీ చేసిన పీవీ మాత్రం ఓటమి చవిచూడటం విశేషం.

బీజేపీకి గట్టి పోటీ

ఉత్తరప్రదేశ్‌లో ఆసక్తికరంగా నాలుగో విడత పోరు

కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో నాలుగో విడత పోలింగ్‌పై అంతటా ఆసక్తి నెలకొంది. మొత్తం 80 లోక్‌సభ సీట్లకు గాను తొలి మూడు విడతల్లో 26 చోట్ల ఎన్నికలు పూర్తవగా నాలుగో విడతలో 13 స్థానాలకు పోలింగ్ జరగనుంది. పార్టీలన్నీ జోరుగా ప్రచారంలో తలమునకలయ్యాయి. ఆర్‌ఎల్డీ, అప్నాదళ్, బీజేపీ కూటమి ఒకవైపు; కాంగ్రెస్, ఎస్పీలతో కూడిన ఇండియా కూటమి మరోవైపు మోహరించాయి. బీఎస్పీ ఒంటరి పోరాటం చేస్తోంది. గత రెండు ఎన్నికల్లోనూ రాష్ట్రంలో ఆధిపత్యం చెలాయించిన బీజేపీకి ఈసారి విపక్షాలు గట్టిపోటీ ఇస్తున్నాయి. 13వ తేదీన పోలింగ్ జరగనున్న 13 సీట్లూ గత ఎన్నికల్లో బీజేపీ నెగ్గినవే. వాటిలో కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్

కన్నౌజ్.. అఖిలేశ్‌కు బస్తీమే సవాల్



• అఖిలేశ్

సమాజ్‌వాదీ పార్టీకి కంచుకోట వంటి ఈ స్థానం గత ఎన్నికల్లో బీజేపీ పరమైంది. 'నేతాజీ' ములాయం సింగ్ యాదవ్, కుమారుడు అఖిలేశ్, కోడలు డింపుల్ ముగ్గురూ గెలిచిన నియోజకవర్గమిది. 1998 నుంచీ 2014 వరకు ఎస్పీ గుప్పిట్లోనే ఉంది. అలాంటి చోట 2019లో డింపుల్‌పై బీజేపీ నేత సుబ్రత్ పాఠక్ 12,353 ఓట్ల స్వల్ప మెజారిటీతో నెగ్గారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఎస్పీకి ప్రతిష్ఠాత్మకమైన ఈ స్థానాన్ని ఎలాగైనా చేజిక్కించుకునేందుకు పార్టీ చీఫ్ అఖిలేశ్ స్వయంగా రంగంలోకి దిగడంతో ఇది దేశంలోనే హాట్ సీట్‌గా మారింది. తొలుత అఖిలేశ్ మేనల్లుడు తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. కార్యకర్తల్లో అసంతృప్తి కారణంగా అఖిలేశే బరిలో దిగారు. ఆయన ఇక్కడ మూడుసార్లు నెగ్గారు. 2012లో నియోజకవర్గాన్ని భార్య డింపుల్‌కు అప్పగించి సీఎం అయ్యారు. కాంగ్రెస్‌తో పొత్తు ఎస్పీకి కలిసొచ్చే అంశం. బీఎస్పీ నుంచి ఇమ్రాన్ బిన్ జాఫర్ బరిలో ఉన్నారు.

ఉన్నావ్.. మహారాజ్ హ్యాట్రిక్ గురి



• అనూ టాండన్

వివాదాస్పదుడైన సిట్టింగ్ ఎంపీ సాక్షి మహారాజ్‌కే బీజేపీ మళ్లీ టికెటిచ్చింది. పీహెచ్‌డీ చేసినా సాధువులా కాషాయం ధరించే ఆయనకు దేశవ్యాప్తంగా ఆశ్రమాలు, విద్యా సంస్థలున్నాయి. ఎస్పీ నుంచి గత రెండు ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చిన అరుణ్ శంకర్ శుక్లా బదులు అనూ టాండన్ బరిలో ఉన్నారు. ఆమె గత రెండు ఎన్నికల్లో ఓడాక 2020లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి ఎస్పీ గూటికి చేరారు. బీఎస్పీ నుంచి అశోక్ కుమార్ పాండే రేసులో ఉన్నారు.

షాజహాన్‌పూర్... స్వతంత్రుని సవాల్



• రాజేశ్ కశ్యప్

గత రెండు ఎన్నికల్లో ఇక్కడ బీజేపీయే నెగ్గింది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ, ప్రముఖ దళిత నేత అరుణ్ కుమార్ సాగర్ బరిలో ఉన్నారు. ఎస్పీ తొలుత రాజేశ్ కశ్యప్‌కు టికెటిచ్చినా తర్వాత జ్యోత్స్న గోండ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. దాంతో కశ్యప్ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి గట్టి సవాలు విసురుతున్నారు. బీఎస్పీ దొద్రామ్ వర్మను పోటీలో నిలిపింది.

సీతాపూర్... ఎస్పీ పట్టు



• నకుల్ దూబే

ఒకప్పుడు బీఎస్పీకి గట్టి పట్టున్న ఈ స్థానంలో కమలనాథులు పాగా వేశారు. దాదాపు 22 ఏళ్ల పాటు బీఎస్పీలో కీలక నేతగా ఉన్న రాజేశ్ వర్మ 2013లో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. 2014లో బీజేపీ అభ్యర్థిగా బీఎస్పీని మట్టికరిపించారు. 2019లో కూడా విజయం ఆయన్నే వరించింది. ఈసారీ వర్మనే బీజేపీ బరిలో నిలిపింది. మాయావతి ప్రభుత్వంలో మంత్రిగా చేసి 2019లో వర్మ చేతిలో పరాజయం పాలైన బీఎస్పీ నేత నకుల్ దూబే ఈసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. బీఎస్పీ నుంచి మహేంద్ర సింగ్ యాదవ్ బరిలో నిలిచారు.

కాన్పూర్... బరిలో మాజీ జర్నలిస్ట్



• అలోక్ మిశ్రా

కాన్పూర్లో 12 శాతం ఎస్సీ ఓటర్లుంటారు. బ్రాహ్మణులు, వైశ్యులు, ముస్లింలతో పాటు పంజాబీ ఓటర్ల సంఖ్యా ఎక్కువే. ఈ పారిశ్రామిక నియోజకవర్గంలో గత రెండు ఎన్నికలుగా కాషాయ జెండానే ఎగురుతోంది. సిట్టింగ్ ఎంపీ సత్యదేవ్‌ను పక్కనపెట్టి మాజీ జర్నలిస్టు రమేశ్ అవస్థీకి బీజేపీ టికెటిచ్చింది. ఎస్పీ దన్నుతో కాంగ్రెస్ పార్టీ అలోక్ మిశ్రాను నిలబెట్టింది. బీఎస్పీ కుల్దీప్ బదౌరియాను బరిలోకి దించింది.

ఖేరి... తేనికి ఎదురుగాలి!



• అజయ్ మిశ్రా తేని

ఇక్కడ గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ నేత, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తేని గెలిచారు. ఈసారి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నా పరిస్థితులు ఆయనకు అంత సానుకూలంగా కన్పించడం లేదు. ఇండియా కూటమి తరఫున ఎస్పీ అభ్యర్థి ఉత్కర్ష్ వర్మ గట్టి పోటీ ఇస్తున్నారు. బీఎస్పీ నుంచి అన్షయ్ కల్రా బరిలో నిలిచారు.



• పంకజా ముండే

ఫైర్‌బ్రాండ్ లీడర్

పంకజా ముండే. మహారాష్ట్ర మాజీ మంత్రి. బీజేపీ ఫైర్‌బ్రాండ్ లీడర్లలో ఒకరు. పవర్‌ఫుల్ పొలిటీషియన్‌గా పేరు తెచ్చుకున్నారు. బీజేపీ నేత దివంగత గోపీనాథ్ ముండే పెద్ద కూతురు. చెల్లెలు ప్రీతంతో కలిసి ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. బీజేపీలో ఓబీసీ నాయకురాలిగా గుర్తింపు పొందారు. ఈసారి బీడ్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

వివాదాల మంత్రిగా..

పంకజ 1979 జూలై 26న జన్మించారు. ఆ మరుసటేడాదే తండ్రి గోపీనాథ్ పర్లీ ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత వరుసగా ఐదుసార్లు విజయ ఢంకా మోగించారు. అలా పంకజ బాల్యం నుంచే తండ్రి రాజకీయాలను చూస్తూ పెరిగారు. విద్యార్థిగా, యువజన నాయకురాలిగా బీజేపీలో చురుగ్గా పనిచేశారు. 2009లో తండ్రి బీడ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. దాంతో పర్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలవడం ద్వారా పంకజ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఇది కుటుంబంలో చీలికకూ కారణమైంది. గోపీనాథ్ రాజకీయ వారసుడినని భావించిన సోదరుడి కొడుకు ధనంజయ్ ముండే తిరుగుబాటు చేసి ఎన్సీపీలో చేరారు. తర్వాత 2014లోనూ పర్లీ నుంచి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచారు పంకజ. ఫడ్నవీస్ ప్రభుత్వంలో మహిళా, శిశు సంక్షేమ మంత్రిగా చేశారు. ఆ సమయంలో పలు వివాదాలకూ కేంద్రమయ్యారు. 2017లో పవర్‌ఫుల్ పొలిటీషియన్ అవార్డు అందుకున్నారు. 2019లో ధనంజయ్ ముండే చేతిలో ఓడిపోయారు. ఒక దశలో బీజేపీని వీడతారని వార్తలొచ్చినా వాటిని కొట్టిపారేశారు.

ఈసారి చెల్లిని కాదని...

2014లో గోపీనాథ్ మరణంతో బీడ్ లోక్‌సభ స్థానం ఖాళీ అయ్యింది. పంకజ ఎమ్మెల్యేగా ఉండటంతో చెల్లి డాక్టర్ ప్రీతం ముండేను బీడ్ ఉప ఎన్నిక బరిలో దింపారు. లోక్‌సభ ఎన్నికల చరిత్రలోనే రికార్డు స్థాయిలో ఆమె ఏకంగా 6,96,321 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2019లోనూ ప్రీతం 1.68 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారి ఆమెను పక్కన పెట్టి పంకజకు బీజేపీ బీడ్ టికెటిచ్చింది.

'గోపీనాథ్ గడ్' ప్రతిష్ఠాన్ సేవ..

పంకజ ముంబైలోని జై హింద్ కాలేజీలో హెచ్ఎస్సీ, రుయా కళాశాలలో ఎంబీఏ చేశారు. ఐటీ నిపుణుడు అమిత్ పాల్వేను పెళ్లాడారు. 'లోక్‌నేత గోపీనాథ్ ముండే' పేరుతో తండ్రి జీవిత చరిత్ర రాశారు. తండ్రి ఘనంగా నిర్వహించిన 'దసరా మేళావ' సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. పర్లీలో గోపీనాథ్ ముండే స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. 'గోపీనాథ్ గడ్' ప్రతిష్ఠాన్ పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అందరినీ కలుపుకొని వెళ్తా..

మరాఠ్వాడా ప్రాంతంలోని లోక్‌సభ అభ్యర్థులందరికీ ఎదురవుతున్న ప్రధాన సమస్య మరాఠా రిజర్వేషన్లు. ఈ విషయంలో షిండే సారథ్యంలోని మహాయుతి సంకీర్ణ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత చవిచూస్తోంది. ఓబీసీ సామాజికవర్గానికి చెందిన నేతగా పంకజకూ ఆ సెగ తగులుతోంది. విపరీతమైన ట్రోలింగ్‌కూ గురయ్యారు. అయినా, "అన్ని వర్గాల ప్రజలూ నావాళ్లే. మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను కలుపుకొని వెళ్తా. నా సాయం కోసం వచ్చిన వారి కులం ఎన్నడూ చూడలేదు. నియోజకవర్గ సమస్యలన్నింటినీ పరిష్కరించడానికే నా తొలి ప్రాధాన్యం" అంటున్నారు పంకజ.



ఇవిగో నవరత్నాల వెలుగులు

పైరవీలకు తావు లేకుండా పథకాలు అందాయి



మేం రజకవృత్తి చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. గత ప్రభుత్వ హయాంలో మా కుటుంబానికి ఎలాంటి లబ్ధి కలగలేదు. ఎదుగూ బొదుగూ లేని జీవితాన్ని గడిపాం. ఇంటికోసం ఎన్నోమార్లు వేడుకున్నా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అందిన సంక్షేమ పథకాల వల్ల మా పరిస్థితులు మెరుగుపడ్డాయి. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ. పదివేలు వంతున అందింది. మా పిల్లలు రేణుక, ధనుష్ 7, 9 తరగతులు చదువుతున్నారు. ధనుష్‌కు స్కూల్‌లో ట్యాబ్‌ను ప్రభుత్వం అందించింది. ఇంకా అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల వంతున ప్రయోజనం చేకూరింది. మాకు సొంతంగా ఇల్లు లేనందున పద్మనాభం మండలంలో రూ.3 లక్షల విలువైన ఇంటి స్థలం ఇచ్చారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి మా అర్హతను బట్టి పథకాలకోసం దరఖాస్తు చేయించి, మంజూరు చేయించారు. మా బతుకులు నిలబెట్టిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– పొగిరి లక్ష్మి, బాలాజీనగర్

సాఫీగా సాగుతున్న కుటుంబ జీవనం



మాది మధ్యతరగతి కుటుంబం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో నేను కిరాణా వ్యాపారం చేసుకుంటున్నాను. అరకొర ఆదాయంతో బతుకు భారంగా గడిచింది. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి సాయం అందలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మా ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. నా భార్య భాగ్యమహలక్ష్మికి వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 అందింది. మాకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. మా అమ్మాయి టైలరింగ్ చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ఆమెకు జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు మంజూరైంది. అనారోగ్యానికి గురైన నాకు చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.లక్ష బ్యాంకు ఖాతాకు జమయింది. ప్రతి నెలా పింఛను అందుతోంది. మా బతుకులు మెరుగుపర్చిన ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– లక్కింశెట్టి వీర వెంకట సత్యనారాయణ, మోరి

బాబొస్తే ఆరోగ్యశ్రీ గో..విందా

ఆరోగ్యశ్రీ ప్రస్తావనే లేని 2024 టీడీపీ మేనిఫెస్టో

- రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకూ ఆరోగ్య బీమా
- ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డు
- అన్ని మండలాల్లో జనరిక్ ఔషధ కేంద్రాలు
- బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులకు జనరిక్ మందులు



2024 వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో

- రాష్ట్రంలో ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలలతో పాటు, మరో 12 కళాశాలల నిర్మాణం పూర్తి చేసి ఐదేళ్లలో అందుబాటులోకి తేవడం.తద్వారా 2,550 ఎంబీబీఎస్, 2,737 పీజీ మెడికల్ సీట్లు సమకూర్చడం.
- కొత్తగా 17 నర్సింగ్ కాలేజీలు తేవడం ద్వారా అందుబాటులోకి 1,020 నర్సింగ్ సీట్లు.
- హృద్రోగ బాధితుల కోసం విశాఖ, గుంటూరు, కర్నూలులో మూడు వైద్య హబ్‌ల ఏర్పాటు.
- క్యాన్సర్ వైద్యాన్ని మరింత బలోపేతం చేసేలా గుంటూరు, కర్నూలు, విశాఖ, కడప, కాకినాడ, అనంతపురంలో క్యాన్సర్ కేర్ సెంటర్‌లు.
- గడచిన ఐదేళ్లలో మాదిరిగానే వచ్చే ఐదేళ్లలోనూ ప్రజారోగ్య రంగానికి ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గకుండా చర్యలు. వైద్య రంగ అభివృద్ధిని కొనసాగిస్తాం.

పై రెండు మేనిఫెస్టోలు గమనిస్తే ప్రజారోగ్యం పట్ల ఏ నాయకుడికి ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థం అవుతుంది. మూడు సార్లు సీఎంగా పనిచేశా.. విజనరీనని చెప్పుకునే నాయకుడు ప్రజారోగ్యం పట్ల ఉజ్జాయింపుగా నాలుగంటే నాలుగే హామీలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సీఎం జగన్ మాత్రం ప్రజారోగ్యం విషయంలో గడచిన ఐదేళ్లలో దేశంలో ఏ రాష్ట్రంలో లేనట్టుగా ప్రజారోగ్యం విషయంలో రాజీ పడకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్నో సంస్కరణలు తీసుకుని వచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచారు. ఆ ఒరవడిని అదే విధంగా కొనసాగిస్తూ వచ్చే ఐదేళ్లలోను ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తానని తన మేనిఫెస్టోలో ప్రకటించారు.

సాక్షి, అమరావతి: వైద్య, విద్యా రంగాలను ప్రైవేట్ పరం చేయాలన్నది చంద్రబాబు లక్ష్యం. ఇందులో భాగంగానే తొలి నుంచీ ఆయన ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తూ వచ్చారు. 2014 ఎన్నికల సమయంలో 'ఆరోగ్యశ్రీలో వ్యాధులన్నింటినీ చేర్చి, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలు, చికిత్స, ఆపరేషన్ సౌకర్యం కల్పిస్తాం' అని టీడీపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక తూతూ మంత్రంగా ప్రొసీజర్‌లను పెంచి చేతులు దులుపుకున్నారు. 2007లో వైఎస్సార్ హయాంలో 942 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి ప్రారంభిస్తే, చంద్రబాబు ప్రభుత్వం పథకాన్ని ఎన్టీఆర్ వైద్య సేవగా పేరు మార్చి, కేవలం 117 వ్యాధులను మాత్రమే పెంచింది. అయినా వాటికి ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స సరిగా అందని దుస్థితి. వివిధ అనారోగ్య బాధితులకు చికిత్సలు అందించడానికి ఆస్పత్రుల నుంచి ట్రస్టుకు అభ్యర్థనలు వచ్చినా వాటిని రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచేవారు. దీంతో చేసేదేమీ లేక చికిత్సలు చేయించుకోవడానికి ప్రజలు అప్పులపాలైన దుస్థితి. ఈ ఐదేళ్ల పాలనలో ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి, విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి సీఎం జగన్ ప్రజలకు అండగా నిలిచారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.5 లక్షల్లోపు వార్షికాదాయ కుటుంబాలను పథకం పరిధిలోకి తెచ్చి, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలిచారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.25 లక్షల వరకు వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు. 1,059గా ఉన్న ప్రొసీజర్‌లను ఏకంగా 3,257కు పెంచారు. తద్వారా ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఉచిత చికిత్సల కోసం రూ.13,421 కోట్లు వెచ్చించారు. ఆరోగ్య ఆసరా కింద రూ.1,465 కోట్ల మేర శస్త్ర చికిత్సలు చేయించుకున్న 24.59 లక్షల మందికి సాయం చేశారు.

జగన్, బాబు పాలన మధ్య ఎంతో తేడా!



అంశం: కొత్త వైద్య కళాశాలలు

జగన్ పాలన: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనట్టుగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు. ఇందుకోసం ఏకంగా రూ.8,480 కోట్లు వెచ్చిస్తున్నారు. అన్ని ప్రాంతాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు చేరువ చేస్తున్నారు. ఇప్పటికే విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను ప్రారంభించి ఒకే ఏడాది 750 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లు కల్పించారు. ఈ విద్యా సంవత్సరం మరో ఐదు, వచ్చే విద్యా సంవత్సరం మిగిలిన ఏడు కళాశాలలు ప్రారంభించేలా ప్రణాళికలు రచించారు.

బాబు పాలన: టీడీపీ అధికారంలో ఉండగా ఏ రోజు ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలల ఏర్పాటుకు పాటుపడింది లేదు. వైద్య విద్యను వ్యాపారం చేసి తన వాళ్ల జేబులు నింపడానికే పాటుపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 16 ప్రైవేట్ వైద్య కళాశాలలకు బాబు పాలనలో అనుమతులు ఇవ్వడమే ఇందుకు నిదర్శనం.

అంశం : గ్రామీణ ప్రజల ఆరోగ్యం



జగన్ పాలన: పీహెచ్‌సీ వైద్యులనే గ్రామాలకు పంపి ప్రజలకు వైద్య సేవలు అందించారు. మంచానికే పరిమితం అయిన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి, వారి ఆరోగ్యాలపై వాకబు చేశారు. 2,500 జనాభాకు ఒకటి చొప్పున 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. వీటిల్లో బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)లను నియమించారు. తద్వారా 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలతో పాటు, 105 రకాల మందులను అందుబాటులో ఉంచి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. వీటికి తోడు విలేజ్ క్లినిక్స్‌లో టెలీ మెడిసిన్ సౌకర్యం ఉండటంతో స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ సైతం ఇక్కడే లభిస్తుండటంతో పట్టణాలు, నగరాల్లోని పెద్దాస్పత్రులకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం ఉండటం లేదు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వమే ఇళ్ల వద్దకు మందుల డోర్ డెలివరీ ప్రారంభించింది.

బాబు పాలన: పల్లె ప్రజలకు సుస్తీ చేస్తే పట్టణాలు, నగరాలకు పరుగులు తీయాల్సిందే. ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమం ఉండేది కాదు. విలేజ్ క్లినిక్ వ్యవస్థ ఊసే లేదు. పీహెచ్‌సీలకు వెళితే అక్కడ డాక్టర్‌లు ఉంటారో లేదో తెలియని దుస్థితి. దీంతో చిన్న అనారోగ్య సమస్య వచ్చినా, వ్యయప్రయాసలకోర్చి పరుగు తీయాల్సిన పరిస్థితి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందుల పంపిణీ, క్రమం తప్పకుండా వారి ఆరోగ్యంపై వాకబు చేసే వ్యవస్థ లేక, ప్రజలు జబ్బు ముదిరి అప్పులపాలయ్యేవారు.

అంశం : ఇంటింటా ఆరోగ్య సర్వే

జగన్ పాలన: అందరి ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను ప్రవేశపెట్టింది. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి, వైద్య పరీక్షలు నిర్వహించి వివిధ అనారోగ్య బాధితులను గుర్తించారు. వారికి పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడికక్కడ సురక్ష శిబిరాలు నిర్వహించి స్పెషలిస్టు వైద్యులతో ఉచితంగా వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్న వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించి, ఉచితంగా చికిత్స చేయించారు.

బాబు పాలన: ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమం నిర్వహించిందే లేదు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్యాన్ని వాకబు చేసి, వాటి పరిష్కారానికి కనీసం ఆలోచించిన పాపాన పోలేదు.



అంశం: ఆస్పత్రుల్లో నాడు-నేడు

జగన్ పాలన: వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించగానే నాడు–నేడు కార్యక్రమంల ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశారు. రూ.16,880 కోట్లతో ఆస్పత్రుల భవనాలకు మరమ్మతులు, పాతవాటి స్థానంలో కొత్తవాటి నిర్మాణం, 17 కొత్త వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం చేపట్టారు. జాతీయ ప్రమాణాలతో ఆస్పత్రుల్లో వనరులను సమకూర్చారు. దీంతో 640 ఆస్పత్రులకు నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ (ఎన్‌క్వాష్), 42 ఆస్పత్రులకు ముస్కాన్, 2022–23లో 3,161 ఆస్పత్రులకు కాయకల్ప గుర్తింపుతో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ నిలిచింది. కేరళ సైతం ఈ అంశాల్లో ఏపీ కన్నా ఎంతో వెనుకబడి ఉంది. ఆస్పత్రుల్లో ఏ ఒక్క వైద్య, సిబ్బంది పోస్టు ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా ఐదేళ్లలో 54 వేల మేర పోస్టులు భర్తీ చేసి రికార్డు సృష్టించారు. 108 వ్యవస్థకు ఊపిరిలూదుతూ రూ.136 కోట్లతో 768 అంబులెన్స్‌లు సమకూర్చి సేవలు విస్తరించారు. ఫ్యామిలీ డాక్టర్ అమలు కోసం రూ.166 కోట్లతో 104 వాహనాలు సమకూర్చారు. మొత్తం 936 వాహనాలు సేవలందిస్తున్నాయి.

బాబు పాలన: రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేసేలా టీడీపీ జమానాలో ఏ ఒక్క కార్యక్రమం చేపట్టలేదు. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందులు, సర్జికల్స్, ఇతర వనరులకు తీవ్ర కొరత ఉన్నప్పటికీ నిమ్మకు నీరెత్తినట్టుగానే బాబు వ్యవహరించారు. 2014–19 మధ్య గుంటూరు జీజీహెచ్‌లో ఎలుకలు కొరికి శిశువు మృతి చెందడం బాబు పాలనలో దిగజారిన ప్రభుత్వ వైద్య రంగ దుస్థితికి నిదర్శనం. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన అనంతరం గుణపాఠంతో ఆస్పత్రులను బలోపేతం చేసేలా అడుగులు వేయలేదు. ఐదేళ్ల బాబు పాలనలో కేవలం 4 వేల మేర పోస్టులను మాత్రమే వైద్య శాఖలో భర్తీ చేశారు. బాబు పాలనలో 108, 104 వ్యవస్థలు కూనరిల్లాయి.







బాబు హయాంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకలు కొరికి మృతిచెందిన పసికందు

ఎవరు కావాలో ఆలోచించండి

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని ఇంతగా నిర్వీర్యం చేసిన నేత ఒక్క చంద్రబాబు తప్ప దేశంలో మరొకరుండరు. సింగపూర్, యూకే ప్రపంచ స్థాయి రాజధాని అంటూ బాబు బాకాలు ఊదిన అమరావతికి కూతవేటు దూరంలోని గుంటూరు జీజీహెచ్‌లోనే అప్పట్లో శిశువును ఎలుకలు కొరికి చంపేశాయి. 2019లో అధికారంలోకి రాగానే వైఎస్ జగన్ ప్రభుత్వాస్పత్రులను సంస్కరించారు. వైద్య రంగానికి ఊపిరి లూదారు. పెద్దాస్పత్రులను ఐదేళ్లలో అవయవాలు మార్పిడి చేసే స్థాయికి తీసుకెళ్లారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష, విలేజ్ క్లినిక్స్ వంటి వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే సర్కార్ వైద్యాన్ని తీసుకెళ్లారు. ఈ క్రమంలో ప్రభుత్వ వైద్య రంగాన్ని దిగజార్చిన బాబు, ఆ వైద్య రంగానికి ఊపిరిలూదిన వైఎస్ జగన్.. ఈ ఇద్దరిలో ఎవరు కావాలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సముచిత నిర్ణయం తీసుకోకపోతే వైద్యానికి డబ్బు కోసం ఆస్తులు తాకట్టుపెట్టాలి. ఆస్తులు లేని వారు తల తాకట్టు పెట్టే పరిస్థితులు వస్తాయని గుర్తుంచుకోవాలి.



రాష్ట్రానికి 'చంద్ర'గ్రహణం వద్దు
అదొస్తే పేదల భవిష్యత్తు చిత్తు

మీకు తెలుసా?

గత ఐదేళ్ల కాలంలో కాపులకు కాపు కార్పొరేషన్ ద్వారా జగన్ సర్కారు రూ.**15,044.64** కోట్లు లబ్ధి చేకూర్చింది

ఈ ఐదేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా కాపు సామాజిక వర్గానికి ఇచ్చింది రూ.**39,317.80** కోట్లు

కాంగ్రెస్‌లో చీలిక.. విలీనం

1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ ఓటమి పాలైంది. ఆ పార్టీ ఓడిపోవడం అదే ప్రథమం. ఆ సమయంలో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పశ్చిమబెంగాల్‌కు చెందిన సీనియర్ నేత సిద్ధార్థ శంకర్ రే, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ నేత కాసు బ్రహ్మానందరెడ్డి పోటీపడగా, కాసు విజయం సాధించారు. తదనంతరం ఆయనకు ఇందిరాగాంధీతో విభేదాలు తలెత్తాయి. ఆమెను ఏకంగా పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో కాంగ్రెస్ నిట్టనిలువునా చీలింది. ఒక వర్గానికి ఇందిరాగాంధీ నాయకత్వం వహించగా, మరో వర్గానికి కాసు సారథ్యం వహించారు. కాసు నేతృత్వంలోని భారత జాతీయ కాంగ్రెసే అసలైనదని ఎన్నికల కమిషన్ తేల్చిచెప్పి ఆవు దూడ గుర్తు వారికే కేటాయించారు. అప్పుడు భారత జాతీయ కాంగ్రెస్(ఐ) పేరుతో ఇందిరాగాంధీ పార్టీని స్థాపించారు. ఆ పార్టీకి హస్తం గుర్తు కేటాయించారు. కాసు నేతృత్వంలోని పార్టీని రెడ్డి కాంగ్రెస్ అని, ఇందిరాగాంధీ నేతృత్వంలోని పార్టీని ఇందిరా కాంగ్రెస్ అని పిలిచేవారు. 1978లో ఇందిరా కాంగ్రెస్ రాష్ట్రంలోని 294 స్థానాలకు 175 స్థానాల్లో ఘన విజయంసాధించింది. 1980లో రెడ్డి కాంగ్రెస్‌ను ఇందిరా కాంగ్రెస్‌లో విలీనం చేశారు.

అత్యంత ధనిక ఎంపీ అభ్యర్థులు

2024 లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులలో అత్యంత సంపన్నులుగా తెలుగువాళ్లే నిలవడం విశేషం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 42 లోక్‌సభ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న వారిలో అత్యంత ధనిక అభ్యర్థులుగా గుంటూరు ఎంపీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణలోని చేవేళ్ల నుంచి బీజేపీ తరఫున పోటీచేస్తున్న కొండా విశ్వేశ్వర రెడ్డి ధనిక అభ్యర్థులుగా గుర్తింపు పొందారు.

అవినీతి 'కాలువ'

▶ మొదటి పేజీ తరువాయి

ప్రయత్నం చేశారు ఈ మాజీ నాయకుడు. ఈ నేపథ్యంలో ఫేజ్–1 కింద రూ.450 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మొత్తంగా రూ.968 కోట్లకు పరిపాలన అనుమతులను జారీచేశారు. అయినా భూనిర్వాసితులకు పిసరంతైనా నష్టపరిహారం అందించలేదు. ఆ పనులను ప్రస్తుతం మరో దుర్గం నుంచి పోటీ చేస్తున్న టీడీపీ నేత సంస్థకు కట్టబెట్టి దోపిడీ పర్వానికి తెరలేపారు. అంచనాలు పెంచి రూ.వందల కోట్లు దోచుకున్నారు. పనుల్లో అడుగడుగునా అక్రమాలకు పాల్పడ్డారు.

- నియోజకవర్గ ముఖ్యపట్టణం నుంచి కళ్యాణదుర్గం రోడ్డు విస్తరణ పనుల్లోనూ రూ.20 కోట్ల వరకు ఈ నేత గుడ్‌విల్ మెక్కారనే ఆరోపణలూ బలంగా ఉన్నాయి.
- ఈ మాజీ ఎమ్మెల్యే హయాంలోనే కణేకల్లు, బొమ్మనహాళ్, డి హీరేహాళ్ మండలాల్లో ఇసుక–మట్టి అక్రమ రవాణా జిల్లాలోనే ఓ మాఫియాను తలపించింది. రచ్చుమర్రి వద్ద వేదావతి హగరి నదిలో తవ్విన ఇసుకను ఈనేత అండదండలతో ఓ సంస్థ సహకారంతో నేరుగా బెంగళూరుకు తరలించి రూ.కోట్లను కూడబెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఒక్క వ్యవహారంలోనే రూ.350 కోట్లకు తక్కువ కాకుండా కూడగట్టారనే అభియోగం నేటికీ ఉంది. అప్పట్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను కణేకల్లు పోలీసులు పట్టుకుంటే పోలీస్‌స్టేషన్ ముందు నేరుగా ఈ మాజీ మంత్రి ధర్నా చేపట్టడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. రాయదుర్గం మండలం టీ వీరాపురం, డి హీరేహాళ్ ప్రాంతాల్లో రూ.కోట్ల విలువ చేసే మట్టిని కర్ణాటక ప్రాంతానికి తరలించారు. ఆనాటి అక్రమాల ఆనవాళ్లు నేటికీ తన అవినీతిని బట్టబయలు చేస్తున్నాయి.
- ముఖ్య పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో విలువైన రిజర్వ్ స్థలాన్ని టీడీపీ కౌన్సిలర్ ఒకరు ప్లాట్లు వేసి అమ్మేశారు. ఈయన్ని అనుసరిస్తూ మరింత మంది దురాక్రమణకు పాల్పడి విలాసవంతమైన భవనాలను నిర్మించారు. వాటిని రూ.లక్షలకు అమ్ముకుని సొమ్ము కూడగట్టారు. మల్లాపురం, గౌడ, భంభంస్వామి, ముత్రాసకాలనీ, బీటీపీ, గ్యాస్‌గోడౌన్ లేఅవుట్లలో భవిష్యత్తు అవసరాల కోసం వదిలిన రిజర్వ్ స్థలాలను సైతం మాజీ ఎమ్మెల్యే అండతో తమ్ముళ్లు ఆక్రమించారు. ఒక్కో స్థలాన్ని రూ.30 వేల నుంచి రూ.50 వేలకు అమ్మేశారు. ఇటీవలే టీడీపీ నాయకుడి సహకారంతో పేదలకు చెందిన నాలుగు ప్లాట్లను రూ.6 లక్షలకు ఓ వ్యక్తి అమ్ముకున్నాడు. ఆ విషయమూ వివాదంగా మారింది.
- ఈ టీడీపీ మాజీ ఎమ్మెల్యే హయాంలో కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఇసుక మేటల నివారణలో భాగంగా రూ.కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసినట్టు రికార్డుల్లో చూపారు. పొలాల్లో మాత్రం ఇసుక అలాగే ఉండిపోయింది. ఆ రికార్డులు సైతం మాయం చేయడం గమనార్హం. నీరు–చెట్టు పనుల్లో సైతం రూ.50 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు తమ్ముళ్ల జేబులోకి చేరాయి. ఇందులో ఈ మాజీ ప్రజాప్రతినిధికీ కమీషన్ల వరద పారింది.
- అప్పట్లో కణేకల్లు చిక్కణ్ణేశ్వర చెరువు పూడికతీత కోసం రూ.2 కోట్లను దిగమింగారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ నిధులతోనే ఈ మాజీ మంత్రి విలాసవంతమైన భవనం కట్టుకున్నట్టు జోరుగా ప్రచారం సాగుతోంది.

మాజీమంత్రిపై నమోదైన కేసుల వివరాలు..

మాజీ మంత్రిపై మొత్తం పది కేసులు ఉన్నాయి.

- 19-04-2014న క్రైమ్‌నం 157/ 2014తో ఎంసీసీ కోడ్ ఉల్లంఘనపై ఐపీసీ 188 సెక్షన్ కింద కేసు నమోదు.
- 27-04-2014న క్రైమ్ నంబర్ - 188/14తో ఎంసీసీ ఉల్లంఘన పై ఐపీసీ 188 సెక్షన్ కింద కేసు
- 14-03-2020న మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల తిరస్కరణ విషయంలో అధికారులపై దౌర్జన్యం చేసినందుకు క్రైమ్ నంబర్ 88/20తో ఐపీసీ 343, 506 సెక్షన్ల కింద ఆర్పీ యాక్ట్ కేసు నమోదైంది.
- 07-12-2021న క్రైమ్ నంబర్ 525/21తో ఓ యాక్సిడెంట్ కేస్‌లో శవ రాజకీయం చేసినందున ఐపీసీ 341, 188ల సెక్షన్ల కింద కేసు నమోదైంది.
- 27-11-2022న చెన్నేకొత్తపల్లి వద్ద అధికారులపై అతిగా ప్రవర్తించినందుకు ఐపీసీ 188, 341 సెక్షన్ల కింద కేసు నమోదు.
- 02-04-2024న క్రైమ్ నంబర్: 64/24తో బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో ఎంసీసీ కోడ్ నిబంధనలకు విరుద్ధంగా.. బైక్ ర్యాలీ నిర్వహించడంతో.. 188, 341 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సరికొత్త కాంతులు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మించాలని యోచిస్తోంది. 51 గిగావాట్ల ఆర్‌ఈ పవర్ (18 గిగావాట్ల పవన విద్యుత్, 33 గిగావాట్ల సౌర విద్యుత్)ను తరలించడానికి రాష్ట్రంలో పంపిణీ సౌకర్యాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది.

పీక్ పవర్ డిమాండ్ కోసం పీఎస్‌పీలు

వేరియబుల్ రెన్యువబుల్ ఎనర్జీ (వీఆర్‌ఈ)ని సమతుల్యం చేయడానికి, పీక్ పవర్ డిమాండ్‌ను చేరుకోవడానికి ప్రభుత్వం పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్స్ (పీఎస్‌పీ)లను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 32,400 మెగావాట్ల పీఎస్‌పీల ఏర్పాటుకు 29 సైట్‌ల కోసం టెక్నో కమర్షియల్ ఫీజిబిలిటీ రిపోర్ట్ (టీసీఎఫ్‌ఆర్)లను సిద్ధం చేసింది. మొత్తం 37 చోట్ల 42,270 మెగావాట్ల సామర్థ్యం గల పీఎస్‌పీల నిర్మాణానికి స్థలాలను ప్రభుత్వం గుర్తించింది. దశలవారీగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్), వివిధ అనుమతులను పొందడానికి మూడేళ్ల సమయం పడుతుంది. కాగా 16,180 మెగావాట్ల సామర్థ్యం గల పీఎస్‌పీ ప్రాజెక్టులను డెవలపర్లకు కేటాయించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కరువు పీడిత ప్రాంతాల భూములను వాటి యజమానుల అంగీకారంతో స్థానిక రెవెన్యూ అధికారుల సహకారంలో సేకరించడానికి ఇప్పటికే చర్యలు మొదలయ్యాయి.

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

మరోవైపు గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రం (హబ్)గా ఆంధ్రప్రదేశ్ అవతరించనుంది. తరిగిపోతున్న శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా, పెరుగుతున్న వాతావరణ కాలుష్యానికి విరుగుడుగా స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో రాష్ట్రం భాగమవుతోంది. ఈ ప్రాజెక్టు కోసం దేశం మొత్తం మీద ఐదు రాష్ట్రాలను కేంద్రం ఎంపిక చేయగా వాటిలో మన రాష్ట్రం కూడా ఉంది. దీనికనుగుణంగా గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ–2023ని రాష్ట్రం రూపొందించింది. రాష్ట్రంలోని బళ్లారి–నెల్లూరు (కర్ణాటక–ఆంధ్రప్రదేశ్) మధ్య నేషనల్ గ్రీన్ స్టీల్, కెమికల్స్ కారిడార్‌గా తీర్చిదిద్దనున్నారు. ఈ కారిడార్‌లోని స్టీల్, కెమికల్ ప్లాంట్‌ల కోసం సంవత్సరానికి 5 వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను 30 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నారు. విశాఖపట్నంలో నేషనల్ గ్రీన్ రిఫైనరీ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌ను సృష్టించి 20 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ ప్లాంట్‌తో సంవత్సరానికి 4 వేల టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయనున్నారు.

జగన్ అంటే నమ్మకం

ఆంధ్ర ప్రజలకు జగన్ అంటే ఎంతో నమ్మకం. గత 58 నెలల్లో రాష్ట్ర భవిష్యత్తు దశ, దిశలను మార్చి, ప్రజల ప్రతి అవసరాన్ని తీర్చేలా నవరత్నాలు పథకాలను అమలు చేశారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ప్రజలకు ఎలాంటి మేలు చేయకపోగా, ప్రజల ఛీత్కారానికి గురయ్యారు. జగన్‌మాత్రం తన పాదయాత్రలో ప్రజల కష్టాలను, నష్టాలను తెలుసుకుని, వాటిని తొలగించేందుకే సంక్షేమ పథకాలను అమలు చేశారు. జగన్‌ను సీఎం చేసేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నాం.

\- మానేపల్లి సువర్ణరాజు, ప్రిన్సిపాల్, గుంటూరు

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

గుడ్డిగా హామీలను నమ్మొద్దు

ఒక వ్యక్తిని నమ్మేముందు క్షణకాలం అతన్ని అనుమానించు.. అన్న ఆంగ్ల సామెత మనిషి నైజాన్ని చెప్పకనే చెబుతుంది. పరీక్షిస్తే మనిషి తత్వం బోధపడుతుంది. అసూయ, స్వార్థం, అధికార కాంక్షతో అలవిమాలిన మాటలు చెప్పి, బంధుమిత్రుల మధ్య వైరాన్ని కలిగించే నాయకుల్ని, వారిచ్చే బూటకపు హామీలను నమ్మొద్దు. తీయటి పలుకులతో వెన్నుపోటు పొడిచే నాయకుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి. మోసగాళ్ల మాటలకు బలయ్యామా? మన రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసిన వాళ్లమవుతాం. జాగ్రత్త.

\- డాక్టర్ పి.సూర్య నాగిరెడ్డి, లెక్చరర్ ఇన్ ఫిజిక్స్, కళ్యాణదుర్గం

విశాఖ.. వైఎస్సార్‌సీపీ విజయ పతాక

జిల్లాను హోరెత్తిస్తున్న 'ఫ్యాన్' గాలి

- ఆ పార్టీ అభ్యర్థులకు అడుగడుగునా ఘనస్వాగతం
- పూర్ణ మనసుతో ఆశీర్వదిస్తున్న ప్రజానీకం
- నియోజకవర్గాల్లో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ
- సంక్షేమం, మంచితనమే అభ్యర్థుల బలం
- ప్రతి చోటా టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు ఎదురుగాలి

సాక్షి, విశాఖపట్నం:

సువిశాల సాగరతీరం ఓ వైపు.. తూర్పు కనుమలు మరోవైపు.. ప్రకృతి సోయగాలతో విలసిల్లే విశాఖ జిల్లాకు రాష్ట్రంలో ఏ ప్రాంతానికీ లేని విశిష్టత ఉంది. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చినా.. ఉత్తరాది మొదలుకొని దక్షిణాది వరకు.. అన్ని వర్గాల ప్రజలకూ స్థిరనివాసంగా విశాఖపట్నం మారింది. మినీ భారత్‌గా అందర్నీ ఆకర్షిస్తోంది. ఈ జిల్లా నుంచి నిజాయితీ, విశ్వసనీయత కలిగిన అభ్యర్థులను వైఎస్సార్‌సీపీ రంగంలోకి దింపుతోంది. దీంతో అన్ని నియోజకవర్గాల్లో గెలుపు సునాయాసమే అవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

తొలిసారిగా బీసీ మహిళకు...

విశాఖపట్నం వైఎస్సార్‌సీపీ ఎంపీ టికెట్ ఈ సారి బొత్స ఝాన్సీకి కేటాయించడంతోనే దాదాపు విజయం ఖాయమైనట్లయింది. సీఎం వైఎస్ జగన్ తొలిసారిగా స్థానిక బీసీ మహిళకు ఇక్కడి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించడంతో సానుకూల పవనాలు కన్పిస్తున్నాయి. గతంలో ఝాన్సీ విజయనగరం ఎంపీగా ఉన్న సమయంలోనూ విశాఖపట్నం అభివృద్ధి కోసం కృషి చేశారు. ఎక్కడకు వెళ్లినా సొంత కుటుంబ సభ్యురాలిగా అక్కున చేర్చుకుంటున్నారు. మరో వైపు టీడీపీ అభ్యర్థిగా భరత్ తలపడుతున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు ఎగ్గొట్టిన వ్యవహారం, గీతం పేరుతో భూములు దోచుకోవడం, ఇలా ఎన్నో అడ్డగోలు వ్యవహారాలు భరత్ చుట్టూ ఉండటంతో ఆయన వైపు విశాఖ ప్రజలు చూడటం లేదు. ఏ నియోజకవర్గానికి వెళ్లినా స్పందన లేదు.

ఉత్తరానికి 'రాజు' ఒక్కడే..

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 2019లో గంటా శ్రీనివాసరావు కుయుక్తులకు బలై చివరి నిమిషంలో స్వల్ప ఓట్ల తేడాతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేకే రాజు ఓటమి పాలయ్యారు. ఓటమి చెందినా రాజు ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఆయన ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడాన్ని చూస్తే వైఎస్సార్‌సీపీ విజయం పక్కా అని చెప్పక తప్పదు. ఇక్కడ బీజేపీ నుంచి విష్ణు కుమార్‌రాజు పోటీ చేస్తున్నారు. భూ ఆక్రమణలకు కేరాఫ్‌గా నిలిచిన విష్ణుకుమార్‌రాజుకు ప్రజల్లో ఆదరణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.



గోపాలపట్నం వద్ద బస్సుయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

కళావతిపైనే 'విశ్వాస'ం

పాలకొండ నుంచి 2014, 2019ల్లో రెండుసార్లు విజయం సాధించిన విశ్వాసరాయి కళావతి మూడోసారి వైఎస్సార్‌సీపీ నుంచి పోటీలో ఉన్నారు. ఆమె నిత్యం ప్రజల్లో ఉంటూ వారి విశ్వాసాన్ని చూరగొన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్న పేరుంది. సీతంపేటలో రూ.50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, ఆరోగ్య కేంద్రాలు, రోడ్ల నిర్మాణం, రూ.139 కోట్లతో తోటపల్లి కాలువ ఆధునీకీకరణ పనులు ఆమెకు కలిసొచ్చే అంశాలు. దీంతో ఆమె హ్యాట్రిక్ దిశగా దూసుకెళ్తున్నారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జనసేన నుంచి నిమ్మక జయరాజ్ బరిలో ఉన్నారు. 2014లో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు ఆయన అక్రమాలకు పాల్పడడం, కోట్లాది రూపాయలు దోచుకున్నాడన్న ఆరోపణలు, నోటి దురుసుతనం వంటివి ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

మార్పు దిశగా తూర్పు

2019లో ఎంపీగా విశాఖ అభివృద్ధికి కృషి చేసిన ఎంవీవీ సత్యనారాయణ ఈసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తూర్పు నియోజకవర్గంలో బరిలో నిలిచారు. ఎంవీవీని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ప్రకటించినప్పటి నుంచి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీకి వలసలు మొదలవ్వడమే విజయానికి సంకేతమని చెప్పవచ్చు. మరోవైపు వెలగపూడి రామకృష్ణబాబు టీడీపీ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినా నియోజకవర్గానికి ఏమీ చేయలేకపోయారు. కోడిపందేలు, మద్యం మాఫియా పెంచుకున్న వెలగపూడి ప్రజల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ సారి రాజకీయ నేరచరితుడికి చెక్ పెట్టేందుకు తూర్పు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

మళ్లీ అవంతికే పట్టం

అవినీతి మరకలేని వ్యక్తిగా వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు నియోజకవర్గ ప్రజలతో మమేకమయ్యారు. 2019లో విజయం సాధించిన తర్వాత భీమిలి పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. మరోవైపు రాజకీయ సంచారజీవిగా పేరొంది ఏ నియోజకవర్గానికి వెళ్తే ఆ ప్రాంతాన్ని నాశనం చేయడమే ధ్యేయంగా మార్చుకున్న గంటా శ్రీనివాసరావు అంటేనే భీమిలి ప్రజలు భయపడుతున్నారు. 2014లో మంత్రిగా ఉన్న సమయంలో కనిపించిన భూములన్నింటినీ దోచుకుని భీమిలి అంటేనే ఆక్రమణలకు కేరాఫ్‌గా మార్చేశారు. మరోసారి అవంతికి జై కొట్టేందుకు భీమిలి ఫిక్స్ అయ్యింది.

కోటలో శ్రీను విజయమే

శృంగవరపుకోట నియోజకవర్గాన్ని ఐదేళ్ల కాలంలో అభివృద్ధి పనులు చేపట్టి ఎన్నడూ లేని విధంగా దశ దిశ మార్చేశారు కడుబండి శ్రీనివాసరావు. మరోసారి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. కోట చరిత్రలో కనీవినీ ఎరుగని అభివృద్ధిని సుసాధ్యం చేసిన వ్యక్తి కడుబండికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. టీడీపీ అభ్యర్థిగా కోళ్ల లలితకుమారి గతంలో ఎమ్మెల్యేగా చేసినా ఎక్కడా తనదైన మార్కు చూపించలేకపోయారు. తిరిగి కడుబండినే అసెంబ్లీకి పంపించాలనే దృఢ నిశ్చయంతో కోట ప్రజలు ఉన్నారు.

గాజువాకలో టీడీపీ గల్లంతే

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గుడివాడ అమర్‌నాథ్ గాజువాక నియోజకవర్గం మిందిలో జన్మించారు. అనకాపల్లి నుంచి ఇక్కడికి రావడంతోనే ఆయన గెలుపు పక్కా అని చెబుతున్నారు. టీడీపీ నుంచి బరిలో ఉన్న పల్లా శ్రీనివాసరావు ఆక్రమణల పర్వం కొనసాగించారు. ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని ఎమ్మెల్యే ఎందుకనే ఉద్దేశం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ప్రస్తుత అభ్యర్థి అమర్‌నాథ్ ప్రచారంలో భాగంగా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటూ గాజువాకను ఎలా అభివృద్ధి చేయబోయేది స్పష్టంగా ప్రకటించడంతో మరోసారి గాజువాకలో ఫ్యాన్‌గాలి బలంగా వీస్తోంది.

రాణికే ఎంపీ కిరీటం

అరకు లోక్‌సభ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా డాక్టర్ చెట్టి తనూజా రాణి నిలిచారు. విద్యావంతురాలైన ఈమెకు గిరిజనుల్లో ఆదరణ ఉంది. గిరిజన ప్రాంతాల్లో ఆమె కరోనా విపత్కర సమయంలోనూ వైద్య సేవలందించి గిరిజనుల మన్ననలు పొందారు. ఇవన్నీ ఆమె విజయానికి సానుకూల అంశాలుగా ఉన్నాయి. మరోపక్క బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొత్తపల్లి గీతపై గిరిజనుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన కొద్ది నెలలకే పార్టీ ఫిరాయించారు. ఇక అసెంబ్లీ స్థానాల వారీగా పరిశీలిస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు జనం నుంచి పెద్ద ఎత్తున మద్దతు కనిపిస్తోంది.

అనకాపల్లి అదరహో

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఫ్యాన్ గాలి బలంగా వీస్తోంది. స్థానిక..స్థానికేతరుల మధ్య జరిగే ఎన్నికల్లో స్థానికుడు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. 1962 నుంచి అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు జరగ్గా 2019 వరకూ స్థానికులకే ప్రజలు పట్టం కట్టారు. ఇక్కడ నుంచి స్థానికేతరుడైన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను ఓడించి స్థానికుడైన బూడి ముత్యాలనాయుడునే గెలిపించుకోవాలని భావిస్తున్నారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన బూడి ప్రజల్లో మమేకం అవుతున్నారు. బీసీకు ఎంపీ టికెట్ ఇవ్వడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కురుపాంలో హ్యాట్రిక్ దిశగా పుష్ప శ్రీవాణి

కురుపాం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పాముల పుష్ప శ్రీవాణి మూడోసారి విజయం వైపు అడుగులేస్తున్నారు. 2014, 2019ల్లో ఆమె వరసగా ఇదే పార్టీ నుంచి గెలుపొందారు. ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.190 కోట్ల అంచనాతో 105 ఎకరాల్లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఇక్కడ టీడీపీ నుంచి తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టి.జగదీశ్వరికి వర్గపోరు అధికంగా ఉంది. ఈ సీటును పద్మావతి, లావణ్య, తమ్మయ్య, విజయకుమార్, కృష్ణబాబు, రామారావు ఆశించారు. వారిని కాదని జగదీశ్వరికి ఇవ్వడంతో వీరంతా ఆమెకు వ్యతిరేకమయ్యారు.

వాసుపల్లికి వాస్తు కుదిరింది

ఎవరికి ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ముందుగా వచ్చే వాసుపల్లికే దక్షిణ నియోజకవర్గం జై కొడుతోంది. వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ దిశగా వాసుపల్లి అడుగులు వేస్తున్నారు. వాసుపల్లితో కలిసి నడిచేందుకు జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీలను వీడుతూ వైఎస్సార్‌సీపీలోకి నాయకులు, శ్రేణులు వెల్లువలా చేరుతున్నారు. ఇక్కడ జనసేన నుంచి బరిలో ఉన్న వంశీకృష్ణ శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని ఇంకా ఆ పార్టీ నాయకులే ఒప్పుకోవడం లేదు. ఎన్నో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సరిగా చెల్లించలేదు. దాదాపు 30 కేసులు ఆయనపై నమోదయ్యాయి. సొంత పార్టీ నేతలే వంశీని ఓడించాలని చెబుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

రాజన్న వైపే సాలూరు

వివాద రహితునిగా పేరున్న పీడిక రాజన్నదొర సాలూరు నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఆయన ఇదే పార్టీ నుంచి విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆయనకు కీలకమైన ఉప ముఖ్యమంత్రి పదవి దక్కింది. దీంతో నియోజకవర్గంలో రూ.1,300 కోట్లతో గిరిశిఖర గ్రామాలకు రోడ్లు, పట్టణంలో 100 పడకల ఆస్పత్రి, బైపాస్ రోడ్డు, వంతెనలు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి సొంత పార్టీలో వర్గ విభేదాలతో సతమతమవుతున్నారు. మాజీ ఎమ్మెల్యే భంజదేవ్ వర్గం ఆమెకు సహకరించడం లేదు.

హ్యాట్రిక్ దిశగా మాడుగుల

మాడుగుల నియోజకవర్గంలో ఫ్యాన్ గాలికి సైకిల్ మరో సారి డీలా పడబోతోంది. వైఎస్సార్‌సీపీ వరుసగా రెండు సార్లు విజయం సాధించి 2024లో కూడా గెలిచి హ్యాట్రిక్ విజయం దిశగా దూసుకుపోతుంది. ఈర్లె అనురాధ మాడుగుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మొదటి నుంచి మాడుగుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయవకాశాలు పెరుగుతూ వస్తున్నాయి. ఇక్కడ టీడీపీ నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి పోటీ చేస్తున్నారు. బెదిరింపు రాజకీయాలు, భూ ఆక్రమణలకు కేరాఫ్‌గా నిలిచిన బండారుకు ప్రజల్లో ఆదరణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. టీడీపీలోనే మూడు వర్గాలున్నాయి. స్థానికంగా ఉన్న వారికి టికెట్ ఇవ్వలేదనే ఆవేదన కూడా టీడీపీ స్థానిక క్యాడర్‌లో ఉంది. వైఎస్సార్‌సీపీకి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది అని మాడుగుల ప్రజలు దృఢంగా నమ్ముతున్నారు.

అనకాపల్లిలో యువతకే పట్టం..

అనకాపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నుంచి మలసాల భరత్ పోటీ చేస్తున్నారు. జనసేన నుంచి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పోటీ చేస్తున్నారు. అనకాపల్లిలో పాత తరహా రాజకీయాలకు స్వస్తి పలికేందుకు..యువతరం ముందుకు వచ్చింది. అవుట్ డేటెడ్ రాజకీయనేత తమ అనకాపల్లికి వద్దు..భరత్‌నే ముద్దు అంటూ అనకాపల్లి అసెంబ్లీ పరిధిలోని యువత, ప్రజలు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారంలో నినదిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న అనకాపల్లిలో తనను గెలిపిస్తే.. సాఫ్ట్‌వేర్ కంపెనీని అనకాపల్లిలో ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని భరత్ హామీ ఇచ్చారు. గతంలో అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పనిచేసిన కొణతాల చేసింది ఏమీ లేదు.

అలజంగికే మళ్లీ అందలం

పార్వతీపురం అసెంబ్లీ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పోటీలో ఉన్నారు. ఈయన ప్రజలకు అందుబాటులో ఉంటారని, సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతారన్న పేరుంది. ఈ నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల నిర్మాణం, పార్వతీపురంలో రూ.600 కోట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరయ్యాయి. టీడీపీ అభ్యర్థి స్థానికేతరుడైన విజయచంద్ర పట్ల ఆ పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వరరావు సహకరించడం లేదు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అలజంగి రెండోసారి గెలుపు సునాయాసమేనన్న భావన ఇక్కడ నెలకొంది.

మత్స్యలింగం వైపే అరకు

వివాద రహితుడిగా ప్రజల్లో మంచి పేరున్న రేగం మత్స్య లింగానికి వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఆయన ఇప్పటికే ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.3 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టింది. కూటమిలో బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావుకు కేటాయించారు. ఇక్కడ బీజేపీకి పట్టు లేకపోవడం, తొలుత ఈ సీటును టీడీపీ అభ్యర్థి దొన్నుదొరకు ఇచ్చారు. తర్వాత బీజేపీకి మార్చడం, ఇదే సీటును ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం ఆశించి భంగపడ్డారు. దీంతో టీడీపీ శ్రేణులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో మత్స్యలింగం గెలుపు నల్లేరు మీద నడకలా మారింది.

పేటలో ఫ్యాన్ మళ్లీ పాగా..

ప్రజల మనిషిగా ఎలాంటి అవినీతి మరకలేని వ్యక్తిగా రెండు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి..మూడో సారి పాయకరావుపేట నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంబాల జోగులు నియోజకవర్గ ప్రజలతో మమేకమయ్యారు. స్థాయిని మించి నోటి దురుసుతో ఎప్పుడూ ఏదో వివాదంలో ఉండే వంగలపూడి అనిత పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఆమెకు సొంతపార్టీ నుంచే వ్యతిరేకత ఉంది. దీంతో ఆమెను ఓడించి తామేంటో చూపించడానికి స్థానిక టీడీపీ, జనసేన నాయకులు సిద్ధంగా ఉన్నారు.

చోడవరం.. ధర్మశ్రీ కేక

చోడవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నిలిపిన కరణం ధర్మ శ్రీ మరోసారి ఇక్కడ నుంచి వైఎస్సార్‌సీపీ నుంచి పోటీలో ఉన్నారు. చోడవరం ప్రజలంతా మళ్లీ కరణం ధర్మశ్రీనే గెలిపించుకుంటామని బహిరంగంగా చెబుతున్నారు. టీడీపీ తరఫున బరిలో ఉన్న కె.ఎస్.ఎన్.రాజు ఆక్రమణల పర్వం కొనసాగించారు. గతంలో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచినా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని ఎమ్మెల్యే ఎందుకనే ఉద్దేశం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.



ఎన్నికల ముందు వారి హామీలు ఘనం ఆ తర్వాత అవన్నీ మాయం

పశ్చిమలో 'ఆనంద'కేతనం

పశ్చిమలోనూ వైఎస్సార్‌సీపీ జోరు కొనసాగుతోంది. నియోజకవర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా తన ఆస్తులు పెంచుకోవడం, తన ఇల్లు పడగొట్టి భవంతి కట్టుకోవడం, సొంత సినిమా హాలును సుందరంగా తీర్చిదిద్దుకోవడం తప్ప ప్రజలకు మంచి చేశానని చెప్పుకోలేని ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి గణబాబు చరిత్రలో నిలిచిపోయారు. విశాఖ డెయిరీతో అందరి మనసుల్లో నిలిచిన ఆడారి ఆనంద్ ఈ నియోజకవర్గానికి సమన్వయకర్తగా వైఎస్సార్‌సీపీ ప్రకటించినప్పటి నుంచి తమ గోడు చెప్పుకోడానికి ఓ మనిషి దొరికాడంటూ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్నారు. ఈసారి పశ్చిమలో 'ఆనంద' పవనాలు వీయడం ఖాయమని భావిస్తున్నారు.



విశ్వేశ్వరరాజుకే పాడేరు పట్టం

పాడేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆశించిన అభివృద్ధి జరిగింది. పాడేరులో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు, మారుమూల పల్లెల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు జరిగాయి. ఇక్కడ గత రెండు సార్లు వైఎస్సార్‌సీపీనే గెలిపించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి మత్స్యరాస విశ్వేశ్వరరాజు బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి తొలుత రమేష్‌నాయుడుకు సీటు ఖరారు చేశారు. ఆ తర్వాత గిడ్డి ఈశ్వరికి ఇచ్చారు. దీంతో టీడీపీలో రెండు వర్గాలుగా చీలిపోయాయి. ఇవన్నీ వెరసి పాడేరులో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ సాధించేందుకు మార్గం సుగమం అయింది.

పెందుర్తిలో రెండోసారి విజయకేతనం..

పెందుర్తిలో ఐదేళ్లలో వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టి.. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దశ దిశ మార్చేశారు అన్నంరెడ్డి అదీప్‌రాజ్. మరోసారి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా.. వైఎస్సార్‌సీపీ హయాంలో తాము పొందిన లబ్ధిని ప్రజలు మరచిపోలేదు. జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేష్‌కుమార్ గతంలో పీఆర్‌పీ నుంచి ఇక్కడ ఎమ్మెల్యేగా చేసినా ఎక్కడా తనదైన మార్కు చూపించలేకపోయారు. కూటమి మేనిఫెస్టో చూపించినా ప్రజలు హర్షించకపోవడంతో ఏం చెయ్యాలో పాలు పోవడం లేదు. ఈసారి పెందుర్తిలో అదీప్‌రాజ్ గెలవడం పక్కాగా కనిపిస్తోంది.

నర్సీపట్నంలో గణేష్‌కి విజయమే

నర్సీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జోరు కొనసాగుతోంది. నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో నర్సీపట్నం ఎమ్మెల్యేగా భారీ విజయం సాధించిన పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు మరోసారి విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. సౌమ్యుడు, ఎదిగేకొద్దీ ఒదిగే మనస్తత్వం ఉన్న గణేష్‌నే మళ్లీ గెలిపించుకుంటే మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని నర్సీపట్నం ప్రజలు దృఢంగా నమ్ముతున్నారు. ఇక్కడ టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ముప్పై ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పనిచేసి నర్సీపట్నానికి అభివృద్ధి చేసింది లేదు. అయ్యన్న అంటేనే అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ధనలక్ష్మికి రంపచోడ'వరం'

రంపచోడవరం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగులాపల్లి ధనలక్ష్మి పోటీలో ఉన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారంలో ముందంజలో ఉన్న ఆమెకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గంలోని గిరిజనులకు 40 వేల ఎకరాల పోడు పట్టాలను అందించారు. టీడీపీ అభ్యర్థి శిరీషకు సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈ సీటును ఆశించి భంగపడ్డ టీడీపీ నాయకులు ఆమెకు సహకరించడం లేదు.



మరొకసారి కన్నబాబురాజు

కన్నబాబురాజు వరుసగా రెండు సార్లు యలమంచిలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు కూడా ఆయన ప్రజా సేవ చూసి నియోజకవర్గం జై కొడుతోంది. ఆయనతో కలిసి నడిచేందుకు జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీలను వీడుతూ వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారు. ఇక్కడ జనసేన నుంచి బరిలో ఉన్న సుందరపు విజయకుమార్ అభ్యర్థిత్వాన్ని ఇంకా కూటమిలో టీడీపీ నాయకులే ఒప్పుకోవడం లేదు. ఎప్పుడూ ఏదో వివాదంతో సుందరపు నోరు పారేసుకుంటాడు. జనసేన పార్టీలో కూడా మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన జన సైనికులు సుందరపు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు.

సంక్షేమ ప్రభుత్వానికే మద్దతు



ఐదేళ్లకోసారి సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు రాజ్యాంగం మనకు ఇచ్చిన గొప్ప ఆయుధం ఓటు. ప్రజలను అన్ని విధాలా ఆదుకునే నాయకుడిని, ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలి. మోసపూరిత హామీలకు లొంగి, అలాంటి వారికి అవకాశం ఇవ్వొద్దు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఆలోచించే వారిని గుర్తించాలి. కుల, మత, పార్టీ తారతమ్యాలు చూడకుండా, అర్హులైన వారందరి సంక్షేమం కోసం కృషి చేసేవారికే ఓటు వేయాలి. అలాంటి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలంతా ఆనందంగా ఉంటారు. విజ్ఞతతో ఓటేద్దాం.

- పెయ్యిల సిద్ధార్థ, మల్కాపురం, విశాఖపట్నం జిల్లా

మేనిఫెస్టోతో ఉద్యోగుల్లో మార్పు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో విడుదల చేశాక ఉద్యోగులు, ఉన్నత వర్గాల ప్రజల ఆలోచనలో చాలా మార్పు వచ్చింది. జగన్ తాను అమలు చేయగలిగే హామీలను మాత్రమే చెప్పారు. టీడీపీ మేనిఫెస్టో తర్వాత ఉద్యోగులు, మేధావుల్లో జగన్‌పట్ల మరింత అభిమానం పెరిగింది. టీడీపీ హామీలు అమలు చేస్తే ఉద్యోగుల జీతాలకూ డబ్బులుండవన్న నమ్మకానికి ఉద్యోగులు వచ్చారు. విశ్వసనీయత ఉన్న ఏకైక నాయకుడు జగన్ మాత్రమేనని ఉద్యోగుల నమ్మకం.

- కుదాల శంకర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్, బనగానపల్లె, నంద్యాల జిల్లా

జగన్ మామయ్యకే తొలి ఓటు



జగన్ మామయ్యే మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారు. నా మొదటి ఓటు జగన్ మామయ్యకే. మరో మూడు ఫ్యామిలీలతో కూడా ఓటేయిస్తాను. జగన్ మామయ్య వల్లే నాకు విద్యాదీవెన, వసతి దీవెన, మా అమ్మమ్మకు ఈబీసీ నేస్తం, ఇద్దరు తాతయ్యలకు పెన్షన్లు వచ్చాయి. మా నియోజకవర్గంలో గత ఎన్నికల్లో గెలిచిన గంటా శ్రీనివాసరావు కోవిడ్ సమయంలో కనిపించనేలేదు. కేకే రాజే ఎప్పటికప్పుడు మా కష్టసుఖాలను తెలుసుకుని, సాయపడ్డారు. విశాఖలో సీఎంగా జగన్ మామయ్య ప్రమాణస్వీకారం తప్పక చూస్తా.

- పెనుమత్స వింధ్య, డిగ్రీ విద్యార్థి, మాధవధార, విశాఖపట్నం జిల్లా

ఫ్యాన్‌కు సిక్కోలు జేజేలు..

మరోసారి ఎగరనున్న వైఎస్సార్‌సీపీ జెండా

- ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీదే ఆధిపత్యం
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో పెరిగిన ఆదరణ
- మేలు చేసిన నాయకుడి వెంటే ఉంటామంటున్న జనం
- ఈ సారి టీడీపీకి తప్పని పరాభవం



అక్కవరం వద్ద సీఎం జగన్ సభకు హాజరైన అశేష జన సందోహంలో ఒక భాగం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

సిక్కోలు మరోసారి వైఎస్సార్‌సీపీ పరం కాబోతోంది. ఇక్కడి ప్రజలు సీఎం జగన్‌కు జై కొడుతున్నారు. గడచిన ఐదేళ్లలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఆ పార్టీకి అనుకూలంగా మారనున్నాయి. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు జిల్లాలో ఒక్కటంటే ఒక్క శాశ్వత అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని, ఇకపై ఆయన్ను నమ్మేది లేదని ఇక్కడి ప్రజలు తెగేసి చెబుతున్నారు. ఈ సారి కింజరాపు ఫ్యామిలీకి జెల్లకొట్టేలా ఉన్నారు. ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా నిలిచిన శ్రీకాకుళం జిల్లా గడచిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అత్యధిక స్థానాలు కట్టబెట్టి తమ అభిమానాన్ని చూపింది. పంచాయతీ ఎన్నికల్లో 81.61 శాతం సర్పంచ్ స్థానాలు, మున్సిపల్ ఎన్నికలో 74.32 శాతం, పరిషత్ ఎన్నికల్లో 84.40 శాతం స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఈ సారీ అవే ఫలితాలు రానున్నాయి.

శ్రీకాకుళం ఎంపీ స్థానంలో మార్పు తప్పదు

శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం ఈ సారి వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోబోతోంది. ఇక్కడ వైఎస్సార్‌సీపీ తరఫున పేరాడ తిలక్, టీడీపీ తరఫున సిట్టింగ్ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పోటీలో ఉన్నారు. 10 మంది బరిలో ఉన్నా పోటీ వీరిద్దరి మధ్యే. అయితే పేరాడ తిలక్‌కు సౌమ్యుడిగా, వివాదరహితుడిగా మంచి పేరుంది. ఇదే సందర్భంలో కింజరాపు రామ్మోహన్‌నాయుడుపై తీవ్ర వ్యతిరేకత ఉంది. రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచినా జిల్లాకు ఏమీ చేయలేదన్న వాదన వినిపిస్తోంది. ఎంపీ లాడ్స్ కూడా సకాలంలో పూర్తి స్థాయిలో ఖర్చు చేయకపోవడం పెద్ద మైనస్.



తిరుగులేని ధర్మాన

శ్రీకాకుళంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ధర్మాన ప్రసాదరావుకు తిరుగులేదని టీడీపీలో జరిగిన పరిణామాలే స్పష్టం చేశాయి. ఇక్కడ మంత్రికి గట్టి పోటీ ఇస్తారనుకున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి కాకుండా కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుకు తొత్తుగా ఉండే గొండు శంకర్‌కు టికెట్ ఇవ్వడంతోనే ఇక్కడ పోటీ తేలిపోయింది. టీడీపీలోని సీనియర్లను పక్కన పెట్టేయడంతో వారంతా తిరుగుబాటు చేస్తున్నారు. ఇక్కడ బరిలో ఉన్న గొండు శంకర్‌కు అనుకున్నంత మంచి పేరు లేదు. ధర్మాన తన పదవీ కాలంలో నగరంలో మౌలిక సౌకర్యాల కల్పనతో తనదైన ముద్ర వేసుకున్నారు. నగర రూపు రేఖలు మార్చడమే కాకుండా నియోజకవర్గంలో రూ.1677.06 కోట్లతో సంక్షేమ పథకాలను అందించారు. ఇవే ఆయన విజయానికి పునాది కానున్నాయి.

తమ్మినేనికి విజయం తథ్యం

ఆమదాలవలసలో మరోసారి స్పీకర్ తమ్మినేని సీతారాం విజయబావుటా ఎగరవేసే అవకాశం కనబడుతోంది. టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్‌తో ఈయన పోటీ పడుతున్నారు. తమ్మినేని తన పదవీ కాలంలో విరామం లేకుండా ప్రతి గడప తొక్కారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. రూ.1429.13 కోట్ల మేర సంక్షేమ పథకాలను అందించారు. వీటితో పాటు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్, డిగ్రీ కళాశాలలు పలు ప్రధాన విద్యా సంస్థలను ఈ ఐదేళ్ల కాలంలో ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంలో కూన రవికుమార్ మొదటి నుంచీ వివాదాస్పద వ్యక్తి అన్న ముద్ర వేసుకున్నారు. ఇదే తమ్మినేనికి అనుకూలం కానుంది.

నరసన్నపేట దాసన్నదే


సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మరోసారి నరసన్నపేటలో విజయకేతనం ఎగురవేయనున్నారు. టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తితో ఈయన పోటీపడుతున్నారు. కృష్ణదాస్ ఈ 58 నెలల్లో నియోజకవర్గ ప్రజలకు రూ. 1496.69 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందించారు. నియోజకవర్గ అభివృద్ధిలోనూ కీలకంగా వ్యవహరించారు. రూ.24 కోట్లతో పంచాయతీ రాజ్ రోడ్లు, రూ.52 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లు చేశారు. ఎనిమిది పీహెచ్‌సీలను రూ.4 కోట్లతో, రూ.12.8 కోట్లతో నరసన్నపేటలో వంద పడకలతో ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంపు ఈయన విజయానికి కీలకం కానున్నాయి. నరసన్నపేటలో రూ.4.5 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తికి సొంత పార్టీ నుంచే మద్దతు కరవైంది. ఈయన ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు పలు అవినీతి, అక్రమాలకు పాల్పడటం ఆయనకు మైనస్ కానుంది.

టెక్కలిలో ఫ్యాన్ పాగా

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుకు ఈ సారి డొటే. అధికారం ఉన్నంతకాలం అవినీతి, అక్రమాలు, స్కామ్‌లతో బిజీగా ఉండి, ప్రతిపక్షంలో ఉన్నాక దుష్ప్రచారం, నోరు పారేసుకోవడం, దురుసుగా వ్యవహరించడం వంటి కారణాలతో ఎదురీదుతున్నారు. ఇక్కడ వైఎస్సార్‌సీపీ తరఫున దువ్వాడ శ్రీనివాస్ విజయానికి ఇవే అస్త్రాలుగా మారనున్నాయి. పైగా వైఎస్సార్‌సీపీ ఈ నియోజకవర్గంలోని ప్రజలకు రూ.1681.10 కోట్ల మేర సంక్షేమ పథకాలను అందించింది. ప్రతిష్టాత్మకమైన మూలపేట పోర్టును నిర్మిస్తోంది. రూ.2.30 కోట్లతో టెక్కలి 200 పడకల ఆస్పత్రిని, నాడు నేడు కింద రూ.20.89 కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేశారు. ఇవన్నీ వైఎస్సార్‌సీపీని గెలిపించనున్నాయి.

పలాసకు 'రాజే'

మంత్రి సీదిరి అప్పలరాజు మరోసారి విజయభేరి మోగిస్తారని దాదాపు సర్వేలన్నీ ఇప్పటికే చెప్పేశాయి. బరిలో 10మంది ఉన్నా ప్రధాన పోటీ ఈయనకు టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష మధ్యే ఉంది. ఎమ్మెల్యేగా ఎన్నికైన దగ్గరి నుంచి చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలే సీదిరికి విజయసోపానాలు కానున్నాయి. రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, రూ.800 కోట్ల వ్యయంతో నిర్మించిన ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు ఆయనకు అనుకూలం కానున్నాయి. నియోజకవర్గ ప్రజలకు రూ.1474.22 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందజేశారు. మత్స్యకారుల కోసం నీళ్లపేటలో రూ.11.95 కోట్లతో జెట్టీ నిర్మిస్తున్నారు. దానిని ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. రూ.21 కోట్లతో ముఖ్యమైన బీటీ రోడ్లు వేశారు. రూ.120 కోట్లను జీడి ప్రోత్సాహకాల కింద అందజేశారు. ఇవన్నీ సీదిరికి విజయావకాశాలు అందిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి శిరీషపై ఇక్కడ సానుకూలత లేదు.



ఇచ్ఛాపురంలో 'విజయ' దుందుభి ఖాయం

ఇచ్ఛాపురంలో ఈ సారి మార్పు తప్పేలా లేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బెందాళం అశోక్‌కు ప్రతికూలత ఎక్కువగా కనబడుతోంది. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నా ఏమీ చేయలేకపోయారన్న విమర్శ ప్రజల్లో ఉంది. ఇక వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన పిరియా విజయ జెడ్పీ చైర్‌పర్సన్‌గా మంచి చేసి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఇచ్ఛాపురంలో రూ.1772.10 కోట్ల మేర అమలు చేసిన సంక్షేమ పథకాలు, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం మండలాల ఉద్దానం గ్రామాలను కలిపే ఎస్‌కేఈ రోడ్డును రూ.31.80 కోట్లతో విస్తరించడం, బారువలో డిగ్రీ కళాశాల రూ.5 కోట్లతో, సోంపేట జూనియర్ కళాశాలలో రూ.2 కోట్లతో కొత్త భవనాలు, అరకబద్ర బ్రిడ్జి, బూర్జపాడు బ్రిడ్జి, మహేంద్రతనయ బ్రిడ్జి నిర్మాణం వంటివి ఈమె విజయానికి దోహదపడుతున్నాయి.

పాతపట్నం శాంతమ్మదే

సిట్టింగ్ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా రెడ్డి శాంతి మరోసారి విజయం సాధించబోతున్నారు. ఇక్కడ టీడీపీ తరఫున మామిడి గోవిందరావు పోటీ చేస్తున్నారు. రెడ్డి శాంతి నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళ్లిన ఘనత దక్కించుకున్నారు. నిజాయితీగా ఉంటూ, నియోజకవర్గంలో అందరినీ కలుపుకుపోతూ మంచి వ్యక్తిగా ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గంలో రూ.1503.38 కోట్లతో సంక్షేమ పథకాలు అందజేశారు. రూ.265 కోట్లతో ఐదు మండలాలకు తాగునీరు అందించే పనులను చేపడుతున్నారు. రూ.176.35 కోట్లతో హిరమండలం వంశధార రిజర్వాయర్ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. వంశధార నిర్వాసితులకు రూ.216.71 కోట్ల మేర అదనపు పరిహారం అందజేశారు. ఇవన్నీ ఆమె విజయానికి దోహదపడనున్నాయి. టీడీపీలో కుమ్ములాటలు మామిడికి ప్రతికూలం కానున్నాయి.

అవలీలగా మళ్లీ బెల్లానే...

విజయనగరం లోక్‌సభ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి బెల్లాన చంద్రశేఖర్ మరోసారి బరిలోకి దిగారు. ఆయన గత ఐదేళ్లుగా తన పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోను విరివిగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ గ్రామానికి సుపరిచితుడయ్యారు. టీడీపీ నుంచి పోటీ చేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడును శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. విజయనగరం జిల్లాకు ఆయన కొత్త ముఖం. క్యాడర్‌కు ఆయన్ను పరిచయం చేసే విషయంలోనూ ఇక్కడి టీడీపీ నాయకులు పెద్దగా చొరవ చూపట్లేదు. ఏదో ఉన్నామంటే ఉన్నామన్నట్లుగా ఆయన పరిస్థితి ఉంది.

చీపురుపల్లిలో తిరుగులేని బొత్స

చీపురుపల్లి నియోకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వరుసగా ఐదో సారి బరిలో ఉన్నారు. ప్రజలతో మమేకమవుతూ, సాధారణ పౌరుడు ఫోన్ చేసినా మాట్లాడి సమస్యను పరిష్కరించడం ఆయన సొంతం. టీడీపీకి చెందిన మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాల నాయుడు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ మీసాల సరోజిని ఇటీవల వైఎస్సార్‌సీపీలోకి రావడంతో మరింత బలం చేకూరింది. టీడీపీ అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు స్థానికేతరుడు. నియోజవకర్గంలో ఎలాంటి పరిచయాలు, క్యాడర్‌తో సత్సంబంధాలు లేవు. ఆయన తమ్ముడి కొడుకు, టికెట్టు ఆశించి భంగపడ్డ పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున సహకరించడం లేదు. గెలిచినా, ఓడినా ఇక్కడ ఉంటారనే నమ్మకం ప్రజల్లో గానీ కేడర్‌లో గాని లేదు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయనగరం



చెల్లూరు సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

2019లో మాదిరిగానే ఈసారీ క్లీన్‌స్వీప్ దిశగా వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. విజయనగరం లోక్‌సభ నియోజకవర్గంతో పాటు దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. 2019 నుంచి 2024 వరకు జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమ విజయానికి బాటలు వేస్తాయని వారంతా ధీమాగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్రతిష్టాత్మకమైన పనులు చేపట్టింది. విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, గిరిజన విశ్వవిద్యాలయం, విశాఖపట్నం–రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే వంటివి మచ్చుతునకలు.

గజపతినగరంలో గెలుపు నల్లేరుపై నడక

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొత్స అప్పలనరసయ్య మూడోసారి బరిలో ఉన్నారు. క్షేత్ర స్థాయిలో మంచి పేరు సంపాదించుకున్నారు. నియోజవకర్గంలో మోడల్ స్కూల్, కేజీబీవీలు, గురుకుల హాస్టళ్లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వంటి సౌకర్యాలు కల్పించారు. గంగచోల్లపెంట నుంచి పట్టువాడకు రూ.4.3 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టారు. అప్పలనర్సయ్య విజయం నల్లేరుపై నడకే. టీడీపీ అభ్యర్థిగా కొండపల్లి శ్రీనివాస్ బరిలో ఉన్నారు. ఈయన రాజకీయాలకు కొత్త. నియోజవకర్గంలో పార్టీ క్యాడర్‌తోనే ఇంతవరకు ఎలాంటి పరిచయాలు లేవు.

విజయ వీరభద్రం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కోలగట్ల వీరభద్రస్వామి బరిలో ఉన్నారు. ప్రజల మధ్యనే ఉండడం ఆయన ప్రత్యేకత. కార్పొరేషన్ హోదాకు తగిన స్థాయిలో నగర సుందరీకరణ, ప్రధాన జంక్షన్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ చేపట్టారు. నగరంలో తాగునీటి సరఫరా మెరుగుపరిచారు. టీడీపీ ఎంఎల్‌ఏ అభ్యర్థి అదితి గజపతిరాజు కోటకు పరిమితమవ్వడం తప్ప ప్రజలకు అందుబాటులో ఉండరన్న ఆరోపణ ఉంది. 2019లో ఓటమి తరువాత మళ్లీ ప్రజలకు కనిపించింది ఇప్పుడే. నగరం నడిబొడ్డున కోట చుట్టూ దశాబ్దాలు తరబడి ఉన్న చిరువ్యాపారులను ఖాళీ చేయించి వారి పొట్ట కొట్టారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండరు.

ఎచ్చెర్లలో కూటమి కుదేలు

ఎచ్చెర్ల టికెట్‌ను కూటమిలోని బీజేపీకి కేటాయించగానే ఫలితం తేలిపోయింది. ఇక్కడ నడికుదిటి ఈశ్వరరావును అభ్యర్థిగా ప్రకటించగానే ఫలితం ఏకపక్షమని స్పష్టమైంది. దళితులపై దాడులు, భూ ఆక్రమణ వంటి ఆరోపణలు ఆయనకు మైనస్ కానున్నాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ విజయం నల్లేరుపై నడకే. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఈయన గెలుపునకు దోహదపడుతున్నాయి. రూ.1859.26 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందజేశారు. రూ.365 కోట్లతో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. రూ.85 కోట్లతో పాఠశాలలను, రూ.167 కోట్లతో ట్రిపుల్ ఐటీని, రూ.16 కోట్లలో అంబేడ్కర్ యూనివర్సిటీ అదనపు భవనాలు నిర్మించారు. ఇవన్నీ వైఎస్సార్‌సీపీకి కలిసొచ్చిన అదనపు అంశాలు.



నెలిమర్లలో అడ్డులేని బడ్డుకొండ

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బడ్డుకొండ అప్పలనాయుడు బరిలో ఉన్నారు. రెండు సార్లు ఎంఎల్‌ఏ, ఒకసారి జిల్లా పరిషత్ చైర్మన్‌గా చేసిన అనుభవం ఉంది. నియోజకవర్గంలో రామతీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణం, ఫ్లోటింగ్ జెట్టీకు శంకుస్థాపన, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంగా జరుగుతుండడం వెనుక ఆయన కృషి ఎంతో ఉంది. రూ.37 కోట్లతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కుళాయిలు పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. సామాజిక వర్గం అండగా ఉంది. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా అగ్రవర్ణానికి చెందిన లోకం మాధవి పోటీ చేస్తున్నారు. స్థానికేతరులు. వ్యాపార కాంక్ష తప్ప రాజకీయ సేవా కాంక్ష లేదని, ఉద్యోగాలు ఇస్తామని 20 ఏళ్ల క్రితమే పేద రైతుల నుంచి జిరాయితీ భూములు కాజేశారన్న విమర్శలున్నాయి.

రాజాంలో హ్యాట్రిక్ దిశగా ఫ్యాన్

రాజాం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కంచుకోట.పార్టీ అభ్యర్థిగా డాక్టర్ తలే రాజేష్ బరిలో ఉన్నారు. పది సంవత్సరాలుగా రాజాం పట్టణంలో భార్యాభర్తలిద్దరూ వైద్యులుగా సేవలు అందిస్తున్నారు. రాజకీయాల్లోకి రాకముందు నుంచే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు మండలాల్లో క్యాడర్‌ను సమన్వయం చేసుకుంటూ ప్రచారంలో ముందంజలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్ బరిలో ఉన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో సొంత పార్టీ నేతలపై కక్ష సాధింపు చర్యలు చేపట్టారన్న అపవాదు ఉంది. అంతర్గతంగా పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి ఉంది. నియోజకవర్గంలో బలమైన కిమిడి కళా వెంకటరావు కుటుంబానికి కనీసం గౌరవం ఇవ్వకపోవడంతో రేగిడి ఆమదాలవలస మండలంలో తూర్పుకాపు నాయకులు గుర్రుగా ఉన్నారు.

బొబ్బిలి కోటలో సామాన్యుడి పాగా

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బరిలో ఉన్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువకు అనుంధానంగా పిల్ల కాలువలు తవ్వించారు. దీనికోసం సొంత నిధులు కూడా వెచ్చించారు. బొబ్బిలి పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారు. సామాజిక వర్గం అండ కలిసొచ్చే అంశం. కుటుంబంలో దాదాపు ఆరుగురు సభ్యులు ప్రచారం నిర్వహిస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా ఆర్‌వీఎస్‌కేకే రంగారావు బరిలో ఉన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా పదవి అనుభవించడమే తప్ప ఐదేళ్ల కాలంలో నాలుగు సార్లు మినహా కార్యాలయానికి రాకపోవడం, ఎలాంటి అభివృద్ధి చేపట్టకపోవడం, గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం కలవడానికి అవస్థలు పడడం వంటిని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.




తోడేళ్ల గుంపొస్తోంది పారా హుషార్
కదిలి రండి తరిమి కొడదాం..

అది విజనరీ కాదు..
'విష'నరీ

బాబు వదిలేస్తే.. జగన్ పొత్తిళ్లలో పెట్టుకున్నారు
పెదలబుడును దత్తత తీసుకుంటానని
వదిలేసిన చంద్రబాబు
నేడు రూపురేఖలు మార్చిన సీఎం జగన్

సాక్షి, విశాఖపట్నం/అనంతగిరి: 'అరకు నియోజకవర్గంలో పెదలబుడు పంచాయతీని దత్తత తీసుకుంటున్నా. స్మార్ట్ విలేజ్‌గా మార్చేస్తా. ప్రతి ఇంటికీ నిరంతరం నీటిని అందిస్తాను' అని సీఎం హోదాలో చంద్రబాబు 2015 జనవరిలో బీరాలు పలికారు. ఏడాదిన్నర గడిచినా ఆ ఊరి వైపు కన్నెత్తి చూడలేదు. చివరికి ప్రజలు రోడ్డెక్కడంతో 2016 మేలో ఆగమేఘాలపై అక్కడకు వచ్చి మంచినీటి కుళాయిల కోసం రూ.5 కోట్లు, సిమెంట్ రోడ్లకు రూ.9 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులూ వచ్చింది లేదు.. పనులు జరిగిందీ లేదు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక బాబు దత్తత తీసుకున్న ఈ గ్రామంలో సామాజిక, ఆర్థిక స్థితిగతులు మారిపోయాయి. ప్రతి ఇల్లు అభివృద్ధి పథంలో నడుస్తోంది. గిరి గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఆయా గ్రామాలు నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. పెదలబుడు మేజర్ పంచాయతీలో ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ అందుబాటులోకి వచ్చాయి. మూడు సచివాలయాల పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు రూ.37 కోట్ల లబ్ధి పొందారు.

గ్రామానికి వెళ్లే రహదారి



పెదలబుడులోని ఆర్‌బీకే



ఇంటర్వ్యూ

'వైఎస్సార్‌సీపీ నవరత్నాలు అమలు సాధ్యమేనా అన్న నోళ్లు మూతపడేలా అమలు చేసి చూపించారు సీఎం జగన్. ఒక విధంగా చెప్పాలంటే ఆయన ప్రతి ఒక్కరికీ ఓ లెసన్. 'జగన్ గెలుపు అంటే జనం గెలుపు' అన్నది ఈ ఎన్నికల్లో స్పష్టం కానుంది' అని సినీనటి, ప్రముఖ బుల్లితెర యాంకర్ శ్యామల అన్నారు. కొంత కాలంగా వైఎస్ జగన్‌కు మద్దతుదారుగా ఉన్న ఆమె ఈ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరఫున చురుకుగా ప్రచారం కూడా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడారు. జగన్‌పై తనకు అభిమానం కలగడానికి కారణాలను... తన భవిష్యత్తు రాజకీయ ప్రయాణాన్ని ఆమె తెలియజేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...



ఇచ్చిన హామీలు అమలు చేయడం ఆయనకే చెల్లు
జగన్‌లోని పట్టుదల ఎందరికో స్ఫూర్తిదాయకం

జగన్ ఓ లెసన్

సాక్షి ఇంటర్వ్యూలో సినీనటి, యాంకర్ శ్యామల

వైఎస్ అంటే ఇష్టం.. జగన్‌పై అభిమానం...

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పట్టణం సమీపంలోని ఇంద్రపాలెం మాది. బ్రాహ్మణ కుటుంబానికి చెందిన నాకు రాజకీయ నేపథ్యం ఏమీ లేదు. ఎదుగుతున్న సమయంలో లీడర్స్ చేపట్టే పనులు మన మీద చాలా ప్రభావం చూపుతాయి కదా. అలా తూర్పుగోదావరి జిల్లాలో పాదయాత్ర చేసినప్పటి నుంచీ వైఎస్ అంటే నాకు చాలా ఇష్టం. కట్టుబొట్టు నుంచి ఆయన ఆహార్యం దాకా అన్నీ గమనిస్తుండేదాన్ని. ఆయన హుందాతనం, మందహాసం బాగా నచ్చేవి. కెరీర్ కోసం హైదరాబాద్ వచ్చేసిన తర్వాత.. వైఎస్సార్ మరణించిన సమయంలో ఉప్పల్‌లో ఓ ప్రైవేట్ చానల్‌లో పనిచేస్తున్నాను. ఎంతగానో బాధనిపించినా... ఆ సమయంలో ఎటూ కదలడానికి వీలు కాలేదు. వైఎస్ మరణం తర్వాత జగన్‌ను బాగా గమనిస్తూ ఉండేదాన్ని, ఆయన చేసిన పోరాటం, అడ్డంకులు ఎదుర్కొంటూ ఆయన వేసిన అడుగులు చూశాక ఆయనపైనా కొండంత అభిమానం కలిగింది. నా భర్త కూడా జగన్ అభిమాని కావడంతో... ఆయన్ను స్వయంగా కలవడం, ఆయన చేతుల మీదుగా వైఎస్సార్‌సీపీ కండువా ధరించడం జరిగిపోయాయి.

హామీల అమల్లో ఆయనకు ఆయనే సాటి

ఇచ్చిన హామీలు ఎలా అమలు చేయాలి? ప్రజలకు ఆపద వస్తే ఎలా స్పందించాలి? ఇలాంటివన్నీ జగన్‌ను చూసి నేర్చుకోవాలి. అందుకే భవిష్యత్తు రాజకీయ నేతలకు ఆయన పాలన ఒక పాఠం అంటాను నేను. ఆయన ప్రవేశపెట్టిన నవరత్నాల గురించి మొదట్లో విని... బాబోయ్ ఇన్ని పథకాలా? ఎలా ఇస్తారో అని భయపడిన మాట నిజం. కాని అవి పక్కాగా అందించడానికి గ్రామ వలంటీర్ పేరిట ఏకంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఎవరికన్నా ఏదైనా ఇబ్బంది కలిగిందీ అంటే ఫిర్యాదు చేసిన 10-20 రోజుల్లోనే ఆ సమస్య పరిష్కారం అయిపోయేలా పక్కాగా నిర్వహించడం అద్భుతం అనిపించింది.

అవకాశాలు పోతాయని వారించినా...

అయితే నేను ఇంకా సినీ-టీవీ కెరీర్ ప్రారంభంలోనే ఉండడంతో పార్టీ మనిషిగా ముద్ర వేసుకోవడం మంచిది కాదంటూ చాలా మంది హెచ్చరించారు. నిజానికి ఇప్పటికీ చాలా మంది అలాగే చెబుతుంటారు. అయితే ఏదో రాజకీయ పార్టీలో ఉన్నానని ఒక క్యారెక్టర్‌కి నేను సరిపోతానని తెలిసినా పిలవకుండా ఉంటారా? అలా జరగదని నా నమ్మకం. ఇప్పటివరకూ అలాంటి అనుభవాలు కూడా ఎదురవ్వలేదు. నేను కేవలం టీవీ యాంకర్‌గానే కాకుండా మాచర్ల నియోజకవర్గం, బెంగాల్ టైగర్... తదితర సినిమాల్లో మంచి పాత్రల్లో చేశాను.

కోవిడ్ సవాల్‌నూ సమర్థంగా ఎదుర్కొని...

ప్రపంచమే బిత్తరపోయిన సంక్షోభం కోవిడ్. మహామహులే ఆ సమయంలో చేతులెత్తేశారు. అలాంటిది ఒక కొత్త సీఎం, అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాలేదు. ఇలాంటి తరుణంలో అనూహ్యమైన ఈ చాలెంజ్ ఎదురైనా.. జగన్ అద్భుతంగా హ్యాండిల్ చేశారు. ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా రెండు వేవ్స్‌నూ సమర్థంగా ఎదుర్కొన్నారు. అందుకే నేను ఫిదా అయ్యా. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లోని ప్రజల్ని కలిసినప్పుడు వారు చెబుతున్నదీ అదే. 'కోవిడ్ టైమ్‌లో సొంత వారు కూడా మా మొహం చూడలేదమ్మా.. అలాంటిది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతీదీ మా చేతికి అందించింది' అని.

జగన్ గురించి తెలుసుకున్న కొద్దీ సంతోషం

మా సొంత ఊరితో పాటు మా అత్తగారి ఊరు చీరాలకు రాకపోకలు సాగించినప్పుడు, షూటింగ్ కోసం గ్రామాలకు వెళ్లినప్పుడు... అక్కడి స్థితిగతుల గురించి కనుక్కునేదాన్ని. వీలైనంతమందితో మాట్లాడేదాన్ని. వాళ్లందరి స్పందన తెలుసుకుంటున్న కొద్దీ జగన్ మీద ఇష్టం పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన నాడు నేడు కార్యక్రమం నా ఆల్ టైమ్ ఫేవరెట్. నేను కాకినాడ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. ఆ స్కూల్లో 7వ తరగతి వరకూ అసలు ఇంగ్లిష్ మీడియం ఉండేది కాదు. ఇప్పుడు ఏకంగా డిజిటల్ బోధన, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్, స్కూల్ బ్యాగ్స్, షూస్, సాక్స్... ఇవన్నీ ఇవ్వడం మామూలు విషయం కాదు. ఇటీవల ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని జగన్ ముందు అద్భుతమైన ఇంగ్లిష్‌లో మాట్లాడితే షాక్ అయిపోయా. ఆ భాషా పరిజ్ఞానం నాకు కూడా లేదు. కేవలం రాజకీయాల కోసం ఓ పాపను దారుణంగా ట్రోల్ చేయడం దారుణం.

-సత్యార్థ్

కాఫీ ఘుమ ఘుమ...
లాభాల మధురిమ...

జీసీసీని కొరగాకుండా చేసిన బాబు

వైఎస్సార్‌సీపీ హయాంలో పునరుజ్జీవం

బాబు హయాంలో జీసీసీ టర్నోవర్ రూ.1,209 కోట్లు

జగన్ పాలనలో రెట్టింపుగా రూ.2,303 కోట్లకు...


2,258 ఎకరాల కాఫీ తోటలకు సేంద్రీయ ధ్రువీకరణ

విదేశాలకూ కాఫీ ఎగుమతికి జీసీసీ సన్నాహాలు



సాక్షి, విశాఖపట్నం/పాడేరు

కొండ కోనల నడుమ పచ్చని వనాలను చూస్తూ... వేడివేడిగా... కమ్మ కమ్మగా... పొగలు కక్కే కాఫీ రుచిని ఆస్వాదిస్తూ పరవశించిపోయే ప్రకృతి ప్రియులకు విశాఖ ఏజెన్సీలోని పాడేరు, అరకు, చింతపల్లి, జీకే వీధి వేదికలు కాఫీ తోటల సాగులో గిరిజనానికి ప్రోత్సాహం లేక చంద్రబాబు పాలనలో గిరిజన సహకారాభివృద్ధి సంస్థ (జీసీసీ) చైతన్య రహితంగా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారిగా ఒళ్లు విరుచుకుని చైతన్యవంతమయింది. అంతకుముందు బాబు పాలనలో ఎగుమతులు తగ్గిపోతే ఆ లోటును భర్తీ చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెట్టింపు ఎగుమతులను చేయగలిగే సత్తాను చాటుకుంది. లక్ష్యం మంచిదై... ఆచరణ సక్రమంగా ఉంటే ఎలాంటి అద్భుతాలు చేయవచ్చో జీసీసీ నేటి ప్రభుత్వంలో చవి చూపించింది. కాఫీ తోటల ఉత్తేజం ఇంతింతలై ఐదు జాతీయ అవార్డులను సాధించింది. ప్రగతి పథంలో శరవేగంగా దూసుకుపోతోంది. ఈ ప్రభుత్వంలో కాఫీ ఘుమఘుమల లాభాల ప్రస్థానం ఇదీ.



రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని, విభాగాన్ని నిర్వీర్యం చేసిన చంద్రబాబు.. గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కీ ఐదేళ్ల కాలంలో అదే దుస్థితి పట్టించారు. ఇక కోలుకోలేదనుకున్న సంస్థకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త ఊపిరి పోసింది. జీసీసీనే నమ్ముకున్న గిరిజనుల జీవితాల్లోకి కొత్త వెలుగుల్ని తెచ్చింది. ఉత్పత్తుల కొనుగోలు నుంచి.. విక్రయాల వరకూ తిరుగులేని శక్తిగా అభివృద్ధి పథంలోకి దూసుకుపోయింది. కాఫీ తోటలకు పునరుజ్జీవం పోసింది. ఫలితంగా చంద్రబాబు కాలంలో టర్నోవర్ కంటే.. ఈ ఐదేళ్లలో రెట్టింపు టర్నోవర్‌ని జీసీసీ సొంతం చేసుకుంది. తొలిసారిగా కాఫీతోటలకు సేంద్రీయ ధ్రువీకరణ లభించడంతో పాటు.. ఐదు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. త్వరలోనే విదేశాలకు కాఫీని సొంతంగా ఎగుమతి చేసేందుకూ సిద్ధమవుతోంది. అరకు కాఫీ నేనే కనిపెట్టానంటూ వైజాగ్ వచ్చిన ప్రతిసారీ బాకా కొట్టే చంద్రబాబు.. గిరి పుత్రుల అభివృద్ధికి మాత్రం పీసమెత్తు కృషీ చేయనేలేదు. గిరిజనులకు దళారుల నుంచి రక్షణ కల్పించాలన్న ఆశయంతో ప్రారంభించిన సంస్థ జీసీసీపై చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యాన్ని కనబరిచింది. ప్రధానంగా గిరిజనులు సేకరించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరను జీసీసీ కల్పించకపోవడంతో దళారులకే అటవీ ఉత్పత్తులను విక్రయించే దుస్థితి చంద్రబాబు పాలనలో సాగింది. మరో వైపు ధరలూ పెంచకపోవడంతో.. దళారులే మేలని గిరిజనులు భావించేవారు.

ఐదు జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న జీసీసీ...

- ఇటీవల కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ట్రైబల్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ట్రైఫెడ్) ప్రకటించిన జాతీయ అవార్డుల్లో 5 సాధించి సత్తా చాటిన జీసీసీ దేశానికే ఆదర్శంగా నిలిచింది.
- ప్రతిస్పందన విభాగంలో.. గిరిజనుల కోసం ప్రధానమంత్రి వన్ ధన్ వికాస్ యోజన కేంద్రాలు, చిన్న తరహా అటవీ ఉత్పత్తుల (ఎంఈపీ)కు ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ను అందించడంలోను దేశంలోనే మొదటి ర్యాంకు సాధించింది.



- రిటైల్ అండ్ మార్కెటింగ్ విభాగంలో.. సేంద్రీయ, సహజ ఆహార ఉత్పత్తుల సరఫరాలోను జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు గెల్చుకుంది.
- కేంద్ర ప్రభుత్వ నిధులతో అత్యధికంగా రూ.4.50 కోట్ల విలువైన చిన్నతరహా అటవీ ఉత్పత్తులను సేకరించినందుకు జాతీయ స్థాయిలో 2వ ర్యాంకు దక్కింది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అత్యధికంగా రూ.9.76 కోట్ల విలువైన చిన్న తరహా అటవీ ఫలసాయాలు (ఎంఎఫ్‌పీ) సేకరించినందుకు జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించింది.
- 2020-21లో అత్యధికంగా రూ.12.86 కోట్ల మొత్తంలో గిరిజనాభివృద్ధికి జీసీసీ వినియోగించినందుకు దేశంలోనే 3వ ర్యాంకు దక్కించుకుంది.

2019-24 మధ్యలో జీసీసీ ఎదిగిందిలా...

- చింతపల్లి, జీకేవీధి క్లస్టర్ల పరిధిలో 2600 మంది రైతులు 2258.55 హెక్టార్లలో ఆర్గానిక్ కాఫీ సాగు చేస్తున్నారు.
- 2018-19 కాలంలో రూ.799.58 లక్షల కాఫీ కొనుగోలు చేయగా.. 2023-24 నాటికి రూ.1339.05 లక్షల కాఫీ కొనుగోలు చేసింది.
- డొనూరులో ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ని స్థాపించేందుకు రూ.3 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేయగా, 2023 అక్టోబర్ 20న సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు.
- గతంలో తేనె కిలోకు రూ.170 కొనుగోలు ధర ఉండగా, ఇప్పుడు రూ.250కు పెంచారు. ఇలా ప్రతి ఉత్పత్తికి ధరలు పెంచడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- కాఫీ తోటల నిర్వహణకు జీసీసీ ద్వారా గిరిజన రైతులకు ఏటా రూ.1.05 కోట్ల రుణాల్ని, వ్యవసాయ కార్యక్రమాల అమలుకు రూ.1.06 కోట్ల క్రెడిట్ రుణాల్ని పంపిణీ చేశారు.
- జీసీసీలో పనిచేస్తున్న 164 మంది కాంట్రాక్టు సిబ్బందికి రూ.12 వేల వేతనం ఉండేది. ఈ వేతనాన్ని 2022లో రూ.23,120కి పెంచారు.
- జీసీసీ ఉద్యోగులకు హెల్త్ కార్డులూ పంపిణీ చేశారు.

ప్రగతి పథంలో జీసీసీ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. **జీసీసీ ప్రగతి** పథంలో పయనించింది. 2014-15 **నుంచి** 2018-19 వరకూ రూ.1209 కోట్లు **మాత్రమే ఉన్న** జీసీసీ టర్నోవర్ ఒక్కసారిగా గేర్ **మార్చింది. సీఎం** వైఎస్ జగన్ జీసీసీ అభివృద్ధిపై **ప్రత్యేక దృష్టి** సారించడంతో 2019-20 నుంచి **2023-24 మధ్య** కాలంలో రెట్టింపై ఏకంగా టర్నో**వర్ రూ.2,3**03 కోట్లకు చేరుకుంది. కోవిడ్ సమ**యంలోనూ** టర్నోవర్ ఏమాత్రం తగ్గలేదు. ఈ **ఏడాది రికార్డు** స్థాయిలో రూ.75.56 కోట్ల అటవీ, **వ్యవసాయ** ఉత్పత్తుల్ని గిరిజనుల నుంచి కొను**గోలు చేసింది.** జీసీసీ అటవీ ఉత్పత్తులు, కాఫీ, తేనె, **చింతపండు,** కుంకుడుకాయలు, శీకాయ, నన్నారి, **బిల్వ, పసుపు,** రాజ్మా, కొండచీపుళ్లు, సబ్బులు తయారు చేసి గతేడాది రూ.17.75 కోట్ల విలువైన ఉత్పత్తులను విక్రయించింది.

నిత్యం గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా..

గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ఎన్నో కీలక నిర్ణయాల్ని ప్రభుత్వం తీసుకోగా.. వాటిని జీసీసీ అమలు చేసింది. డీఆర్ డిపోల ద్వారా రూ.16.65 కోట్ల విలువైన నిత్యావసరాల్ని, రూ.360.78 కోట్ల విలువైన ఆహార దినుసులను గిరిజన కుటుంబాలకు పంపిణీ చేసింది. గిరిజన ప్రాంతాల్లో పండించే చిరుధాన్యాల్ని ప్రోత్సహించేందుకు మార్కెటింగ్ ప్రణాళికలను సిద్ధం చేసింది. రిటైల్ విక్రయ ధరకు నాణ్యమైన ఇంధనాన్ని గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు అందించడంతో పాటు వారికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో జీసీసీ ఏజెన్సీలో 16 పెట్రోల్ బంకులు, 12 ఎల్‌పీజీ గోడౌన్లను ఏర్పాటు చేసింది.



త్వరలో 'అరకు' బ్రాండ్‌తో విదేశాలకు కాఫీ..

ఈ ఐదేళ్ల కాలంలో అరకు కాఫీకి అంతర్జాతీయంగా క్రేజ్ పెరిగింది. ముఖ్యంగా సేంద్రీయ పద్ధతుల్లో పండుతున్న కాఫీ ఘుమ ఘుమలకు విదేశీయులు ఫిదా అవుతున్నారు. జపాన్‌లోనే కాకుండా.. బ్రెజిల్, అమెరికా.. ఇలా వివిధ ప్రాంతాల్లో అరకు కాఫీ అంటే అహో... అనేవారు చాలా మంది ఉన్నారు. అందుకే అంతర్జాతీయ విపణిలో డిమాండ్ పెరుగుతూ వస్తోంది. సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్న కాఫీ అంటే.. అంతర్జాతీయ మార్కెట్‌లో హాట్ హాట్‌గా అమ్ముడవుతోంది. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో సాగుచేస్తున్న అరబికా, రోబస్టా చెర్రీ కాఫీ రకాలకు గిరాకీ పెరుగుతోంది. అరకులో సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్న కాఫీ గింజల్ని బెంగళూరుకు చెందిన అనేక ప్రైవేట్ సంస్థలు సేకరించి విదేశాలకు ప్రైవేట్ బ్రాండ్‌తో ఎగుమతి చేస్తున్నాయి. జీసీసీ మాత్రం సొంత బ్రాండ్‌తో దేశీయ మార్కెట్‌లో మాత్రమే కాఫీని విక్రయిస్తోంది. కారణం.. సరైన ప్రాసెసింగ్ యూనిట్స్, సౌకర్యాలు లేకపోవడంతో స్థానిక మార్కెట్‌లకే జీసీసీ బ్రాండ్ అరకు కాఫీ పరిమితమైంది. విదేశీ విపణిలో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఇకపై సొంతంగా ఎగుమతులు చేపట్టాలని జీసీసీ భావిస్తోంది. ఇప్పటికే ఎక్స్‌పోర్ట్ సంస్థలతో అధికారులు సంప్రదింపులు జరిపారు.

సంతోషాలు పంచిపెట్టి

ఆంజనేయ ప్యాకింగ్ ఇండస్ట్రీస్ విజయప్రస్థానం ● స్వయం ఉపాధితో పాటు 40 మందికి బతుకుతెరువు

ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యాపారం విస్తరిస్తున్నామన్న యాజమాన్యం ● ఉన్నత చదువులు చదివినా ఉన్న ఊరికి మేలు చేయాలనే సంకల్పం

వారు రైతు బిడ్డలు. భూమాతను నమ్ముకున్న అన్నదాతల కష్టాలు తెలిసిన మానవతావాదులు. జన్మభూమి రుణం తీర్చుకోవాలనుకున్నారు. ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీలు చేసినా ఉద్యోగం చేయాలనే ఆలోచనలకు స్వస్తి పలికారు. ఉన్న ఊరిలోనే పలువురికి ఉపాధి కల్పిస్తూ సొంతంగా వ్యాపారం చేయాలని సంకల్పించారు. ప్యాకింగ్ పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ రాయితీలతో వ్యాపారాన్ని విస్తరించారు. ఇదీ నరసరావుపేట ఆంజనేయ ప్యాకింగ్ ఇండస్ట్రీస్ విజయ ప్రస్థానం.

- నరసరావుపేట



ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. అయినా ఉద్యోగాల కోసం ఎదురుచూపులు చూడలేదు. స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారు. ప్రాంత అవసరాలపై దృష్టి కేంద్రీకరించారు. అధ్యయనం చేశారు. ఆయిల్, స్పిన్నింగ్, మిల్క్ యూనిట్లు అనేకం ఉండడంతో ఆయా ఉత్పత్తులు ప్యాకింగ్ చేసేందుకు అవసరమైన అట్ట పెట్టెలు తయారీ పరిశ్రమ నెలకొల్పాలని నిర్ణయించుకున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ (ఏపీఐఐసీ) ద్వారా ప్యాకింగ్ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇదీ నరసరావుపేట పెద్దచెరువు ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో ఉన్న ఆంజనేయ ప్యాకింగ్ ఇండస్ట్రీస్ అధినేత కామిరెడ్డి కృష్ణకిశోర్‌రెడ్డి విజయగాథ.



అట్టపెట్టెల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు

గత ప్రభుత్వం రిక్త హస్తం

పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రచారాలు చేసిన గత టీడీపీ పాలకులు హామీలను తుంగలో తొక్కారు. ఎటువంటి సబ్సిడీని మంజూరు చేయకపోయినా కృష్ణకిశోర్ రెడ్డి ఆటుపోట్లను ఎదుర్కొని సొంత పెట్టుబడితో పరిశ్రమను స్థాపించాడు. సంస్థ కార్యకలాపాలు విస్తరించాలనుకున్నా ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. దీంతో కష్టంగానే వ్యాపారాన్ని నెట్టుకొచ్చారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ రాకతో ఉజ్వల ప్రగతి

పరిశ్రమ ఏర్పాటుచేసిన కొన్ని నెలలకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వ విధానాలతో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీసింది. ఓ వైపు కోవిడ్ తో ప్రభుత్వానికి ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నా సీఎం జగన్ మోహన్ రెడ్డి చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వంలో 2015-20 పాలసీ కింద ఏర్పాటుచేసిన పరిశ్రమలకు చెల్లించాల్సిన సబ్సిడీలను విడుదల చేశారు. దీంతో ఆంజనేయ ఇండస్ట్రీస్ కు రూ. 13 లక్షల సబ్సిడీ లభించింది. దీంతోపాటు విద్యుత్ టారిఫ్‌ల మినహాయింపులు, చెల్లించాల్సిన రుణానికి వడ్డీలో సబ్సిడీ మంజూరు చేశారు. ప్రభుత్వ చర్యలతో యజమానుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. సుమారు 40 మంది ఉద్యోగులు, కూలీలను నియమించుకొని వ్యాపారాన్ని మరింత విస్తరించారు. మూడు షిఫ్టులుగా పని చేస్తున్న సిబ్బందికి ఒకొక్కరికి నెలకు రూ.40వేలు నుంచి రూ.15వేలు వరకు జీతాలు చెల్లించి ఉపాధి చూపించారు. జిల్లాలోని పలు వ్యాపారులు, పరిశ్రమలకు కావాల్సిన అట్టపెట్టెలను ఆర్డర్లు తెప్పించుకొని వారికి నచ్చిన రీతిలో తయారుచేసి సకాలంలో అందిస్తూ వ్యాపారుల మన్ననలు పొందుతున్నారు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా పరిశ్రమ దినదినాభివృద్ధి చెందింది. ఐదేళ్ల కాలంలో ఏడాదికి రూ.3 నుంచి 4కోట్ల టర్నోవర్ చేస్తూ ప్రగతిపథంలో దూసుకుపోతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైందని యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

40 మందికి ఉపాధి

నరసరావుపేటకు చెందిన కామిరెడ్డి కృష్ణకిశోర్‌రెడ్డి ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. నరసరావుపేటలోనే ఏదైనా పరిశ్రమ పెట్టాలని భావించారు. ఈ ప్రాంతంలో ఆయిల్, స్పిన్నింగ్ మిల్లులు, మిల్క్ యూనిట్లు, లాంటి సంస్థల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్యాకింగ్‌కు ఉపయోగించే అట్టపెట్టెల పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిశ్చయించుకున్నారు. ఎంఎస్ఎంఈ ప్రోత్సాహంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ (ఏపీఐఐసీ) ద్వారా ప్యాకింగ్ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాడు. 2015 నుంచి 2020 పరిశ్రమల ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ కింద లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తన స్నేహితుడు గెల్లి అరుణ్‌రెడ్డిని భాగస్వామిగా చేసుకొని 2019 జనవరిలో పట్టణంలోని పెద్దచెరువు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఆంజనేయ ప్యాకింగ్ ఇండస్ట్రీస్ అనే చిన్నతరహా పరిశ్రమను ఏర్పాటు చేశారు. మెషినరీ కోసం రూ.60లక్షలు, మరో రూ.25లక్షల ఓవర్ డ్రాఫ్ట్‌తో సంస్థను ప్రారంభించారు.

నా ఆశయం నెరవేరింది



మా లాంటి చిన్నతరహా పరిశ్రమలకు ప్రస్తుత ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. ఏ అధికారి వత్తిళ్లు లేవు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లిస్తున్నాం. ఉన్న పట్టణంలోనే పదిమందికి ఉపాధి కల్పించాలనే నా ఆశయానికి ప్రభుత్వ సహకారం తోడైంది. వ్యాపారాన్ని ఇంకా అభివృద్ధి చేస్తాం.

-కామిరెడ్డి కృష్ణకిశోర్‌రెడ్డి, ఎం.డి. ఆంజనేయ ప్యాకింగ్ ఇండస్ట్రీ

ఉన్న ఊరిలో ఉపాధి దొరికింది



ఈ పరిశ్రమ రావడంతో నాకు ఉన్న ఊరిలోనే ఉపాధి లభించింది. ఐదేళ్లుగా పనిచేస్తున్నాను. నెలకు రూ. 15 వేలు జీతం ఇస్తుండడంతో కుటుంబ అవసరాలకు ఇబ్బంది లేకుండా గడిచిపోతోంది. పనిలో ఎటువంటి ఒత్తిడి లేకుండా అట్ట పెట్టెలు తయారుచేస్తున్నాను.

-కె.కోటేశ్వరరావు, కూలీ

యూనిట్ పేరు	:	ఆంజనేయ ప్యాకింగ్ ఇండస్ట్రీస్
ఉత్పత్తి	:	అట్ట పెట్టెల తయారీ
యజమానులు	:	కృష్ణకిశోర్‌రెడ్డి, అజయ్ రెడ్డి
పెట్టుబడి	:	రూ. 85 లక్షలు
టర్నోవర్	:	రూ. 3 కోట్లు
ఉపాధి	:	40 మంది
కేటగిరి	:	చిన్నతరహా
ప్రాంతం	:	నరసరావుపేట